RNI No. APTEL/2003/12253

భావవీణ


కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 3 Monthly March 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ఆశావాది ప్రకాశరావు

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 3 - March 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

ఆశావాది ప్రకాశరావు

కళారత్న, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆశావాది ప్రకాశరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కవిత్వం ఆలోచనాత్మకం. ఆయన అవధానం సాహితీ లోకానికి వీనులవిందు. తొలి దళిత అవధానిగా ప్రసిద్ధికెక్కారు.

ఆశావాది ప్రకాశరావు 1944వ సంవత్సరం ఆగష్టు 2వ తేదీన కుళ్ళాయమ్మ, పక్కీరప్ప దంపతులకు కొరివిపల్లి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య పెరవలి, 6వ తరగతి నుండి డిగ్రీ వరకు అనంతపురంలో సాగింది. అనంతరం ఎ.పి.పి.ఎస్.సి గ్రూప్ 5 పరీక్షలో ఉత్తీర్ణులై లోయర్ డివిజినల్ క్లర్క్‌గా ఏలూరులో కొంతకాలం పనిచేశారు. తన ప్రగతికి అవరోధంగా భావించి ఆ ఉద్యోగం వదలి తెలుగు పండితుడిగా పనిచేశారు. ఉద్యోగ ప్రస్థానంలో ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారు. పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రాచార్యులుగా (ప్రిన్సిపల్)గా పనిచేసి 2002 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. అవధాన విద్యలో డా॥. సి.వి. సుబ్బన్న శతాబధాని గురువు వద్ద శిష్యరికం చేసి వారి ఆశీస్సులతో ఆశు కవిత అలవర్చుకున్నాడు. 1963 సంవత్సరంలో తన 19వ ఏట మొదటి అవధానం చేశారు. అప్పటి నుండి ఆంధ్ర సాహిత్య చరిత్రలో దళితులలో ఏకైక అవధానిగా ముద్ర వేసుకుని అసాధారణ ధారణాశక్తితో, అనిర్వచనీయమైన మహేంద్రజాల శక్తితో శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాడు. వీరు ఆంధ్రదేశంలోనే కాక ఆంధ్రేతర ప్రాంతాలలో కూడా అవధానాలు 171కి పైగా చేశారు. అలాగే ద్విగుణిత అష్టావధానం చేశాడు.

ప్రకాశరావు ఇంటి పేరు ఆసాది. ఆయన అనంతలోని సాయిబాబా కళాశాలలో చదివేరోజుల్లో స్నేహితుల నుండి ప్రశ్నలు వేయించుకుని వాటికి అవధానం రూపంలో సమాధానం చెప్పేవారు. అప్పటి తెలుగు విభాగం అధ్యక్షుడిగా ఉన్న నండూరి రామకృష్ణమాచార్యులకు తెలిసి ప్రకాశరావును పిలిపించారు. ఏదో అవధానం చేశావట కదా! నేనే సమస్య ఇస్తాను పూరించమన్నారు. గురువు ఇచ్చిన సమస్యను పూర్తి చేసిన విధానానికి నండూరి సంబరపడిపోయారు. అవధానంలో నీకు మంచి భవిష్యత్తు ఉందని చెప్పి ఇక నుండి నువ్వు ఆసాది కాదు, అశావాది అని ప్రకాశరావు ఇంటిపేరు మార్చారు. అనంతపురంలో ఆర్ట్స్ కళాశాలలో ప్రకాశరావు డిగ్రీ చదివే రోజుల్లో అదే విశ్వవిద్యాలయం అధ్యాపకుడిగా ఉన్న రాష్ట్రపతి డా॥. సర్వేపల్లి రాధాకృష్ణన్ నుండి "బాలకవి" ఆశీర్వాదం అందుకున్నారు.

అవధానిగా ప్రసిద్ధికెక్కి ప్రకాశరావుకు బాల్యం నుండే పద్యంపై మక్కువ ఎక్కువ. ప్రకాశరావు గురువు జోగప్పపై విశ్వభూషణ అనే పుస్తకం రాశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేటు ప్రధానం చేసింది. హైదరాబాద్ క్షీర సాహితీ సమితి వారు కనకాభిషేకం చేశారు. పెనుకొండలో గండపిండేరం తొడిగారు. ఉగాది పురస్కారాలు ఆంధ్ర సాంస్కృతిక మండలి హంస పురస్కారం, జీవిత సాఫల్య పురస్కారాలు అందుకున్నారు. సుమారు 150కి పైగా రచనలు చేశారు. అందుకే శ్రీ నారాయణరెడ్డిగారు ప్రకాశరావు పద్యాలకు ముగ్ధులై "పద్యం చెబితే తెలుగు భాషలోని తీయదనం రుచి చూస్తారు. పద్యం కమ్మగా పాడువాడు పద్యమిధ్యను కాపడువాడు. పద్య ధ్వేషనలతో రాపాడువాడు ఆశావాది ప్రకాశరావు" అని కీర్తించారు.

పుష్పాంజలి, అంతరంగ తరంగాలు, మెరుపు తీగలు, చెల్లపిళ్ళ రాయ చరిత్రము, ఆర్కెస్ట్రా (వచన కవిత), విద్యావిభూషణ, ఘోషయాత్ర నాటకం, నారాయణ శతకం, శ్రీరాప్తాటి పరిచయ పారిజాతము, సహయాచారి సాహితీ సాహచర్యము, ప్రహ్లాద చరిత్ర - ఎర్రన, పోతనల తులనాత్మక పరిశీలనలతో పాటు అనువాద గ్రంథాలు, సుబోధినీ వ్యాకరణం వంటి రచనలు ప్రకాశరావుకు పేరు తెచ్చిపెట్టాయి. ప్రకాశరావు తన 52 ఏళ్ళ సాహితీ జీవితంలోకి 50కి పైగా పుస్తకాలు రాశారు. 171కి పైగా అవధానాలు చేశారు. ప్రకాశరావు సాహితీ సేవలకు గాను భారత ప్రభుత్వం 2021వ సంవత్సరంలో పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది రాష్ట్ర ప్రభుత్వం కళారత్న బిరుదుతో సత్కరించింది. అవధాన ప్రతిభతో పల్లె నుండి ఢిల్లీ దాకా తన సాహిత్యాన్ని వినిపించారు.

సాహిత్య పిపాసులు ఆయనకు గండ పెండేరం తొడిగారు. కనకాభిషేకం చేశారు. ఎన్నో సన్మానాలు, పురస్కారాలు అందుకున్నారు. ఆరుద్ర శబ్దాలుగా అవిశ్రాంతంగా తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్న సాహితీ శ్రామికుడు ఆశావాది ప్రకాశరావు ఫిబ్రవరి 17, 2022వ సంవత్సరం పెనుకొండలోని తన స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. చిత్తూరు జిల్లా తొలితరం కథలు - వస్తు విశ్లేషణ	- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి	6
2. భూమిపుత్రి నవల - దుర్గ పాత్ర చిత్రణ	- బి. శ్రీదేవి డా॥. డి. యువశ్రీ	11
3. పద్మ పురస్కార గ్రహీతలు తెలుగు సాహిత్యానికి చేసిన కృషి - విశ్లేషణ	- చింతరెడ్డి భాస్కర్ రెడ్డి	13
4. తెలంగాణా పాటల్లో స్త్రీ జీవితం	- డా॥. డి. రాంబాబు	19
5. లంబాడీల ఆరాధ్య దైవం - అరుదైన ఆరాధన విధానం	- డా॥. బి. సరస్వతి	22
6. కరోనా కల్లోలం నేపథ్యంగా వెల్లువెత్తిన కవిత్వం	- డా॥. చింతల రాకేశ్ భవాని	26
7. మూడు తరాల సబ్బండ సోయి 'అడపం' కథలు	- డా॥. చింతం ప్రవీణ్ కుమార్	30
8. "రాయలసీమ సంస్కృతి - ఒక పరిశీలన"	- డా॥. డి. సహదేవుడు	38
9. రాలిపోయిన దళిత వేగు చుక్క	- డా॥. గైని రవి	42
10. గురజాడవారి పుత్తడిబొమ్మ పూర్ణమ్మ	- డా॥. గెంజి అరుణ	46
11. వైవిధ్యభరిత మానవ సంబంధాల సమాహారం 'విహారి' కథా సాగరం	- డా॥. ఎం. హరికృష్ణ	49
12. భాష ప్రధాన లక్షణాలు - ఆధునిక భాషాశాస్త్రంలోని పదాంశ విజ్ఞానం	- డా॥. యం. ప్రసాద్ నాయక్	54
13. డా॥సి.నారాయణరెడ్డి సినీగీతాలు - జానపద సాహిత్యంతో ...	- డా॥. యం. వెంకటలక్ష్మమ్మ	61
14. అమెరికా తెలుగు కథానిక - వస్తు వైవిధ్యం	- డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి	66
15. జోగిని వ్యవస్థను ప్రతిబింబించిన అపూర్వ నవల	- డా॥. ర్యాగట్ల సాయిలక్ష్మీ	74
16. ప్రాచీన ఒరియా సాహిత్యంపై భక్తి - భక్తి ఉద్యమ ప్రభావాలు	- డా॥. పళని	77
17. కట్ట బ్రహ్మన చరిత్రము - దేశభక్తి కావ్యం	- డా॥. పి. విశ్వప్రసాదు	83
18. ప్రజాకవి సుంకర సత్యనారాయణ సాహిత్యోద్యమం	- పాత శ్రీనివాసరావు	89
19. ప్రవాసంలో తెలుగువారు - ఆశలు అక్కరలు - బాధ్యతలు	- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి	92
20. ఆంధ్రకవయిత్రులు - కవితా దృక్పథం	- డా॥. డి. ఉదయకుమారి	102
21. కొండేపూడి నిర్మల 'హక్కు' కథానిక - పరిశీలన	- డా॥. జి. పార్వతి	107
22. శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!' - భాషా వైదుష్యం	- డా॥. మానమ మునిరత్నం	111
23. కథా నేపథ్యంగా తెలుగుభాష - సంస్కృతి - ప్రపంచీకరణ ప్రభావం	- డా॥. వి. శాంతిలక్ష్మి	116
24. తెలంగాణ వెతలే... కథలై - సమాలోచనం	- బి. సునీత	119
25. డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగు బోధనా లక్ష్యాలు..	- గుత్తి కొండ చంద్రకళ	123
26. నల్లగొండ కథ - వస్తు వైవిధ్యం	- దర్శనం ప్రకాశం	128

27. శ్రీమతి సూర్యా ధనుంజయ్ కథల్లో మానవ జీవన చిత్రణ	- ధనావత్ పద్మ	131
28. "భారతం"లో స్త్రీ	- రమాదేవి ఇడికూడ	139
29. పెన్నా శివరామకృష్ణ సాహిత్యేతర రచనలు - అధ్యయనం	- ఐ.చిదానందం	142
30. కడప జిల్లా కథలు - స్థానికత	- యం. రాణి - డా॥. డి.యువశ్రీ	146
31. సురభి నాటకరంగం - సాంకేతిక వ్యవస్థ	- రేకందార్ నిరుపమ సునేత్రి	148
32. పాటల మధుశాల సీనియర్ సముద్రాల	- తిరునగరి శరత్ చంద్ర	152
33. ఆశావాది - అవధాన నిధి	- డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. బూసి వెంకటస్వామి	156
34. A Role of International Day of Yoga in the World	- B. Venkateshwarlu	159
35. Ravana : The Hero of Lanka	- Dr. Nilachal Mishra	165
36. Tagore's Views on Education	- Dr. S. Hemalatha	170
37. Feminism in the Novels of R.K.Narayan ...	- Sahithi Modugula	173
38. Horrors of History-Violence-Victimisation of Women in..	- D. Kavitha & - Prof. M. Neeraja	181
39. Foundational principles for the Kcântipâramitâ or Tolerance	- Dr. Mai Ram	185
40. *Jai Bhim* : An Unremitting Discourse on Dalit and Tribal Identity	- Jai Shri Jain	189
41. Pronominal system of Banjara Language	- Dr. Korra Balu Naik	198

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిత్తూరు జిల్లా తొలితరం కథలు – వస్తు విశ్లేషణ

– అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగులో ఆధునిక కథానిక అన్ని లక్షణాలతో గురజాడ రాసిన 'దిద్దుబాటు' (1910) కథతో మొదలైంది అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పోరంకి దక్షిణామూర్తి, ప్రోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, వేదగిరి రాంబాబు లాంటి వాళ్ళు చెప్పారు. అయితే గురజాడ కంటే ముందు కథలు రాసినవాళ్ళు ఉన్నారంటూ భండారు అచ్చమాంబ కథలను, ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ కథలను, వెదురుమూడి శేషగిరిరావు కథలను ప్రతిపాదిస్తూ పురిపండా అప్పలస్వామి, రాయసం వెంకటశివుడు, అక్కిరాజు రమాపతిరావు, ఆరుద్ర లాంటి వారు తొలి తెలుగు కథపై చర్చను లేవదీశారు. ఈ చర్చ జరుగుతుండగానే వివినమూర్తి 2015లో దిద్దుబాటులు పేరుతో గురజాడ దిద్దుబాటు కథ కంటే ముందు వచ్చిన 92 కథలతో ఒక సంకలనాన్ని తెచ్చిన విషయం అందరికీ తెలిసినదే. అయితే లక్ష్య లక్షణ సమన్వయ దృష్టితో చూస్తే పైకథలన్నీ ఆధునిక కథానికకు ఉండవలసిన లక్షణాలతో ఉన్నాయా అన్న ప్రశ్న మనకు జనిస్తుంది. దీనికి వివినమూర్తి గారు ఇచ్చిన సమాధానం "స్వరూప, స్వభావ చర్చలోకి దిగకుండా, 1910 జనవరి-ఫిబ్రవరి ఆంధ్రభారతి తొలి సంచికలో వచ్చిన దిద్దుబాటుకి ముందుగా పత్రికలు ముద్రించిన కథలు తేదీల వారీగా ఒక క్రమంలో ఉంచటానికి ప్రయత్నించాను. ఇవి కథలుగా అనడానికి పాటించిన ప్రమాణాలివి. 1. కథ నిడివి. 2.కథగా పత్రికలు అనడం. 3. సంభాషణల రూపంలో చాలా ఉన్నాయి. వాటిని కథలన్న ఉద్దేశంతోనే రాశారు కాని ప్రదర్శన నిమిత్తం రాయలేదు. కనుక వాటిని కథలుగా తీసుకున్నాను" (దిద్దుబాటులు ముందుమాట) అంటారు. ఈ విషయం ఇక్కడ ఎందుకంటే చిత్తూరు జిల్లా తొలితరం కథలు దిద్దుబాటుకు తరవాత వచ్చినప్పటికీ కొన్ని కథలు సంభాషణల రూపంలో ఉండడం, వాడుక భాషకు బదులు గ్రాంథిక భాషలో ఉండడం వల్ల వాటిని ఆధునిక కథానికలు అనవచ్చా అని సందేహం వచ్చి. దీనికి వినినయూర్తి గారిచ్చిన పై వివరణను చిత్తూరు జిల్లా తొలితరం కథలకు నేను అనువర్తింపచేస్తూ వాటిని కథానికలుగా పరిగణిస్తూ అందులోని వస్తు వైవిధ్యాన్ని విశ్లేషించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఈ చర్చ పక్కన పెడితే ఇలాంటి చర్చే రాయలసీమ తొలి కథ ఏది, రాయలసీమ తొలి కథా రచయిత ఎవరనే విషయాలపై కూడా ఉంది. 1941లో విజయవాణి పత్రికలో వచ్చిన 'చిరంజీవి' కథ తొలి రాయలసీమ కథ అని, దీనిని రాసిన గుత్తి రామకృష్ణ (అనంతపురం) రాయలసీమ తొలి కథా రచయిత అని వల్లంపాటి వెంకట సుబ్బయ్య, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, వేంపల్లి గంగాధర్, శశిశ్రీ లాంటివారు చెప్పారు. అలాగే ఏప్రిల్ 1944 చిత్రగుప్త పత్రికలో వచ్చిన 'కడగండ్లు' కథ తొలి రాయలసీమ కథ అని, దీనిని రాసిన కె. సభాను(కనక సభాపతి పిళ్ళై) (చిత్తూరు) రాయలసీమ తొలి కథా రచయిత అని మధురాంతకం రాజారాం, సింగమనేని నారాయణ, వేదగిరి రాంబాబు లాంటి వారు చెప్పారు. అయితే ఇటీవల ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో జరిగిన పరిశోధనల ఫలితంగా తొలి తెలుగు కథ విషయంలో మార్చుకోవాల్సిన అభిప్రాయాలలాగా పై అభిప్రాయాలను కూడా మార్చుకోవలసి వస్తుంది.

ఏవిధంగా అంటే మొన్న మొన్నటి వరకూ కె. సభానే చిత్తూరు జిల్లా తొలి కథా రచయిత అనుకున్నాం. అయితే ఇటీవల రాయలసీమ కథా సాహిత్యంపై ప్రాంతీయ అస్తిత్వ నేపథ్యంలో తవ్వా వెంకటయ్య 'భారతకథానిధి' అనే పత్రికపైన, అప్పిరెడ్డి హరినాథరెడ్డి 'జనవినోదిని', 'హిందూసుందరి', 'సౌందర్యవల్లి', 'శారద', 'శ్రీ సాధన',

'తెనుగుతల్లి', 'విజయవాణి', 'చిత్రగుప్త' పత్రికలపైన చేసిన పరిశోధనల ఫలితంగా లభించిన ఆధారాల మేరకు చిత్తూరు జిల్లాలో సభా కంటే ముందే కథలు వచ్చాయని తెలుస్తోంది. పై పత్రికల్లో సేకరించిన కథలను 'రాయల సీమ తొలితరం కథలు' (తవ్వా వెంకటయ్య), 'మొదటి తరం రాయలసీమ కథలు' (అప్పిరెడ్డి హరినాథరెడ్డి) అనే పేర్లతో వెలువరించారు. వీటితో పాటూ తప్పెట రామప్రసాద రెడ్డి సంపాదకత్వంలో 'భారతకథానిధి' పత్రికలో లభించిన మరికొన్ని కథలను 'సీమ కథా శిలాజాలు' అనే పేరుతో కూడా ప్రచురించారు. ఈ మూడు గ్రంథాలలో చిత్తూరు జిల్లాకు సంబంధించిన పది కథలు లభిస్తున్నాయి. ఈ మూడు సంకలన గ్రంథాలలో లేని చిత్తూరు జిల్లాకు సంబంధించిన మరొక కథ (సావిత్రి) కూడా భారతకథానిధి (1928 మార్చ్) పత్రికలో నేడు లభ్యమవుతున్నది.

ఈ పదకొండు కథలు భారతకథానిధి, తెనుగుతల్లి పత్రికల్లో వచ్చాయి. వాటి వివరాలు చూస్తే శారద (1927 జనవరి, భారతకథానిధి), హైమావతి (1927 సెప్టెంబర్, భారతకథానిధి), సావిత్రి (1928 మార్చ్, భారతకథానిధి) అనే కథలను యం.వి. పాపన్న గుప్తబీ ప్రేమానుబంధం (1927 జూలై భారతకథానిధి) అనే కథను చింతా నరసింహారెడ్డిబీ భోగపుమేళములు (1927 డిసెంబర్ భారతకథానిధి) అనే కథను సి.యన్. నీలకంఠయ్యర్‌బీ ఒక ఆదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర (1928 డిసెంబర్ భారతకథానిధి) అనే కథను పూతలపట్టు శ్రీరాములురెడ్డిబీ నా చిట్టితల్లి (1929 నవంబర్ భారతకథానిధి) అనే కథను టి.కె. రంగస్వామి అయ్యంగార్‌బీ చంద్రికా మోహనులు (1937 ఆగస్టు తెనుగుతల్లి) అనే కథను రావూరు చంగనార్యబీ రాఘవేంద్రరావు గారి రాజీనామా (1937 సెప్టెంబర్ తెనుగుతల్లి), బిక్కిరింత పిదప వెక్కిరింత (1937 నవంబర్ తెనుగుతల్లి), పాపి చావు (1937 డిసెంబర్ తెనుగుతల్లి) అనే కథలను ఆర్మొగం పిళ్ళై రాశారు.

దీనిని బట్టి చూస్తే తెలుగు కథానిక 1910 (దిద్దుబాటు) నుండి 1879కి (చిలుకను గురించిన సంభాషణ) ఏవిధంగా చేరిందో అదేవిధంగా చిత్తూరు జిల్లా కథ కూడా 1944 (కడగండ్లు) నుండి 1927కి (శారదా) చేరింది. 1927 భారతకథానిధి మాస పత్రికలో ప్రచురితమైన 'శారద' కథే చిత్తూరు జిల్లా మొదటి కథ. దీని రచయిత యం. వి. పాపన్న గుప్త. ఈయనే చితూరు జిల్లా మొదటి కథా రచయిత అని కూడా నిస్సంకోచంగా చెప్పవచ్చు.

సభా కంటే ముందు చిత్తూరు జిల్లా తొలితరం కథలుగా లభిస్తున్న ఈ పదకొండు కథలూ తనదైన ప్రత్యేకతని కలిగి ఉంటూ, మూఢ నమ్మకాలను, భోగపుమేళ వ్యవస్థను, దళిత జీవిత చిత్రణను, సామాజిక పరమైన సమస్యలను, ఆర్థికపరమైన సమస్యలను చిత్రించిన కథలుగా కనిపిస్తాయి.

చిత్తూరు జిల్లా తొలి కథైనటువంటి శారద కథ మూఢనమ్మకాలను, సాంప్రదాయాలను విపరీతంగా పాటించే కృష్ణారావు చివరికి తన ప్రాణాలను కూడా వాటికోసం బలి తీసుకోవడం తెలియజేస్తుంది. రజస్వల అయి ఒక సంవత్సరం అయినప్పటికీ చెడ్డ నక్షత్ర కాలంలో తన కోడలు శారదను తమ ఇంటికి తీసుకురాకూడదని, కనీసం భార్యా భర్తలు ఒకరినొకరు చూసుకోడానికి కూడా శాస్త్రం ఒప్పుకోదని కొడుకైన ప్రసాదరావును ఒక సంవత్సరం నుండి అత్తవారింటికి కూడా పంపకుండా ఉంటాడు. ప్రసాదరావు ఆంగ్ల విద్యను అభ్యసించి, తహసీలుదారుగా ఉద్యోగం రావడంతో ఉన్న ఊరు నుండి వేరే ఊరికి వెళ్ళవలసి వస్తుంది. శారదపైనే ధ్యాస ఉన్న ప్రసాదరావు, పెద్దవారు చెప్పే మూఢాచారాల కోసం నా సంతోషాలను పాడుచేసుకోవాలా అని తండ్రికి చెప్పకుండా తన భార్యను అత్తవారింటి నుండి కాపురానికి తెచ్చుకుంటాడు. ఈ విషయం తెలిసిన కృష్ణారావు శాస్త్ర విరుద్ధంగా తన మాటకి ఎదురుగా కొడుకు చేసిన పనికి కోపగించుకొని ఒక ఉత్తరం రాస్తూ "తనయా! లేక లేక కలిగిన వాడవే యయినను దుష్కర్ముడగుటచే నిన్ను

విసళించుకున్నాడను. ఇక నీగతినీది. నాగతి నాది. లోకనింద పడజాలను. గాన నేను పాషానమును గొని యీలోకమును, బాయుచున్నాడను" (రాయలసీమ తొలితరం కథలు, పుట 59) అంటూ తన తల్లిని కూడా తన దగ్గరకు పోకుండా నిర్బంధం ఆంక్షలను పెట్టి, "నీ శ్రేయస్సును గోరక, వంశక్షయ మగునట్లు మీరు నిస్సంతులై యుండునట్లు, నా కడబటి యాశీస్సు నిచ్చి వెళ్ళుచున్నాను" (రాయలసీమ తొలితరం కథలు, పుట 59) అంటూ ఆత్మహత్య చేసుకుంటాడు.

యం.వి. పాపన్న గుప్త ఈ కథలో తిరోగమన భావాలతో సమాజాన్ని వెనక్కి నడిపించే మూఢ నమ్మకాలను, శాస్త్ర సంప్రదాయాలను పాటించే వారికి ప్రతీకగా కృష్ణారావు పాత్రను, ఈ పూర్వాచార పరాయణత్వాన్ని విస్మరించి తమ పనులను చక్కపెట్టుకొనే వారికి ప్రతీకగా కృష్ణారావు కొడుకు ప్రసాదరావు పాత్రను ఆధారంగా చేసుకొని కథను నడిపిస్తాడు. ఈ కథను మనం బాగా గమనించినట్లైతే చిత్తూరు జిల్లా మొదటి కథ ప్రారంభ కాలంలోనే సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢనమ్మకాలపై ఒక రకమైన తిరుగుబాటుతో వచ్చిందని చెప్పవచ్చు.

భోగపుమేళాల ప్రభావం నాటి సమాజం పైన ఎంత బలంగా ఉందో తెలియజేస్తూ సి. ఎస్. నీలకంఠయ్యర్ రాసిన కథ 'భోగపు మేళములు'. ఇందులో సత్యసాధనుడు ఎంత చెప్పినా వినకుండా భోగపుమేళాలు లేని పెండ్లి ఒక పెండ్లేనా అంటూ పట్టు బట్టి తన వియ్యంకుడి చేత తన కొడుకు జగన్నాధము పెళ్ళిలో భోగపుమేళాలు పెట్టిపిస్తాడు సోమసుందరుడు. దీని పర్యవసానం జగన్నాథము వేశ్య లోలత్వంలో పడి తన భార్యను వదిలేసి ఆస్తినంతటినీ విలాసాలకు ఖర్చు చేయడం మొదలు పెడతాడు, ఇది చూసి సోమసుందరుడు వియ్యంకుడు చెప్పిన మాటలను పట్టించుకోనందుకు తనని తాను నిందించుకుంటాడు. ఇది ఈ కథలోని సారాంశం.

ఈ కథలో రచయిత భోగపుమేళాల ప్రభావం నాటి సమాజం పైన ఎంత బలంగా ఉందో తెలియజేస్తూనే, వేశ్యలు ఉన్నంతకాలం ఈ భోగపుమేళాలను ఆపలేమని, ఒక పక్క సంఘసంస్కర్తలు పడపు వృత్తి చేసుకునే వారి ఇండ్లకు వెళ్లి, పడపు వృత్తి మానుకొని వివాహాలు చేసుకోమని శతవిధాలుగా చెప్తున్నప్పటికీ వెయ్యిలో ఒక్కరు కూడా మారడంలేదని తన మనసులోని ఆలోచనల పరంపరను, ఆనాటి సమాజపు తీరును, తనకు గల సంఘసంస్కరణ అభిలాషను మన ముందు ఉంచుతాడు రచయిత. ఈ కథను చూస్తే సమాజాన్ని పట్టి పీడిస్తున్న కొన్ని రుగ్మతల నుండి ప్రజలను జాగృత పరచాలనే ఆకాంక్ష కూడా రచయితకు ఉందని తెలుస్తుంది.

శారదా బిల్లు మొదలు నిర్భయ చట్టం నుండి నిన్న మొన్నటి దిశా చట్టం వరకూ అమాయకపు అబలలపై జరుగుతున్న అకృత్యాలను రోజూ మనం దిన పత్రికలలో చూస్తూనే ఉన్నాం. కొందరు అభం శుభం తెలియని చిన్నారులపట్ల, ఏ ఆదరువూ లేని ఒంటరి స్త్రీల పట్ల, భర్తలు లేని వితంతువుల పట్ల లైంగిక వేదింపులతో పురుషహంకార భావజాలంతో మనిషిలోని మృగత్వాన్ని నిరూపించుకుంటూనే ఉన్నారు. ఇంతటితో చాలక కొంతమంది మద్యం మత్తులోనో లైంగిక వాంఛతో నిండిన వికృత రూపంతోనో కన్న కూతురని కూడా చూడకుండా పైశాచికానందాన్ని పొందుతున్నారు. ఇలాంటి వస్తువుతో రాసిన కథే 'నా చిట్టి తల్లి'. ఈ కథలో ప్రధాన పాత్ర సుందరి. పెళ్ళైన కొంత కాలానికే పాము కాటుతో భర్త మరణించిన బాల వితంతువు. పెద్ద తండ్రి సహాయంతో చిత్తూరులో బాలికల పాఠశాలలో పనిచేసుకుంటూ ఉంటుంది. తన పెత్తల్లి దీపావళికి రమ్మన్నదని కారులో వెళ్తుంది. ఈ క్రమంలో కారులో ఒక సన్యాసి సుందరి పట్ల వ్యామోహంతో ఆమెను పొందగోరుతాడు. చివరికి సుందరి తన కూతురేనని తెలిసి తన నుదిటిపై ముద్దు పెట్టుకుంటాడు. ఈ కథ చిన్న తనంలోనే వితంతువులైన స్త్రీల పట్ల పురుషుల లైంగిక వేదింపులు ఏవిధంగా ఉంటాయన్న దానికి ఉదాహరణగా కనిపిస్తుంది.

మతం ముసుగులో తీరని కోర్కెలను తీర్చుకోవడానికి, అమాయకపు ప్రజల భయాన్ని సొమ్ము చేసుకోడానికి క్రైస్తవ

మతంలోని ఫాదర్లు చేసే అకృత్యాలను, అరాచకాలను తెలిపే కథే 'పాపి చావు'. ఈ కథలో క్రైస్తవ మత ప్రచారం కోసం ఇంగ్లాండు నుండి భారతదేశం వచ్చిన ఫాదరు ప్రజలను మోసం చేసే తీరు, ఆడవారి పట్ల వారి దురా గతాలను కళ్ళకు కట్టినట్టు రచయిత చిత్రించాడు. క్రైస్తవ మత ప్రచారం చేసే ఒక ఫాదరీ తన చుట్టూ ఉన్న ప్రజలకు ఉపన్యాసాలిస్తూ, తన దగ్గరికి వచ్చే రోగులకు మందు ఇవ్వకుండా మందక్కరలేదు మతం పుచ్చుకో నేరుగా స్వర్గానికి చేరుతావు అంటూ మత మార్పిడికి ప్రయత్నిస్తూ ఉంటాడు. అప్పటి వరకూ అణచి పెట్టుకున్న కోరికల్ని తన దగ్గరికి వచ్చే స్త్రీలను చూసినప్పుడు వారిపట్ల అనభ్యకరంగా ప్రవర్తిస్తూ కోరికను తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూ యానాది స్త్రీ 'చెంగి' చేతిలో చనిపోతాడు.

మనుధర్మ శాస్త్రం స్త్రీల పట్ల విధించిన ఆంక్షల పట్ల వ్యతిరేకత ప్రకటిస్తూ, అనాదిగా సాగుతున్న సాంప్ర దాయానికి కట్టుబడో లేక వరకట్నం ఆశించో అప్పుడే యవ్వనంలోకి ప్రవేశించిన స్త్రీలను వృద్ధాప్యం మీదపడి కాటికి కాళ్ళు చాచుకున్న వాళ్లకు ఇచ్చి పెళ్ళి చేసి వారి జీవితాన్ని నరక ప్రాయం చేసే విధానాన్ని ఎత్తి చూపుతూ పాపన్న గుప్త రాసిన కథ 'సావిత్రి'.

యం. వి. పాపన్న గుప్త రాసిన మరొక కథ హైమావతి. నిరుపేదలైన తల్లిదండ్రులు అప్పులవాళ్ళు పెట్టే బాధలకు ఏడవడం చూసిన కూతురు ఎలాగైనా వారికి మనశ్శాంతిని కలిగించాలని ప్రాణ త్యాగానికి సిద్ధపడడం ఇందులోని కథ. ఊరిలోని రాజుకు గంగాభవానీ కలలో కనిపించి చెరువు ఉప్పొంగుతుందని దానికి శాంతిగా ఎవ్వరైనా మూడవ కాన్పును బలిగా ఇస్తే ఆవిధంగా జరగదని చెప్తుంది. ఈవిషయాన్ని రాజు చాటింపు వేయిస్తూ ఇరవై వేల రూపాయలను బహుమానంగా కూడా ప్రకటిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న హైమావతి రాజు దగ్గరికెళ్ళి నేను బలికి సిద్ధంగా ఉన్నానని చెప్తుంది. అయితే రాజు తల్లిదండ్రుల అనుమతి లేనిదే నేను అంగీకరించనని చెప్తాడు. హైమావతికి ఏమి చెయ్యాలో తెలీక చెరువు గట్టుకెళ్లి అందులో దూకేస్తుంది. ఇది చూసిన బోయ వాడు ఆమెను కాపాడడం. విషయం తెలిసి రాజు అక్కడికి రావడం, పురోహితులు గంగాభవాని శాంతించింది అనడంతో రాజు హైమావతి ధైర్యానికి మెచ్చుకొని ప్రకటించిన బహుమానంతో పాటు మరిన్ని వస్త్రాలను ఇస్తాడు.

ఒక అగ్రహారాన్ని ఆశ్రయించుకొని ఉన్న మాలపల్లెలోని నల్లయ్య అనే అమాయకపు దళితుడు పుట్టినప్పటి నుండి మరణించే వరకూ చేసే అమాయకపు పనులను చిత్రిస్తూ 'ఒక ఆదియాంధ్ర భక్తుని జీవిత చరిత్ర' కథ. ఒకరికి తెలీకుండా ఒకరికి వచ్చిన సినిమా టికెట్ల గురించి అవతలి వారికి తెలీకూడదని రెండు సన్నిహిత కుటుం బాలు ఒకరితో ఒకరు ఆడిన అబద్ధాల కారణంగా కొంత హాస్యాన్ని పుట్టించే కథ 'బిక్కిరింత పిదప వెక్కిరింత'. ఆర్థిక సంబంధాలు మనుషుల మధ్య దూరాన్ని ఏవిధంగా పెంచుతుందో తెలియజేస్తూ ప్రేమాను బంధము కథ. ఇలా ప్రతి కథా ఒక్కొక్క రకమైన ఇతి వృత్తంతో చిత్తూరు జిల్లాలోని తొలితరం కథలు అనాటి సమాజంలోని మూఢ నమ్మకాలను, భోగపుమేళాల వ్యవస్థను, సామాజిక సమస్యలను, క్రైస్తవ మత వ్యవస్థ లోని ఫాదర్ల దురాగతాలను, దళితుల జీవన వ్యవస్థను చిత్రిస్తూ కనిపిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. గంగాధరం, వేంపల్లి. *రాయలసీమ కథా సాహిత్యం (ఒక పరిశీలన).* పి.హెచ్.డి. అముద్రిత సిద్ధాంత గ్రంథం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం. 2010.
2. రంగనాథాచార్యులు, కె. కె. *తొలినాటి తెలుగు కథానిక* మొదటి నుంచి 1930 వరకు. హైదరాబాదు: పల్లవి గ్రాఫిక్స్. 2008.

3. రామప్రసాద రెడ్డి, తప్పెట. సీమ కథా శిలాజాలు (రాయలసీమ తొలితరం కథలు 1927-1930). అనంతపురం: దిక్సూచి పబ్లికేషన్స్. 2015.

4 .రాంబాబు, వేదగిరి. తెలుగు కథానిక హైదరాబాదు: సాయిలిఖిత ప్రింటర్స్. 2012.

5. వివినమూర్తి. దిద్దుబాటలు: యుఎస్ఏ: తానా పబ్లికేషన్స్. 2015.

6. వెంకటయ్య, తవ్వా. సీమ కథా తొలకరి (వ్యాస సంపుటి). తవ్వారుపల్లె: అక్షరదీపిక పబ్లికేషన్స్. 2014.

7. వెంకటయ్య, తవ్వా. (సంపాదకులు). రాయలసీమ తొలితరం కథలు. తవ్వారుపల్లె: అక్షరదీపిక దీపిక పబ్లికేషన్స్. 2015.

8. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథా శిల్పం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2008.

9. శశిశ్రీ. రాయలసీమ సాహిత్యం. హైదరాబాదు: తెలుగు అకాడమి. 2012.

10. హరినాథ రెడ్డి, అప్పిరెడ్డి (సం). మొదటి తరం రాయలసీమ కథలు (1882-1944). హైదరాబాదు: అబ్జ క్రియేషన్స్. 2015.

11. సావిత్రి (కథ). మార్చ్ 1928 భారతకథానిధి మాసపత్రిక

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భూమిపుత్రి నవల – దుర్గ పాత్ర చిత్రణ

– బి. శ్రీదేవి
పరిశోధక విద్యార్థి, శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి.

– డా॥. డి. యువశ్రీ
సహాయ ఆచార్యులు, శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి.

మాలాతీచందూర్ నవలల్లో ఒక ప్రత్యేకత కల్గిన నవల "భూమిపుత్రి".

గ్రామీణ వాతావరణ నేపథ్యం కల్గిన స్త్రీ అయినప్పటికి ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని ఎలా మలుచు కుంటుంది, తన కుటుంబాన్ని ఎలా నిలబెడుతుందో ఈ నవల ద్వారా మనం తెలుసుకోవచ్చు.

బాల్యం నుంచే తనుపడ్డ కష్టాలు, ఆ కష్టాల ద్వారానే ఒక స్త్రీ ఎలా రాటుదేలుతుందో ఎలా పరిపక్వత చెందుతుందో దుర్గ పాత్ర ద్వారా మాలతీచందూర్ గారు నిరూపించారు.

మాలతీచందూర్ తన చుట్టూ ఉన్న పరిస్థితులను, సంఘటనలను ఆధారం చేసుకొని తన రచనలు కొన సాగిస్తారు. అలాంటి కొనసాగింపులో భాగంగానే "భూమి పుత్రి" నవల చదువుతున్నంతసేపు మన చుట్టూ జరుగుతున్న సంఘటనలు మనకు గుర్తుకు వచ్చేలా ఉంటుంది.

ముఖ్యాంశాలు :

"భూమిపుత్రి" నవల మాదిరెడ్డి సులోచన అవార్డ్ పొందినది. నవలలో ప్రధానపాత్ర అయిన కనకదుర్గ పల్లెటూరి అమ్మాయి. ఎలాంటి కల్మషం లేని స్వచ్ఛమైన నది లాంటిది. ముక్కుసూటితనం, నిజాయితీకి మారు పేరు. దుర్గ చిన్నప్పుడే తండ్రిని కోల్పోయి, తల్లితో కలిసి మేనమామ ఇంటికి చేరుతుంది. తల్లితో కలిసి తల్లి పుట్టింట్లో బండెడు చాకిరి చేస్తుంది. వారుపెట్టే తిట్లు, చివాట్లు భరిస్తుంది. ఒక్కొక్కసారి ఎదురుతిరగాలి అని మనసులో అనుకొంటుంది. కానీ దుర్గ వాళ్ళ అమ్మ అణచివేస్తూ ఉంటుంది. ఇలా బాల్యం అంతా దుర్గ జీవితం కష్టాలు, కన్నీళ్లతో ఉంటుంది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో దుర్గ తన తల్లిని కోల్పోతుంది. తల్లిని కోల్పోయిన దుర్గ గుండెలు బాదుకొని ఏడ్వదు. ఆమె బాధ కన్నీటికి అతీతమైనది. దుర్గ ఏవో చిన్నచిన్న పనులు చేస్తూ సంపాదించుకుంటుంది.

దుర్గలోని ఆత్మవిశ్వాసం, నిజాయితీ, కుృషం లేని తనం తన మేమమామ కొడుకు రామకృష్ణని ఆకర్షిస్తాయి. రామకృష్ణ పట్నంలో గది అద్దె తీసుకొని చదువుకుంటూ ఉంటాడు. కానీ అతను అంత ధైర్యవంతుడు కాదు. ప్రతి చిన్న విషయానికి భయపడుతూ ఉంటాడు. ఒకానొక సందర్భంలో దుర్గపట్నం వెళితే తన గదికి తీసుకొని వెళ్ళడానికి భయపడుతాడు రామకృష్ణ. కనకదుర్గ చొరవ తోనే వారి వివాహం జరుగుతుంది. వివాహం తర్వాత వారి జీవితం నందనవనం అవుతుంది. దుర్గ పాత్రను గమనిస్తే అత్యంత సహజత్వం కల్గిన సజీవశిల్పంగా గోచరిస్తుంది. వారి వివాహ జీవితం ఆదర్శప్రాయంగా ఉంటుంది. ఎలాంటి విద్యాగంధం లేని దుర్గ పిల్లలని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతుంది. దీనివెనుక ఆమె అపారకృషి కనబడుతుంది. పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులుగా వారి వారి జీవితాలలో చక్కగా స్థిరపడతారు.

నవల మొత్తం మీదుగా దుర్గ పాత్రను గమనిస్తే ఈ పాత్రను రూపుదిద్దిన విధానం మనల్ని తప్పక ఆలోచింప చేస్తుంది. దుర్గ పాత్రలో ఉండే నిజాయితీ, పట్టుదల, ఓపిక, స్వతంత్ర వ్యక్తిత్వం ఆత్మవిశ్వాసం చదివే పాఠకులకి స్ఫూర్తిని కల్గిస్తాయి. ఈ నవల చదువుతున్నంత సేపు మనం ఇలా హాయిగా ఆలోచిస్తే బావుంటుంది అనే భావం చదివే ప్రతి పాఠకుడిలో అన్పిస్తుంది.

ముగింపు :

భూమిపుత్రి నవలలో కనకదుర్గ ఒక పాత్రగా కాక ఒక సజీవత్వం ఆపాదించబడిన స్త్రీగా కనబడుతుంది. ఈ పాత్రవల్ల స్త్రీలో అహంకారం, డాంభికత్వం, ఒక రకమైన కాంప్లెక్స్ ఇలా ఏవీ అడ్డం రాకుండా జీవితాన్ని నేర్చుకుందాం అనుకుని ఎంతో కొంత విధేయతని అలవర్చుకోవాలి అనుకునేటట్లుగా అనిపిస్తుంది.

మాలతీచందూర్ గారి నవలల్లో స్త్రీ పాత్రలకు పురుష పాత్రలు సహకరించేవిగా ఉంటాయి. ఈమె స్త్రీలకు ఆత్మవిశ్వాసం, ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటాయి. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని చెప్పడమే ఆమె భావనగా తెలుస్తుంది.

భూమిపుత్రి నవలలోని స్త్రీ పాత్ర అయిన "దుర్గ" హృదయం ఎంత సుకుమారంగా, సున్నితంగా ఉంటుందో అంతే స్థిరంగా, ధృడంగా కూడా ఉంటుంది. స్త్రీలో ఉండే విభిన్న పార్శ్వాల్ని ఈ ఒక్క పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు. "దుర్గ" పాత్ర స్ఫూర్తిదాయకం.

ఆధారగ్రంథం :

భూమిపుత్రి నవల - మాలతీచందూర్.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పద్మ పురస్కార గ్రహీతలు తెలుగు సాహిత్యానికి చేసిన కృషి – విశ్లేషణ

– చింతరెడ్డి భాస్కర్ రెడ్డి, తెలుగు భాషోపాధ్యాయులు, జి.ప.ఉ.పా నేతాపురం, తిరుమలగిరి సాగర్ మండలం, నల్గొండ జిల్లా.

పురస్కారం అంటే బహుమతి అని అర్థం. అపరిమిత ధైర్యసాహసాలను ప్రదర్శించినందుకు ఇచ్చేది పుర స్కారం. భారతదేశంలో ప్రధానం చేయబడుతున్న అత్యున్నత రెండవ పురస్కారం పద్మ పురస్కారం (మొదటిది భారతరత్న). ఈ పురస్కారాలు వివిధ రంగాలైన కళలు, పౌర సేవలు, సాహిత్యం మరియు విద్య, మెడిసిన్, ప్రజా వ్యవహారాలు, శాస్త్రం, సామాజిక సేవ, క్రీడలు, వాణిజ్యం మరియు పరిశ్రమలు, ఇతరాలు మొదలైన వాటిలో విశిష్ట కృషి చేసిన వారికి ప్రధానం చేస్తారు. వీటిని ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన కమిటీ ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం రోజున (జనవరి 26)న పురస్కార గ్రహీతల జాబితా ప్రకటిస్తుంది. అనంతరం రాష్ట్రపతి మార్చ్, ఏప్రిల్ నెలలలో ప్రధానం చేస్తారు. నియమ నిబంధనల ప్రకారం ఒక సంవత్సరానికి 120 మందికి మాత్రమే ప్రధానం చేయాలి. కానీ 2022లో 128 మందికి ప్రధానం చేశారు. అయితే మరణానంతరం ప్రకటించేవాటికి విదేశీయులు, ప్రవాస భారతీయుల విషయంలో ఈ నిబంధన వర్తించదని పేర్కొన్నారు. వీటిని పౌర పురస్కారాలలో భాగంగా 1954లో జనవరి 2న నెలకొల్పారు. మొదట పహేలా వర్గ్, దుస్రా వర్గ్, తిస్రా వర్గ్‌గా పిలిచేవారు. 1955 జనవరి 8న రాష్ట్రపతి విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మ శ్రీలుగా పేరు మార్చారు. జాతి, కుల, మత, లింగ, ప్రాంత భేదం లేకుండా వ్యక్తులందరూ ఈ అవార్డుకు అర్హులే. కానీ వైద్యులు, శాత్రవేత్తలు మినహా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులు అర్హులు కాదు. 1954లో నెలకొల్పిన ఈ అవార్డు 1978, 79 మరియు 1993 నుండి 1997 మధ్య కాలంలో మాత్రమే కొన్ని అవాంతరాల వలన ప్రకటించలేదు. 1954 నుండి నేటి వరకు పద్మ విభూషణ్ 325, పద్మ భూషణ్ 1295, పద్మశ్రీ 3330 మొత్తం 4950 అవార్డులు ప్రధానం చేశారు. వీనిలో అత్యధికంగా 1972లో 148 అతి తక్కువగా 1986లో 3 మాత్రమే ప్రధానం చేశారు. విదేశీయులు సహితం ఈ పురస్కారాలు అందుకున్నారు. అమెరికా దేశస్థులు అత్యధికంగా 114 పురస్కారాలు అందుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుండి 94, తెలంగాణ నుండి 158 మంది పురస్కా రాలు పొందారు.

పద్మ విభూషణ్ పురస్కారం: ఇది భాతరదేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారం. ఈ పురస్కారం అసాధారణ మైన మరియు విశిష్ట సేవలు చేసిన వారికి ప్రధానం చేస్తారు. 2022వ సంవత్సరం వరకు 325 మందికి ఈ పురస్కారం అందజేయబడింది. అత్యధికంగా 1999లో 14, అతి తక్కువ 1960, 66, 82లలో కేవలం 1 మాత్రమే అందజేశారు. రంగాల వారిగా చూస్తే అత్యధికంగా ప్రజా వ్యవహారాలకు 79, అతి తక్కువగా క్రీడలకు 4 మాత్రమే అందజేశారు. అత్యధికంగా అవార్డులు పొందిన రాష్ట్రం మహారాష్ట్ర 62, కేంద్ర పాలిత ప్రాంతం డిల్లీ 73, విదేశాలలో అమెరికా దేశం 11 అందుకున్నది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ కు 6, తెలంగాణకు 14 పురస్కా రాలు అందజేశారు. ''ఆంధ్రప్రదేశ్'' నుండి సాహిత్యం మరియు విద్య విభాగంలో కొత్త సచ్చిదానంద మూర్తి 2001, సామాజిక సేవ శ్రీ ప్రకాశ 1957, డా. చింతమన్ ద్వారకాంత్ దేశ్ ముఖ్ 1975, ప్రొ. నాయకులు గోగినేని రంగా 1991, సివిల్ సర్వీసెస్ శ్రీ హఫీజ్ మహ్మద్ ఇబ్రహీం 1967, శ్రీ రామస్వామి మొదలియార్ 1970, ''తెలంగాణ'' నుండి కళారంగం కాళోజీ 1992, అక్కినేని నాగేశ్వర రావు 2011, సాహిత్యం మరియు విద్య విభాగంలో

చక్రవర్తి రంగరాజన్ 2002, రామోజీరావు 2016, సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఎ పి జె అబ్దుల్ కలాం 1990, పల్లె రామారావు 2011, వాణిజ్య పరిశ్రమలు మైదావుల నరసింహన్ 2000, ప్రజా వ్యవహారాలు జాకీర్ హుస్సేన్ 1954, పద్మజా నాయుడు 1962, శ్రీ మెహిదీ నవాజ్ జంగ్ 1965, ఆలియావర్ జంగ్ బహదూర్ 1977, రావి నారాయణ రెడ్డి 1992, యాగ వేణుగోపాల్ రెడ్డి 2010, సివిల్ సర్వీసెస్ పట్టడకల్ వెంకన్న రావు 1967లో పురస్కారాలతో సత్కరించబడ్డారు.

పద్మభూషణ్ పురస్కారం: ఇది భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారం. ఈ పురస్కారం అత్యున్నత స్థాయికి చెందిన విశిష్ట సేవ చేసిన వారికి ప్రధానం చేస్తారు. 2022 సంవత్సరం వరకు 1294 మందికి ఈ పురస్కారం అందజేయబడింది. అత్యధికంగా 1972లో 50, అతి తక్కువగా 1980లో 1 మాత్రమే ప్రధానం చేశారు. అంశాల వారిగా గమనిస్తే అత్యధికంగా సాహిత్యం మరియు విద్యా రంగానికి 300, అతి తక్కువగా క్రీడలు 33 ప్రధానం చేశారు. రాష్ట్రాల పరంగా పరిశీలిస్తే అత్యధికంగా మహారాష్ట్ర 248, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఎక్కువగా డిల్లీ 235 అందుకున్నాయి. విదేశాలలో అమెరికా నుండి 52 మంది పొందారు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ నుండి 25 తెలంగాణ నుండి 33 మంది పురస్కారాలు పొందారు.

పద్మశ్రీ పురస్కారం: ఇది భారతదేశ నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం. ఈ పురస్కారం విశిష్టమైన సేవ చేసిన వారికి ప్రధానం చేస్తారు. 2022 సంవత్సరం వరకు 3330 మందికి ఈ పురస్కారం అందజేయబడింది. అత్యధికంగా 2020లో 118 అతి తక్కువగా 1956 లో 9 మాత్రమే అందజేయడం జరిగింది. అత్యధికంగా కళారంగం నుండి 786, తక్కువగా ప్రజా వ్యవహారాలు నుండి 65 అందజేశారు. రాష్ట్రాల వారిగా గమనిస్తే అత్యధికంగా మహారాష్ట్ర 500, కేంద్ర పాలిత ప్రాంతమైన డిల్లీ 514, విదేశాలలో అత్యధికంగా అమెరికా 51 పురస్కారాలు దక్కించుకున్నాయి. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ నుండి 63 తెలంగాణ నుండి 111 మంది పురస్కారాలు పొందారు.

పద్మ పురస్కారాలు పొందిన వారిలో సాహిత్యరంగాభి వృద్ధికి కృషి చేసిన ప్రముఖ కవులున్నారు. మరికొందరు వివిధ రంగాలలో పని చేస్తున్నప్పటికీ సాహిత్యం పై మక్కువతో అనేక గ్రంథాలు రచించారు. ముందుగా తెలుగు రాష్ట్రాలనుండి పద్మ పురస్కారాలు పొందిన వారిలో వివిధ రంగాలలో కృషిచేస్తూ సాహిత్యం పై మక్కువతో రచనలు చేసిన వారిని గురించి తెలుసు కుందాం.

సాహిత్యం పట్ల మక్కువ :

వివిధ రంగాలలో కృషి చేస్తూ సాహిత్యం పట్ల మక్కువతో రచనలు చేసిన వారిలో ఏ.పి.జె అబ్దుల్ కలామ్, రామోజీరావ్, పద్మజానాయుడు, పట్టడకల్ వెంకన్న రాఘవేంద్ర రావు, శ్రీపాద పినాకపాణి మామిడి వెంకట రంగయ్య, కొత్త సచ్చిదానంద మూర్తి, ఆచార్య ఎన్.జి,రంగా, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మొదలైన ప్రముఖులెందరో కలరు.

శ్రీపాద పినాకపాణి వృత్తిరీత్య వైద్యులు గొప్ప సంగీత ప్రియుడు. వీరు పాణినీయం, ప్రపత్తి, స్వరరామమ్, అభ్యాసమ్, నా సంగీత యాత్ర పుస్తకాలు రచించారు. గానకళనర్వస్వము, మనధర్మసంగీతము(1992), పల్లవిగానసుధ, సంగీత సౌరభము(1995) మొదలైన గ్రంథాలు వ్రాశారు. "సంగీత సౌరభం" పేరుతో తిరుపతి దేవస్థానం ప్రచురించిన 4 సంపుటాలలో వీరు స్వర పరచిన అన్నమాచార్య కృతులు 108, త్యాగరాజాది వాగ్గేయ కారుల కృతులు 607, ముత్తు స్వామి దీక్షితుల కృతులు 173, పదములు 44, జావళీలు 40, తాన వర్ణములు 56, తిల్లానాలు 10, మొత్తం 1088 సంగీత గుళికలు ఉన్నాయి. మిస్సైల్ మ్యాన్ గా పేరుగాంచిన ఎ పి జే అబ్దుల్ కలామ్ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త. మన దేశానికి 11 వ రాష్ట్రపతిగా పని చేశారు. "వింగ్స్

ఆఫ్ ఫైర్'' అన్ ఆటో బయోగ్రఫీ, ఇండియా 2020 ఎ విజన్ ఫర్ ది న్యూ మిలీనియం, ఇన్ఫ్లెరింగ్ థాట్స్ గ్రంథ రచయిత. తెలుగు వారికి ఏ మాత్రం పరిచయం చేయాల్సిన అవసరం లేని పేరు రామోజీరావు. వీరు ప్రముఖ వ్యాపారవేత్త, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత. రామోజీరావు అనగానే ఈనాడు, ఈనాడు అనగానే రామోజీరావు గుర్తుకు రావడం జరుగుతుంది. మీడియా మొఘల్ గా అభివర్ణించబడినారు. ఈనాడు దిన పత్రిక, తెలుగు వెలుగు, బాల భారతం వంటి మాస పత్రికల ద్వారా నూతన రచయితలను ప్రోత్సహిస్తూ సాహిత్యాభి వృద్ధికి కృషి చేస్తున్నారు. కొత్త సచ్చిదానంద మూర్తి తత్వశాస్త్రం పై అనేక పరిశోధనలు, గ్రంథ రచనలు చేసిన వీరికి అందిన బిరుదులు, పురస్కారాలు అంతే స్థాయిలో ఉన్నాయి. వందలకొలది పరిశోధనా పత్రాలు రాసారు. తెలుగులో 12 గ్రంథాలు, ఆప్రో, ఏషియన్ తత్వ శాస్త్రాలపైనా ఆంగ్లంలో 30 గ్రంథాలు రచించారు. వీరు తత్వశాస్త్రంపై 1952లో రాసిన 'ఎవల్యూషన్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ ఇండియా' అనే గ్రంథానికి ఎం.ఎన్.రాయ్ పీఠిక రాయడం విశేషం. ఈ తరహా కృషికే మొదటిసారి డాక్టర్ బి.సి.రాయ్ అవార్డు దక్కింది. ఈ అవార్డును 1982లో కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేసింది.

ఆచార్య ఎన్.జి.రంగా గా ప్రసిద్ధుడైన గోగినేని రంగనాయకులు భారత స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ వాది, పార్లమెంటు సభ్యుడు, రైతు నాయకుడు. రైతాంగ విధానాలకు మద్దతునిచ్చిన ఈయనను భారత రైతాంగ ఉద్యమపితగా భావిస్తారు. రంగా గారు ఆంగ్లంలో 65 పుస్తకాలను, తెలుగులో15 పుస్తకాలను రాసారు. రైతు కూలీల కోసం ప్రత్యేకంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. రైతుకూలీలరాజ్యం స్థాపనకోసం మహాత్మునితో సుదీర్ఘచర్చలను జరపడమే కాక, సంభాషణలసారాన్ని, 'బాపూ ఆశీస్సులు ' అనే పేరుతో గ్రంథస్థం చేశాడు. కాకతీయ, విజయనగర, తంజావూరు, చంజి, మధుర రైతాంగ ప్రజల, భరతపూర్, సిక్కు, మహారాష్ట్ర, ప్రజల రాజ్యాంగ నిర్మాణ చరిత్రలను పరిశీలించి ' కాకతీయ నాయకులు ' పేరుతొ రైతులకు రాజ్యాంగ నిర్మాణ, నిర్వహణ, చరిత్ర, కలవని నిరూపించారు. రంగా గారి పరిశోధన గ్రంథాలు రైతు గ్రంథమాల పేరుతో వెలువడినవి అవి హరిజన నాయకుడు, రైతు భజనావళి (ఇది అనేక భాషల్లో అనువదించబడినది), ప్రపంచ ధనికవాదం, సామ్రాజయ వాదులకు ప్రపంచ రైతాంగము సవాలు -1942, ధన్య జీవి నేతాజి, శారదార్చన (సాహిత్య వ్యాసాలు), భారతి దేవి సృతులు, విప్లవ రైతాంగం మొదలైనవి.

మామిడిపూడి వెంకటరంగయ్య గారు ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం పేరుతో వెలువరించిన నాలుగు సంపుటాలు చరిత్రకారునిగా ఆయన ప్రతిభను వెల్లడిస్తాయి. కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని తెలుగులోకి అనువదించారు. తెలుగులో ఆయన రాసిన పుస్తకాలు 25 వరకు ఉన్నాయి. 20కి పైగా పుస్తకాలు ఇంగ్లిష్‌లో రాశారు. భారత స్వాతంత్ర్యం సమరగాథను మూడు సంపుటాలలో తెలుగులో కూడా రచించారు. చరిత్ర రచనతో పాటు రాజ్యాంగం మీద విశ్లేషణ, పంచాయతీ రాజ్ గురించి పుస్తకాలు రాశారు. విజ్ఞాన సర్వస్వం సంకలనాలకు కూడా ఆయన పనిచేశారు. ఆయన పుస్తకాల జాబితాయే విస్మయం గొలిపే రీతిలో ఉంటుంది. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్, మన పరిపాలకులు, మన శాసనసభలు, పారిశ్రామిక విప్లవం, విద్యారంగం నాడు-నేడు ఆయన రాసిన తెలుగు పుస్తకాలలో కొన్ని. ప్రొఫెసర్ హరూన్ ఖాన్ షేర్వానీ (1891-1980) ఒక భారతీయ చరిత్రకారుడు, పండితుడు మరియు రచయిత. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ అతని గౌరవార్థం డెక్కన్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ముస్లిం రాజకీయ ఆలోచన మరియు పరిపాలన, దక్కన్ బహమనీలు, భారతదేశం యొక్క విదేశీ సంబంధాలలో అధ్యయనాలు తొలి కాలం నుండి 1947 వరకు, మధ్యయుగ భారతదేశంలోని

సాంస్కృతిక పోకడలు అనే గ్రంథాలు రచించారు. సయ్యద్ అబ్దుల్ లతీఫ్ ప్రముఖ ఆంగ్ల రచయిత. వీరు ఇస్లామిక్ సంస్కృతి మరియు ఉర్దూ సాహిత్యం పై అనేక రచనలు రాశారు. వానిలో ప్రముఖమైనవి ది మైండ్ అల్ ఖురాన్ బిల్డ్, బేసిక్ కాన్సెప్ట్స్ ఆఫ్ ఖురాన్, ది ఓపెనింగ్ చాప్టర్ ఆఫ్ ద ఖురాన్, అన్ ఔట్ లైన్ ఆఫ్ ద కల్చరల్ హిస్టరి ఆఫ్ ఇండియా మొదలైనవి.

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రముఖ రచయిత, రాజకీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ ఛైర్మన్ హిందీ భాష, సాహిత్యములలో విశేష కృషి చేస్తున్నాడు. పలు తెలుగు గ్రంథాలు హిందీలోకి అనువాదము చేశాడు. తెలుగులో 32 పుస్తకాలు రచించాడు. లక్ష్మీప్రసాద్ ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ అవార్డు-2009 పురస్కారం అందుకున్నారు. అయన వ్రాసిన 'ద్రౌపది' తెలుగు నవలకుగాను ఈ పురస్కారం వరించింది. వీరికి సాహిత్య అకాడమీ అవార్డు రావడం ఇది రెండోసారి. బిషన్ సహానీ వ్రాసిన 'తామస్' అనే హిందీ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించినందుకు 1992లో సాహిత్య అకాడమీ అనువాద అవార్డును పొందారు. కాగా, ఈ సారి ద్రౌపది పాత్రలో స్త్రీ ఔన్నత్యాన్ని విలక్షణంగా ఆవిష్కరించినందుకు సాహిత్య అకాడమీ సృజనాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఒకే రచయిత రెండుసార్లు సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నవ్యక్తి వీరే కావడం విశేషం. వీరి సాహిత్య రచనలు అట్టడుగు నుండి అగ్రస్థానం వరకు, డాక్టర్ కరణ్ సింగ్ (జీవిత చరిత్ర), ద్రౌపది, హరివంశరాయ్ బచ్చన్ (జీవిత చరిత్ర), కథనాల వెనుక కథలు, మన గవర్నర్ నారాయణదత్ తివారీ, పుచ్చలపల్లి సుందరయ్య (జీవిత చరిత్ర), సత్యభామ (నవల) మొదలైనవి రాశారు. "నెల్లూరు గాంధీ"గా పిలువబడే వెన్నెలకంటి రాఘవయ్య గిరిజనుల హక్కుల కోసం పోరాడుతూ వారి జీవిత సమస్యలపై అనేక గ్రంధాలు రాశారు. 'అడవిపూలు, మురియాలు, గుర్తింపు, నాగులు, చెంచులు, సంచార జాతులు, ఆదివాసుల వివాహ వ్యవస్థ - సంప్రదాయాలు, గిరిజనుల జానపద గీతాలు, మన కర్తవ్యం ఏమిటి? టాల్‌స్టాయ్ నవల మొదలైన గ్రంథాలు రాశారు. నూకల చినసత్యనారాయణ ప్రఖ్యాతి గాంచిన కర్ణాటక సంగీత విద్వాంసుడు. రాగ లక్షణ సంగ్రహం అనే పుస్తకం రాశాడు. పట్టడకల్ వెంకన్న రాఘవేంద్ర రావు ఇండియన్ సివిల్ సర్వెంట్ భారతదేశపు ఆరవ రక్షణ కార్యదర్శి. చైనా - భారత్ యుద్ధ సమయంలో ఈ పదవిలో కొనసాగుతున్నారు. వీరు డిఫెన్స్ విత్ ఔట్ డ్రిఫ్ట్, రెడ్ టేప్ అండ్ వైట్ క్యాప్, ఇండియాస్ డిఫెన్స్ పాలసీ అండ్ ఆర్గనైజేషన్ సిన్స్ ఇండిపెండెన్స్ అనే మూడు గ్రంథాలు రచించారు.

హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ బెంగాళీ ఆంగ్ల కవి, హిందీ సినిమా నటుడు, సరోజినీ నాయుడి సోదరుడు, లోక్ సభ సభ్యుడు. రవీంద్రనాథ్ టాగూర్ ఈయన్ను తన సారస్వత వారసునిగా భావించాడు. హరీన్ వామపక్ష భావాలను అభిమానించి ఆచరించాడు. ఆంధ్రదేశంలో అభ్యుదయ రచయితల సంఘంతో హరీన్‌కు అత్యంత సాన్నిహిత్యం వుండేది. ఆయనకు విశ్వనాథ, కృష్ణశాస్త్రి, అబ్బూరి, శ్రీశ్రీ వంటి కవులతో స్నేహం కుదిరింది. కర్ణ్ సెల్లర్' అనే వ్యంగ్య విమర్శనాత్మక రచన తెలంగాణా సాయుధపోరాటానికి స్ఫూర్తినిస్తూ సుదీర్ఘ కవితను రాశారాయన. అయన కవితకు ఆరుద్ర అనువాదమిలా వుంది:

అచ్చంపేటా నీవొక/ అసామాన్య కుగ్రాం
తెలంగాణా పల్లెలన్నీ/ మిళితమాయే నీలోనే
నీ గ్రామపు సంగ్రామం/ నిజముగా ఏకాకిగాదు
కొరియాలో మలాయాలో/ కొరకరాని వియత్నామున
బర్మా, ఇండోనేషియా/ పల్లెలు నీ చెల్లెళ్ళు

ఉప్పులూరి గణపతి శాస్త్రి ప్రముఖ వేద పండితుడు వేద శాస్త్రాల పరిరక్షణకు వేద సారాన్ని ప్రచారం చేయడంలో అయన ప్రముఖ పాత్ర పోషించారు. వేదభాష్య విశారద, వేద భాష్యాలంకార అనే బిరుదులు కలవు. వేదాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి వేదసార రత్నావళి అనే గ్రంధం రచించారు. చెన్నమనేని

హనుమంతరావు రిజర్వ్ బ్యాంక్ డైరెక్టరుగా, ఏడవ, ఎనిమిదవ పంచవర్ష ప్రణాళిక సభ్యుడిగా పనిచేశారు. దేశంలోని సామాజిక, ఆర్థిక, వ్యవసాయరంగ పరిస్థితులపై అనేక పరిశోధనలు చేసి, విలువైన గ్రంథాలు రచించారు. వ్యవసాయ అర్థశాస్త్రం, గ్రామీణ పేదరికం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి అంశాలపై వందకుపైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించారు.

తెలుగు సాహిత్యానికి కృషి చేసిన వారు

తెలుగు రాష్ట్రాల నుండి పద్మ పురస్కారాలు పొంది తెలుగు సాహిత్యానికి కృషి చేసిన వారిలో కాళోజి, డాక్టర్ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ గుర్రం జాషువా, శ్రీ దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, బోయి భీమన్న మొదలైనవారున్నారు. వీరి రచనలను సాహిత్య కృషిని పరిశీలిద్దాం.

"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళ కదలిక" అని చాటుతూ తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేసిన ప్రముఖ కవి కాళోజీ. తెలంగాణ తొలిపొద్దు, తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడ్డాడు. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా అతను తన కలం ఎత్తాడు. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి - అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు. వీరి జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషాదినోత్సవంగా చేసి గౌరవించింది. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతిగాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించారు. అణా కథలు, నా భారతదేశయాత్ర, పార్థివ వ్యయము, కాళోజి కథలు, నా గొడవ, జీవన గీత, తుదివిజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ!బాపూ!!బాపూ!!! మొదలైనవి కాళోజీ రచనలు. తెలంగాణ భాషాభివృద్ధికి కృషి చేస్తూ ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నేనెన్నో సార్లు చెప్పిన. భాష రెండు తీర్లు - ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల భాష అంటూ పలుకు బడుల భాషగావాలె నని ప్రకటించి ప్రజల భాషకు పట్టం కట్టిన మహోన్నుభావుడు. పరభాషపై వ్యామోహంతో తెలుగు మాట్లాడుటకు అయిష్టత వ్యక్తం చేస్తున్న వారినుద్దేశించి తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు-సంకోచపడియెదవు నంగతేమిటిరా? అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు-సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా అంటూ మాతృభాషపై మమకారాన్ని చాటాడు. 'జనం వైజ్ఞానికంగా ఎదగటానికి నిరంతరం కృషి చేసేవాడే కవి' అని నిశ్చితాభిప్రాయాన్ని వ్యక్తం చేసిన ప్రముఖ కవి బోయి భీమన్న. ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. వీరు సుమారు 70 పుస్తకాలు రాశాడు. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశాడు. అనాది కొసనుంచి అనంతతత్వంలోకి, రాగవైశాఖి, రాఖీలు (కవితా సంకలనం), గుడిసెలు కూలిపోతున్నై (కవితా సంపుటి)1975 (కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది). పాలేరు, నాటకం - 1938, కూలిరాజు, అసూయ, ప్రగతి, పడిపోతున్న గోడలు, రాగవాసిష్ఠం, ఆదికవి వాల్మీకి మొదలైన నాటకాలు రచించారు. ఇదిగో ఇదీ భగవద్గీత, అంబేద్కరిజం, అంబేత్కరమతం, పురాణాలలో హరి-గిరిజన మనీషులు వంటి వచన రచనలు కూడా రాశారు. ''బానిసతనమును బాపుమురా..... భారతభూమికి భాగ్యము తేరా! సకల దేశముల సర్వ మానవుల సామ్యము సాధింపుమురా!!"

అంటూ తన రచనలతో అణగారిన సమాజాన్ని ప్రేరేపించిన సమరసతా సాహిత్య సిద్ధాంతకర్త బోయి భీమన్న. సమాజానికి మంచి విషయాన్ని పదే పదే ఉద్బోధించాలని అయన చెప్పేవారు.

"ప్రతిరోజూ సుప్రభాతం పాడితేనేకాని
దేవుడికే మెలకువరాని ఈ దేశంలో
ఎంతటి ప్రసిద్ధ సత్యం కానీ ఎవరో
అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే ఉండాలి మనిషికి"

అంటారు 'గుడిసెలు కాలిపోతున్నాయ్' గ్రంథంలో

తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ. వీరు కవి సామ్రాట్ బిరుదాంకితులు. వీరు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదని చెప్పవచ్చు. విశ్వనాథ మాట్లాడే వెన్నెముక అని శ్రీశ్రీ గారు కొనియాడారు. దీనిని బట్టి విశ్వనాథ వారు తెలుగు సాహిత్యాభివృద్ధికి ఎంత కృషి చేశారో అర్థమవుతుంది. 1916 లో విశ్వేశ్వర శతకంతో సాహిత్య రంగ ప్రవేశం చేసి పుంఖానుపుంఖాలుగా రచనలు చేసి స్వాతంత్రోద్యమ కాలంలో "ఆంధ్రపౌరుషము" గ్రంథ రచనతో సాహితీ జగత్తులో ప్రముఖ స్థానం సంపాదించుకున్నారు. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం(జ్ఞానపీఠ అవార్డు లబించింది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని చెప్పారు. వీరు రాసిన "ఏకవీర" నవల సినిమాగా కూడా వచ్చినది. వీరి వేయిపడగలు నవలను పి.వి గారు సహస్రఫణ్ పేరుతో హిందీలోకి అనువదించారు. ఏకవీర, బద్దన్న సేనాని, స్నేహఫలము, పునర్జన్మ, జేబుదొంగలు, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు వంటి నవలలు ఆంధ్ర ప్రశస్తి, ఋతు సంహారము, శ్రీకుమారాభ్యుదయము, గిరి కుమారుని ప్రేమగీతాలు, గోపాలోదాహరణము, శశిదూతము మొదలైన పద్య కావ్యాలు వేనరాజు, అశోక వనము, నర్తనశాల, త్రిశూలము, అనార్కలీ నాటకములు మొదలైన రచనలెన్నో రచించారు. విశ్వనాథ రచించిన ఋతుసంహారం, తెలుగు ఋతువులు వంటి కావ్యాలలో అతను చేసిన తెలుగు నాట ఋతువుల సూక్ష్మమైన వర్ణనలు చాలా పేరుపొందాయి

వెస స్వరాజ్యము వచ్చిన పిదప కూడ
సాగి ఇంగ్లీషు చదువునే చదివినట్లు
అంగనామణి పెండిలియాడి కూడ
పాతచుట్టరికమునె రాపాడుచుండె

పెళ్లయిన తర్వాత కూడా అంగనామణి పాత చుట్టరికాల్నే పట్టుకు వేళ్ళాడుతూండడం..... "స్వరాజ్యం వచ్చిన తర్వాత కూడా ఇంగ్లీషు చదువే చదివినట్లుగా" ఉందని చెప్పడంలో ఆయన స్వరాజ్య, స్వభాషాభి మానాలూ పరాయి పాలనపై, భాషపై ఉన్న విముఖత, జాతీయవాద దృక్పథము, దేశభక్తి వ్యక్తమవుతున్నాయి.

కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూడాచారాలపై తిరుగుబాటు చేసి చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన కవి గుర్రం జాషువా. నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్ బిరుదాంకితులు. జాషువాగారు అభ్యుదయ వాది. వర్గ సంఘర్షణ, ఆర్థిక వ్యత్యాసాల నిర్మూలన దోపిడీ వర్గాలపై తిరుగుబాటు జాషువాగారి కావ్యాలలో నిండుగా వున్నాయి. రేడియోలో వస్తున్న కవితలను విమర్శిస్తూ, అన్నార్తుల ఆక్రందనను తనకవితలో యిలా వినిపించారు.

'రేయిబవలు భారతీయ సంస్కృతీ పేర
గండశిలలు చూపి కథలు చెప్పి
కటిక పేదవాని కడుపులోగల చిచ్చు
గడపగలవే నీవు గగనవాణి'

సామాజిక సృహతో, స్వాతంత్ర్య కాంక్షతో రచనలు చేస్తూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ పోకడలను దుయ్యబడుతూ అణగారిన వర్గాల పక్షాన పోరాడుతూ నిరంతరం ప్రజలను చైతన్యవంతం చేయడంలో కవులు విజయం సాధించారని చెప్పవచ్చు. నేను పరిశీలించినంత వరకు తెలుగు రాష్ట్రాల నుండి పద్మ పురస్కారాలు పొందిన వారు తెలుగు సాహిత్యాభివృద్ధికి విరివిగా కృషి చేశారని చెప్పవచ్చు. భవిష్యత్ తరాలు కూడా వీరి రచనలను ఆదర్శంగా తీసుకొని చైతన్యవంతులవుతారని ఆశిస్తున్నాను.

★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణా పాటల్లో స్త్రీ జీవితం

- డా॥. డి. రొంబాబు

ఆకాశంలో సగం స్త్రీ. నారి లేనిదే నరుని జీవితం లేదు. స్త్రీపురుషులిద్దరు జీవితరథానికి రెండు చక్రాలు. ఇవి సర్వసాధారణంగా మనకు వినిపించే సమానత్వపు మాటలు. కానీ, సాహిత్యంలో మరీ ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో పురుషునికి దక్కిన గౌరవస్థానానికి సమానమైన స్థానం స్త్రీకి దక్కలేదని చెప్పవచ్చు. కావ్యయుగంలో నాయికగా స్థానం పొందిన స్త్రీ దక్షిణాంధ్ర యుగం నాటికి ఆ గౌరవస్థానాన్ని కోల్పోయింది. సాహిత్యం సమాజానికి దర్పణం కనుక ఆనాటి స్త్రీ పరిస్థితి ఏమిటో అర్థం అవుతోంది.

ఆధునిక యుగం ఆరంభం కావడంలో, ఆంగ్లవిద్య అందుబాటులోకి రావడం, క్రమంగా సంఘసంస్కర్తలు సమాజంలో నెలకొన్న అనేక దుష్టసంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉద్యమించడం వల్ల క్రమేపి స్త్రీల పట్ల సమాజపు దృక్పథంలో మార్పు కనిపించడం ఆరంభమైంది. అయితే ఇది సర్వేసర్వత్ర కనిపించదు. ఆధునిక ధోరణులు సాహిత్యంలో ప్రవేశించినా అధికశాతం జనంలో స్త్రీల పట్ల పురుషాధిక్య ప్రపంచ భావనల్లో పెద్దగా మార్పు రాలేదు.

స్త్రీవాద సాహిత్యంలో వ్యక్తమైన నిరసనగాని, అసహనం గాని పురుషాధిక్య సమాజం మీదనే గాని వ్యక్తులుగా పురుషుల మీద కాదని చెప్పవలసి ఉంది. వ్యక్తులుగా ఆడ మగ లో అన్నిరకాల మనస్తత్వాలున్న వాళ్ళూ ఉంటారు. వారి వారి ఆలోచనలనీ తద్వారా వారి జీవితాలనీ నిర్దేశించే భావజాలం ఏదైతే ఉందో? దాని ప్రభావం దృష్ట్యానే మనం మన కాలంనాటి సమాజాన్ని అందులోని విలువల్ని అంచనావేస్తాం.

1960-70 దశకంలో స్త్రీ విముక్తి ఉద్యమం ఒక సైద్ధాంతికతతో ప్రారంభమైంది. దాన్ని స్త్రీవాదం అన్నారు. అప్పట్లో ఈ పదం పెద్ద సంచలనాన్నే సృష్టించింది. ప్రపంచ దేశాలన్నింటిలోనూ వ్యాపించి, ఓటు హక్కుతో ప్రారంభమై, ఆడపిల్లల విద్యావిషయం, పెళ్ళిళ్ళ స్వేచ్ఛవంటి సంస్కారాన్ని అలవర్చింది. ఈ వాదం ప్రకారం పురుషాధిక ప్రపంచమే స్త్రీ జాతికి శత్రువు కాని, పురుషులు కాదు. స్త్రీ పురుషుల మధ్య అసమానతలను వెలికి తీసేందుకు ఎందరో స్త్రీ మేధావులు నడుంకట్టారు. శ్రమకు తగిన విలువను ఇవ్వకపోవడం వంటి స్త్రీ సమస్యలెన్నో లేవనెత్తారు. 1960ల్లో70దశకంలో రచయిత్రులు, కవయిత్రులు అనేకమైన రచనలు చేశారు. వర్ణాంతర వివాహాలు, ప్రేమ పెళ్ళిళ్ళు, చదువుసంస్కారం వంటి ఇతివృత్తాలతో నవలలు, కథలు, వ్రాశారు. వరకట్న సమస్యలు , కుటుంబాల్లో స్త్రీల కష్టాలు, అత్తాకోడళ్ళూ ఆరళ్ళు ఆరాట పోరాటాలు అన్ని కథా వస్తువులయినాయి. ఇన్ని అంశాలు సృశించినా కానీ, స్త్రీ పురుషసంబంధాల్లో న్యూనతాభావాల విషయాలేగాని, స్త్రీ స్వేచ్ఛ, ఆర్థిక సమస్యలు, అసమానతలు, అణచివేతలు వంటివి రచనల్లో ఎక్కువరాలేదు. స్త్రీలు తమ కష్టాలను తామే అనుభూతులుగా వ్యక్తపరిచే కవిత్వం కావాలి. తమ బాధలను, సానుభూతిగా పురుషులు వ్యక్తపరచడం స్త్రీవాదులు కోరుకోలేదు. ఈ భావాలను వ్యక్తం చేసేందుకు గేయం లేదా పాట ఒక సాధనమైంది.

సమాజంలో అన్ని వర్గాల్లోని స్త్రీలకు కష్టాలు ఉన్నాయి. అయితే దళిత, మైనారిటీ వర్గాలలోని స్త్రీల సమస్యలు మరికొన్ని ఎక్కువే. అగ్రవర్ణాలలోని స్త్రీలకు విద్య, ఆర్థిక ఆలంబనల లాంటివి ఉండడంతో వారికి కొన్ని సమస్యలు తగ్గాయి. అలాగే విద్యావంతులైన స్త్రీల శాతం కూడా ఎక్కువ గా ఉండడం వల్ల వారికి తమ హక్కుల పట్ల మిగిలిన వర్గాల స్త్రీల కంటె కొంచెం ఎక్కువ గానే అవగాహన ఉంది. అయినా పురుషాధిక్య ప్రపంచపు

ఆధిపత్యం వారిపైనా కనిపిస్తుంది. ఈ ఆధిపత్యపు ధోరణి నిరసన మనకు వివిధ గేయాలలో. పాటలలో కని పిస్తుంది.

సర్వసాధారణంగా సాహిత్యాధ్యయనం చేసేటప్పుడు ప్రముఖులైనవారి సాహిత్యం నుంచే లేదా జానపద సాహిత్యం నుంచి ఉదాహరణలు తీసుకోవడం జరుగు తుంది. ప్రస్తుత పరిశోధన వ్యాసానికి గాను ప్రభావ వంతమైన గేయాలను, పాటలను రాసిన ఇతర రచయిత్రుల సాహిత్యం నుండి ఉదాహరణలు తీసుకోవడం జరుగుతున్నది.

ప్రేమ పేరుతో మోసం చేస్తున్నవారి నెట్లా పసిగట్టాలో చెప్పి, యువతను చైతన్యవరచాల్సిన బాధ్యత కవయిత్రులపై ఉన్నది. అట్లే అసభ్యకర సన్నివేశాలను చిత్రిస్తున్న సినిమారంగాన్ని బుల్లితెరనూ అభ్యంతరకర కార్యక్రమాలు నిర్వహిస్తున్న నభ్యనమాజాన్ని నిలదీయాలంటున్నది సుషమ అన్న కవయిత్రి కవిత.

పతియే సతికి గతి అని గతంలో చెప్పావు
పతీ సతీ సమమని ఇప్పుడు చెబుతున్నావు
సమానమైతే మరి సినిమాలో మరి ఎందుకు
స్త్రీని వెన్నులేను పాకుడు తీగను చేస్తున్నావు
(నాయిక - సుషమ)

అని ప్రశ్నించిన కవయిత్రి మరికొంత ముందుకు పోయి

అరాకొరా బట్టలతో అరడజను పాటలకు
అలరించేందుకా నేనున్నది
ఆరారా బూతులతో నన్నో బమ్మని చేయాలా
ఆర్థికలాభాల కోసమా నా తనువున్నది
(నాయిక - సుషమ)

అని సూటిగానే ప్రశ్న సంధించింది. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే సినీ నిర్మాతగాని, దర్శకుడుగానీ, పేరున్న కథానాయకులుగానీ లేరన్నది వాస్తవం.

ఆర్థిక లాభాలే సమాజ స్వభావమైనపోతున్న ఈ రోజుల్లో స్త్రీలకు కల్పిస్తున్న సౌకర్యాలను, రిజర్వేషన్ల వంటి వసతుల్ని వెక్కిరించేలా పురుషుల ప్రవర్తన ఉంటోంది. దాన్ని ప్రశ్నించిన స్వరం నాదెళ్ల నిరుపమది. నేనెవరు? అన్న గీతంలో ఆమె -

పంచాయితీలో నాకు బదులు నువ్వు
పాలనలో నాకు వెనుక నువ్వు
ప్రతినిధి నేనైనా పాలనలో నువ్వు
ఎన్నికల్లో నేను, వెధవ పనులతో నువ్వు
కనిపించేది నేను, కదిలించేది నువ్వు
ఇంకెంతకాలం నీకు ముఖాన్ని నేను
(నేనెవరు? - నాదెళ్ల నిరుపమ)

అని ప్రశ్నిస్తోంది.

మూడోవంతు మాదంటారు మహిళలే ముందంటారు
మాకోసం మున్న సీట్లల్లో మీరే కూర్చుంటారు
ముచ్చటగా మాటలు చెబుతారు మూలనే మమ్మల్ని నిలుపుతారు
మహిళలంటే మేమా? మాటలు చెప్పే మీరా?
(రిజర్వుడు సీటు - పింగళి మనోరమ)

అని పురుషుని ప్రవర్తనను నిలదీసింది కవయిత్రి.

ఇక దళిత మహిళ ఎదుర్కొంటున్న సమస్యల విషయానికి వస్తే ?

చదువు సంధ్యలు లేని నన్ను గడీలలో బమ్మను చేశావు
శుద్ధ మొద్దును చేసి అడుగడుగున వేధించావు
చదువుకేసి చూస్తే నీకెందుకు చదువన్నావు
చదువుకొని వస్తే, నీకెదురుగా నిలిస్తే
మాలముండవు నేకేంటే గౌరవమన్నావు
(నాకు వెన్నుంది - పప్పుల లలితకుమారి)

అంటూ విద్యను పొందినా, ఉద్యోగాలు చేస్తున్నా దళిత మహిళకు దక్కుతున్న అనాదరణను వ్యక్తం చేసింది కవయిత్రి.

ఇక మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలది మరో రకం అవస్థ. మతబోధనల పేరిట వారిపై జరిగే అత్యాచారాలకు అంతులేదు. విద్యకు అవకాశం లేదు. మనసులోని భావాలను చెప్పుకునేందుకు తోడూ లేదు. ముస్లిం స్త్రీలలో కనిపించే సమస్యలు ఇతర మతాలకు చెందిన స్త్రీలలో కన్పించే సమస్యలకు భిన్నంగా ఉంటాయి. వారి మతమే వారిని పరాయివాళ్లుగా చూటం, బురఖా నిబంధనలు, స్వేచ్ఛ లేకపోవడం లాంటి అణిచివేతలకు వ్యతిరేకంగా ముస్లిం స్త్రీవాదులు పెదవి విప్పారు. మైనార్టీ స్త్రీల జీవితాలు ఘోషాల వెనుకాల, బురఖాల ముసుగు లో కూరుకుపోయి మానసిక క్షోభకు గురవుతున్నాయి. సంప్రదాయం పేరుతో మైనార్టీ స్త్రీలపై జరిగే అణిచివేతను నిరసిస్తూ ముస్లిం స్త్రీవాదులు కలం పట్టారు.

శరీరాన్ని కప్పి ఉంటే బురఖా లేదా పరదా పద్ధతి మీద పెద్ద యుద్ధమే ప్రకటించారు కవయిత్రులు. పరదే కే పీఛే అన్న గేయంలో కవయిత్రి

గుమ్మానికి కట్టిన కర్టెన్
నా శరీరానికి తగిలించావు
ఇంటిని దాచేసినట్లే ఇంతినీ దాచేశావు
ముసుగేస్తే నా మనసు దాగిపోద్దా
నా కలలను ఈ ముసుగు ఆపగలదా
(పరదే కే పీఛే -సయీదా ఫాతిమా)

అంటూ పురుషుల్ని ప్రశ్నించింది కవయిత్రి.

పెళ్లంటే నూరేళ్ల పంటంట
నిఖానామాలోనే విడాకుల విలువ రాశావు
విడిపించుకోవడానికి వాట్సప్పు వాడావు
మెసేజులతో బంధాలు తెంపుతున్నావు
మాటలతో ముగుస్తుందా మన బంధం
(తలాఖ్ - అన్వారీ బేగం)

అంటూ మూడుమార్ల మాటలతో, మేసేజులతో ముగిసేది కాదు సంసారం అని చాటుతోంది మరో స్వరం.

ఇస్లాంలోని బహుభార్యత్వాన్ని, బహుసంతానాన్ని కూడా మహిళాస్వరాలు ప్రశ్నించాయి. ఆర్థిక పేదరికం పేరిట అరబ్బు షేకులకు ముక్కుపచ్చలారని బాలికల్ని ఇచ్చి వివాహం చేయడాన్ని కూడా ప్రశ్నించాయి.

ముక్కూ మొహం తెలియని వాడు
మూడు ఇరవైలు దాటినవాడు
మూడునెలలకు భార్య కావాలంటే
బాబా నేనే నీకు కనిపించానా?
నీ వయసు వాడు నాకు చాచానో మామానో కాదా
(యే క్యా హై బాబా ? తబస్సుమ్)

అన్న కవితలో అమాయక ముస్లిం బాలిక నిర్వేదం కనిపిస్తోంది.

ఇలా స్త్రీల గేయాలు, పాటలు నేటి ఆధునిక కాలంలోనూ స్త్రీ ఎదుర్కొంటున్న వివక్షను వ్యక్తపరుస్తున్నాయి. ఈ పరిస్థితులు మారాలంటే అన్నివర్గాల స్త్రీలలోనూ చైతన్యం పెరగాలి. తమ హక్కుల పట్ల అవగాహన పెరగాలి. అప్పుడే సమానత్వం సిద్ధిస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచిక

1. అవరాజిత (2019), వివిధ - సాహిత్యవ్యాసాలు, సాహిత్య పబ్లికేషన్స్, హైదరాబాదు
2. జయప్రభ, గత ఇరవైయేళ్లస్త్రీవాద సాహిత్యం, ఈమాట సెప్టెంబరు 1999 సంచిక
3. పద్మావతి, పి. (2019), తెలంగాణ పాటలు - ఆధునిక సామాజం, ప్రేరణ పబ్లికేషన్స్, హైదరాబాదు
4. లక్ష్మి, కె. (సంపా), 2018, ఎలుగెత్తిన స్వరం, విజయభారతి ప్రచురణలు, హైదరాబాదు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

లంబాడీల ఆరాధ్య దైవం – అరుదైన ఆరాధన విధానం

– డా॥ ఐ. సరస్వతి, తెలుగు సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి.

మనది వేద భూమి, మనది జ్ఞాన భూమి, మనది తపో భూమి, మనదది కర్మ భూమి, మనది ధ్యాన భూమి. ప్రపంచమంతా అజ్ఞానాంధకారంలో మునిగి యున్న విపత్కర క్లిష్ట పరిస్థితులలో జ్ఞాన, విజ్ఞాన జ్యోతు లను అందించింది. మనమే ధర్మశాస్త్ర ప్రభోదం నుండి ఖగోళ శాస్త్రం వరకు పరిపూర్ణమైన విజ్ఞానాన్ని ప్రపంచానికి మనమే అందించాం. మానవ జీవితంలో ఆధ్యాత్మిక, భావనలకు పెద్దపీట వేసింది కూడా మనమే, భూమి పుట్టుక నుండి జీవరాశి సృష్టి వరకు విశ్లేషణ చేసి వేద వాజ్మయంలో పొందుపరచడం జరిగింది.

విభిన్న నాగరికతలు వెలసిన భారతదేశంలో భిన్న సంస్కృతులతోపాటు భిన్న మత విశ్వాసాలు కూడి ఊపిరిపోసుకున్నాయి. వేద ప్రమాణికమైన వైదికంతో పాటు ఎన్నో విశ్వాసాలు భారతీయ సమాజంలో వ్యాపించి ఉన్నాయి. ప్రకృతి ఆరాధన, నాగారాధన, శక్తి ఆరాధన, మొదలగునవి వీటికి ఉదాహారణలు మానవుడు నిజ జీవితంలో ఎదురైన ఒడుదుడుకులను అధిగ మించడానికి ఈ విశ్వాసాలపై నమ్మకం ఉంచక తప్పలేదు. ఆ విశ్వాసాలు దైవ సృష్టికి ప్రతీకలైనాయి.

శాస్త్రతికేతిత్ కుమార:
మాత్తిపిత్తి ఏతే భక్తా య
యంప్రార్థయంత్ జగదీశితారం
సమేక ఏవ ప్రభురద్వితీయ:

వారివారి విశ్వాసాలను బట్టి దేవతలకు నామకరణం చేయడం జరిగింది. ఈ సృష్టి స్థితికి లయకారుడైన ప్రభువును కొందరు 'శాస్త' అని మరికొందరు 'కుమారుడ'ని ఇంకొందరు 'మాత' అని కొందరు 'తండ్రి' అని, కొందరు 'స్వామి' అని పిలుస్తారు. ఎవరు ఎన్ని విధాలుగా పిలిచినప్పటికీ ఆ పరమేశ్వరుడు ఒకడే అతడు అద్వితీయుడు అతనికి సాటి మరెవ్వరూ లేరు. విశ్వ మానవుల ప్రగతికి అహర్నిశలు కృషి జరిపి అందులో విజయం సాధించిన వారిలో సంఘ సంస్కర్తలు ప్రవక్తలు, మహాత్ములు ఎందరో మహానుభావులు ఈ లోకంలో ధర్మము క్షీణించి, అధర్మం పరాకాష్టకు చేరినప్పుడు మహాత్ములు ఉద్భవించి అధర్మమును రూపుమాపి ధర్మ ప్రతిష్టాపన చేస్తారు. అలాంటి వారిలో 'సేవాలాల్ మహారాజ్' ఒకరు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో అనేక గిరిజన జాతులు ఉద్భవించి వికసించాయి. వాటిలో లంబాడీ జాతి ఒకటి ప్రకృతి ఒడినే తల్లి ఒడిగా నమ్ముకొని ఒకచోట నుండి మరొకచోటికి సంచార జీవనం గడిపే వారికి దైవం లేదనుకుంటే పరపాటే. వీరి జాతిలో పుట్టి, లంబాడీ సమాజానికి మంచిని బోదించి, సత్పవర్తనను నేర్పిన గురువు. అతని ధర్మ సూత్రాలు లంబాడీ జాతి నిలబడేటట్లు చేసాయి. నిజాం నవాబులకు ఎదునేగి పోరాడిన మహా ప్రభువు సేవాలాల్ మహారాజ్. ఈ ప్రభువును లంబాడీ సమాజం కొలుచుకొని పూజలు చేస్తారు. మేరామాను (జగదాంబ) పూజిస్తారు.

సేవాలాల్ మహారాజ్‌ను కొలిచేటప్పుడు కుండనిండా ఆవుపాలు, నెయ్యి, పరవాన్నం తో పూజలు చేస్తారు. ఇది పురుషులు మాత్రమే చేస్తారు. ఈ పూజకు స్త్రీలను దూరంగా ఉంచుతారు. చాలా నియమనిబంధనలతో పూజలు చేస్తారు. స్త్రీలు వలయాకారంగా వుంటూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. మేరామా దండియాడి (జగదాంబా) కు వేట బలులు ఇస్తారు. డప్పులతో పాటలు, నృత్యాలు చేస్తారు.

లంబాడీలు సంచార జీవనం గడపడంతో ప్రతిరోజు పూజలు పునస్కారాలు చేసేవారు కాదు. గోత్రాలను బట్టి

సం॥రానికో, మూడు సం॥రాలకో మేరామాను పూజిస్తారు. వేట బలులు ఇస్తు ఇంటిలోపల నడిదూలానికి వ్రేలాడదీసిన వెండి రూపాయి బిళ్ళలలో కొలువై వున్న మేరామాను బాజా, భజింత్రీలతో ఇంటి ముందు ఆవరణలో క్రిందకు దించి ఒకరోజు, ఒక రాత్రి పాటలు, ఆమె కథలు, ఆమె సామెతలు చెప్పి భక్తి భావమును ప్రదర్శిస్తారు.

హైందవ సాంప్రదాయములు గల లంబాడీలు పూర్వం ఉప్పు వ్యాపార నిమిత్తం బందరు వచ్చి ఉప్పును గోనే సంచులలో నింపుకుని పుశువులపై వేసుకొని ఆంధ్రా తెలంగాణ, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వగైరా ప్రాంతాలు తిరుగుతూ ఉప్పు వ్యాపారం చేస్తూండే వారు. 16 వ శతాబ్దమున శ్రీ సంత్ సేవాదాస్ మహారాజ్ బందర్ సముద్రమును సందర్శించి ఈ ప్రాంతాములో సేవచేయుటకు తన పీఠాన్ని ఏర్పాటు చేసారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా ముదినేపల్లి మండలం, సింగరాయ పాలెం గ్రామంలో పీఠమును స్థాపించి బ్రహ్మచారి మఠమును నెలకొల్పారు. లంబాడీలు వ్యాపార నిమిత్తం వచ్చి సేవాభాయా ఆశీస్సులు పొందేవారు. నేటికి ఈ గుడిలో లంబాడీలు తరలి వచ్చి 'భోగ్ బండారో' (అగ్నిలో నెయ్యి ఆహుతిచ్చుట) అలాగే జగ్గయ్యపేట మండలం అనిగిళ్ళపాడు గ్రామంలో సేవాభాయా గుడిని లంబాడీలు స్థాపించారు. బంజారాలలో తండా సంస్కృతిని అంకురార్పణ చేసిన మహాపురుషుడు ధర్మ శాస్త్రాన్ని రూపొందించి, వారు ఏవిధంగా కలసికట్టుగా జీవించాలి తన జాతి వారికి విధి విధానాలను రూపొందించాడు. భారతదేశ నలుమూలలకు తన ఉపదేశాన్ని వినిపించారు. అవసరమైనప్పుడు యుద్ధాలు చేసి జాతికి రక్షణ కల్పించారు. సూరజ్ ఖండ్ రాజుతో యుద్ధం చేసిన ఉదంతం మరియు నైజాం నవాబుతో కూడా తన పోరాటాన్ని చేసి హైదరాబాద్ నగరంలోని 'మహారాజ్ గంజ్' వీధిని ఇనాముగా పొందినట్లు కథనాలున్నాయి.

సంత్ సేవా లాల్ మహారాజ్ జీవిత విషయాలు:

బ్రిటీషు పాలనా కాలంలో బళ్ళారి జిల్లాలోని గుత్తి తాలుకాలో రాంజీనాయక్ లంబాడీ తండాను స్థాపించారు. ఆనాడు లంబాడీల బ్రతుకులు దుర్భరంగా ఉండేవి. వారి బిడారులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. కరువు విలయ తాండవం చేస్తూ వుండి. ఆ సమయంలో లంబాడీల పెద్ద వారైన బృగురాజ్ బాణోత్, సాల్యాసాద్ మరియు హూన్యాసాద్‌ల ఆధ్వర్యంలో సాత్ భవానీ (బంజారాలు పూజించే ఏడుగురు శక్తి దేవతలు) లను పూజించి తమజాతి కష్టాల నుండి గట్టెక్కించమని వేడుకున్నారు. అప్పుడు సాత్ భవానీలు ప్రత్యక్షమై మీ కష్టాలు రూపుమాపడానికి మీ జాతిలోనే ఒక మహా పురుషుడు జన్మిస్తాడని, చింతించవద్దని చెప్పి అదృశ్య మయ్యారు. గుత్తి ప్రాంతాంలోని రాంజీనాయక్ తండాలో నివసిస్తున్న ధర్మణిభాయి, భీమానాయక్ రమావత్‌లకు పన్నెండు సంవత్సరాలుగా సంతానం లేక బాధపడు తున్నారు.

ధర్మణీబాయి, భీమనాయక్‌లు చాలా పేదవారు. భీమనాయక్ సంతానం కోసం కఠోర తపస్సు చేస్తారు. మేరామా భవాని ప్రత్యక్షమై మీకు సంతాన ప్రాప్తిని కలుగజేస్తున్నాను. కాని మీకు పుట్టిన మొదటి బిడ్డకు పన్నెండు సంవత్సరాల వచ్చిన తరువాత నాకు సేవకునిగా నా వెంట పంపవలసి ఉంటుందని చెప్పింది. అతని తరువాత ముగ్గురు కొడుకులు పుడతారని వరాన్ని ఇస్తుంది. లేకలేక సంతానం కలుగుతున్నందుకు సంతోషంగా ఉన్నా పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి దేవతకు అప్పగించవలసి వస్తున్నందుకు బాధపడతారు. ధర్మణి భాయి, భీమానాయక్‌లకు పుట్టిన మొదటి బిడ్డ బంజారా జాతికి, దండియాడికి సేవ చేయడానికి పుట్టినాడు కాబట్టి ఆయనకు సేవాదాస్ అని పేరును ఖరారు చేసారు. 'సేవాదాస్' పుట్టుకతోనే సంపూర్ణ జ్ఞానాన్ని కలిగినవాడు. చిన్నతనంలోనే సకల విద్యలను ప్రదర్శించేవాడు. పశువులను మేపేవాడు ఉదయాన్నే లేచి

కాళోకూండ్ (నల్ల కుంట) లో స్నానమాడి సూర్య చంద్రులకు నమస్కరించి దినచర్యను ప్రారంభించేవాడు. ఎవరికి ఏ కష్టమొచ్చినా ముందుండి ఆ సమస్యను పరిష్కరించే వాడు. లంబాడీ జాతిలో గల అహింసను పాటించమని ప్రభోదించేవాడు. పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి దండిభవాని తనకు బిడ్డను అప్పజెప్పమని ధర్మణిని, భీమానాయక్‌ను కోరింది. పుట్టెడంత దు:ఖంతో ధర్మణి భీమాలు సేవాదాస్ దండియాడికి అప్పగించుటకు సిద్ధమౌతారు. కాని 'సేవాదాస్' దండియాడి వెంట వెళ్ళుటకు ఇష్టపడరు. నేను రాను అని తెగేసిచెప్పారు. అప్పుడు మేరామా యాడి ఎందుకని అడుగగా సావాభాయా 'మేరామా' తో ఈ విధంగా అంటాడు.హే జగదాంబ ! నీ పైన నాకు భక్తి ఉంది కానీ నీ పూజకై బలిని కోరడం నాకు ఇష్టంలేదు. సకల చరాచర సృష్టికి మాతృమూర్తివైన నీవు ఈ విధంగా నీకీ బిడ్డలను బలికోరడం నీకు తగదు అని తన నిరాకరణను చెప్తాడు. అది విన్న మేరామా ఆగ్రహించి సేవాదాస్ కుటుంబం మొత్తాన్ని నాశనం చేయదలున్నుంది. సేవాదాస్ చిన్న తమ్ముడు ఖానాను గరసియాసాండ్ (ఎద్దు) ను, గుఱ్ఱం తోళారాంను చంపివేస్తుంది. గోవులను, బిడారి ఎద్దులను ఎక్కడికో తరిమేస్తుంది. అయినా సేవాబాయా మేరామా ఆదేశాలను అంగీకరించరు. అప్పుడు మేరామా ఇలా అంటుంది.

కరలరే భాయా భగతిమారి
కరూ కచనేరి కాయాతారి
అనే ఢనేరి భరూకొటడి
ఛో మీనార్ వగం కియూ
రణ, వేర్‌తో జితన్ లాయూ
డిల్లీ ఆగ్రనామ్ చలాయూ
మారి భగత్ కర్‌ల సేవాభాయా!

భావం :

ఓ సేవాదాస్ నీవు నన్ను పూజించు, నేను నిన్ను సంపదను ధన, ధాన్యాలతో తులతూగినట్లు చూస్తాను. నేను నీకు జరగబోయే విషయాలు ముందుగానే జ్ఞానదర్శినిగా తెల్పుతూ వుంటాను. ప్రతి కష్టములోనూ, ప్రతి సందర్భములోనూ నీకు విజయాన్ని కల్పిస్తారు. డిల్లీ ఆగ్రాల వరకు నీ పేరు వచ్చేటట్లు వ్రోగిస్తాను. ఓ సేవాదాస్ నీవు నన్ను శరణువేడుకో....

అప్పటికి సేవాబాయా మేరామా మాటలకు లొంగక పోవడంతో చివరిగా మేరామా తన విశ్వరూపాన్ని చూపిస్తుంది. సూర్య చంద్రులను తన కళ్ళుగానూ, మొత్తం విశ్వ బ్రహ్మాండమును తన శరీరంతో దర్శనమిస్తుంది. అప్పుడు 'దండియాడి'ని శాంతింపచేయుటకు 'కడావ్' వండి భక్తితో కొలచి 10వేల మంది జనాభాకు మాట ఇచ్చి కొన్ని షరతులు విధిస్తాడు. అవి 'తన తమ్ముడి'ని తిరిగి బతికించాలి. తమ జీవనాధారమైన 3,751 గోవులను, 6,400 ఎద్దులను తిరిగి ఇవ్వాలి. బంజారాలను పద్నాలుగు తరాల వరకు దండియాడి పూజలను చేసుకోనివ్వాలి. సంవత్సరానికొకసారి కడవో (పాయాసం) చూర్మో (రొట్టె, బెల్లం నెయ్యితో కలిపి చేసిన ముద్దలు) లను నైవేద్యంగా సమర్పించి పూజిస్తారు. బంజారాలను ఎప్పుడు ఆయురారోగ్యాలతో ఉండేటట్లు చూడాలి. నా నోటి నుండి వచ్చిన ప్రతివాక్కు అమలుకావాలి. అని వరాలనూ ఆమోదించి సేవాదాస్‌ను మేరామా అనుగ్రహించింది.

అప్పటి నుండి బాల బ్రహ్మచారిగా, సేవాదాస్‌ను 'సేవాభాయా' గా పిలవడం మొదలుపెట్టారు. సేవాభాయా బ్రహ్మచారిగానే ఉండి తన శేష జీవితాన్ని మేరామా భవానీ సేవలోను, బంజారా జాతి సేవలోను సాగించాడు. 'సేవాబాయా' అనంతపురం జిల్లా గుత్తి తాలూకా రాజీ తాండాలో ది. 15.02. 1741 వ సంవత్సరం సోమవారం నాడు జన్మించారని చరిత్ర ఆధారాల ద్వారా కొందరు బంజారా పరిశోధకులు నిర్ధారించారు.

సేవాబాయ మహిమలు :

సంత సేవాలాల్ మహారాజ్ మహిమలు అద్భుతమైనవి. వీటిమీద అనేక కథనాలు కలవు. వాటిలో పురుషున్ని స్త్రీ గా మార్చడం, ఒక ముంత బియ్యంతో

10,000 మందికి భోజనాలు పెట్టడం చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బ్రతికించడం. విషం కలిపిన తీపి వంటకాలను నిర్వీయం చేయడం. ఉధృతంగాపారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం. సేవాలాల్‌కు అపకీర్తి తీసుకురావాలని జాదుగర్ వడతియా ఒక పురుషుడికి ఆడవేషం వేసి తీసుకువచ్చి సంతానం ప్రసాదించాలని కోరతాడు. సేవాదాన్ తథాస్తు అంటూ దీవిస్తాడు సంతానం కల్గుతారు. అందరూ ఆశ్చర్యపోతారు.

లంబాడీలు నగరాలకు దగ్గరగా నివసించుట చేత వారి సంస్కృతి, సాంప్రదాయాలను దూరం చేసుకుంటూ, వారి ఆరాధ్య దైవమును కూడా మరచి హిందువుల గుడులకు, చర్చిలకు వెళ్ళడం జరుగుతుంది. ఈ విషయాలను గమనించి రాబోయే లంబాడీ తరముల వారు తమకంటూ ఒక భగవంతుడు ఉన్నాడని నమ్మకం కలుగుటకు సేవాలాల్ మహారాజ్ జీవిత విశేషాలు తెలుసుకొని పారాయణం చేసినట్లైతే అతని మహిమలను చవిచూస్తారు.

ఆధార గ్రంథాలు

1. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి బి. చినియానాయక్
2. బంజారాల చరిత్ర ఆంధ్రాలో వికాస ప్రస్థానం - డా. రామావత్ కుసుమకుమారి
3. నల్గొండజిల్లా బంజారా సాహిత్యం- జీవన చిత్రణ - డా.సూర్యాధనంజయ్
4. లంబాడీ - డా.కె. శ్యామల

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కరోనా కల్లోలం నేపథ్యంగా వెల్లువెత్తిన కవిత్వం

– డా॥. చింతల రాకేశ్ భవాని, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్.

కరోనా కల్లోలం మొత్తం ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. సకల రంగాల్ని కదిపి కుదిపింది. కరోనా ఇంకా ముగిసిపోలేదు. ఆ వైరస్ సమసిపోలేదు. అంతర్ధానం కాలేదు. ఎక్కడోచోట ప్రతిరోజూ దాని బారిన పడుతూనే వున్నారు. కాకపోతే తొలినాళ్ళతో పోల్చుకుంటే కరోనా వచ్చినప్పటికీ కోలుకునే అవకాశాలు మెరుగయ్యాయి. దాదాపు ఇరవై నెలల కిందట తలెత్తిన కరోనా సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ఇప్పటికీ ఆ విలయం ప్రభావం మన సమాజం మీద కొనసాగుతున్నది. అందుకే సృజనశీలురు మొదట్నించి స్పందిస్తూ వచ్చారు. కరోనాని అడ్డుకునేందుకు విధించిన లాక్‌డౌన్ సకల రంగాల మీద చూపిన ప్రభావం అపారం. ముఖ్యంగా వలస కార్మికుల వెతలు అనంతం. ఆకస్మిక లాక్‌డౌన్, కార్పోరేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యపు పోకడలు, మనిషిని చూస్తే మనిషి జడుసుకునే పరిస్థితుల విషాద పరిణామాలు ఇతి వృత్తంగా ఎంతో కవిత్వం వచ్చింది, వస్తున్నది.

కరోనా కారణంగా- కరోనా పూర్వపు పరిస్థితులు, కరోనా అనంతర పరిస్థితి అనే రీతిన వర్తమాన చరిత్ర రూపు దాల్చింది. ఇదే రీతిన సాహిత్య రంగంలోనూ కరోనాకు పూర్వం, కరోనా ఆరంభ అనంతర స్థితి అనే పరిణామం నెలకొన్నది. ఈ నేపథ్యాన కరోనా - లాక్‌డౌన్ ఆరంభమైన మార్చి 2020 నుంచి మొదలుకొని తెలుగు సాహిత్యంలోకి 'కరోనా' అనే కొత్త ఇతివృత్తం చేరింది. కరోనా ఎన్నిరకాలుగా బతుకుని చెల్లాచెదురు చేసిందో కవులు, రచయితలు గమనించారు. అందుకు తగినట్టుగానే స్పందిస్తూ భిన్న పార్శ్వాల్ని కవిత్వంలోకి తీసుకువచ్చారు. ఈ ఇరవై నెలల కాలంలో కవిత్వం రాసే వారు ఏదో ఒక సందర్భంలో కరోనా మీద స్పందిస్తూ విస్తృతంగా కవిత్వం రాశారు. అనేక కవితా సంపుటాలు, సంకలనాలు వచ్చాయి.

భిన్న కవితారూపాల్లో..

కరోనా మీద వచన కవితలే గాక దీర్ఘకవితలు, పాటలు, నానీలు, మినీలు, పద్యాలు అనేకం వెలువడినాయి. కోవిడ్-19 కాలపు పెను సంక్షోభంపై తెలుగులో మొట్టమొదటిసారి సెప్టెంబర్ 2020లో 'ఊపిరిపాట' అనే వచన కవితా సంకలనం వచ్చింది. 'కరోనాపై కవుల సంధించిన కవన శరాలు' అంటూ గోపగాని రవీందర్ సంపాదకత్వంలో వచ్చిన ఈ సంకలనంలో యాభై కవితలున్నాయి. మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట సాహితీ స్రవంతి వారు తీసుకొచ్చిన తొలి కవితా సంకలనమిది. కరోనా వైరస్ ఒక విధమైన విపత్తయితే వ్యవస్థ వైఫల్యాలు మహావిపత్తుగా పరిణమించి కోట్లాదిమంది వలస కార్మికుల దీనగాథల్ని లోకానికి తెలియజెప్పాయి. ఈ సంక్షోభ స్థితిమీద, వలస కార్మికుల అవస్థల మీద దీనిలో చాలా కవితలున్నాయి. గోపగాని రవీందర్, నూటెంకి రవీంద్ర, ఐ.వి. సుబ్బాయమ్మ, వేనంక చక్రవర్తి, ముత్యం నాగవర్మ, రాచకొండ శ్రీనివాస్ వంటి వారు పదునైన అభివ్యక్తితో కదిలించే కవిత్వం రాశారు.

ఇదే సెప్టెంబర్ 2020లో తిరునగరి శ్రీనివాస్ సంపాదకత్వంలో 'కవనభేరీ' శీర్షికన కరోనా కవితల సంకలనం వచ్చింది. దీనిలో 59 మంది కవితలున్నాయి. విభిన్న ప్రాంతాలకు చెందిన వారి కవితలని దీనిలో చూడొచ్చు. కరోనా ఉపద్రవం వల్ల అవస్థలు పడిన వలస కార్మికుల, దినసరి కూలీల బాధలపై ఎందరో స్పందించారు. కాలుష్యం తగ్గడం, మనుషులకు క్రమశిక్షణ నేర్పడం, ఆరోగ్యకరమైన జీవనం, ప్రకృతిపై ప్రేమ ఏర్పడటానికి కరోనా ఏవిధంగా కారణమైందో కొందరి కవితల్లో కనిపిస్తుంది. చక్కటి అభివ్యక్తి ఉన్న మంచి కవితల సంకలనమిది.

ఎస్.ఆర్. పృథ్వి దీర్ఘకవిత కరోన :

దీర్ఘకవితల్లో చెప్పుకోదగింది ఎస్.ఆర్.పృథ్వి రచించిన 'కరోన'. కోవిడ్-19 బారిన పడి ఎందరో మృత్యువు పాలయ్యారు. లాక్‌డౌన్ ఫలితంగా ఉపాధి కోల్పోయి, రోజులు గడవటమే కష్టమై లక్షలమంది బతుకులు రోడ్డున పడ్డాయి. ఈ పరిస్థితుల మీద ఆర్ద్రంగా స్పందించిన కవి ఈ దీర్ఘకవిత రచించారు. విశ్వమంతా భయం గుప్పిట్లో వణికిపోతున్న భయానక స్థితిని తన కవితాక్షరాల్లో దృశ్యమానం చేశారు. జూన్ 2020న ఈ దీర్ఘకవిత వెలువడింది. ఈరకంగా తెలుగులో వెలువడిన తొలి దీర్ఘకవిత ఇది.

జి.వి.కృష్ణయ్య 'వలస భారతం' శీర్షికన ఒక దీర్ఘకవిత వెలువరించారు. లాక్‌డౌన్ అనంతరం వలస కార్మికులు ఎదుర్కొన్న పెను సంక్షోభాన్ని, దు:ఖాన్ని, ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎత్తి చూపారు. ఈ దేశంలో కోట్ల మంది వలస కార్మికుల బతుకులోని దైన్యాన్ని 'కరోనా' సందర్భం తెలియజెప్పిన వాస్తవాన్ని తన కవిత్వంలో చెప్పారు.

ప్రత్యేకమైంది 'ప్రపంచీకరోనా' :

కోవిడ్-19 ఉత్పాతం మీద ఆర్ద్రంగా, అతి వేగంగా స్పందించారు డా.ఎన్.గోపి. ఒక వైపున కరోనా, మరోవైపున ఆకస్మిక లాక్‌డౌన్ నేపథ్యంలో నెలకొన్న పరిస్థితుల మీద గోపి గారి చాలా కవితలు రాశారు. మార్చి 23 నుంచి మే 5, 2020 మధ్య వారు రాసిన కవితల్ని పాఠకుల్ని ఆలోచింపజేశాయి. కరోనా పరిస్థితుల్ని ఎలా అర్థం చేసుకోవాలో వారి కవిత్వం వివరించింది. వివిధ పత్రికల్లో వచ్చిన కవితలతో కలిపి 'ప్రపంచీకరోనా' శీర్షికన గోపి గారి కరోనా కవితల సంపుటి వెలువడింది. ''ఒకప్పుడు విదేశీ యాత్రలు/ జ్ఞానాన్ని మోసుకొచ్చేవి/ ఇప్పుడు/ రోగాలను వెంట తెస్తున్నాయి'' అంటూ విదేశాల నుండి ఇక్కడికొచ్చిన కరోనా పరిస్థితుల్ని ప్రస్తావించారు. "నిన్నటి దాకా బయటి ప్రపంచం/ ఇల్లును నడిపేది/ ఇవాళ ఇల్లే లోకాన్ని ధిక్కరిస్తుంది" అంటూ లాక్‌డౌన్ నేపథ్యంలో ఇంటికి పరిమితమైన జీవనస్థితికి చిత్రిక పట్టారు. లాక్‌డౌన్ కాలంలో కరోనా విపత్కర ప్రభావాల్ని ఆకళింపు చేసుకోడానికి తప్పనిసరిగా చదవాల్సిన కవితా సంపుటి 'ప్రపంచీకరోనా'. ప్రపంచీకరణ మాదిరిగానే కరోనా దేశాల్ని చుట్టుముట్టిన నేపథ్యంలో 'ప్రపంచీకరోనా' అనే పదబంధం అర్థవంతంగా, ఔచితీమంతంగా వుంది.

విభిన్న సంకలనాలు :

కరోనా కాలంలో కొన్ని పత్రికలు కరోనా కవిత్వాన్ని ప్రోత్సహించాయి. అంతేగాక కరోనా, తత్ఫలితంగా నెలకొన్న పరిణామాలే సాహిత్య వస్తువుల య్యాయి. కరోనా పరిస్థితుల్ని గమనించి డా. నాగభైరవ ఆదినారాయణ 'కరోనా పై కవనం' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు. దీనిలో పద్యం, వచనం, పాట, రుబాయిలు, నానుడి-న్యూనుడి, కూనలమ్మ, మినీ,నానీ, సూక్తి, జోకులు వంటి పది రూపాల్లో కరోనా మీద సంధించిన రచనల సంపుటి ఇది. పది రూపాల్లో చేసిన రచనలతో ప్రయోగాత్మకంగా డా. నాగభైరవ ఆదినారాయణ తీసుకొచ్చిన ఈ పుస్తకం జూన్ 2020న వెలువడింది.

అలాగే నేతల ప్రతాప్‌కుమార్ సంపాదకత్వంలో వెలువడిన 'ఐసోలేషన్ వాడ' సంకలనం ప్రత్యేకమైంది. 55 మంది కవుల కరోనా కవితలతో ఈ పుస్తకం వచ్చింది. కరోనా కాలాన ముఖ్యంగా దళితులు, శ్రమజీవులు ఎన్ని బాధలు పడ్డారో, ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నారో కవులు బలంగా చెప్పారు. సామాజిక దూరం పేరిట దళితుల్ని అంటరానివాళ్ళుగా చూసిన చారిత్రక పరిస్థితుల్ని గుర్తు చేశారు. సాటి మనుషుల్ని దూరం పెట్టడంలో ఉండే బాధ ఎలాంటిదో ఈ ప్రపంచానికి తెలియజేసిన వైనాన్ని కొందరు అక్షరీకరించారు.

శ్రీశ్రీ మీద వరుసగా సంపుటాలు వేస్తున్న సింగంపల్లి అశోక్‌కుమార్ మినీ కవితలతో 'ఔరా! కరోనా!!' శీర్షికన నవంబర్ 2020న ఒక పుస్తకం తీసుకొచ్చారు. ఈ సంపుటిలో 61 మినీ కవితలున్నాయి. లాక్‌డౌన్, ఐసోలేషన్, సామాజికదూరం వంటి వాటి వల్ల నెలకొన్న

సామాజిక, మానసిక స్థితిగతుల్ని ఈ మినీ కవితల్లో చూస్తాం.

ఇక కరోనా పరిణామాలపై చాలామంది నానీలు కూడా రాశారు. హర్షవర్ధన్ 'కోవిడ్ నానీలు' పేరుతో డిసెంబర్ 2020 లోనే కరోనా నానీల సంపుటి వెలువరించారు. అలాగే 'కరోనా నానీలు' పేరిట చలపాక ప్రకాష్ ఓ నానీల సంపుటి తీసుకొచ్చారు.

కేవలం లాక్‌డౌన్ మీదనే పత్తిపాక మోహన్ కొన్ని కవితలు రాశారు. 'లాక్‌డౌన్' శీర్షికన తన కరోనా కవితల సంపుటి వెలువరించారు. లాక్‌డౌన్‌లో ఎలాంటి పరిస్థితి ఉండేదో రికార్డు చేసిన ఆర్ద్రమైన కవితల సంపుటి ఇది.

కవితా సంపుటాలలో...

ఈ ఏడాది చాలామంది కవులు తీసుకొచ్చిన కవితా సంపుటాలలో కరోనా ప్రస్తావన ఉన్నది. కొందరయితే కేవలం కరోనా వల్ల నెలకొన్న విషాద బీభత్సాన్ని, మనుషుల నడుమ పెరుగుతున్న ఎడాన్ని గురించి ప్రత్యేకించి రాసిన కవితలనే తమ సంపుటాలలో ఎక్కువగా చేర్చారు. చిత్తలూరి సత్యనారాయణ కవితా సంపుటి 'మనిషి అలికిడి లేక...' అన్న పుస్తకం కరోనా విలయపు పార్శ్వాలన్నిటిని ప్రతిఫలించింది. దీనిలోని చాలా కవితలలో కరోనా విలయం వల్ల నెలకొన్న మానవ జీవన విషాదాన్ని చిత్రించారు. చివరి కవితలో ఒక భరోసానిస్తూ

"ఒక అర్థవంతమైన ముగింపుతో పాటు
ఒక ఆకురాలే సంక్షోభం
ఒక పురుగు ముట్టిన సందర్భం
ముగింపుకు చేరాక
చిగురించే వసంతం లాంటి
ఒక సరికొత్త ప్రారంభమూ తప్పక వుంటుంది!"

ఆశావహమైన ముగింపు నిచ్చారు చిత్తలూరి. కరోనా విషాదాన్ని బలంగా వ్యక్తం చేసిన సంపుటి ఇది.

ముప్పయి కవితలతో 'కరోనా కోరల్లో...' శీర్షికన డా. నూనె అంకమ్మ రావు ఒక కవితా సంపుటి వెలువరించారు. లాక్‌డౌన్ వేళ నెలకొన్న పరిస్థితుల్ని చెప్పారు. 'గమ్యం తెలిసిన తొవ్వ' శీర్షికన డాక్టర్ దామెర రాములు ఇటీవల ఓ కవితా సంపుటి తీసుకొచ్చారు. దీనిలోనూ కరోనా మీద కొన్ని ప్రత్యేకమైన కవితలున్నాయి. కరోనాని 'మృత్యుకీలల కిరీటధారి' అంటూ

"మానవాళికి భయభీతి అంటే ఏమిటో
ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనావస్థ అంటే ఏమిటో
కళ్ళకు కట్టినట్టు దృశ్యమానం చేస్తోంది" అనే వాస్తవాన్ని చెప్పారు. ఇంకా ఇలా అంటారాయన:

"మానవేతిహాసంలో ఈ ఉపద్రవం
మరిచిపోలేని క్షీణ ఘట్టం
చెరగిపోని దు:ఖకాండ
అయినా తప్పకుండా ఇది మానవాళి
ప్రాణాలొడ్డి గెలవాల్సిన మహాయుద్ధం" అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. ఈ క్రమాన వైద్యులు, వైజ్ఞానికరంగం చేస్తున్న కృషిని తన కవితాక్షరాలతో సత్కరించారు.

ఏనుగు నరసింహారెడ్డి వెలువరించిన 'నీడల దృశ్యం'లోనూ కరోనా మీద కొన్ని కవితలున్నాయి. "నీటిలో మునిగేటట్లూ లేదు/ కత్తెరకు చినిగేటట్లూ లేదు/ కనిపించని శత్రువుతో/ ఇప్పుడు భూగోళపు అణువణువూ యుద్ధక్షేత్రమే" అనే నిజాన్ని ఎరుకపరుస్తూ అప్రమత్తంగా ఉండాలని చెబుతారు.

కరోనా ఉపద్రవం నుంచి మానవాళి మేల్కొని పురోగమించ గలదనే విశ్వాసాన్ని కొండి మల్లారెడ్డి వ్యక్తం చేస్తారు. 'నిశ్శబ్ద యుద్ధం' అనే శీర్షికన రాసిన కవితలో "మబ్బులు కమ్ముకున్న ప్పుడల్లా/ మానవ మేధస్సు వికసిస్తూ/ వేకువ కొత్త ఉషస్సును/ ప్రసరిస్తూనే ఉంది" అంటారు. కరోనా కాలం ఇలాగే నిలిచిపోదని అంటారు.

కరోనా కాలంలో భీతిల్లిన మనిషికి స్థయిర్యం చెబుతుంది పి.శ్రీనివాస్ గౌడ్ రాసిన 'ధైర్యవచనం'. కరోనాని అడ్డుపెట్టుకొని చెలరేగిన దుర్మార్గాన్ని ప్రతీకాత్మకంగా కవిత్వం చేశారాయన. కరోనా-లాక్‌డౌన్ కారణంగా

సొంతూర్లకు తరలిపోతూ నానా యాతన పడుతున్న వలస కార్మికులకు అండగా నిలబడిన వారిని 'దయాదీపాలు'గా అభివర్ణిస్తూ కరుణారస ప్లావితమైన కవిత్వం రాశారు. మనుషుల్లో దాగివున్న కరుణాంతరంగం వ్యక్తమైన సందర్భాన్ని సముచితంగా చెప్పారు.

ప్రతి ఒక్కరూ అనివార్యంగా స్పందించాల్సిన సందర్భాన్ని కరోనా సృష్టించింది. పరిశోధకుడు, విమర్శకుడు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 'కరోనా కాలంలో మా కాపురం' అంటూ తీసుకొచ్చిన కవితా సంపుటి విలక్షణమైంది. ఏడు పదులు దాటిన వయసులో కరోనా-లాక్‌డౌన్ కాలాన్ని ఎదుర్కొన్న తీరుని ఈ కవిత్వంలో దృశ్యమానం చేశారు. 'వంట పని నీది ఇంటి శుభ్రత నాది' అని పని విభజన చేసుకొని దంపతులిద్దరు రెండు లాక్‌డౌన్ల కాలాన్ని ఎలా గడిపారో, ఈ కాలంలో వారి అంతరంగం ఎలా ఉన్నదో చెప్పిన కవిత్వమిది. 'కరోనా కాలంలో మా కాపురం' అనేది ఒక దీర్ఘకావ్యం. ఇదే అరవై ఆరు పేజీలు ఉన్నది. ఇది గాక కరోనా మీద రాసిన మరికొన్ని కవితలున్నాయి.

ఈమధ్యనే వచ్చిన కరిపె రాజ్‌కుమార్ కవిత్వంలోనూ వలనజీవుల వెతలు కనిపిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది వచ్చిన కవితా సంపుటాలలో కరోనా వెతల ప్రస్తావన లేని పుస్తకం లేదనవచ్చు. అయితే స్థూలంగా ఈ కవిత్వంలో వ్యక్తమైన అంశాలు ఈ కిందివిధంగా ఉన్నాయి.

1. కరోనా తీవ్రతని హెచ్చరిస్తూ, జాగ్రత్తలు చెప్పడం
2. ప్రకృతి, పర్యావరణం పట్ల కొత్త చైతన్యం, పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి అన్న ఎరుక
3. లాక్‌డౌన్ నేపథ్యంలో వలసకార్మికుల వెతలు, సంవేదన
4. కరోనా తీవ్రతతో పెరుగుతున్న పరాయీకరణ, మానవ సంబంధాల విధ్వంసం
5. మహిళలపై లాక్‌డౌన్ ప్రభావం
6. అభివృద్ధి పేరిట ప్రకృతి వనరుల విధ్వంసం తగదన్న చైతన్యం.

ఈవిధంగా కరోనా కేంద్రంగా వచ్చిన కవిత్వంలో వస్తువైవిధ్యం అపారం. వ్యక్తీకరణలో ఎవరి శక్తిమేరకు వారు తాము ఎంచుకున్న వస్తువును కవిత్వం చేశారు. మొత్తంగా ఈ ఇరవై నెలల కాలంలో వేలాది కవితలు వచ్చాయి. అనేక సంపుటాలు, సంకలనాలు వెలువడ్డాయి. ఈ కవిత్వం మీద నిశితమైన పరిశోధనలు జరిగితే తెలుగు సాహిత్యచరిత్రలో కొత్తకోణాలు ఆవిష్కరించడానికి వీలవుతుంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడు తరాల సబ్బండ సోయి 'అడపం' కథలు

- డా॥. చింతం ప్రవీణ్ కుమార్

సకల తీర్థములను సకల యజ్ఞంబుల
తలల గొరగకున్న ఫలము లేదు
మంత్ర జలము కంటె మంగలి జలమెచ్చు
విశ్వదాభిరామ వినురా వేమ॥

మానవుడు తను పొందిన ఉత్పత్తి జ్ఞానాన్ని శ్రమ విజ్ఞానాన్ని తన తరువాత తరానికి అందించే క్రమంలోనే కళలు ఉద్భవించాయి. నేటి ఆధునిక కాలంలోని నాట్యం, నటన, కవిత్వం, సంగీతం,సాహిత్యం యిట్లా అవి అనేక కళలుగా రూపాంతరం చెందాయి. అందులో మనిషి జీవితానికి దగ్గరిది మనిషి జీవితంతో అత్యంత సాన్నిహిత్యం కలిగినది కథ. తను విన్నదాన్ని, చూసిన దాన్ని, ఎవరో చెప్పిన దాన్ని ఇతరులకు చేరవేయడానికి, ఇతరులతో పంచుకోవడానికి కథలోని భాష ఉప యోగపడింది. అక్షరాలు పుట్టిన తరువాత తన దగ్గర ఉన్న సమాచారమంతా రాయడం మొదలయ్యాక, మౌఖిక సాహిత్యం కాస్తా లిఖిత సాహిత్యమయ్యింది. అదే నేటి ఆధునిక కథగా ప్రచారంలో ఉన్నది.

అప్పటి కథ, కవిత, గానం రాజుల్ని వారి భుజ బలాన్ని, పౌరుషాన్ని, దాన గుణాన్ని రాణుల అందాలను కీర్తించాయి. దేవుల్లని వారి మహిమల్ని దేవీ,దేవుళ్ళ ప్రణయ గాథల్నీ కీర్తించాయి. కానీ రాజ్యం నడవడానికి మూలకారణమై పన్నులు కడుతూ తమ చెమటను ధారపోసి రాజ్యాన్ని నడిపిస్తున్న శూద్ర ప్రజల్ని మర్చిపోయాయి. చెమడోడ్చి పండించిన ధాన్యపు గింజలనే నిత్య నైవేద్యాలుగా స్వీకరిస్తున్న దైవాలు వారికి అనుసంధాన కర్తలం అని చెప్పుకునే పురోహిత వర్గం శ్రామిక కులాలను తమకు,తమ అదుపాజ్ఞలో ఉన్న రాజ్యానికి సేవచేసే కులాలుగా కేవలం చాకిరీ చేసే శ్రమ కులాలుగా బానిసలుగా ఆత్మగౌరవంలేని అల్పజాతు లుగా చిన్నచూపు చూశారు. కానీ వారి శ్రమజీవన సౌందర్యాన్ని శ్రమతో ముడిపడి ఉన్న ఆత్మగౌరవాన్ని ఎన్నడూ గుర్తించలేదు.

జమానా మారింది. ప్రజాస్వామ్యం ఊపిరిగా ప్రజ లందరూ సమానులు అనే సమభావనతో వనరులు, హక్కులు, చట్టాలు అందరికీ సమానంగా పంచబడతాయి అంటూ రాజ్యాంగం రూపంలో కొత్త పొద్దు ఉదయిం చింది. కానీ అధికారంలో వున్న అగ్రకులాలు అప్రకటిత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ఈ దేశ వనరుల్ని దోచు కుంటూ తొంభై శాతం ఉన్న దళిత, బహుజన అశేష ప్రజానీకాన్ని పేదరికంలో బానిసత్వంలో ముంచు తున్నాయి. ఇలా తరతరాలుగా బానిసలుగా మార్చబడిన దళిత బహుజన కులాల్లో ప్రతిఘటనా శక్తి రోజు రోజుకు నిర్వీర్యమైపోతున్నది. ముఖ్యంగా శూద్ర కులాలకు బ్రతుకే ఒక నిత్య పోరాటం అవుతున్నది.

అంతరించిన రాజుల స్థానంలో శూద్ర వర్ణంలోని కొన్ని కులాలు అప్పటికే తమ చేతుల్లో ఉన్న భూముల కారణంగా దొరలు, జాగీర్దారులు, జమీన్‌దారులు, దేశ్‌ముఖ్‌లుగా అవతరించారు. వీరి ఆధీనంలో ఉన్న గ్రామాల్లో వృత్తిదారులపై అఘాయిత్యాలు పెరిగాయి. పన్నుల భారాలు మోయలేక వృత్తులు కూలిపోయాయి. ఎదురు తిరిగిన జీవితాలు ఆరిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా తెలంగాణలో దొరల పీడన పోలేదు. అప్పుడే భూమి కేంద్రంగా ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగా రూపుదిద్దుకున్నది. దున్నేవానికి భూమి నినాదంతో విప్లవ శంఖం పూరించింది. ఆ పోరాట ఫలితంగానే దళిత బహుజన కులాల్లోని ప్రజలకు భూమి కాస్త చేరువైంది, ఆత్మగౌరవంగా బ్రతకడానికి భూమి

కొద్దిగా ఆదరువయ్యింది. ఇలా భూమి కాస్త చేతికి వచ్చిన శూద్ర కులాలకు పెరిగిన ఆత్మగౌరవాన్ని అణిచి వేయడానికి ఎట్లాగైనా భూమిని లాక్కోవాలనే ఆధిపత్యం ఒకవైపు- ఇంకోవైపు ప్రపంచీకరణతో భూమి అందినట్టే అంది అనతికాలంలోనే మళ్ళీ చేజారిపోయింది.

అంతే-మళ్ళీ ఎప్పటిలాగే శ్రమ సేవాకులాలకు చాకిరీ రెట్టింపయ్యింది. ఇంకా ప్రపంచీకరణ వల్ల నమ్ముకున్న కులవృత్తులు మార్కెట్‌లో వస్తువులయ్యాయి. అటు భూమిలేక ఇటు ఉన్న వృత్తి కాస్త చేజారిపోయి ఎట్లా బ్రతకాలో ఇంకెట్లా సావాలో తెలియక కొట్టుమిట్టాడే దయనీయమైన పరిస్థితిలోకి నెట్టివేయబడ్డారు శూద్ర చాకిరీ సేవా కులాలు. ఇలా శూద్ర కులాల కల్లోల జీవితాలు వారి సంఘర్షణ పేదరికం అవిద్య పోరాటాలు ధిక్కారం వీటన్నింటికి కథా రూపమే 'అడపం-వృత్తి కథలు-1'. పైకి ఇవి కేవలం సేవా కులమైన మంగలి కథల్లాగా కనబడ్డా వీటినిండా అంతర్లీనంగా ప్రవహించే దంతా శూద్ర కులాల ఆత్మ.

మంగలి ప్రజల జీవితాలకు చెందిన ముప్పైఒక్క కథలతో ఈ సంకలనం ప్రచురితమైంది. తుమ్మల రామకృష్ణ గారు ప్రధాన సంపాదకులుగా వ్యవహరించగా ఎం.నాగరాజు, టి.సతీష్‌ల సంపాదకత్వంలో ఈ కథా సంకలనం వెలువడింది. ఈ కథాసంకలనంలోని కథకుల్లో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు మినహా మిగతా వారంతా శూద్ర అతి శూద్ర రచయితలు కావడం చాలా సంతోష కరమైన విషయం. మా సాహిత్యాన్ని మేమే రాసుకుంటాం అని కుంచించుకుపోకుండా ఉన్నందుకు సంపాదకులను తప్పకుండా అభినందించాల్సిందే. సాహిత్యం ఎంత విస్తృతమైతే అంత వికసిస్తుంది. దాని తాలూకు ప్రభావం అన్ని కులాలపై ప్రతిఫలిస్తుంది. కులాలకు అతీతంగా మానవ సమాజమంతా కులరహిత ఉద్యమాల వైపు కదలడం కోసం అది ఉపయోగపడుతుంది. మనుషులు కులాలుగా విడగొట్టబడి వున్న ఈ సమాజంలో మనమంతా పీడిత కులాలమనే అవగాహన మాత్రమే మన జనాలను ఐక్యం చేయడానికి ఉపయోగపడే సాధనం. మనమంతా అగ్రకులాల బాధితులమనే స్పృహ ఈ దేశాన్ని ఒక విప్లవకర దశకు చేర్చుతుంది. ఐతే ఇక్కడ కావలసినదంతా కులానికి కులానికి నడుమ సఖ్యత. పక్కనున్న వాడి బాధను పంచుకునే సానుభూతి మాత్రమే ఇద్దరి నడుమ సఖ్యతను కలుగజేస్తుంది. అలాంటి ప్రయత్నమే 'అడపం' సంపాదకులు చేసినందుకు వారికి మనం కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిందే.

"ఉదయం పాలం నుండి ఇంటికి తిరిగివస్తున్న తండ్రి ముఖంలో కనిపించిన దీనత్వం లాంటి తన అదృష్టం తలుచుకొని నాగలింగం కుమిలిపోయాడు. తండ్రి కష్టార్జితం ఆ రెండెకరాలు గరువు! తమ యావదాస్తి! నిజానికి తన తండ్రికి ఆ పాలం రెండో కొడుకు! ఆ పాలం మీద అంత ప్రేమ! కొన్నప్పుడు పాడు బీడుగా ఉన్న భూమి పంటపాలంగా చేసుకొన్నాడు. ఏలెడంత పసివాణ్ణి ఏనుగంత మనిషిని చేసుకొన్న తల్లి తత్వం కోటిది. పాలం పంట ఇంటికి వస్తే పిల్లాపాపలతో ఇల్లు కలకలలాడినట్లు పొంగిపోయాడు కోటి".

నాగ్గాడు నాకుబాకీ అన్నాడు వీరన్న'. అంతే కాదు నాడబ్బు నాగ్గట్టు పట్టుబట్టాడు.

'ఏందాధారం?

'నోటు!'

కోటి నోటు చూశాడు, సంతకం చూశాడు నాగలింగం సంతకమే!

అసలుకు రెట్టింపువేసి నోటు వ్రాయించుకొన్నాడు. మొత్తానికి వడ్డీ కట్టి తిరగ వ్రాయించాడు. ఈ విధంగా పన్నెండేళ్ల నుంచి పెరిగిపోయిన వడ్డీ అసలుకు తాత అయి కూర్చొంది. తీసుకొన్న డబ్బుకూ, కట్టవలసిన డబ్బుకు దోమ ఏనుగుకున్నంత తేడా!

'బాకీ కింద పాలం జమకట్టమన్నాడు వీరన్న'

ఇంతకాలం వీరన్న మైత్రి ఆంతర్యం ఇప్పుడర్థమై పోయింది"

(తలలేనోడు కథ-కొలకలూరి ఇనాక్)

పై రెండు విషయాలు కులవృత్తుల మీద ఆధారపడి బ్రతుకుతున్న నగటు శూద్ర కులాల జీవితాన్ని తెలియజేస్తున్నాయి.అదే విధంగా రెక్కాడితేగానీ డొక్కాడని సేవాకులాలు ఏ విధంగా ఆర్థిక దోపిడీకి గురవు తున్నాయో శూద్రకులాల ఒకానొక జీవన సంధిగ్ధావస్థను తెలియజేస్తున్నాయి.

కులవృత్తుల మీద ఆధారపడి అవమానాలతో బతకడం కంటే భూమి దున్నుకుని తిండి గింజలు పండించుకొని గౌరవంగా బతుకుదామనే ఆలోచన వచ్చింది మొదలు కొండంత కష్టం చేసి కడుపు కట్టుకొని పైసా పైసా కూడేసి ఊరి కరణం దగ్గరికి పోతే పైసలు తీసుకొని కూడా కొండలు, బండలున్న భూమి తొండలు గుడ్లుపెట్టే నేలల్ని అప్పజెప్పారు మనకు. కొండలు తొలిచేదెన్నడు పంట పంటేదెన్నడు అనుకున్నారు. ఆనాటి కరణాలు, భూస్వాములు. కానీ శ్రమనే నమ్ముకుని మొదటి నుండి బతుకుతున్న బహుజన కులాల చెమట బొట్లు నేలపై పడగానే నేల చిగురించింది. కొండను, బండను తొలిచి రాయి రప్పా ఏరి, చదును చేసి పంట తీయగానే భూస్వాముల కడుపు మండటం మొదల య్యింది.

అట్లా కడుపు మండిన వాడే వీరన్న, తను ఊరి మునసబు. కోటి తనకు లొంగడని అర్ధమయ్యాక కోటి కొడుకు నాగలింగంతో స్నేహాన్ని నటించి నాగలింగానికి తాగడం, జూదం, వేశ్యల్ని అలవాటు చేశాడు. దాని కోసం స్నేహితున్ని అదుకుంటున్నట్టు నటించి ఇచ్చిన పైసల్ని అప్పుగా రాయించుకొని అప్పుకింద భూమిని గుంజు కున్నడు వీరన్న. ఇది మోసపోయిన ఒక్క నాగలింగం సమస్యే కాదు, ఇట్లా తెలంగాణ సమాజం నిండా ప్రతీ గ్రామంలో మోసపోయిన ఎందరో మంగలి నాగలింగాలు, మోసం చేసిన మనసబు వీరన్నలున్నారు. పేరు, ఊరు మారుతుంది గాని సారాంశం మాత్రం ఒక్కటే. వీలైతే మోసం, లేదంటే కుట్ర.అంతిమంగా శూద్ర కులాల నిలువు దోపిడీ.

"మొగిలప్ప కుల వృత్తి చూసుకుంటూ సేద్యంలోకి కాలు పెట్టాడు. చినుగు చిట్రా పడినప్పుడు కయ్యి, చేను దున్నుకోవాల, పల్లెలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా వృత్తి చేసుకోవాల."-ఇది కులవృత్తిని కాపాడుకుంటూ తన అత్తమామలిచ్చిన కాస్తంత భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ గుట్టుగా బతుదా మనుకునే ఆత్మగౌరవం కలిగిన మంగలి మొగిలప్ప గుణం.

'పల్లెలో భూమిబుట్ర విషయంలో నరసయ్యదే పైచేయి. తోట, దొడ్డి, మడి, చేను అంతా కలిపి యాభై ఎకరాలుండవచ్చు...నెత్తి నేసుకొనేంత ఉన్నా ఎంగిలి చేత్తో కాకిని తోలడు...చావు మేళంకు అయిదు రూపాలే ఇస్తాడు. నమర్త మేళానికి తిండి పెట్టి అయిదు రూపాయలిస్తాడు. చాకలోళ్లతో, మాదిగోల్లతో, మాలోల్లతో నరసయ్యకి ఎప్పుడూ తగువే...అందరూ నరసయ్య చెప్పినట్లు వినాల్సిందే. లేకుంటే ఊరి మద్దిస్తం పెట్టి నలుగుర్ని తన వైపు తిప్పుకుని పని బాట్లోళ్లదే తప్పని తేల్చి 'దండగ' కట్టమంటాడు...ఇది అగ్రాధిపత్యం కలిగిన నరసయ్య స్వభావం.

భూమి ఆదాయ వనరుతో పాటు గౌరవ చిహ్నంగా కూడా మారింది. ఎన్ని ఎకరాల భూమి ఉంటే అంత పెద్ద ఆసామి. భూమి భూస్వాములకు డబ్బునే కాదు ఊరిమీద అధికారాన్ని కూడా కల్పించింది. ఊరిమీది పట్టంతా భూస్వాములదే. రాజకీయాలన్ని వారి చుట్టే తిరిగేవి. వారు పిలిచినప్పుడు రావాలా పొమ్మనప్పుడు పోవాలా...కాదంటే కళ్ళెర్రజేసుడే.

'నాకే ఎదురు తిరిగి మాట్లాడతావా నా కొడుకా? ఇంటింటి కూడు, కూర తిని నీకు పొగురు పట్టిందిరా?

-నరసయ్య

'మాచేతుల కష్టమే తింటావుండాం. మాటలు కొంచెం చూసుకొని మాట్లాడండి. ఎవరూ మీ చేతి గెంజి తాగి బతకడం లేదు'.

-మొగిలప్ప

'నీది కాదురా తప్పు. ఇరవై గుంటల మడి, ఎకరా చేను చూసే సరికి నీకు కండ్లు పైకెక్కినాయి'

- నరసయ్య

భూమి మనుషులకు ఒక సామాజిక, రాజకీయ హోదాలను కల్పిస్తుంది. అయితే తమ భూముల్లో కూలీలుగా పని చేసే కులాలు తమ కండ్ల ముందే భూమిని కొని పంటలు తీసి బాగుపడటాన్ని జీర్ణించుకోలేక పోయాయి గ్రామాల్లోని భూస్వామ్య కులాలు, నిన్నటి వరకు కూలి పైసల కోసం తన ముందు చేయి చాపిన వాళ్లు ఇప్పుడు తన ముందే తలెత్తుకుని తిరగడం చూసి రగిలిపోయాయి నరసయ్యలాంటి అగ్రాధిపత్యాలు. కారణం భూమి. అలాంటి భూమితో ముడిపడిన సామాజిక హోదాను అందనివ్వకుండా తన అదుపాజ్ఞలలో ఉంచుకోవాలని అందుకు ఎలాగైనా భూమిని తనదిగా చేసుకోవాలనే అగ్రకుల సామాజిక ఆధిపత్య ధోరణి కలిగిన నరసయ్యకి వ్యతిరేకంగా తమ ఆత్మ గౌరవాన్ని కాపాడుకునే క్రమంలో కులవృత్తుల కత్తి ఎదురుతిరిగి ప్రశ్నించడం మొదలవుతున్నదనే చైతన్యం మొగిలప్ప పాత్ర ద్వారా తన 'అడపం' కథలో చెబుతాడు రచయిత తుమ్మల రామకృష్ణ .

అయితే ఈ ఆత్మగౌరవాన్ని కాపాడుకునే క్రమంలో ఏ కులవృత్తి అయితే తమ చిన్నచూపుకు కారణమవుతున్నదో ఆ కులవృత్తిని సైతం వదిలిపెట్టే ధిక్కార స్వరం వినిపించిన మొగిలప్ప ఈ కథలో దిగ్రేట్ సామ్రాట్ అశోకుని వారసునిలాగా మనకు కనిపిస్తాడు.

(అడపం మేలుకుంది-అడపం-తుమ్మల రామకృష్ణ)

నిజానికి శూద్ర కులాల సాహిత్యం అంటేనే కుల వృత్తుల తండ్లాట,పల్లె కన్నీరు పెట్టడాలు,బతుకు భయం నిరాశ నిస్పృహలు ఇలాంటివే ఎక్కువగా కనబడతాయి. అయితే ఇంకా ఇవే ఎన్నాళ్ళు?? గాయాలు, ఓటమి నిస్పృహ బానినత్వం మాత్రమే బీసీల సాహిత్యం కాకూడదు కదా...గాయాల్ని దాటి ధిక్కారం వైపుకు గెలుపు వైపుకు పయనించడం కూడా కావాలి కదా...అలా బీసీలని గెలుపు వైపుకు నడిపించే కథే 'అడపం'.

''మా ఊళ్లో రాఘవయ్య ఓ పెద్దమనిషి నూరు ఎకరాల ఆసామి, ఊరి వ్యవహారాలన్నీ రాఘవయ్య గుప్పిటలోనే. తను గీచిన గీత జనం దాటకూడదు. అమాయక జనం. గొర్రెదాటు. ఒక్క మాటలో చెప్పాలంటే రాఘవయ్య ఆ ఊరికి మకుటం లేని మహారాజు.'

'మంగలి మల్లయ్య సన్నకారు రైతు. ఆరడుగుల ఆజానుబాహుడు. కండపుష్టి కల్గిన మనిషి. ముడతలు పడిన శరీరంలో వృద్ధాప్యపు ఛాయలు తొంగి చూస్తున్నాయి... మంగలి మల్లయ్య ఊరి వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనే వాడు. నిజాయితీ గల మనిషి. పేదల పక్షాన నిలబడేవాడు. ప్రజల్లో పలుకుబడి గల మల్లయ్యంటే రాఘవయ్యకు అసూయ.ఎక్కడ రాజకీయంగా తనను మించిపోతాడోనని గుబులు'

మంగలి కులస్తులు ఊరందరితో సత్సంబంధాలు కలిగి ఉండటం వల్ల, గ్రామంలో ప్రతి గడప తెలిసి ఉండటం వల్ల, ప్రతి మనిషిని వారిలోని గుణాలను బేరిజు వేయడం వల్ల మంచి చెడుల నంగతులను ఇట్టే గ్రహించేవాల్లు. ముఖ్యంగా రాజకీయాలను అప్పటి పరిస్థితులకు అనుగుణంగా అర్థం చేసుకోవడంలో నిష్ణాతులు మంగలి వారు. ఊరు నుండి మొదలు కొని రాష్ట్ర, దేశ రాజకీయాలను కూడా అవపోసన పట్టడంలో దిట్టలు..అదే రాఘవయ్యలాంటి వారికి అసూయ ఆగ్రహానికి కారణమవుతుంటది. మరి ఆ ఆగ్రహం అన్నిసార్లు పనిచేయదు కదా-శక్తివంతుడు బలవంతుడున్న చోట బలవుంతుని వెనకాల సబ్బండ జనమున్న చోట బలం పనిచేయదు కదా...కనుక కుట్ర చేయాలి... అదే చేశాడు రాఘవయ్య.

''మంత్రాలకు చింతకాయలు రాలవు'' అన్నది తెలంగాణలో సామెత. కానీ ఇదే తెలంగాణలో గడిచిన కొన్ని ఏండ్లుగా చాలా గ్రామాల్లో మంత్రాలు చేస్తున్నారనే

నెపంతో జరిపిన సజీవ దహనాలు, చెట్టుకు కట్టేసి కొట్టి చంపిన దారుణాలు, పట్టపగలే ఊరినడిబొడ్డులో కత్తులతో దారుణంగా హత్యగావించ బడ్డ సంఘటనలు మనకు తెలుసు. ఇలాంటి ఘటనల్లో బాధితులంతా దళితులు, బీసీలే. అనుకోకుండా గ్రామంలో ఒకరో ఇద్దరివో వరుస మరణాలు జరుగుతాయి, కారణాలు అంతుచిక్కకుండా ఉంటాయి. సడెన్‌గా ఒక రోజు ఇదంతా చేతబడంటా అని గాలి పుకార్లు లేపుకుంటూ ఊర్లోకి ప్రవేశిస్తుంది, ఉన్నట్టుండి గ్రామంలో ఒకరికి దేవుడు లేదా దేవత పూనుతుంది. ఇదంతా చేసింది ఫలానా వాళ్లంటూ తన భవిష్యవాణి చెప్తుంది. ఇంకే ముంది ఊరుఊరంతా కదిలి భవిష్య వాణి చెప్పిన పేరు గల ఒక వ్యక్తినో, లేదా ఒక కుటుంబాన్నో టార్గెట్ చేసి చేతులు విరగొట్టి, కాళ్లు విరగ్గొట్టి, నోటిలో పళ్లూడగొట్టి ఆ వ్యక్తి లేదా ఆ కుటుంబాన్ని మంటల్లో వేసి కాల్చిన తరువాతే ఊరంతా చల్లబడుతుంది. తన అధికారానికి, హెూదాకు ఎటువంటి భంగం కలిగే అవకాశం యిక ఏమాత్రం లేదంటూ ఊరి అగ్రకులత్వం కంటినిండా నిద్రపోతుంది. ఇదే విషయాన్ని లోగుట్టు కథలో చాలా హృద్యంగా చెప్పాడు రచయిత.

మంగలి మల్లయ్య తను చేసిన మోసాలను బైట పెడుతూ తన రాజకీయ జీవితాన్ని నాశనం చేస్తున్నాడనే కోపంతో రాఘవయ్య పన్నిన పన్నాగమే మంత్రాలు, మాయలు. మంగలి మల్లయ్య వల్లనే ఊర్లో అనర్థాలు జరుగుతున్నాయనే మూఢనమ్మకాన్ని ప్రచారం చేయడం ద్వారా మల్లయ్యను చంపడానికి లైసెన్స్ దొరికినట్టవుతుంది తనకు. ఈ విధంగా ఇప్పటికీ గ్రామాల్లో దళిత, బీసీ కులాలు మంత్రాల పేరుతో బలైపోతూనేవున్నరు.

'అజ్ఞాతం రౌద్రరూపం దాల్చింది. ఊరి గర్భం నిండిన మూఢ విశ్వాసం అగ్నిపర్వతంలా భగ్గుమని బద్దలయ్యింది. ఊరి వెలుపల మోదుగువనం ...రక్తపు మడుగు... నెత్తురోడుతున్న బుర్రమీసాల దేహం ..ఆయువు అనంత వాయువుల్లో మల్లయ్య...'మల్లయ్య కుటుంబం ఊరొదిలి వెళ్లిపోయింది. ఊరి పెత్తనం మీసాలు మెలివేస్తూ క్రూరంగా నవ్వింది. మూఢవిశ్వాసాల పెంపకం రాఘవయ్య రాజకీయాల్లో భాగం. లోగుట్టు తెలియని ప్రజలు మోసపోయారు" (లోగుట్టు-పంజాల జగన్నాధం)

దళిత, బీసీ కులాలు స్వయంగా సృజనాత్మకమైనవి. ఆ సృజనాత్మకతే మానవుడు సుఖంగా బతకడానికి కావాల్సిన వనరులను సమకూర్చి పెట్టింది. అయితే వీరి కష్టాన్ని దోచుకుంటు సుఖపడుతున్నది మాత్రం అగ్రకులాలే. అటువంటి అగ్రకులాలు వారి అధికారాన్ని స్థిరం చేసుకునేటందుకు ఎలాంటి ఎత్తులు పై ఎత్తులైనా వేయడానికి సిద్ధపడతారు. దళిత, బీసీ కులాలకు చదువుకు దూరం చేస్తారు. భూమికి దూరం చేస్తారు, వైద్యానికి దూరం చేస్తారు, మంచి తిండికూడా దొరకకుండా చేస్తారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ కులాలు చదువుకోవడం వల్ల తమ అధికారానికి, పెత్తనానికి గండి పడుతుందని గ్రహించిన అగ్రకులాలు వీలైతే దైవం లేదంటే దయ్యం పేరుతో మూఢులుగా మార్చేస్తారనేది చరిత్ర చెబుతున్న సత్యం.

"చెంగల్రాజు క్రాపు కత్తిరిస్తుంటే ఒక న్యూస్ బ్యూరో కదిలి పోయినట్టే"

(వ్యా!కులవృత్తి-మల్లెమాల వేణుగోపాల రెడ్డి)

కథలో చెప్పింది అక్షరాల నిజం. రాజకీయాలు ఇవ్వాళ మంగలి వారికి కొత్తేం కాదు. నిజానికి ఈ దేశంలో మనుషులందరూ సమానంగా బ్రతికింది, సమానత భావం వర్ధిల్లింది నందులు మౌర్యులు ఏలిన మగధ రాజ్యం కాలంలో. నందులు మౌర్యులు మంగలి వారు. బుద్ధుని సమతావాదాన్ని ఆచరించారు. మనుషులందరూ సమానమే అంటూ కులవ్యవస్థను రద్దు చేశారు. అలెగ్జాండర్ ఈ దేశంపై దండెత్తి రావాలనుకున్నప్పుడు మగధ సామ్రాజ్యం యొక్క సైనిక బలం గురించి వారి సాహసాల గురించి తెలుసుకొని దాడి చేయాలనుకున్న తన ప్రయత్నాన్ని విడిచిపెట్టి సుభిక్షమైన మగధ రాజ్యాన్ని వారి పాలనను ప్రత్యక్షంగా చూడటానికి సామాన్యుడిలా

తిరిగాడని చరిత్రలో చెప్పబడింది. మగధ పాలనలో బహుజనులు సుఖసంతోషాలతో ఉన్నారు.

సామ్రాట్ అశోకుడు మనందరికీ తెలుసుకదా! అంతెందుకు మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో మహానీయుడు పెరియార్ రామసామి వారసత్వాన్ని కొన సాగిస్తూ బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిరసిస్తూ ప్రజా రంజకంగా పాలించిన కరుణానిధి కూడా మంగలి. అయితే బ్రాహ్మణాధిపత్యానికి చోటివ్వని మగధ రాజ్య పాలన గురించి బ్రాహ్మణులు ఎక్కడా చెప్పలేదు. రాయలేదు. బ్రాహ్మణులకు పదవులను కట్టబెట్టి వారికి విరివిగా దానధర్మాలు చేసిన రాజుల గురించి పుంఖాను పుంఖాలుగా వ్రాసి అదే చరిత్రగా మన ముందుంచారు. ముందు నుండీ అగ్రకుల రాజకీయాధిపత్యాన్ని నిరసిస్తూ క్షౌరం చేయడం మాత్రమే కాదు రాజ్యం కూడా ఏలడం వచ్చు అని నిరూపించిన పరిపాలనా దక్షులు మంగల్లు. అయితే ఇది చరిత్ర. రాజకీయాలను అర్థం చేసుకోవడం, అనుభవాలుగా ప్రజలతో పంచుకోవడం మొదట నుండి మంగలి రక్తంలో ఉందని ఈ కథల్లో మనకు కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

"ఉద్యమాల యుగం మనది - ఉద్యమిస్తె జయం మనది" అన్నది ఒక నినాదం. నిజమే యిది అస్థిత్వ ఉ ద్యమాల యుగం. మేమెవరం అని తెలుసుకోవాలనే సోయి జనాల్లో కలిగింది. ముఖ్యంగా స్వాతంత్ర్యా నంతరం రాజ్యాంగం ద్వారా కల్గిన హక్కుల వల్ల కింది కులాల ప్రజలు తమ జీవితాల్లో కొంత స్వేచ్ఛని పొందారు. విద్య అన్ని కులాల ప్రజలను చైతన్యవంతులను చేసింది. ఆ చైతన్యమే మేమెవరం అనే భావన కల్గడానికి కారణమైంది. సమాధానాల కోసం వెతుకుతూ పోతున్న కొద్దీ మేము కుమ్మరి, కమ్మరి, చాకలి, మంగలి, గౌడ, పద్మశాలి, యాదవ, ముదిరాజు అంటు ఇట్లా అనేక కులాలుగా చీలిపోయిన సమాజాన్ని మన కండ్ల ముందుంచింది. అప్పటి వరకు ఉన్న మనదంతా ఒకే జాతి అనే భావనాపూరిత మంచు పొరలు కరిగిపోయాయి. మనదంతా ఒకే జాతి (భారతీయత), మన దంతా ఒకే (హిందూ) మతం అయినప్పుడు మరి కులాల నడుమ ఎక్కువ తక్కువ అనే తేడాలెందుకు? అగ్రకులాల వారి చేతుల్లో అధికారం, హోదా, సంపద ఉంటే, కింది కులాల వారి జీవితాల నిండా అవమానాలు, అవ హేళనలు, పీడనలు ఎందుకు నిండివున్నాయి అన్న ఎరుకలోంచే ఎవరికి వారుగా తమ తమ స్వంత కుల అస్థిత్వంలోకి తొంగి చూసుకోవడం మొదలుపెట్టారు. ఈ దేశంలో శ్రామిక కులాలుగా, చాకిరి కులాలుగా ముద్ర వేయబడి తమ శ్రమకు కనీస గుర్తింపు కూడా లేకుండా పోయిన బీసీలు ఆవేదన, కష్టాలు కన్నీళ్ళతో నిండిన తమ బ్రతుకుల్ని అంచనా వేయడం షురూ చేసిండ్లు. ఆ స్నేహ మంగలి వారూ అందుకున్నరు అట్లాంటి సోయిలోంచి వచ్చిన కథాసంకలనమే "అడపం" వృత్తికథలు".

మంగలి బతుకుల్ని ముంచెత్తిన కన్నీటి సునామీలు, వెంటాడే అవమానాలు, ప్రశ్నించినందుకు పగబట్టి కాటేసిన అగ్రకుల కాటిన్యం, కొండంత చాకిరీ చేసినా కడుపు నిండని ఆకలి పేగుల అరుపులు, వెలివేతలు, ఆవేశాలు, తిరుగుబాట్లు, మోసాలకు గురైన మంగలి బతుకులు ఈ కథల నిండా మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా కథలు రాసిన రచయితలు మంగలి వృత్తిని మంగలి జీవితాలను వారి వారి సొంత అస్తిత్వ స్నేహ నుండే వ్యక్తీకరించడానికి చేసిన ప్రయత్నం వల్ల కథలు చదువుతున్నప్పుడు కథల్లోకి కథల్లోని పాత్రల్లోకి మనకు తెలియకుండానే పరకాయ ప్రవేశం చేస్తాము. పాఠకునికి ఎలాంటి ఆటంకం లేకుండా చదువుతున్న కొద్దీ సులువుగా కథలు అలా తేటగా పారుతున్న సెలయేరులాగా వెల్లి పోతుంటాయి. ఊహలు, కల్పనలకు తావివ్వని కథలు. తమ బతుకుల్ని నిండా ముంచిన దొరగురించి తెలిసి కూడా మైల ఆలోచనలను దరికి రానియ్యకుంట దొర బిడ్డలకు దొరసానమ్మలకు పురుడు పోసిన పవిత్రాత్మ కల్గిన మంత్రసాని కథలివి.

కథ సమాజం యొక్క అద్దం అనుకోవచ్చు మనం.

ఎందుకంటే ఆయా సమాజాల్లో ఆయా కాలాల్లో జరిగిన సంఘటనల రూపంలో కదులుతూ మనకు అప్పటి సమాజపు స్థితిగతుల్ని ఎరుకపరుస్తాయి. చరిత్రను రికార్డ్ చేస్తాయి. ఈ కథా సంకలనం 2016లో వెలువడింది. కానీ ఇందులోని కథలు కథా సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినవి ఏమాత్రం కావు. హెన్‌రీ ఆధారంగా తెలుగులో అనువదించిన కథ 'మంగలి చెప్పిన కథ' ను మినహాయిస్తే 1956 నుండి 2016 వరకు వివిధ సందర్భాల్లో ఆయా రచయితలు రాసుకున్నవే అవడం గమనార్హం. అంటే దాదాపు 60 సంవత్సరాల అంటే సుమారు మూడు తరాల మంగలి జీవితాలు ఈ కథాసంకలనంలో మనకు కనిపిస్తాయి. కాలం మారినా మారని తమ జీవిత సంఘర్షణల గురించి మనముందు వలపోసుకుంటాయి.

సంపద, హోదా, అధికారం ఎక్కడ ఉంటాయో అక్కడ తిష్ట వేస్తాయి అగ్రకులాలు. ఊరిమీద పెత్తనం చెలాయిస్తూ బీసీ కులాలను అణగదొక్కుతూ తమ అధికారాన్ని చాటుకున్న భూస్వామ్య వారసత్వం ప్రపంచీకరణ వల్ల విద్య, ఉపాధి, వైద్యం, పారిశ్రామిక, సైన్స్ ఇట్లా అన్ని రంగాల్లో వచ్చిన మార్పులను త్వరితంగా గ్రహించి అందులోకి చేరిపోయింది. వాటి ప్రయోజనాలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ లాభాలను గడించడం మొదలు పెట్టింది. అయితే సునామీలాగా వచ్చి పడిన ఈ మార్పును పసిగట్టలేక వృత్తుల్ని కోల్పోయి క్షోభను అనుభవించింది ఇక్కడి బీసీ సమాజం. ఒకరి మీద ఒకరు ఆధారపడి బ్రతుకున్న వృత్తులు ఎవరికి వారే ఒంటరై పోయి దిక్కు లేని పరిస్థితుల్లోకి నెట్టబడింది. కరువులోకి, ఆకలి చావుల్లో ఇప్పటికీ కొట్టుమిట్టాడుతూనే ఉంది. అప్పటి వరకు తాము అనుభవించిన దారిద్ర్యం, నిరక్షరాస్యత, సంపద లేని తనం అగ్రకులాల వారిలాగా వచ్చిన మార్పులకనుగునంగా తమను తాము మార్చుకోవడానికి కావాల్సినంత సమయం, పరిస్థితుల్ని కిందికులాల్లో కల్పించలేక పోయాయని కూడా మనం చెప్పుకోవచ్చు. ఇట్లాంటి పరిస్థితులు ఈ కథా సంకలనంలోని కథల్లో మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

పాలకుల సంస్కృతే ప్రజల సంస్కృతిగా వెలుగొందుతున్న దేశంలో నిజమైన ప్రజల సంస్కృతి నీచమైన సంస్కృతిగా చూడబడుతుంది. ప్రజలు జరుపుకొనే క్రతువులు మూఢనమ్మకాలుగా అశాస్త్రీయమైనవిగా ప్రచారం పొందుతాయి. వాటి స్థానంలో మైనార్టీ ప్రజలైన పాలకుల భాష, వారి ఆహార్యం, వారి పండుగలు, వారి దేవుళ్లు, వారి రాజకీయాలు వచ్చి చేరుతాయి. బీసీలైన మెజార్టీ ప్రజల్లోని విద్యావంతులైన వారు క్రమంగా వారి పూర్వీకుల సంస్కృతిని కాదని పాలకుల సంస్కృతిని అనుసరించడం మొదలుపెడతారు. మెజార్టీ ప్రజలైన బీసీల్లో ఈ రకమైన అనుసరణా వాదం మనకు కనిపిస్తుంది. అందుకు మంగలి కులం కూడా మినహాయింపేమీ కాదు. వరుసగా ఈ కథల్లోని మనుషులు వారి ఆలోచనల్లో వచ్చిన మార్పు మనకు కొట్టొచ్చినట్టు కనబడుతుంది. విద్యాధికులైన తరం తమ సుఖాన్ని, విలాసాన్ని వెతుక్కుంటూ పట్టణాలకు వెళ్లిపోగా ఒంటరిగా నిస్సహాయులుగా మిగిలినా బిడ్డల్ని నిందించని తల్లిదండ్రుల గుండెగోస ఈ కథల నిండా పరుచుకున్నది.

"కాలేజీలో చేరిన తర్వాత బి.ఇ.లో చేరిన తర్వాత మరీ ఎక్కువగా వినోద్‌లో మార్పొచ్చింది. 'వీనవ్వా' అంటు ఆప్యాయంగా పిలిస్తే అది మోటుగా భావించి చీదరించుకునేవాడు. ఉన్నవాళ్లతో స్నేహాలు పెరిగాయి తన కులం వాళ్లతో మాట్లాడటానికి వెనుకాడేవాడు. దొరలు పటేండ్ల పిల్లలతో స్నేహం పెరిగింది".

"అతనికి గుడిసెలోని దుర్భర దారిద్ర్యం అసహ్యంగా అగుపడుతుంది. క్షవరాలు, కాన్పులు, కూలి పనులు చేస్తూ బ్రతికే తల్లిదండ్రులు మురికిగా అగుపిస్తున్నారతనికి'....

'తాను కష్టపడి చదివించిన కొడుకు పైకొచ్చాడు. తనకంతే చాలు. తనకతడేమీ పనికి రాకున్నా చదివించినందుకు పశ్చాత్తాప పడటం లేదు గౌరయ్య. కొడుకు సుఖంగా ఉంటే తన కడుపు నిండినట్టే అనుకున్నాడు.' (అడ్డాలనాడు-కాలువ మల్లయ్య)

''తరం మారుతున్న కొద్దీ ఆలోచనలు కూడా మారుతాయంటారు మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు.''

ఒక తరం వెట్టిచాకిరి నుండి బైటపడితే చాలను కున్నది. మరొక తరం పని చేస్తూనే తిట్లు అవమానాల నుండి బైటపడాలనుకున్నది. ఊరే మనకు జైలు మన కష్టం పిల్లలు పడొద్దు అనుకున్నది యింకో తరం, చదువుతోనే తమ బతుకులకు విముక్తి అని ఒక తరం అనుకొని రెక్కలు ముక్కలు చేసి అవమానాలు పడి సంపాదించిన భూమిని కూడా అమ్మి మరొక తరాన్ని చదివించింది.

అయితే ఏ కులవృత్తిలో పడి చదువును జ్ఞానాన్ని పొందకుండా అజ్ఞానులుగా మిగిలిపోతున్నారోనని రక్తాన్ని చెమటను ధారపోస్తే ఆ రక్తం చెమట పునాదిగా చదువుకుని ఇంత జ్ఞానాన్ని పొందిన వ్యక్తులు ఆ కులం వాసనే అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తుండడం...తనలాగా మిగతావారిని జ్ఞాన వెలుగుల్లోకి తీసుకుపోవడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయకపోవడం...అసలు ఒక స్థాయిలో ఆ కులాన్ని ఆ కుల సంస్కృతిని ఆ మట్టి మనుషులను అన్యహించుకునే దళిత బహుజన భావదారిద్ర్యపు వ్యక్తులను పట్టించే గొప్ప కథ 'అడ్డాలనాడు' . ఇలాంటి వ్యక్తులను ఉద్దేశించే కదా బాబాసాహెబ్ అన్నది 'పే బ్యాక్ టు సొసైటీ' అన్నది.

కింది కులాల ప్రతిభను హేళన చేయడం, అది ప్రతిభే కాదనడం అగ్రకులాలకు అనవాయితీగా వస్తున్నది. అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో కింది కులాలు కొంత ప్రశ్నించడం నేర్చుకున్నాయి. మా చాకిరి లేకుండా నీ జీవనం సాగదని నిలదీయడం షురూ చేసిన తరువాత పరిస్థితులు కొంత మారాయి, ఆ సందర్భంలోంచే అస్తిత్వ స్పృహ పెరిగింది అందులోంచే అస్థిత్వ సాహిత్యం వెలువ డుతున్నది. మా వృత్తి మా సంస్కృతి ఎవరి కంటే తక్కువ కాదు అనే చైతన్యం అందుకున్నవి కింది కులాలు. అయితే అస్తిత్వ ఉద్యమాలు మాత్రమే మనల్ని ఈ బానిస వ్యవస్థ నుండి విముక్తి చేయలేవు. రాజ్యాధికార కాంక్షను ప్రేరేపించకుండా మన వాళ్లని మనం రాజకీయ పోరాటాల వైపు నడిపించలేం. రాజకీయ పోరాటాలు మాత్రమే మన జీవితాల్ని బాగు చేయగలవు. రాజకీయ వాటాలో మనకు దక్కాల్సిన భాగం దక్కినప్పుడే మన ప్రజలు బాగు పడతారు. మన కింది కులము కూడా బాధిత కులమే అనే స్పృహను కలిగివుండాలి. అప్పుడే బాధిత సమూహ మంతా ఒక్కటై నడిస్తే బాగుపడే రోజులు తొందరలోనే వస్తాయి. అలా రాజకీయ జ్ఞాన స్థాయిని పెంచుకోవాలంటే ముందు మన అస్తిత్వాన్ని సాహిత్యపరంగా సాంస్కృతి పరంగా మనమేంటో ముందు మనం తెలుసుకోవాలి. ఆ ప్రయత్నమే 'అడపం-వృత్తి కథలు'.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"రాయలసీమ సంస్కృతి – ఒక పరిశీలన"

– డా॥. డి. సతీదేవుడు, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (ఎ), అనంతపురము.

సంస్కృతి పరిచయం :

సంస్కృతి ఒక ప్రాంతం యొక్క విశిష్ట అంశాలకు ప్రతిబింబం. ఆ ప్రాంత ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సాంప్రదాయాలు, నమ్మకాలు అనేకం మిళితమై ఉంటాయి. ఆ ప్రాంతంలోని వ్యక్తుల యొక్క బాహ్యాంతర స్వరూపాల ప్రతిబింబమే ఆ సమాజ సంస్కృతి స్వరూపంగా వర్ణించవచ్చు. ఒక వ్యక్తి యొక్క కరచరణ ముఖ నేత్రాదులైన భౌతిక అవయవాలతో పాటు అంతర్లీనంగా ఉన్న జీవకళా చైతన్య ధిషణా లావణ్యాల ప్రతిఫలనమే ఆ వ్యక్తి సంస్కృతి రూపం అవుతుంది. అదే విధంగా ఒక ప్రాంతం, ఒక జాతికి సంబంధించిన రాజకీయ ఆర్థిక, సాంఘిక, విద్యా కళా సర్వస్వం యొక్క భౌతిక అంతరంగిక రూపాలు ఆ జాతి సంస్కృతి అని అనవచ్చు.

సహజంగా పూర్వీకుల నుండి సంప్రదాయాలు, ఆచారాలు రూపంలో సిద్ధించే ఈ సంస్కృతి నిరంతరం సాగిపోతున్న జాతి యొక్క జీవన స్రవంతి ప్రవాహంలా ఉంటుంది. ఆయా రుతువులలో, కాలాల్లో పడిన వర్షాల వల్ల పరివాహక ప్రాంతాలందలి మట్టి యొక్క రుచి, రంగు మూల ప్రవాహంలో విలీనం అయినట్టే జాతి యొక్క చైతన్య స్రవంతి రూపంగా ఉన్న సంస్కృతి స్వరూపం కూడా కొత్తకొత్త జాతుల సంపర్కం వల్ల కొత్త కొత్త విద్యా నాగరికతల వల్ల కలిగే నూతనత్వాన్ని అంతర్లీనం చేసుకొని కొత్త బలాన్ని పుంజుకొని మూలరూపానికి భిన్నం, కానీ తీరులో సాగుతూ ఉంటుంది. ఎన్ని కొత్త కొత్త భిన్న సంస్కృతుల ప్రభావం వచ్చిపడినా మూలరూపం మార్పు పొందనప్పుడే ఆ జాతికి ప్రత్యేక సంస్కృతి ఉందనవచ్చు. పాత పద్ధతిననుసరించి నలుగుపిండి వాడిగాని, నవీన పద్ధతులు అనుసరించి సబ్బులు వాడిగాని శరీరోగ్యాన్ని వ్యక్తి పరిరక్షించుకుంటున్నట్లే స్వీయ జాతి యొక్క సంస్కృతి మూలరూపాన్ని కూడా పరిరక్షించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

తెలుగు సంస్కృతి :

రంగు రుచీ వాసనా లేనిది పరిశుద్ధజలం. సంస్కృతి కూడా అటువంటి స్వచ్ఛరూపం గలది. ఆయా నేలల మట్టితత్వాన్ని, ఇతర బాహ్య ప్రభావాలను బట్టి, నీటి యొక్క రంగు, రుచి వాసనల్లో తేడా ఉన్నట్లే ఆయా ప్రాంతాల జాతుల సంస్కృతులలో కూడా కొన్ని ప్రత్యేకత లుంటాయి. తెలుగుజాతికి ప్రత్యేకమైన సంస్కృతి సంపద ఉన్నది. అది దక్షిణాత్యమైనది. అసలు 'తెన్' అంటేనే దక్షిణం. 'తెన్' నుండి తెలుగు వచ్చింది. ద్రావిడ భాషలలో తెలుగు భాష ఒకటి. దక్షిణాది భారతదేశం వారు ద్రావిడ భాషలలో మాట్లాడుతారు. ద్రావిడ భాష అయిన తెలుగు భాషపై వర్ణధర్మంతో పాటు సంస్కృత భాష ప్రభావం, బౌద్ధ జైన ధర్మాలతో పాటు ప్రాకృత ప్రభావం వచ్చిపడింది. భాషలో పరిణామం వచ్చింది. అయినా మూలరూపాన్ని విడవలేదు. సంబంధ బోధకాలు, మూలక్రియలు సర్వనామ సంఖ్యావాచకాలు మొదలైన పదాలు సంస్కృత, ప్రాకృతాలకు భిన్నంగా ఉంటున్నాయి. వాక్య నిర్మాణం కూడా ప్రాకృత, సంస్కృత భాషలకు భిన్నమైనవే. కాని అనేక సంస్కృత పదాలను తనలో ఇముడ్చుకొని తెలుగు సంస్కృత ప్రాకృత జన్యమా అని అనుమానించే విధంగా మారింది. అంతేకాని తన వ్యక్తిత్వాన్ని విడువలేదు. మూల ప్రకృతిని వదలలేదు. ఈ విధంగా బాషారూప సంస్కృతిని తెలుగు నిలుపు కొన్నది.

ఆహారం, భాష, వేషం, లిపి, కళా స్వరూపాలు, నాగరికత, చరిత్ర ఆచార సంప్రదాయాలు మొదలైనవి

జాతి సంస్కృతి యొక్క బాహ్య స్వరూపాలు. ఆలోచనా రీతి, నైతిక భావన, విద్య దుఃఖానందాల ప్రదర్శనా, క్షమ, దయ, శౌర్య ధైర్యాధి గుణ ప్రదర్శనా మొదలైనవి దాని యొక్క అంతర రూపాలు.

మానవ జాతిది అంతా ఒకే సంస్క్ృతి అనవచ్చు. అయినా భౌగోళిక స్థితులు అనుసరించి, ఆహారాది కాలననుసరించే చిన్నచిన్న భేదాలు కనిపిస్తూ ఉంటాయి.

ఒక ప్రాంతానికి చెందిన జాతికి ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆహారం, భాష, వస్త్రధారణ, అలంకరణ, వివాహాది సంస్కారాలు, ఆచార వ్యవహారాలు, ఇవన్నీ అన్ని ప్రాంతాలలోని జాతులకు సూక్ష్మంగా సామాన్యమే అయినా, స్థూలంగా భిన్నత్వాన్ని కలిగి ఉంటున్నాయి. జాతి యొక్క సంస్కార పరిణామారూపమే సంస్కృతి అయినప్పటికీ, ఇది కాలగమనాన్ని, ప్రాంతాల దూరాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఈ మార్పు బాహ్యమూ, దాన్ని అనుసరించి అంతరం కూడా అవుతుంది. ప్రాంతీయ భేదాలు సరేసరి. ఒకే ప్రాంతంలోని ఒకే జాతి యొక్క సంస్క్ృతి భిన్నకాలాల్లో భిన్నభిన్న రూపాలు పొంది ఉండటం విజ్ఞులకంతా తెలిసిన విషయం. దీనికి భారతదేశమే ప్రబలమైన ఉదాహరణ.

రాయలసీమ సంస్కృతి :

భారతదేశానికంతా స్థూలంగా ఒకే సంస్కృతి ఉన్నప్పటికి సూక్ష్మంగా పరిశీలిస్తే ప్రాంతాలననుసరించి భేదాలు లేకపోలేదు. ఆంధ్రప్రదేశంలోని రాయలసీమ ప్రాంత సంస్క్ృతిలో కూడా కొంత భేదం కనిపిస్తుంది. అంతరంగిక కారణాలకంటే బాహ్యకారణాలపై ఆధార పడినది.

ఆహారం తీసుకొందాం... రాయలసీమ చాలాభాగం వర్షచ్ఛాయా ప్రదేశం. పంటలన్నీ మెట్టపంటలే. ప్రత్తి, వేరుశెనగ, జొన్న, రాగి, ఆరుక మొదలైన పంటలు అధికం. ఉత్తర హిందూదేశంలో మాదిరిగా గోధుమ ఆహారం నిత్య భోజనం కాదు ఇక్కడ.

రాయలకాలంలో ఆరుక పంట ఎక్కువగా ఉన్నట్లు అయన ఆముక్తమాల్యదలో చేసిన వర్ణనల వల్ల తెలుస్తుంది. ఆరికల్లో కూడా కుట్టారికలు రుచి అయిన ధాన్యం.

వర్షపాతం తక్కువగా ఉండేచోట దున్ని చల్లితే వర్షాధారం వల్ల మాత్రమే పండే పంట.

వర్షాకాలంలో రెడ్ల (కాపుల) ఆహారాన్ని వర్ణిస్తూ...

"గురుగుంజెంచలి తుమ్మిలేదగిరి సాకున్ తింత్రిణి పల్లవో
త్కరముంకూడ పొరంటి నూనియలతో కట్టావి కుట్టారికో
గిరిముల్ మెక్కి కొముల్ పొలము - వోగ్రేవుల్ మెయిన్నాకమే
కెరువుంగుంపటి మంచమెక్కిరి ప్రభుత్వై కాప్తి రెడ్లజ్జడిన్"

అన్నారు రాయలవారు. అంటే, గురుగాకు, చెంచలాకు, తుమ్మి ఆకు, లేత తగిరిస ఆకు, చింత చిగురుతో కలిపి, నూనెతో పొరటి, వేడిగావుండే కుట్టారుక (కుఱు + ఆరుక) అన్నములో కలుపుకొని మెక్కి, కొడుకులందరూ పొలాలకు పోగా మేక ఎరువు కుంపటిని మంచం క్రింద పెట్టుకొని ఆవుదూడలు శరీరాన్ని నాకుతూ ఉండగా ప్రభువుల్లాగా రెడ్లు ఆ జడివాన కాలంలో మంచంపై కూర్చున్నారు అని భావం. ఈ ఆరుక భోజనం రాయలసీమ పడమటి ప్రాంతంలో అప్పుడు ఆహారం వరి అన్నానికి బదులు. ఇప్పటికి కూడా రాగి చంకటి వాడుక ఎక్కువ. ఆ ప్రాంతంలో కడప జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో వరి పండని రోజుల్లో పండగపబ్బాలకు మాత్రం వరి అన్నం చేసుకున్నప్పుడు దానిని స్వామి బువ్వ అని పిలిచేవారు. ఇప్పుడు అక్కడ కూడా వరి పండించుకుంటున్నారు. రవాణా సౌకర్యాలు పెరిగి ఇతర ప్రాంతాల నుండి బియ్యం సరఫరా అవుతున్నాయి. పాత కాలపు పెట్టకుంటల భోజనం తగ్గింది.

పై పద్యంలో రెడ్లను రాయలవారు హేళన చేవారు అనీ, వారి భోజనాన్ని వెక్కిరించారనీ కొందరు సాహితీ పరులు అన్నారు. వారికి రాయలవారి మనస్తత్వమూ, ఆ ప్రాంతపు సాంఘిక మర్యాదలు తెలియక అట్లా అన్నారు. తన యేలుబడిలో ఉన్న రైతులను, రాయలవారు ఎగతాళి చేస్తారా? వాళ్ళ లేమిని ఎగతాళి చేస్తే తన పరిపాలనను ఎగతాళి చేసినట్లు కాదా? అది కాదు అసలు విషయం. రాయలసీమలోని ఆ ప్రాంతపు కాపులలో (రెడ్లలో) చాలా భాగం శాకాహారులు. వాళ్ళు తమ పేర్లప్రక్క రెడ్డి అనీ, గౌడ్ అనీ పెట్టుకుంటారు. శైవ సంప్రదాయం వారు. మిగతా ప్రాంతాలలోని రెడ్లు (కాపులు) మాంసాహారులు. రాజుల యొక్క వైభవోపేత ఆహారాన్ని అంతకు ముందే వర్ణించిన రాయలు ఈ శాకాహారాన్ని వర్ణించినప్పుడు, మాంసాహారులైన రెడ్లను పాపం శాకాహారం, అందులో ఊరికే దొరికే ఆకులలములు తిన్నట్లుగా హేళన చేశారని భ్రమపడడం జరిగింది అంతే.

ఇక వేషం విషయం తీసుకుంటే, అందులో కూడా ప్రత్యేకత అట్టే కనిపించదు. ఇది విద్యా నాగరికతలను బట్టీ, ఐశ్వర్య - దారిద్ర్యాల బట్టీ మారుతూ ఉంటుంది. అంతేగాని పంచెకట్టూ జుబ్బాలు ఆంధ్ర జాతికంతా మామూలే. కాని ఔత్తరాహులలో మాత్రం మన వేషం భిన్నత్వాన్ని భజిస్తుంది. రాయలు మొదలయిన మన కవులు వర్ణించిన తీరులు ఆనాటి వారి చల్లనాలు, దట్టీలు బీదల్లో, అనాగరికుల్లో ఇప్పటికీ రాయలసీమ ప్రాంతంలో కనిపిస్తాయి.

ఆచార సంప్రదాయాల్లో కూడా రాయలసీమలో కొంత భిన్నత్వం కనిపిస్తుంది. ఇది కూడా కులాలబ్ధి భిన్న రూపాల్లో కనిపిస్తుంది. ఒకే తాలూకాలో కాదు, ఒకే గ్రామంలో కూడా కులాలను బట్టి ఈ ఆచార సంప్రదాయాలు భిన్నంగా కనిపిస్తాయి. వివాహాది సంస్కారాలూ, పండుగలూ, ప్రేత సంస్కారాలూ, దినాలూ, తద్దినాలూ, పూజా పుస్కారాలూ అన్నిట్లో కూడా కులాల బట్టి తేడాలు కనిపిస్తాయి. అవిద్య, అనాగరికత అధికంగా ఉన్న రాయలసీమలో ఈ తేడాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి.

రాయలసీమ విషయంలో చెప్పుకోదగ్గ సంస్కృతి భేదం ఒకటి ఉన్నది. అది దేవాలయాల నిర్మాణము. రాయల వారి కాలములోనూ, అంతకు ముందూ తర్వాత కూడా అనేక దేవాలయాలు ఇందుకు తార్కాణాలు. గొప్ప గొప్ప విగ్రహాలూ, అనేక వందల స్తంభాలు గల మంటపాలూ, ఆనాటి నిర్మాణాల్లోని ప్రత్యేకతలు. రాయలసీమ ప్రాంతమంతా అనేక దేవాలయాలు వెలిసినది విజయ నగర రాజులకాలంలోనే. ఒకే రాతి స్తంభంలో "స రి గ మ ప ద ని స" స్వరాలు పలికించడం ఆ దేవాలయాలను నిర్మించిన శిల్పుల ప్రతిభకు ప్రబలోదాహరణం.

సంగీతంలో శాస్త్ర గ్రంథాలు వెలువడడమూ, క్రొత్త రకం వీణల సృష్టి జరగడమూ కూడా రాయలసీమ సంస్కృతిలోని ప్రత్యేకత.

ముగింపు :

కవిత్వంలో కూడా విలక్షణోపేతమైన ప్రబంధ సృష్టికీ, ప్రబంధ శైలికీ కూడా రాయలసీమ జనయిత్రి. ఎన్ని చెప్పినప్పటికీ సమాహార రూపములో సంస్కృతి అన్నది ఒక్కటే; అదే మానవ సంస్కృతి. భిన్న భిన్న ప్రాంతాలలో భిన్న భిన్న కాలాలలో అది కొంత మార్పు చెందుతూ ఉన్నట్లు కనిపిస్తుంది. అది భాష, వేషము, ఆహారమూ, దేవాలయాలూ, ఆచార సంప్రదాయాల్లో వ్యక్తమవుతూ ఉంటుంది. అట్లాంటిదే రాయలసీమ సంస్కృతి స్వరూపం.

'ఏ తపస్వి జీవించెనో యి మనోజ్ఞ
సీమ, పూజ్యమౌ రాయలసీమలోన
నాటి ఋషి వాటికల శోభనందపరచు
ప్రకృతి మాధుర్యమొలుకు మాపల్లెలిచోలు'

అని కీర్తించిన బెళ్ళూరి శ్రీనివాసమూర్తి మాటలు రాయలసీమ సంస్కృతికి నిదర్శనమని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1) ఆంధ్రుల చరిత్ర సంస్కృతి : ఖండవల్లి లక్ష్మీకాంతం - బాలెందు శేఖరం
2) ఆంధ్రుల చరిత్ర - బి.యస్.యల్. హనుమంతరావు
3) అనంతదర్శిని - డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
4) ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి
5) తెలుగు చరిత్ర, సంస్కృతి - తెలుగు అకాడమి
6) తెలుగు సంస్కృతి - తెలుగు భాషాసమితి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాలిపోయిన దళిత వేగు చుక్క

– డా॥. గైని రఘు, కవి, రచయిత నిజామాబాద్.

దళిత సాహిత్యం పేరు వినగానే ఆచార్య ఎండ్లూరి సుధాకర్ పేరు తెలియని వాళ్లు ఉండరు.అంతటి పేరు, గుర్తింపును తనసొంతం చేసుకున్న కవి ఎండ్లూరి సుధాకర్. ఆయన జనవరి 21, 1959 లో నిజామాబాద్ జిల్లాలోని పాముల బస్తిలో దేవయ్య, శాంతా బాయిలకు జన్మించారు. హైదరాబాద్ వీధి బడిలో ప్రారంభమైన చదువు విశ్వవిద్యాలయం వరకు హైదరా బాద్ లోనే సాగింది. నల్లకుంట ప్రాచ్య కళాశాలలో ఓరియంటల్ విద్య, ఉస్మానియా విశ్వవిద్యా లయంలో ఎం.ఏ. ఎం.ఫిల్, పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వ విద్యాలయం లో పిహెచ్.డి చేసారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించి విశ్వవిద్యా లయ ఆచార్య స్థాయికి చేరు కున్నారు. 1985 నుంచి 1990 వరకు సికింద్రాబాద్ లోని వెస్లీ బాయ్స్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ గా ఉద్యోగం చేసారు.1990 అక్టోబరు 6 వ తేది నుంచి నేటి వరకు వివిధ పదవుల్ని నిర్వహిస్తు న్నారు. 2004 సం.నుంచి 2011 సం.వరకు తెలుగు విశ్వ విద్యాలయం ప్రచు రించే 'వాఙ్మయి' సాహిత్య పత్రికకి సహాయ సంపాదకుడిగా, సంపాదకుడిగా వ్యవహరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసోసి యేట్ ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ గా ఆధునిక శాఖాధిపతిగా, (1994 నుంచి 2012 వరకు) పదవుల్ని నిర్వహించారు. 2009, సెప్టెంబరు 5వ తేదీ నుంచి రాజమండ్రి సాహిత్య పీఠానికి ఆచార్యులుగా, డీన్ గా బాధ్యతలు నిర్వహించాడు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గా పని చేశారు.జూలై 2002లో అమెరికా తెలుగు అసోసియేషన్‌లో జరిగిన పలు సాహిత్య సభల్లో ప్రసం గించారు. 2011, డిసెంబర్ 8,9,10 తేదీలలో మారిషస్ లో ప్రపంచ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. మే 2017లో అమెరికాలోని న్యూజెర్సీ సిటీలో సిలికాన్ ఆంధ్రా ద్వారా మనబడి కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు.

తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్ర వేసుకున్న ఎండ్లూరి సుధాకర్ "వర్తమానం, కొత్త గబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్ణీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల, వంటి రచనలు చేసి, తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసుకున్నారు. నిష్కల్మషమైన వ్యక్తిత్వం, ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండటం ఆయన లక్షణాలు. గుర్రం జాషువా అందించిన దళిత స్ఫూర్తిని నేటి వరకూ కొనసాగించిన అసలైన దళిత వారసుడు దళిత సాహితీ రథసారథి ఎండ్లూరి సుధాకర్ అని నిర్మొహమాటంగా చెప్పవచ్చు.యల మంచిలి, ఫ్రీవర్స్ ఫ్రంట్, ఉదయ భారతి జాతీయ అవార్డు, భువనే శ్వర్,నల్గొండ తిలక్ అవార్డు, కవికోకిల జాషువా, లలిత కళా పరిషత్ పురస్కారం, బెంగళూరు, సమతా రచయితల పురస్కారం అమలా పురం, రాజ మండ్రి ప్రతిభాపురస్కార్, రాజ మండ్రి, జాసిస్ అవార్డు, గరిక పాటి సాహిత్య పురస్కారం కాకినాడ, రాజ మండ్రి, మ్యాన్ ఆఫ్ ది ఇయర్, రాజమండ్రి, బి.ఎస్. రాములు కథా పురస్కారం, ఎన్.జి. రంగాసెంటరీ అవార్డు, డెట్రాయిట్ తెలుగు అసో సియేషన్ సిల్వర్ జూబ్లీ అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారం,అమెరికా తెలుగు అసోసియేషన్ ఆటా, డల్లాస్, నేదురుమల్లి జనార్ధన రెడ్డి ట్రస్ట్ ప్రకాశం, నెల్లూరు, సహృ దయ సాహితీ పురస్కారం, తపన ఫౌండేషన్ అవార్డు రాజమండ్రి,వరంగ ల్, కొండెపూడి శ్రీనివాసరావు కవితా పురస్కారం, గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ అధికారభాషా సంఘ పుర స్కారం, సినారె పురస్కారం కరీంనగర్ ,యువకళా వాహిని ద్వారా డాక్టర్ జి.ఎన్.రెడ్డి మెమోరియల్ అవార్డు,

ఆంధ్రప్రదేశ్ ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారం, గాడే పల్లి కుక్కుటేశ్వరరావు స్మారక పురస్కా రం, పిఠా పురం, ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ ద్వారా ఎన్టీఆర్ ప్రతిభా పుర స్కారం, కవి జాషువా సాహిత్య ఆం.ప్ర. ప్రభుత్వ అవార్డు, రాజహంస కృష్ణ శాస్త్రి కవితా పురస్కారం, అరుణ్ సాగర్ ట్రస్ట్ ద్వారా కవి అరుణ్ సాగర్ మెమోరియల్ అవార్డు, అద్దంకి, ప్రతిభా వంతులైన విశ్వవిద్యాలయ ఉపా ధ్యాయులకు రాష్ట్ర అవార్డు మొదలయిన అవార్డులు ఎన్నోఅందుకున్నారు. 28 జనవరి 2022 ఉదయం హైదరాబాద్ లో తుది శ్వాస విడిచారు.

తెలుగు సాహిత్యంలో దళిత ఆవేదనను, ఆవేశాన్ని కవిత్వం ద్వారా ప్రశ్నించిన ఎండ్లూరి సుధాకర్. దళిత సాహిత్యానికి ఎనలేని సేవ చేసి మౌనంగా ఈ లోకాన్ని వదిలేసి వెళ్లిపోవడంసాహితీలోకానికితీరనిలోటు.తన రచనలతో సమాజం కళ్ళు తెరిపించి సామాజిక న్యాయం కోసం కవిత్వాన్ని ఆయుధంగా మలుచుకున్నారు. ఎన్నో అనుభవాల్ని, ఎన్నో అవమానాల్ని, ఎన్నో వేదనల్ని అనుభ వించి కవిగా ఈ వర్తమాన సమాజంపై చెరగని ముద్ర వేశారు ఎండ్లూరి సుధాకర్.

భారత దేశంలో కులనిర్మూలన కోసం జరిగిన పోరాటాలు, జరుగుతున్న పోరాటాలు ఇంకా విజయం సాధించాల్సి ఉంది. 1990 ప్రాంతంలో దళితవాదం ప్రారంభమైన సమయంలో బిఆర్ ఆంబేడ్కర్ సిద్ధాంతాల్ని అనుసరిస్తూ ఆత్మగౌరవం కోసం, సామాజిక సమానత్వం కోసం కులనిర్మూలన కోసం ఉద్యమ కవిత్వం దేశమంతా నిప్పులా రాజేసుకుంటున్న క్రమంలో ఉ వ్వెత్తున ఎగసి పడిన కవిత్వకెరటం ఎండ్లూరి సుధాకర్. ఈ భూమ్మీద అణగారిన ప్రజలు ఎక్కడ వివక్షకు, అత్యాచారాలకు, ఊచకోతలకు గురైనా సుధాకర్ కలం కత్తిలా దూసుకు పోయింది.

ఎండ్లూరి సుధాకర్ సమాజంలో దళితుల స్థితి ఎలా ఉందో 'నెత్తుటి ప్రశ్న' కవితలో ఇలా ఆవిష్కరించాడు.

"నేనింకా నిషిద్ధ మానవున్నే
నాది బహిష్కృత శ్వాస
నా మొలకు తాటాకుచుట్టి
నన్ను నలుగురిలో
అనహ్య మానవ జంతువుని చేసిన మనువు
నా నల్లని నుదిటి మీద బలవంతంగా
నిషిద్ధ ముద్రవేసినప్పుడే
నా జాతంతా
క్రమక్రమంగా హత్య చేయబడింది
వేదం విన్న నా చెవుల్లో సీసం పోసినప్పుడు అదేదో
భాష మాట్లాడితే నాలుక తెగ్గోసినప్పుడు
నా వీర్యం తీర్చిన దాహానికి నా తల నరికేసినప్పుడు
నన్ను చెట్టుకుకట్టి గొడ్డులా చావగొట్టినప్పుడు
నేనప్పుడే శవమైపోయాను"

అనే పంక్తుల్లో దళితుని ఆవేదన ప్రస్ఫుటుగా వెల్లడించాడు. దళిత వ్యతిరేకుల చేతుల్లో హత్య చేయ బడిన కవి 'శంభూక'ను వస్తువుగా చేసి చాల మంది కవులు పదునైన కవితలు రాశారు.

"శంబుకుడి తలను
నరికిన చేతులు ఏవైనా
ఆయుధం మాత్రం ఒక్కటే
హంతకుల రక్తపు రంగు ఒక్కటే
హత్యావ్యూహాలు ఒక్కటే
ఆధునిక శంబుకుడి నెత్తుటి తల
మళ్ళీ ఈ భూమిలోంచి మొలకెత్తుతుంది
కవి తలకి కపాల మోక్షం వుండదు"

అంటూ ఎండ్లూరి సుధాకర్ "శంబుక శకం" కవితను రాశారు.సంవత్సరాలుగా వెంటాడుతున్న వేదన గురించి ఏ ముసుగూ లేకుండా ఒక నిజం గురించి 'దండోరా' కవితలో ఎండ్లూరి సుధాకర్ ఇలా మాట్లాడుతున్నారు.

"తొడకోసి ఇవ్వడానికి నేను శిబిచక్రవర్తిని కాను
మెడ నరుకుతుంటే తలవొంచే శంబూకుణ్ణి కాను

ఇంత కాలానికి చింత నిప్పుల కళ్ళతో నిలబడ్డ వీరబాహుణ్ణి
రక్తం చిందించడానికైనా సిద్ధపడిన కన్నమనీణ్ణి
కృతజ్ఞత నా రక్త లక్షణం
సమానత్వం నా జాతి తత్త్వం" అంటూ తాతల నాటి సాంస్కృతిక వారసత్వం గురించి తనకు రావల్సిన వాటా గురించి వాదిస్తున్నాడు. తనకు దక్కాల్సిన హక్కుల గురించి లేవదీస్తున్నాడు.

తన తల్లికి బొట్టు లేని కారణంగా ఎవరూ ఏ శుభకార్యానికి కూడా పిలువక, నల్లరంగు అని పెళ్ళిళ్ళకు రాకుండా చేసిన సందర్భాన్ని ఎండ్లూరి సుధాకర్ అభివ్యక్తీకరించిన విధానం అందరిని ఆలోచింపచేసింది. ఎదురింటి మేడమీద అమ్మాయి సమర్తాడితే తన "నల్లతల్లి" కూతురే పెద్దమనిషి అయిందని తాదాత్మ్యం చెందిన విషయాన్ని 'నల్లతల్లి' కవితలో చూపించాడు.

"నీకు గుర్తుందా అమ్మా!
మన ఎదురింటి మేడ మీది అమ్మాయి సమర్తాడితే
నీ కూతురు పెద్దమనిషి అయినంతగా పొంగిపోయ్యావు
కనీసం ఎవరూ మన ఇంటి గడప తొక్కలేదు
అంతటా అసహ్యం మురికి కాల్వలా మొహాల్లో ప్రవహించింది.
బొట్టులేని నీ కాటుకరంగు నుదురు చూస్తే
కుంకుమ భరిణేలు నెత్తురు కక్కుకునేవి
నేను మరిచాననుకున్నావా" అంటారు. ఈ మాటల్ని సంభాషణగా ఎదుటివారితో మాట్లాడుతున్నట్లుగా వ్యక్తీకరించాడు. ఎదురింటి అమ్మాయిని తన కూతురు అనుకుని తాదాత్మ్యం చెందడం మానసికంగా జరిగే రియాక్షన్. దానిని అతి సునయాసంగా మాటల్లో వ్యక్తం చేశారు ఎండ్లూరి సుధాకర్. దళితుల చైతన్యానికి కుదేలయిన అగ్రకుల నాయకత్వం దళితులకు అధికారాన్ని అప్పజెప్పుతుందని 'దళితాయణం' కవితలో ఎండ్లూరి సుధాకర్ పేర్కొన్నారు.

"వజ్రాల తాపడం చేసిన బంగారు గిన్నెలో మట్టి కాళ్ళు
సీతాదేవి శ్రద్ధతో అర్ఘ్యమిస్తోంది.
రాముడు కాళ్ళు కడిగి నెత్తిమీద చల్లుకుని సింహాసనం దాకా నడిపించాడు" అంటారు.

భరత లక్ష్మణులు, శత్రఘ్నుడు వరుసగా వశిష్టుడు కొత్త ద్రావిడ మంత్రాలు చదువుతుంటే.హనుమంతుడు గొంతెత్తి దళితశకం ఆరంభమైందని గట్టిగా ప్రకటిస్తాడు. అప్పుడు శంభూకుడు సింహాసనం మీద నల్లసూర్యుడై వెలుగుతుంటే వాల్మీక తన దళితాయాణాన్ని ప్రారంభించడాని ఎండ్లూరి సుధాకర్ చిత్రించారు.

ఎండ్లూరి నూటికి నూరుపాళ్ళు తాను అనుభవించిన కవిత్వమే రాశాడు. తన బాధ, తన జాతి ఆవేదన, తన జాతి గురౌతున్న దోపిడీనే కవిత్వంగా మలిచాడు. వర్తమాన సమాజంలోని వాస్తవికత ఆధారంగానే కవితలు రాశారు. అతడి బహుముఖీన ప్రజ్ఞ అనేక పార్శ్వాలుగా ప్రవహించింది. కవిత్వమూ కథలే కాదు, అనేక అనువాదాలు చేశారు. ఉర్దూలోకి అనువదించిన ఒక కవిత దు:ఖదీవిగా కనబడుతుంది..ఆ కవిత తన జీవితాన్నే పలకరించి నట్లుంటుంది.

"తెల్లారి పోయినా ఆ కొవ్వొత్తి
ఇంకా ఏడుస్తోంది దేనికనీ ?
ఇంకొద్దిగా వెలిగించు
అది కూడా కరిగిపోవాలని"

పై కవితలో ఉన్న ఇప్పుడు శోకం ఎవరిదో స్పష్టంగా తెలుస్తున్నది. జాషువా పద్య కవిత్వం ఎంత ప్రభావితం చేసిందో ఎండ్లూరి కవిత్వం కూడా దళిత సాహిత్యంలో అంతే ప్రభావం చూపింది. గోసంగీల గురించి చిత్రిస్తూ ఇలా

"ఒక విషాద శతాబ్దంలో జీవించిన వాణ్ణి
ఒక అంధకార యుగంలో
అస్పృశ్యతను అనుభవించిన వాణ్ణి
పేర్కొనడానికి వీలులేని కులంలో పుట్టినవాణ్ణి
ముట్టుకోవడానికి ఇష్టపడని మురికి జలాన్ని
ఐదు వందల సంవత్సరాలుగా
హైందవలోక అవమానితుణ్ణి

సూర్య నమస్కారం చేసినంత సుఖంగా
ప్రతి వర్ణ నమస్కారం చేయలేం కదా
ప్రతిసారి ఎదుటివాడి రూపంలో
చండాలుడే కనిపిస్తే
దుఃఖంతో పక్కకి తొలగిపోం కదా.!"

అంటూ ముందు చూపు కలిగిన కవులు తెలుగు కవిత్వంలో కొందరే కనబడతారు. ఒక జాతి కన్నీళ్ళు కన్నీటి వాసనలే కవిత్వ పరిమళాలుగా గోసంగిగా పరచుకున్నాయి. ఒక్కో పాదం భావావేశం కలిగి, ఒక్కో కవితా వాక్యం అణచివేతకు గురైన తీరును చిత్రించారు. కవిత్వంలోని ప్రతి వాక్యం నిప్పులా రాజుకుంది. అతడి సాహిత్య జీవితం మొత్తం దళితజాతిని జాగృతం చేసే ప్రయత్నము చేశారు. చివరగా ఆయన కవిత్వం తన జీవితాన్ని ఎలా గొప్పగా చేసిందో పరిశీలిస్తే ...

"ఆగ్రహం రాని అక్షరం జ్వలించదనీ
ఆర్ద్రతలేని వాక్యం ఫలించదనీ
నా అనుభవం నేర్పిన కవిత్వ పాఠం
నాలుగు మెతుకులే నా అక్షరాలు
నలుగురు నేను చదివిన ప్రబంధాలు
నా బాల్య దృశ్యాలే నేను చూసిన అలంకార శాస్త్రాలు
ఆకలి రసం నాలోని రచనా రహస్యం
అవమాన విషం నా కంఠంలోని నీలామృత విశేషం
మా బీద బస్తీలే నన్ను కవిని చేశాయి
మా వీధి కుక్కలు జీవితాన్నీ జీవించడాన్నీ నేర్పాయి"

అని చెప్పుకున్నారు.

తెలుగు కవిత్వాన్ని ఎంతో ఉన్నత స్థానంలో ఉంచి దళిత సాహిత్యానికి సొబగును అందిచ్చిన దళిత సాహితీ వేత్త ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 28 జనవరి 2022న గుండెపోటుతో హైదరాబాదులో తుదిశ్వాస విడిచారు. అతను ఇచ్చిన చైతన్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లడమే మనం ఆయనకిచ్చే ఘననివాళి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గురజాడవారి పుత్తడిబొమ్మ పూర్ణమ్మ

– డా॥. గెంజి అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, ఎన్.వి.యూనివర్సిటీ, తిరుపతి.

గురజాడ అప్పారావు వ్యవహారిక భాషోద్యమంలో పాల్గొని తన రచనలు అందరికీ అర్థమయ్యే విధంగా వ్యవహారిక భాషలో రచించారు. వీరు జీవించినది కొంతకాలమే అయినా అనేక మంచి రచనలు చేశారు. అనాటి సాంఘిక దురాచారాలు పారద్రోలడానికి నడుం బిగించిన వారిలో ఆద్యులు. వీరు రచయితగా, సంఘ సంస్కర్తగా, సాహితీకారుడిగా మరియు హేతువాదిగా, అభ్యుదయ కవిగా పేరు పొందారు. వీరి జననం సెప్టెంబరు 21, 1886. తల్లి కౌశల్యమ్మ, తండ్రి వెంకట రామదాసు. గురజాడ తన రచనల ద్వారా సమాజంలో మార్పుకోసం ప్రయత్నించారు. అనాటి కాలంలో బాల్యవివాహాలు ఎక్కువ. కన్యాశుల్కం దురాచారానికి ఎంతోమంది ఆడపిల్లల జీవితాలు నాశనం అయ్యేవి. అలాంటి సమయంలో వారిపై జాలితో, దయతో కన్యాశుల్కాన్ని కళ్ళకు కట్టినట్లుగా పూర్ణమ్మ గేయంలో తెలియజేశారు. ఈ గేయంలో మొదటగా ఆడపిల్లలను ఎంత బాగా వర్ణించారో చూడండి.

మేలిమి బంగరు మెలతల్లారా! కలువల కన్నుల కన్నెల్లారా!
తల్లులగన్నా పిల్లల్లారా! విన్నారమ్మా ఈ కథను?
ఆటల పాటల పేటికలారా! కమ్మని మాటల కొమ్మల్లారా!
అమ్మలగన్నా అమ్మల్లారా! విన్నారమ్మా మీరీకథను?

అని అంటూ కథలోకి వెళ్తారు.

కొండల నడుమ కోనొకటుంది. ఆ కోనకి నడుమ కొలను ఉంది. కొలనుగట్టున గుడిలో బంగరు దుర్గమ్మ వెలసివుంది. అక్కడ పూజారి ఇంట్లో పూర్ణమ్మ జన్మిస్తుంది. ఆమెకు తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఉన్నారు. ఆమెకు దుర్గమ్మ అంటే చాలా భక్తి. ప్రతిరోజు రకరకాల పూలను సేకరించి మాలగా కట్టేది. అదేవిధంగా ఏఏ ఋతువుల్లో కాసే పండ్లనన్నింటిని సేకరించి దుర్గమ్మకు ప్రతిరోజు సమర్పించేది. అలా పాడుతూ సంతోషంగా జీవితాన్ని గడిపేది. ఆమె అందం రోజురోజుకు పెరుగుతూ ఉంది. ఆ సమయంలో తల్లిదండ్రులు కన్యాశుల్కానికి ఆశపడి ఆమెను ఒక ముసలివాడికిచ్చి వివాహం చేస్తారు. ఆమె మనస్సు చాలా బాధపడుతుంది. పెళ్ళి తర్వాత దుర్గగుడి దగ్గరకు రాగానే ఆమె వచ్చిందన్న ఆనందంతో కొలనులోని తామరలు కళకళా నవ్వుతాయి. పక్షులు కిలకిల పలుకుతాయి. అలా ఆమె ప్రకృతితతో పరవసించి పోతున్నప్పుడు ఆమె భర్తను గుర్తు చేసుకొని ఏడ్చేసేది. ఆడుకోడానికి వెళితే తోటి స్నేహితులు ఆమెను ముసలి మొగుడు అని ఎగతాళి చేశారు. ఆటను వదిలి ఏమి చేయాలో తోచని పరిస్థితిలో గుడికి వెళ్లి కూర్చొని బోరున ఏడ్చేసేది.

కొంతకాలానికి ఆమె భర్త అనేకరకాల సొమ్ములను తీసుకుని వచ్చి ఆమెను తన ఇంటికి తీసుకుని వెళ్ళటానికి వస్తాడు. ఆ సమయంలో పూర్ణమ్మ వదినలు ఆమెను బాగా అలంకరించి, ఆమెకు మంచిమాటలు చెప్తారు. ఆమె తల్లిదండ్రులు ఆమెను దీవిస్తారు. ఆ సమయంలో పూర్ణమ్మ నవ్వుకుంటుంది. చిన్నపిల్లలును దగ్గర తీసుకుని ముద్దు మురిపాలాడుతుంది.

ఆడపిల్లలకు వారు ఉన్న ప్రాంతాన్ని, తన సొంత వారిని విడిచి వెళ్లేటప్పుడు వారి బాధ వర్ణనాతీతంగా ఉంటుంది. అలా పూర్ణబరువెక్కిన హృదయంతో దుఃఖాన్ని ఆపుకొంటూ తన అన్నదమ్ములతో దుర్గమ్మని భక్తితో పూజించమని చెప్తుంది. తల్లిదండ్రులను బాగా చూసుకోమని చెప్తుంది. మీరు కూర్చుని మాట్లాడుకునేటప్పుడు నన్ను తలచుకోండి. మీకు పుట్టే బిడ్డల్లో

ఒక్కరికి నా పేరు పెట్టుకోండి అని చెప్తూ కన్నీళ్ళు పెట్టుకొంటుంది. తర్వాత వెంటనే కన్నీళ్లు తుడుచుకొని వెంటనే నవ్వేస్తుంది. ఆమెను చూసి ఆమె ఇంటి వాళ్ళందరూ కన్నీళ్లు పెడతారు. తర్వాత యథావిధిగా సాయంత్రం పువ్వులన్నీ సమకూర్చుకొని సంతోషంగా దుర్గగుడికి ఒంటరిగా బయలుదేరి వెళుతుంది. సాయంసమయాన పాడి ఆవులు అన్నీ ఇళ్లకు చేరుతాయి. పక్షులు వాటి గూళ్లకు చేరుతాయి. ఆకాశంలో చుక్కలు మెరుస్తాయి. కానీ ఇంటికి పూర్ణమ్మ రాదు. కొండల్లో, కోనల్లో చీకటి ముసురుకొంటుంది. కాని ఇంటికి పూర్ణ రాలేదు. దుర్గమ్మకు హారాలు అలంకరించబడతాయి. కానీ పూర్ణమ్మ ఇంటికి రాదు. చివరికి కవి కన్నుల కాంతులు కలవల చేరెను, మేలిమి జేరెను మేని పసల్, హంసల జేరెను నడకల బెడగులు దుర్గను చేరెను పూర్ణమ్మ అని వివరిస్తాడు. ఆనాటి సాంఘిక దురాచారానికి పూర్ణమ్మ బలైపోయింది.

మంచితనానికి మూసపోసినట్లు పూర్ణమ్మను వర్ణించాడు కవి. ఆమె భక్తిభావం గాని, తనవారిపట్ల ప్రేమానురాగాలు గాని, బయటివారితో స్నేహంగా ఉండటం అలాగే బాధ్యతగా ఎలా మెలగాలో, తనకు తానుగా ఓదార్చుకోవటం వంటి అనేక విషయాలు మనకు పూర్ణమ్మలో కనబడుతాయి.

ఈ కథలో ఆమెను తల్లిదండ్రులు దీవించినప్పుడు ఆమె మనసులో నవ్వుకుంటుంది. ఆ నవ్వువెనక ఉన్న అర్థం పెళ్లి చేసిన ఆడపిల్లను దీర్ఘసుమంగళీభవ, పిల్లాపాపలతో వర్ధిల్లాలని దీవిస్తారు. ఆమె తల్లిదండ్రులు కూడా అలాగే దీవించి ఉంటారు. అందుకే మునలి వాడికిచ్చి పెళ్లి చేసి అలా దీవిస్తున్నారని మనసులో నవ్వుకుని ఉంటుందని నా అభిప్రాయం.

తల్లిదండ్రులు ధనానికి ఆశపడి పూర్ణమ్మను ఒక మునలివాడికిచ్చి పెళ్లి చేస్తారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆడపిల్లను వయసు మీరిన వాడికిచ్చి పెళ్లి చేయడానికి కూడా తల్లిదండ్రులు వెనుకాడే వారు కాదు. ఆడపిల్ల జీవితం ఏమవుతుందో అనే బాధ ఎవరికి ఉండేది కాదు. ఆడపిల్లంటే ఒక బరువుగా భావించేవారు. ఆడపిల్లలకు కూడా ఆశలు, కోరికలు ఉంటాయని అనుకునేవారు కాదు. ఆడపిల్ల చదువుకుంటే అంతకన్నా ఎక్కువ చదివిన వాడికిచ్చి పెళ్లి చేయాలని చదివించేవారు కాదు.

కన్యాశుల్కం పేరుతో పిల్లకు బాల్యవివాహం చేసి మునలి మొగుడు చనిపోతే ఆ పిల్ల భవిష్యత్తు అంధకారమే. అభం శుభం తెలియని ఆ పిల్లకు గుండు గీయించి, తెల్లచీర కట్టి, మూల కూర్చో పెట్టేవారు. ఆ పిల్లను ఎందుకు పనికిరాని వస్తువుగా చూసేవారు. ఆ పిల్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉండేది. అలాంటి సందర్భంలో సాంఘిక దురాచారాలు పారద్రోలడానికి గురజాడవారు తనవంతు కృషిగా తన సాహితీకలంతో పోరాటాన్ని సాగించారు.

ఆనాటి సాంఘిక దురాచారమైన కన్యాశుల్కానికి ఆడపిల్లలు బలైపోతూ ఉండేవారు. కానీ ఈనాటి ఆడపిల్లలు వరకట్న దురాచారానికి బలైపోతున్నారు. ప్రస్తుతం వరకట్నం చాపకింద నీరులా ఉంది. ఆనాటి పరిస్థితులు వేరు, అప్పుడు చదువు అంతగా లేదు. అంత అవగాహన ప్రజల్లో లేదు. సాంకేతిక పరిజ్ఞానం, అందరికీ చదువు అందుబాటులో ఉండేది కాదు. కానీ ఇప్పటి పరిస్థితులు వేరు. అందరికీ చదువు అందుబాటులోకి వచ్చింది. దేశం ఆనాటితో పోలిస్తే ఈనాడు బాగానే అభివృద్ధి చెందింది. కానీ ఆడపిల్లల విషయంలో వెనకడుగులోనే ఉందని చెప్పాలి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా ఈనాటి వరకు కూడా అక్కడక్కడా బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రస్తుతం వరకట్నంతో ఆడపిల్లలను బాధిస్తూనే ఉన్నారు. తల్లిదండ్రులు కూడా మంచిచెడులను ఆలోచించాలి. ఆడపిల్లలు చదువుకోవడానికి ఇప్పుడు అవకాశం ఉంది. చాలామంది చదువుకొని వాళ్ళ కాళ్లమీద నిలబడే అవకాశం ఉంది. పెళ్లి చేసుకున్నా కూడా ఇద్దరూ

సంపాదించి కుటుంబాన్ని పోషించుకోవచ్చు. విడిపోయి జీవితాన్ని గడపాలన్నా గడపవచ్చు. వితంతు విషయంలో ఆనాటి మూఢనమ్మకాలు ఇప్పుడు కనుమరుగవు తున్నాయి. అయినా కూడా ఆడవాళ్ళు బలైపోతూనే ఉన్నారు.

జీవితాన్ని చేతులారా పాడు చేసుకోకూడదు. ఆవేశంతో తీసుకునే నిర్ణయాలు తర్వాత కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తాయి. సమస్యకు పరిష్కారం చావే అనే ఆలోచనే రాకూడదు. సమస్య వస్తే దాన్ని ఎదురేగి పరిష్కరించు కోవాలి కానీ చావుతో అది సమసిపోదు అని గుర్తించాలి.

ఆనాటి సాంఘిక దురాచారాన్ని పారద్రోలడానికి నడుం బిగించిన సమయంలో గురజాడ తన రచనల ద్వారా అప్పటి స్థితిగతులను కూడా తెలియజేశారు. ఇలాంటి మంచివిషయాలను తెలియజేసే మహనీయు లను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాల్సిన బాధ్యత మనమీద ఎంతో ఉంది.

ఆధార గ్రంథాలు :

1. గురుజాడలు - గురజాడ అప్పారావు - ప్రధాన సంపాదకత్వం : పి.గోపాలక్రిష్ణ.
2. గురజాడ రచనలు (కథానికలు), గురజాడ అప్పారావు - సంపాదకుడు : సెట్టి ఈశ్వరరావు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వైవిధ్యభరిత మానవ సంబంధాల సమాహారం 'విహారి' కథా సాగరం

– డా॥ ఎం. లోలకృష్ణ, అసిస్టెంట్ ఎడిటర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.

మానవ సంబంధాలు అంటే ఏమిటి? కుటుంబంతో వున్న సంబంధాలా? మనుషులకు, మనుషులకు మధ్య వున్న సంబంధాలేనా? సమాజంతో వున్న సంబంధాలా? ఏవి మానవ సంబంధాలంటే? దీనికి సరైన సమాధానం ఇవ్వడం కష్టమే. మానవ సంబంధాలకు చాలామంది చాలాచాలా భాష్యాలు చెప్పారు. దీనిలో ప్రధానమైనది, నేటి ప్రపంచానికి కొలమానంగా మారింది కార్ల్‌మార్క్స్ చెప్పినదే.

"మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే" అంటారు మార్క్స్. నాటి నుంచీ నేటివరకూ చాలా ఘటనలు దీనిని రుజువు చేశాయి కూడా...

"మానవ సంబంధాలు అంటే శ్రమల సంబంధాలు" అంటారు ప్రముఖ రచయిత్రి రంగనాయకమ్మ. ఇదీ నిజమే. శ్రమను మార్పు చేసుకోవడం వల్ల కూడా మానవ సంబంధాలు పటిష్టమవుతాయి.

ఇలా చాలామంది చాలా రకాలుగా చెప్పారు. అయితే మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు మాత్రం దీని విశ్లేషణను కొంత కఠినతరం చేస్తాయి. మానవ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగానో, శ్రామిక సంబంధాలుగానో చూడడాన్ని మన సంస్కృతి ఒప్పుకోదు. మనుషుల మధ్య వున్న భావోద్వేగాల సమాహారంగానే మనం ఈ మానవ సంబంధాలను చూస్తాం. ప్రేమో, కోపమో, ఆగ్రహమో, అనురాగమో, అనుబంధమో, జాలో, బాధ్యతో ఈ సంబంధాల రూపురేఖలను మారుస్తూ వుంటుంది. మన కుటుంబ సభ్యులతో, సమాజంలోని ఇతర వ్యక్తులతో మనం వ్యవహరించే తీరే మానవ సంబంధాలలోని తీవ్రతను నిర్ణయిస్తుంది.

ఇదే విషయాన్ని తన కథలద్వారా తెలుపుతారు "విహారి". 1941లో తెనాలిలో జన్మించిన విహారి అసలు పేరు జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఎస్ఎస్ఎల్‌సీతోనే చదువు ఆపేసిన ఆయన ఎల్ఐసీలో చిరుద్యోగంతో జీవితాన్ని ప్రారంభించారు. చదువు మీద ఆయనకున్న ఆసక్తికి పేదరికం అడ్డురాలేదు. ప్రైవేట్‌గా చదువుకుంటూ డిగ్రీలు సంపాదించుకున్నారు. రచనారంగం ఆయనను ఆకట్టుకుంది. గోపీచంద్, మదురాంతకం రాజారాం కథలు చదివిన ఆయన ఆ ప్రభావంతో 1962లో "రాగజ్యోతి" పేరుతో తొలికథను రాశారు. అది "చుక్కాని"అనే పత్రికలో ప్రచురితం అయింది. తనలాగే రచనల పట్ల అభిరుచి వున్న తన సహోద్యోగి శాలివాహనతో కలిసి పదిహేనేళ్ల పాటు చాలా కథలు రాశారు. ఉద్యోగంలో బదిలీల కారణంగా వారిద్దరూ కలిసి కథలు రాయడం ఆగిపోయింది. విహారి తెలుగు సాహిత్యంలో చేపట్టని సాహితీ ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. 14 కథా సంపుటాలు, 15 విమర్శనాత్మక వ్యాస సంపుటాలు, ఆరు నవలలు, ఐదు కవితా సంపుటాలు ప్రచురించారు. 300 కథలకు పరిచయాలు, పరామర్శలు చేశారు. వివిధ పత్రికల్లో శీర్షికలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారంతో సహా అనేక పురస్కారాలు విహారి అందుకున్నారు. "మన జీవితాలను సాహిత్యంలో సమకాలీనం చేస్తూ రాయాలి" అంటారు విహారి. అదే నియమాలను ఆయన పాటించారు. నాటినుంచీ నేటివరకూ మానవ సంబంధాలను సునిశితంగా పరిశీలించి విశ్లేషించారు. పరిష్కారాలనూ చూపించారు. ఆయన "కొత్తనీరు" కథా సంపుటి ఈ విషయాన్నే తెలుపుతుంది.

"కొత్తనీరు" కథలో పాతతరానికి ప్రతినిధి నాన్న. మధ్యతరానికి ప్రతినిధులు కొడుకూ కోడళ్లు. నవతరానికి చెందిన మనవరాలు, మనవడు. మనవరాలు వేసుకొచ్చిన

పచ్చబొట్టు తాతకు కోపం తెప్పించింది. మనవరాలేం చిన్నపిల్లా.. అదీకాదు. ఇంజనీరింగ్ పూర్తి చేసి వుద్యోగం చేస్తోంది. ఆమె మీద తాడెత్తున లేచాడు తాత. పనిలో పనిగా ఆమెను సమర్థించిన కొడుకూ కోడల్ని కూడా ఏకిపారేశాడు.

"కొంతమంది ఎంత వయసొచ్చినా మైనర్లే. ఎందుకు పనికొస్తార్రా కూతుర్ని అదుపుచేసుకోలేని వెధవలు" అనేశాడు. అది అయన తరం సామాజిక న్యాయం. ఇది ఒకరోజు వ్యవహారం కాదు. ఆరోజు టాటూవల్ల జరిగిం దంతే. ఇందులో ఎవరి తప్పూ లేదు. ఎవరి ఒప్పూలేదు. ఇది తరాల మధ్య వున్న అంతరం. అయితే ఆడవాళ్లు ఒక తరం ముందుంటారు. బిడ్డలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అదే జరిగింది. నాన్నమ్మకు ఈ విషయంలో కోపం వచ్చింది. ఎదిగిన పిల్లమీద గంతులేంటని తాతయ్యను మందలించింది. గాయపడ్డాడు తాత. కాసేపటికి మనవడు వచ్చాడు. బిటెక్ చదువుతున్న మనవడి టీషర్టు మీద "గర్ల్ ఆర్ లైక్ మెడిసిన్స్. దే డు హ్యావ్ ఎక్స్‌పైరీ డేట్!" అని వుండడం చూడగానే మళ్లీ పిడుగులు పడ్డాయి. నాన్నవల్ల అందరికీ టెన్షనే. ఏనిముషం ఏ పిడుగు పడుతుందోనన్న ఆదుర్దా. చివరికి నాన్నే అర్థం చేసుకున్నాడు. "కొత్తనీరు పాతనీటిని కొట్టేస్తుంది. ఒకరి ప్రవర్తన, నడత మరొకరి అనారోగ్యానికి కారణం కాకూడదు. నేనూ, అమ్మా కేర్ హోంలో చేరుతున్నాం" అన్నారు. వెళ్లిపోయారు కూడా. వాళ్లు వెళ్లిపోవడం నాకు చాలా రిలీఫ్‌నిచ్చింది అన్నాడు మనవడు. అమ్మా, నాన్నలు గతుక్కుమన్నారు. "రానున్న పరిణామాలకు సంకేతమా ఇది" అని అంటారు విహారి.

విచ్ఛిన్నమైన బంధాలు దు:ఖాన్నివ్వాలి. కానీ రిలీఫ్‌ను ఇవ్వడం ఏమిటి? మారిన మానవసంబంధాల వ్యవహారం ఇలా వుందని చెప్పారు రచయిత.

మరో కథ "అవ్యక్తం". ఇంటి ఇల్లాలు గౌరి విద్యా వంతురాలు. ఉన్నతోద్యోగిని కూడా. ప్రమాదంవల్ల శాశ్వతంగా మంచాన పడింది. ఆమెకు ఆ లోటు తెలియ కుండానే చూసుకుంటున్నాడు భర్త శివరాం. తన వల్ల భర్త ఇబ్బందులు పడుతున్నాడన్నది గౌరి మనోగతం. తనకు విడాకులిచ్చి భర్త కొత్త జీవితం గడిపితే బాగుం టుందంటుంది గౌరి. అదే మాట భర్తతో అంటుంది.

"జీవితం 'మనం' అనే నువ్వూ నేనూ మధ్య నడుస్తుంది. మూడో చేతి ప్రమేయం లేదు. మన బతుకు, మన విశ్వాసం- ఇవి మన సొంతమైనవి" అంటాడు శివరాం.

పెద్దకొడుకు కోడలితో సహా అమెరికాలో వుంటు న్నాడు. అతడు ఫోన్ చేసిన రోజు పువ్వుల వానే. రెండోకొడుకు రమేష్ ఢిల్లీలో ఉద్యోగి. అతనికోసం సంబంధాలు చూస్తున్నారు. తన అనారోగ్యాన్ని గురించి చెప్పి తన బాధ్యత కోడలికి వుండదని చెప్పమంటుంది గౌరి. అయితే రమేష్, తన మేనమామ కూతురు వసంతను పెళ్లి చేసుకుని తల్లిదండ్రులతోనే కలిసి వుండాలనుకుంటామని, వసంత కూడా అదే కోరుకుం టోందని చెబుతాడు. ఈ కథలో భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రుల మధ్య వున్న అనుబంధాలను చూపారు విహారి. అందరూ ఒకేలా వుండరని, మనసులో తడి వున్నవారు కూడా వుంటారంటారు.

మరో కథ "శేషప్రశ్నలు" నిజంగా శేషప్రశ్నలే. ఈ కథలో విశ్వనాధం తండ్రి. అయనకు ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్లూను. ఎంత బిడ్డలైనా సరే పెళ్లిళ్లయ్యాక వారి కుటుంబాలలోనే మునిగిపోతారు. తల్లిదండ్రులను పట్టించుకోవడం కుదరదనే అనుకోవచ్చు. ఇదే చేశారు ఆయన పిల్లలు కూడా.. చిన్నకొడుకు సత్యం ఉద్యోగ రీత్యా జపాన్‌లో వున్నాడు. విశ్వనాధం బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డాడు. చిన్న ఫ్రాక్చర్ అయింది. పెద్దకొడుకూ కోడలూ వచ్చారు. కూతుళ్లూ వచ్చారు. సత్యం, అతని కుటుంబం రాలేకపోయాడు. విశ్వనాధం నొచ్చుకున్నాడు. ఆయన తన చిన్న కొడుకు సత్యం వ్యవహారం గురించి ఓ కథ రాశాడు. సత్యానికి కోపం వచ్చింది. ఆయన స్నేహితుడి దగ్గరికి వెళ్లాడు. తండ్రి యిలా రాయడం

బాలేదన్నాడు. "నాణేనికి రెండోవైపు వుంటుందనే స్పృహే వుండదు" అన్నాడు.

విశ్వనాధంది పెద్ద కుటుంబం. వయసులో వున్నపుడు అక్కచెల్లెళ్ల బాధ్యత, వయసు పెరిగాక బిడ్డల బాధ్యత అన్నీ మోశారు. ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులు వున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెద్దకొడుకు నాగేశం కొడుక్కి ఉపనయనం చేశారు. 'ఇప్పుడు ఇదెందుకు?' అన్నది సత్యం ప్రశ్న. పెద్దకూతురు కళ్యాణిది బొటాబొటి సంసారం. పుట్టింటివారు తనకు ఏమీ పెట్టలేదన్నది ఆమె ఆరోపణ. "నాన్నగారు ఆయన చెల్లెళ్లనీ, వాళ్ల సంసారాలనీ సాకి సాకి పైసా మిగిల్చుకోలేకపోయాడని దెప్పుతూ వుంటారు. అట్టాంటా వాళ్లు ఎవరో ఏదో పెట్టలేదని సతాయించడమెందుకు. ఒకచోట న్యాయం కానిది ఇంకోచోట న్యాయమైపోతుంది వీళ్లకి" అంటాడు సత్యం చెల్లెలి ప్రవర్తన చూసి. పులిమీద పుట్రలా భర్తకు షష్టిపూర్తి చేసుకోవాలని వుందంటుంది తల్లి శాంతమ్మ. సత్యం తీవ్రంగా వ్యతిరేకించాడు దీన్ని. 'ఆ కృత్రిమ వాతావరణ మంటేనే నాకు అసహ్యం' అన్నాడు.

దీంతో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్నకోణంలో కథ రాశేశారు విశ్వనాధం. "ఎదుటివారి నుంచి డబ్బుని ఆశిస్తూ, అది లభించకపోతే, ఎదుటివారికి మానవ సంబంధాల పట్ల మమతా, మన్ననా లేవంటుంటే... వీరికి ఆ మానవ సంబంధాల పట్ల వున్న శ్రద్ధా, చిత్తశుద్ధీ ఏపాటిది?" ఇదేగా సత్యం అడిగింది అనుకుంటాడు రచయిత.

"సమాజంలో సంక్లిష్టత, సంఘర్షణ, అస్తవ్యస్తత... వీటి తీవ్రతలో తరతమ భేదాలూ.. మనిషిని నాడూ నేడూ శాసిస్తున్నవి! మానవచైతన్య ప్రస్థానంలో ఒకటి రెండు పాత్రల్ని తీసుకుని సిద్ధాంతాలు చెయ్యగలమా? జీవితం ఎప్పుడూ శేషప్రశ్న కదా?!!!" అంటాడు రచయిత. నిజమే జీవితం ఎప్పుడూ శేషప్రశ్నే. ఎవరి న్యాయం వారిది. ఎవరి సమర్థన, వాదన వారిది అంతే.

ఇలాంటిదే మరో కథ "రెండో సముద్రం." ఈ కథలో స్వరూప హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. భర్త రాఘవ బెంగుళూరులో హార్డ్‌వేర్ ఇంజనీర్.. "హార్ట్‌తో సహా మనిషంతా హార్డ్‌వేరే" అన్నది స్వరూప ఆవేదన. శనివారం ఉదయానికల్లా హైదరాబాద్‌లో దిగుతాడు రాఘవ. ఆ నరికల్లా వున్న ఒక్కగానొక్క కూతుర్ని తల్లిదగ్గరికి పంపేయాలి స్వరూప. కూతురిమీద ఆపేక్ష కూడా లేని మనిషి. భార్యంటే ఓ సెక్స్‌బొమ్మ అంతే. దీనికితోడు రాగానే అనుమానపు ప్రశ్నలు. భర్త వచ్చిన ఆనందం లేదు సరికదా. వస్తున్నాడంటేనే ఓ అసహ్యం, భయం. భార్య శరీరం మీద అవమానకరమైన అపహాస్యాలు. చిన్నచిన్న సరదాలకు కూడా నోచుకోలేదు స్వరూప. జీవితం చుట్టూ గోడకట్టేసిన భర్తమీద చెప్పలేనంత విరక్తి. ఉద్యోగం చేసే భార్యను అదుపులో వుంచుకోవాలంటే ఆమెను వేధించడమే ఏకైకమార్గం అని నమ్మిన భర్తతో జీవితం ఎలా వుంటుంది? అది స్వరూపకు బాగా అనుభవం.

ఆమె అమ్మ జీవితం, అమ్మమ్మ జీవితాలూ ఇలా మొగుళ్ల చేతుల్లో నలిగినవే. నుపరిచితమైన మహా విషాదం. స్వరూప అన్న కృష్ణమూర్తి. తండ్రిని చూస్తూ పెరిగిన కృష్ణమూర్తి ఏమవుతాడు. అదే అయ్యాడు. భార్య రాజశ్రీని వేపుకు తిన్నాడు. తట్టుకోలేక పారిపోయింది. సేల్స్‌గర్ల్‌గా పనిచేసుకుంటోంది. "ప్రాణం హాయిగా వుంది వదినా. రూపాయో అర్ధో నా కూడు నేను తింటున్నాను" అంటుంది తృప్తిగా. స్వరూప తన సహోద్యోగినులు తనకంటే కాస్త నయంగా వుండడం గమనించింది. "ఆరేళ్ల నుంచీ సాగుతున్న ఒక టీవి సీరియల్ చూసి "అంతా ట్రూష్, మగవాళ్లిలా వుండరు అనుకుంది. కానీ ఇవ్వాళ? ఆపాత్రలే బెటరనిపిస్తోంది. వాస్తవం ఎప్పుడూ కాలిలో ముల్లే" అనుకుంది స్వరూప.

"మానవ సంబంధాలు సరిచేసుకోవాలన్నా ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతి తప్పదు కదా" అంటాడు స్వరూప ఆఫీసులోని భార్యాబాధితుడు కుమార్. స్వరూప ఆలోచనలో పడింది. తల్లితో మాట్లాడింది. భర్తకు ఫోన్

చేసింది తాను తల్లిని, బిడ్డను తీసుకుని కాశీ, ప్రయాగ్, హరిద్వార్‌కు వెళ్తున్నానని. తిరిగిరావడానికి నెలరోజులు పడుతుందని చెప్పింది. ఇదీ ఒక ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతే. ఆశ రెండో సముద్రం కదా అనుకుంది స్వరూప. ఈ కథలో స్వరూప తనను బాధించే వేధించే సంబంధాలను సరిదిద్దుకునే పనిలో పడింది. సంతోషాన్నిచ్చే సంబంధాలతో కలిసి పయనించడానికి సిద్ధమైంది. మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను ఈ కథ చూపుతుంది.

మధ్యతరగతి... చావలేక, బ్రతకలేక జీవితాన్ని ఈడ్చుకొచ్చే ఓ రకం మనుషులు. చొరవగా ముందడుగు వేయలేరు. ఎప్పుడూ పరువు సమస్యే. ఏంచేస్తే ఏం జరుగుతుందోనన్న భయం. ప్రతిక్షణం నలుగురిలో గొప్పగా వుండాలన్న కోరిక. దానికోసం దాగుడుమూతలు. నిజం అబద్ధంగా.. అబద్ధం నిజంగా.. దోబూచులాటలు. వాస్తవం బయటపడితే ప్రాణాలు తీసుకోవడాలు.. ఈ కథే "కొత్తపాఠం." అలాంటి లేని గొప్పలు చెప్పుకునే ఓ నాన్న. తట్టుకోలేని కొడుకు. ఇదే కథ. పెద్దకొడుకు నారాయణకు ఇరవయ్యారేళ్లు. పెద్దగా చదువురాదు. ఐదేళ్ల చదివి బియ్యే పూర్తిచేశాడు. క్రెడిట్ కార్డులు అంటగట్టే పని. అయితే నాన్న శంకరయ్య తనకు తెలిసిన వారికి కొడుకును ఎంబియ్యేగా పరిచయం చేశాడు. మార్కెటింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా చేస్తున్నానని చెప్పుకున్నాడు. కొడుకు గుండె గుభేలుమంది ఆ గొప్పమాటలు విని. తమ్ముడికి చదువురాలేదు. ఇంటర్ పూర్తిచేసి సెట్విన్‌లో కండెక్టర్‌గా చేరాడు. తన రెండోకొడుకు ఎంసెట్‌కి తయారవుతున్నాడన్నాడు. తనను కార్లో దింపాల్సిన చిన్నకొడుకు బిజీగావుండి వెళ్లిపోయాడంటూ తమకులేని కారును కూడా సృష్టించేశాడు శంకరయ్య. చెల్లెలు స్వరూప ఇంటర్ ఫస్ట్‌ఇయర్. అంతంతమాత్రం చదువు. ఆమెను ర్యాంక్ స్టూడెంట్ చేసేశాడు నాన్న. కన్నాలకు సున్నం పూసేశాడు. సున్నం పోతే మిగిలేది కన్నమే. అది అంత వయసొచ్చినా నాన్నకు తెలియలేదా. తెలిసీ చేశాడా. ఏమో..! మధ్యతరగతి కదా. పిల్లలను ఆకాశానికెత్తేసిన తండ్రి తల్లిని పాతాళానికి తొక్కేశాడు. ఆమెను ఓ అవివేకిని, ఏమీ తెలియని మూర్ఖురాలిని చేసేశాడు. అది కొడుక్కు నచ్చలేదు.

దీనికితోడు తమ మేనత్త నాన్న పెగ్గిమాటలు విని ఇంటర్ ఫెయిలయిన తన కొడుక్కి ఏదైనా ఉద్యోగం చూసిపెట్టమంది. ఆమెకు అరచేతిలో స్వర్గంచూపించి వచ్చేశాడు శంకరయ్య.

"ఎందుకు నాన్నా ఇదంతా? నలభై ఏళ్ల తర్వాత నీవాళ్లముందు నువ్వు గొప్పవాడినని చెప్పుకోవటానికా?" అన్నాడు తను రాసిన ఉత్తరంలో కొడుకు. "ఎదుటివారు నువ్వు చాలా గొప్పవాడివని అనుకోవాలనే కోరిక నీది. అందుకనే తరచూ పార్టీలూ, ఫంక్షన్లూ అంటూ భేషజాలకు పోతావు" అంటాడు కొడుకు.

తనకు తెలియని విషయం లేదని అనుకుంటాడు శంకరయ్య. అది తప్పంటాడు నారాయణ. "నాన్నా నీలో నువ్వు నీ వ్యక్తిత్వ విధ్వంసాన్నీ, ఆరోగ్య భంగాన్నీ పెంచుకుపోతున్నావ్. నువ్వు మాకు పంచుతున్న ఈ బాధను మూగగా అనుభవించడం స్థలకాలాల స్పృహని కోల్పోయేలా చేస్తోంది." అంటాడు. దీని ఫలితం మాకు కనిపిస్తోందంటాడు. అందరూ దీనిమీద జోకులు వేస్తున్నారని, అమాయకంగా తాము జోకర్లమవుతున్నామని అంటాడు. "వాస్తవం దాగదు, అరచేతిలో నిప్పుకణికను పట్టుకొని ఎంతసేపని ఎన్నాళ్లని తిరగగలం?! అంటాడు నారాయణ. ఈ మేరకు నాన్నకు ఓ ఉత్తరం కూడా రాశాడు.

ఇదిలా వుండగా తన మేనత్త కొడుక్కు ఉద్యోగంకోసం ఇచ్చిన డబ్బులు వెనక్కివ్వమంటూ వచ్చింది. పెద్ద గొడవల తర్వాత మేనల్లుడు సురేంద్ర టీవీ బృందంతో దిగాడు. కుటుంబ వ్యవహారం కాస్తా రచ్చకెక్కింది. తానుచేసిన తప్పులకన్నా, అవి బయటకు రావడాన్ని తట్టుకోలేకపోయాడు శంకరయ్య. తెల్లారేసరికి ప్రాణా

లొదిలేశాడు. "కొందరి జీవితాల ముగింపు వారి జీవనశైలికి భిన్నంగా వుండదు కాబోలు. వారు చేసుకున్న పాపానికో, నేరానికో ఫలితంలా భయంగొల్పుతూ వుంటుంది అని పించింది." అంటాడు కొడుకు. మానవ సంబంధాల్లో యిదోకోణం. జీవితపు చీకట్లు బయటపెట్టుకోలేక, వెలుగుందని నమ్ముతూ, నమ్మిస్తూ బ్రతికే జీవన విధానాన్ని రచయిత ఈ కథలో చూపించారు. విహారి రాసిన కథల్లో ఇవి మచ్చుతునకలు మాత్రమే. ఈ కథలు చదువుతుంటే మానవ సంబంధాల పట్ల విహారి సునిశితమైన పరిశీలన, అవగాహన మనకు కనిపిస్తూ వుంటుంది. సంబంధాలలో సంక్లిష్టత, మార్మికతలను ఈ కథలు మనకు కళ్లకు కట్టినట్లు చూపుతూ వుంటాయి.

ఆధార సూచి :

1. ఎడిటోరియల్ - ఆంధ్రజ్యోతి, మార్చి 17, 2020, డాక్టర్ ఎం. స్వర్ణలత.
2. మన కథల్లో మానవ సంబంధాలు - ఆంధ్రజ్యోతి, జనవరి 17 2016, ధీర
   నవతెలంగాణ, మార్చి 30, 2020
3. సాహితీ విహారి - సాక్షి, 25 అక్టోబర్ 2016
5. స'కాలమ్'లో స'కలం - విహారి' ఆంధ్రభూమి, 23 డిసెంబర్ 2019
6. ఈమాట - ఫిబ్రవరి 2018
7. కొత్తనీరు - కథాసంపుటి, జనవరి 2009, విహారి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భాష ప్రధాన లక్షణాలు – ఆధునిక భాషాశాస్త్రంలోని పదాంశ విజ్ఞానం

– డా॥ యం. ప్రసాద్ నాయక్, సహాయ ఆచార్యులు, భాష అధ్యయన శాఖ, లింగ్విస్టిక్స్, ద్రావిడ విశ్వవిద్యాలయం.

మానవ జాతి తనకు సన్నిహితమైన చింపాంజీ, గిబ్బన్ల లాంటి కోతిజాతుల నుంచి కోటి, కోటిన్నర సంవత్సరాలకి ముందే విడిపోయిందని భాషాశాస్త్రవేత్తలు అభిప్రాయ పడ్డారు. అయితే భాష ఇంచుమించు ఇరవై ఐదు నుంచి ముపై వేల సంవత్సరాల క్రితం పుట్టి వుండవచ్చు. ఈ మధ్య కాలంలో మానవుల మెదడు పరిమాణం పెరిగి ఒక తరం నుంచి మరో తరానికి మొదట సంస్కృతి, తర్వాత భాష ప్రసరించడం మొదలై వుండవచ్చు.

భాష ధ్వనినిర్మితం. సృష్టిలో ఎన్నోరకాల ధ్వనులున్నాయి. కాని, భాషకు అవసరమైనవి ఉచ్చరిత ధ్వనులు మాత్రమే. ఒక్కొక్క భాషలో ప్రధానమైన ధ్వనులు మరొక భాషలో అప్రధానం కావచ్చు. అందుకే భాష అనేది ఒక వ్యవస్థ అని అంటారు. భాష భావ వాహకం అన్న అభిప్రాయంతో పక్షుల భాష , జంతువుల భాష , మానవుల భాష అని రకరకాలుగా వ్యవహరింపబడు తున్నది. కోతులు, పశు పక్ష్యాదులు కూడా మానవుల్లాగే భయం, కోపం, ఆకలి మొదలైన భావాలను తమ వివిధరకాల అరుపుల ద్వారా సూచిస్తాయి. అయితే మానవభాషకూ, జంతువులు భాషకూ చాలా వ్యత్యాసం ఉంది. జంతువుల అరుపుల ధ్వనులలో ఏడెనిమిది లేదా పదికన్నా ఎక్కువ రకాలు ఉండవు. కాని , మానవ భాషలో రకాల ధ్వనులు కలిసి మాటలు (పదాలు) గా ఏర్పడటం, రకరకాల మాటలు కలిసి వాక్యాలుగా ఏర్పడటం అనేది నిరంతరమూ జరిగే ప్రక్రియ. అందువల్ల మానవుల భాషలో కనిపించే వైవిధ్యం జంతువుల్లో కనిపించదు. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు జంతువులకీ, మనుషులకీ సమాన మైనప్పటికీ భాషను సృష్టించుకునే అవకాశం కేవలం మానవులకే కలిగింది. కాబట్టి ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు స్వాభావికంగా జరిగే ధర్మం. కాని భాష స్వాభావికంగా సమకూడేది కాదు.

భాష ప్రధాన లక్షణాలు :

భాషను ఎదిగిన తర్వాత భాషను నేర్చుకోవాలంటే అంత సులభం కాదు. పూర్వం అలవాటు అభ్యాసాన్ని మార్చుకోవాలి. అప్పుడు గాని కొత్త ధ్వనులను, కొత్త వ్యాకరణాన్ని గ్రహించి అభ్యసించడం సాధ్యం కాదు.

సృష్టిలో ఎన్నో ధ్వనులున్నాయి. ఒక్కొక్క భాషలో కొన్ని రకాలైన ధ్వనులు మాత్రమే ఉపయోగిస్తారు. ఒక భాషలో ముఖ్యమైందిగా పరిగణింపబడే ధ్వనికి మరియొక భాషలో గుర్తింపు లేకపోవచ్చు. ఒక భాషలో అప్రధానమైనది మరొక భాషలో అత్యంత ప్రధానమైనది కావచ్చు. అందుకే భాష ఒక వ్యవస్థ అని చెప్పుకున్నాం. అన్ని వ్యవస్థలలాగే ఇది క్రమబద్ధమై ఉంటుంది. కాని సమాజంతోటి నిరంతరమైన సంబంధం వల్ల భాషలో కొన్ని మార్పులు జరుగుతాయి. ఆ మార్పులు కూడా క్రమబద్ధంగానే ఉంటాయి. భాష భావవాహకం అన్న అభిప్రాయంతో పక్షుల భాష జంతువుల భాష, సాంకేతిక భాష అని రకరకాలుగా వ్యవహరింపబడుతుంది. అందుచేత మానవభాషకు భాషాశాస్త్రవేత్తలు కొన్ని లక్షణాలు చెప్పారు. అవి : 1.ఉద్దేశపూర్వక ఉచ్చారణ 2. నిర్మాణ 3. ఉత్పాదకత 4. యాదృచ్ఛికత 5. వక్తృశ్రోతృవినిమయం 6. ప్రత్యేకత 7. ప్రేరణదూరత 8. సాంస్కృతిక ప్రసరణ.

ఉద్దేశపూర్వక ఉచ్చారణ :

ప్రతి భాష విశిష్టమైన కొన్ని వర్ణాలుగా, విశిష్టమైన పదాంశాలుగా వేరుపరచడానికి వీలుగా ఉంటుంది. ఈ వర్ణాల, పదాంశాల కూడికచేతనే మానవ భాష ఏర్పడు తుంది. అది ఉద్దేశపూర్వకంగా ఉచ్చరింపబడుతుంది. చిలుకలు, గోరువంకలు, చింపాజీల మాదిరిగా అభ్యాస వశం చేత వెలువరించేదికాదు. చిలుకలు అభ్యాసం చేత కొన్ని మాటల్ని ఉచ్చరించినప్పటికీ వాటికి ఆ మాటల

అర్థం తెలియదు. అవి భాషలోని వర్ణాలను, పదాలను విశదీకరించి మానవుల్లాగా చెప్పలేవు కాబట్టి వాటికి ఉద్దేశపూర్వక ఉచ్చారణ ఉండదు. అది కేవలం మానవులకు మాత్రమే ఉంటుంది .

నిర్మాణ ద్వైవిధ్యం :

ప్రపంచంలో ఏ భాషలో నైనా 60 వర్ణాలకు మించి వుండవు. 15 వర్ణాలకు తక్కువ వుండవు. వ్యాకరణ వ్యవస్థవల్ల సంపూర్ణ సందేశం మనకు అందుతుంది. భాషలో రెండురకాల పద్ధతులున్నాయి. అవి : 1. కొన్ని ధ్వనులు కలిసి పదంగా ఏర్పడటం, 2. కొన్ని పదాలు కలిసి వాక్యంగా ఏర్పడటం ఏ భాషలోనైనా ఈ రెండు పద్ధతులు తప్పనిసరిగా ఉంటాయి. కాబట్టి దీన్ని ' నిర్మాణ ద్వైవిధ్యం ' అని పేర్కొనటం జరిగింది.

ఉత్పాదకత :

భాషలోని నిర్మాణాంశాలను కలిపి కొత్త రూపాల్ని ఉత్పన్నం చేయవచ్చు. పిల్లలు, పెద్దలు మాట్లాడిన వాటినే తిరిగి మాట్లాడుతారు. కొంతకాలమైన తర్వాత తామే స్వయంగా కొత్తకొత్త నిర్మాణాలు చేయగలుగుతారు. ఉదా: చిలుకలు 'చుట్టాలు వచ్చారు' అని అనగలవు గానీ ఎవరు వచ్చిప్పటికీ వాటి భావ ప్రకటనలో మార్పు ఉండదు. చుట్టాలకు బదులుగా మిత్రులు శత్రువులు, దొంగలు మొదలైనవారు వచ్చినా అవిఅభ్యాసం చేసిన మాటలనే పలుకుతాయి కాని సందర్భానుసారంగా, సృజనాత్మకంగా కొత్త మాటల్ని కొత్త నిర్మాణాలను సృష్టించలేవు . కాబట్టి ' ఉత్పాదకత ' అనేది మానవులకే సాధ్యం.

శబ్దార్థ సంబందశక్తి :

ప్రతి భాషలోనూ పదాలు వుంటాయి. ఈ పదాలకు అర్థాలు వుంటాయి. ఈ పదానికి అర్థం ఇది అనే సంకేతం ఒక్కొక్క భాషా సముదాయం ఏర్పరచుకుంది. మానవ భాషా ధ్వనుల సమాహారానికి అర్థానికి వున్న సంబంధం వుంది. ఈ మానవ భాషాధ్వనుల సమాహారానికి అర్థానికి వున్న సంబంధం పూర్తిగా 'శబ్దార్థ సంబంధ శక్తి'తో కూడింది. నోరు అంటే 'కన్ను' అనే అర్థం ఎందుకు రాలేదు ? 'పన్నుఅంటే 'గుండె' అనే అర్థం ఎందుకు కాకూడదు ? ఇలాంటి ప్రశ్నల పరంపరకు సరైన సమాధానం ఒక్కటే. శబ్దార్థ సంకేతం కేవలం స్వచ్ఛందతతో కూడికొనినదని చెప్పడమే. వైయాకరణులు 'శక్తం పదమ్' అని అన్నారు. అంటే శక్తి కలది పదం అన్నమాట.

వక్త్ర శ్రోతృ విపరిణమం :

వక్త ఉచ్చరించిన మాటలవల్ల ధ్వని తరంగాలు ఏర్పడుతాయి. ఆ ధ్వనులవల్ల శ్రోత ప్రచోదనాన్ని పొందుతాడు. అంటే ప్రతిక్రియ ఉంటుందని అర్థం. అది క్రియారూపంలో ఉండవచ్చు. వాగ్రూపంలో ఉండవచ్చు. అది ఎలాగంటే ఒకడు 'అదిగోపాము' అని అరవగానే ఒకడు పరుగెత్తుకెళ్ళి కర్రనో, రాతినో పట్టుకురావడాన్ని క్రియారూప ప్రతిక్రియ అంటారు. మరొకడు 'ఎక్కడ' అని ప్రశ్నిస్తాడు . దీన్నే వాగ్రూప ప్రతిక్రియ అంటారు. ఒకే ప్రచోదనానికి ఉభయవిధ ప్రతిక్రియలు ఏకకాలంలో ఉండటంలో ఆశ్చర్యం లేదు.

వార్థప్రసారంలో ప్రత్యేకత :

వార్తా ప్రసారంలో ప్రేరణ, ప్రతిక్రియ ఉంటాయి. ఈ రెండిటికీ సహజ సంబంధం లేకపోతే ఆ వార్తా ప్రసారంలో ప్రత్యేకత ఉన్నట్లు లెక్క. ఉదాహరణకి వడ్డన జరుగుతూ ఉండడం చూసి మనం చేతులు కడుక్కొని వంటింట్లోకి వెళ్లి కూచుంటాం. ఈ రెండు క్రియలకి సహజ సంబంధం ఉంది. కాబట్టి ఈ వార్తా ప్రసారంలో ప్రత్యేకత లేదు. కాని "వడ్డించేస్తున్నాను, రండి" అని గృహిణి చేసే ధ్వనులకీ మనం వంటింట్లోకి వెళ్లడానికి సహజ సంబంధం లేదు. వీటి మధ్య సంబంధం కృత్రిమమైన శబ్దార్థ సంబంధ సిద్ధి వల్ల వచ్చింది. గృహిణి వాడిన భాష తెలియనివారు ఈ మాటలు విన్నా దానికి తగిన ప్రతిక్రియ చెయ్యలేరు .

ప్రేరణదూరత :

మానవుడు తన భావాల్ని, ఆలోచల్ని వ్యక్తం చేయడానికి మాటలాడుతారు. మనిషి వర్తమాన సంఘటనల

గూర్చేకాక భూతభవిష్యత్ మాట్లాడుతాడు. పశుపక్ష్యాదుల్లో ధ్వనులు మనోవికారాలు కలిగినప్పుడు మాత్రమే వస్తాయి. మానవులకు జంతువులకు వుండే భేదం కూడా ఇదే.

సాంస్కృతిక ప్రసరణ :

మానవుడు సంఘజీవి. సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల్ని మానవుడు ఒక తరం నుండి మరో తరానికి అందిస్తాడు. ఇదేవిధంగా భాష కూడా ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటారు. మనిషికి ఈ శక్తి రావడానికి కారణం అనుకరణ వుండడమే. సాధారణంగా పిల్లలు మాట్లాడే భాషలో తప్పులు వుంటాయి. పెద్దవారు ఆ తప్పుల్ని కనిపెట్టి సవరిస్తారు. ఈ అనుకరణ శక్తి మానవేతర జీవులకు వుంది అయితే వాటిలో సాంస్కృతిక ప్రసరణ లేదు.

ఆధునిక భాషాశాస్త్రం :

భాషను విశ్లేషించి, శాస్త్రీయంగా అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'భాషాశాస్త్ర' అంటారు. ఈ భాషాశాస్త్రంలో సైద్ధాంతిక భాషాశాస్త్రం, అనువర్తిత భాషాశాస్త్రం అని రెండు విధాలుగా చెప్పుకోవడం జరుగుతుంది.

ఉచ్చారణాత్మక ధ్వనిశాస్త్రంలో ధ్వనులు భౌతికంగా ఏవిధంగా స్థానకరణ ప్రయత్నాలతో వెలువడతాయో తెలుసుకోవడం జరుగుతుంది. సాధారణ భాషాశాస్త్ర అధ్యయనానికి ఉచ్చారణాత్మక ధ్వనిశాస్త్రం గురించి తెలుసుకుంటే చాలు. ఆయా అంశాల్లో విశిష్ట పరిశోధన జరిపేవాళ్ళకు మిగిలిన విభాగాలతో పరిచయం ఉండాలి, ఉచ్చారణాత్మక ధ్వనిశాస్త్రంలో ముఖయంత్రంలోని అవయవాల కదలికను మనం చూడటానికీ, అనుకరించి పరిశీలించడానికీ వీలుంటుంది కాబట్టి ఉచ్చారణాత్మక ధ్వనిశాస్త్రం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం ఎంత యినా అవసరం.

వర్ణాలు ప్రవర్తించే రీతిని, వర్ణనిర్మాణ ప్రక్రియను తెలియజేసేది వర్ణనిర్మాణశాస్త్రం. ఇక్కడ వర్ణాల లక్షణాల్ని బట్టి వర్ణభేదాలను గుర్తిస్తాం. వర్ణాలను ఒక క్రమపద్ధతిలో అమర్చడం వల్ల అర్థవంతమైన పదాలు ఏర్పడతాయి.

పదాల్లో పదాంశాలుంటాయి. ఇవన్నీ అర్థవంతమైనవి. ఈ పదాంశాల్ని ఒక్క నియతి క్రమంలో కూర్చడం వల్ల పదాలూ, పదబంధాలూ ఏర్పడతాయి. వీటినన్నింటినీ శాస్త్రీయంగా అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'పదనిర్మాణ శాస్త్ర ' అని పిలుస్తారు. పదాల్ని ఒక క్రమపద్ధతిలో తగిన విభక్తులతో కూర్చగా తయారయ్యేవి వాక్యాలు. ఈ వాక్య నిర్మాణం గురించి, వాక్యభేదాల గురించి వివరించేది వాక్యనిర్మాణశాస్త్రం.

ఆధునిక భాషాశాస్త్రం - పాశ్చాత్యుల కృషి :

పంతొమ్మిదో శతాబ్దారంభంలో యూరప్ ఖండం లోనూ, తర్వాత అమెరికాలోనూ భాషాశాస్త్రంలో నూతన కృషి ప్రారంభమైంది. భాషా శాస్త్రవేత్తలు ఆధునిక భాషాశాస్త్ర ప్రధాన లక్ష్యాలవైపు దృష్టి సారించారు . ఆ లక్ష్యాలలో 1. భాషల నిర్మాణ క్రమపరిశీలన, 2. ఇతర భాషలతోటి తారతమ్య పరిశీలన, 3. భాషల పరస్పర సంబంధ బాంధవ్య నిర్ణయం, 3. భాషల వర్గీకరణ, 5. మూల భాషాపునర్నిర్మాణం, 6. కొత్త భాషను అన్వేషించి వర్ణనాత్మక వ్యాకరణాన్ని రచించటం ముఖ్యమైనవి.

భిన్నకాలాల్లో ఒక భాష పొందిన పరిణామాన్ని తెలిపేవే తులనాత్మక చారిత్రక వ్యాకరణాలు, ఒక భాషను సోదర భాషలతో పోల్చి అందులో వచ్చిన పరిణామాల్ని తులనాత్మక వ్యాకరణం వివరిస్తుంది. ఒక భాషలో ప్రాచీన కాలం నుంచి ఉన్న లిఖిత ఆధారాల మూలంగా ఆ భాషలో కాలక్రమంగా వచ్చిన మార్పుల్ని చారిత్రక వ్యాకరణం సమీక్షిస్తుంది. ఈ రెంటికన్నా భిన్నమైనది వర్ణనాత్మక వ్యాకరణం. ఇది ఒక కాలంలో ఒక భాషా నిర్మాణం ఎలా ఉందో వర్ణిస్తుంది. వర్ణనాత్మక వ్యాకరణానికి చారిత్రకం విషయాలతో నిమిత్తం లేదు .

లాటిన్ భాష రోమన్ భాషగా ఎలా పరిణమించిందో, ప్రాకృతాదులు ఆధునిక ఆర్య భాషలెలా అయ్యాయో, ఆంగ్లో శాగ్జన్ భాష ఆధునిక ఆంగ్లభాషగా ఎలా మారిందో ఈ చారిత్రక భాషాశాస్త్రం నిరూపిస్తుంది . ఇది అనేక ఏకకాలిక భాషాశాస్త్రం విశేషంగా వర్ణనాత్మక భాషాశాస్త్రమీద ఆధారపడింది.

ఆధునిక భాషాశాస్త్రం - తెలుగువారి కృషి :

తెలుగుభాష గురించి అనేకమంది తెలుగు భాషాశాస్త్ర వేత్తలు వివిధరంగాల్లో కృషి చేసి తెలుగు భాషాశాస్త్రాభి వృద్ధికి తోడ్పడ్డారు. వారి కృషిని ఈ కింద వివరించడం జరుగుతుంది. తెలుగు భాషాశాస్త్రవేత్తల్లో మొదటగా స్మరించదగిన వ్యక్తి గిడుగు రామమూర్తి పంతులు (1863-1940). ఈయన మారిన కాల పరిస్థితుల దృష్ట్యా విద్య సర్వజన భోగ్యం కావడానికి, నూతన సామాజిక అవసరాలు తీర్చడానికి వ్యావహారిక భాషయే సమర్థ మైందని సమకాలిక పండితులతో వాదించి వ్యావహారిక భాషను అమలులోకి తెచ్చిన మహనీయులు.

ఇప్పుడు భాషాశాస్త్రరంగంలో సుప్రసిద్ధ లైన భద్రిరాజు కృష్ణమూర్తి , తూమాటి దొణప్ప , బూదరాజు రాధాకృష్ణ , పి.యస్ . సుబ్రహ్మణ్యం , చేకూరి రామారావు లాంటి వారంతా గంటిజోగిసోమయాజి (1890-1987) శిష్యులే.

కోరాడ రామకృష్ణయ్య (1891-1962) చారిత్రక పద్ధతిలో సోదరద్రావిడ భాషలతో సరిపోల్చి తెలుగు సంధి స్వరూపాన్ని విశ్లేషిస్తూ 'సంధి' అనే గ్రంథం రాశారు. రుగాగమ, టుగాగమాలు తెలుగులో లేవని అవి పదగతా లేనని వారి ప్రతిపాదన. పొదరిల్లు, కొమరాలు, శబ్దంలోని రకారం ఆగమం కాదని పొదరు ం ఇల్లు, కొమరుం ఆలు అని సోదర ద్రావిడ భాషల నుండి ఉదాహరిస్తూ నిరూపిం చారు. కాల్డ్వెల్ తెలుగు ద్రావిడ భాషాజన్య సిద్ధాంతాన్ని బలపరుస్తూ 'ఆంధ్ర భాషోత్పత్తి క్రమము-భాషాచరితము. అనే పుస్తకాన్ని రాశారు.

సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యులైన ఆచార్య చేకూరి రామారావు మౌలికంగా భాషాశాస్త్రవేత్త, భాషాశాస్త్ర పద్ధతుల్లో తెలుగు వాక్యనిర్మాణం, 'తెలుగు వాక్యం' అనేది వీరి ప్రామాణిక రచన. నోమ్ చోమస్కీ పరివర్తన సిద్ధాంతాన్ని అన్వయిస్తూ తెలుగు వాక్యాన్ని విశ్లేషించారు.

ఆచార్య జి.యన్.రెడ్డి (1927-1987) భాషకు సంబంధించిన సర్వాంశాలు పరిశోధన యోగ్యాలు అని భావించి శిష్యులచేత పరిశోధనలు చేయించారు. తెలుగు నిఘంటువు, ఇంగ్లీషు తెలుగు ద్విభాషా నిఘంటువు కుమ్మర, వడ్రంగి లాంటి పదకోశాలు, తెలుగు పర్యాయపద నిఘంటువు తయారు చేశారు.

సంస్థానాల మీద, హరికథల మీద అసాధారణ పరిశోధన చేసిన ఆచార్య తూమాటి దొణప్ప సంస్కృత, ప్రాకృత, ఆంధ్ర , ద్రావిడ భాషల మధ్య పద, వాక్య, వ్యాకరణ సంబంధాలను శాస్త్రీయంగా విశ్లేషించారు.

బూదరాజు రాధాకృష్ణ (1932-2006) తెలుగు ప్రాచీన శాసనాలపై పరిశోధన 'ప్రాచీనాంధ్ర శాసనాలు' అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. వీరు తెలుగుభాషపై వివిధ పరిశోధనలు జరిపి తెలుగు భాషాశాస్త్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. తదితరులు

బండి రామకృష్ణారెడ్డి, పి.సి. నరసింహారెడ్డి, వెన్నెల కంటి ప్రకాశం, కె.వి. సుబ్బారావు, గాలి సాంబశివరావు, కస్తూరి విశ్వనాథం, పేరి భాస్కరరావు, కె.కె.రంగనాథా చార్యులు, గారపాటి ఉమామహేశ్వరరావు ఇంకా ఎంతోమంది తెలుగు భాషాశాస్త్ర పరిశోధకులు వివిధ రంగాలలో కృషి చేసి ఆధునిక భాషాశాస్త్రాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు.

ఆధునిక భాషాశాస్త్రం - వివిధ దృక్పథాలు భాషాశాస్త్రం నూతనంగా ఏర్పడ్డ తర్వాత ప్రాంతీయ భేదాల్నిబట్టి, ఆశయఘాన్ని బట్టి, అవసరాల్నిబట్టి పరిశోధకుల్లో వివిధ దృక్పథాలు చోటుచేసుకున్నాయి.

పదాంశ విజ్ఞానం :

భాషలో ధ్వనులు, వర్ణాలు, పదాలు, వాక్యాలు అనేవి ముఖ్యాంశాలు. ఇవి ఒకదాని నుండి ఒకటి ఏర్పడు తాయి. వీటిలో ధ్వని అనేది కనిష్ఠాంశం. వాక్యం అనేది గరిష్ఠాంశం. వాక్యాన్ని చిన్న చిన్న ముక్కలుగా విడగొడితే పదాలు, పదాంశాలు బయటపడతాయి. ఇవన్నీ అర్థవంత మైనవి. ఒక్కోసారి ఒకపదం కూడా వాక్యం కావచ్చు . ఉదాహరణకు అది ఎవరి ఇల్లు ? అని ప్రశ్నిస్తే దానికి

సమాధానంగా 'మాది' అనవచ్చు. ఇది ఏకపదమైనా వాక్యమనే చెప్పాలి. అంటే 'అది మా ఇల్లు' అనే సంపూర్ణ వాక్యానికి సంక్షిప్త రూపం .

పదం :

వాక్యానికి సంక్షిప్త రూపం పదమైనా ప్రతిపదాన్ని సందర్భవిరహితంగా వాక్యం అనటానికి వీల్లేదు. అర్థవంతమైన పదాలను ధ్వనులుగా విడగొట్టవచ్చు. కాని ఆ ధ్వనులకకి అర్థాలు ఉండవు. ఉదాహరణకి 'బొమ్మ' అనే పదాన్ని బ్, ఒ, మ్, మ్ అ అని విడగొడితే అందులో ఉన్న ధ్వనులు ప్రత్యేకంగా తెలుస్తాయి. కాని వాటికి అర్థాలు లేవు. దీనివల్ల విడి ధ్వనులకి అర్థం లేకపోయినా అవి కొన్ని విధాలుగా పరస్పరం కలియడంవల్ల ఏర్పడిన పదాలకి అర్థాలు ఉంటాయని మనం గ్రహించవచ్చు. ఒకే ధ్వనిని కొన్ని సందర్భాల్లో పదంగా ప్రయోగించవచ్చు. ఆ పుస్తకం, ఈ ఇల్లు, ఏఊరు మొదలైన వాటిలో ఆ-, ఈ-, ఏ - లకి అర్థాలు ఉన్నాయి. కాబట్టి వీటిని పదాలుగ పరిగణించవచ్చు. వాక్యంలోని పదాలకు రెండురకాల అర్థాలుంటాయి. ఒకటి నైఘంటికార్థం (Lexical Meaning) రెండోది వ్యాకరణార్థం (Grammatical Meaning). ఏనుగు, గుర్రం, కాకి మొదలైనవాటికున్న అర్థం నైఘంటికం. లు, -కు, -లో ప్రత్యయాలకున్న అర్థం వ్యాకరణార్థం. ఇంకా 'వంట' అనే పదంలోని ట కూడా అర్థవంతమైనదే . 'వండు' అనే ధాతువుకి 'ట' పదాల్లోని అనే ప్రత్యయం చేరటం వల్ల 'వంట' అనే పదం ఏర్పడుతుంది. మంట, పంట అనే ట కూడా అదే అర్థంలో ఉంది. ఇక ' చెప్పాను ' అనే పదంలో 'చెప్పు' , 'ఆ-', '-ను' చెప్పు ఒక క్రియా వ్యాపారాన్నీ, '-ఆ' భూతకాలార్థాన్నీ, 'ను' నేను అనే అర్థాన్ని సూచిస్తాయి. పదాంశాల సమ్మేళనం వల్ల పదాలు ఏర్పడుతాయి. పదాల సమ్మేళనం వల్ల వాక్యాలు ఏర్పడుతాయి. పదాంశాలు ఏవిధంగా కలిసి పదం ఏర్పడుతుంది అని చర్చించేది 'పదనిర్మాణం' పదాలు ఏవిధంగా కలిసి వాక్యం ఏర్పడుతుంది అని చర్చించేది 'వాక్యనిర్మాణం' ఉదాహరణకి రైతులు పంటలు పండిస్తారు అనే మూడు పదాలున్న వాక్యంలో తొమ్మిది పదాంశాలు ఉన్నాయి. అవి రైతు, లుబీ పండు, ట (భావార్థకం), లు (బహువచనార్థకం), పండు, ఇస్(సకర్మకార్థకం), తా (తద్ధర్మ, భవిష్యదర్థకం), రు (మనుష్య బహువచనార్థకం).

సపదాంశం :

తెలుగులో బహువచనాన్ని సూచించడానికి బొమ్మలు లో లు ఉంది. కాని ఇళ్ళులో-ళు ఉంది. అలాగే బాలురులో -రు ఉంది. ఇవన్నీ 'బహుత్వం' అనే ఒకే అర్థాన్ని సూచిస్తాయి. కాబట్టి వీటిని ఒకే అర్థం రూపాంతరాలుగా గ్రహించవచ్చు. ఇలాంటి రూపాంతరాలను ' సపదాంశం '(Allomorph) అంటారు. పదాంశం సపదాంశం- వీటి మధ్య ఉన్న సంబంధం వర్ణం - సవర్ణం మధ్య ఉన్న సంబంధం లాంటిది. అయితే సవర్ణానికి పరస్పర పరిపూరక ప్రవృత్తి వర్ణాత్మకం గానే ఉంటుంది. కాని సపదాం శాలకి ఇది వర్ణాత్మకంగా పదాత్మకం గా గాని ఉండవచ్చు.

పదాంశం - అర్థస్వరూపం :

ప్రతి పదాంశమూ అర్థవంతంగా ఉండాలని చెప్పాం. కొన్నిచోట్ల అర్థం స్పష్టంగా ఉంటుంది. కొన్నిచోట్ల అర్థం ఉన్నదని మనకు తెలిసినా దాన్ని స్పష్టీకరించటం క్లిష్టమవుతుంది. నామాలూ, క్రియలూ, విశేషణాలూ అయిన పదాంశాల (ఉదా. ఇల్లు, వచ్చు, గొప్ప మొదలైనవాటి) అర్థాల్ని వ్యవహర్తలు వెంటనే గ్రహించ గలరు. కాని బహువచన -'లు' , క్వార్థక '- ఇ', శత్రర్థక 'తూ/ -టూ' మొదలైన వాటి అర్థాలను భాషాశాస్త్రజ్ఞులు గుర్తించగలిగినట్టు సామాన్య భాషా వ్యవహర్తలు గుర్తించలేదు. పదాంశం రూపభేదాలు :

ప్రతి పదాంశానికి ఒక రూపమూ, అర్థమూ ఉంటా యని చెప్పుకున్నాం. క్వాచిత్కంగా భాషల్లో నిర్మాణాన్ని బట్టి రూపం లేకుండా అర్థం ఉన్నవి. అర్థం లేకుండా రూపం ఉన్నవి కూడా సపదాంశాలుండవచ్చు. ఒక పదాంశానికి చాలా పదాల్లో రూపాంతరాలు కనిపిస్తూ,

అదే పరిసరాల్లో కొన్ని పదాల్లో రూపం లేకపోయినా ఆ పదాంశర్థం వస్తుంటే శూన్యరూపంగా ఆ పదాంశం ఉన్నట్టే గుర్తించాలి. వీటిని రూపశూన్య నవదాంశాలన వచ్చు. తెలుగులో వ్యతిరేక క్రియల్లో మూడు పదాంశాలుంటాయి. ధాతువు, వ్యతిరేకార్థక ప్రత్యయం అ-, పురుషార్థక ప్రత్యయం.

ఉదా :

చెప్ప్- అ-డు; వండ్ - అ - డు, అమ్ అ-డు; తిన్ - అ - డు,

కొన్ -అ- డు ; పిలవ్ - అ-డు

కాని 'తెచ్చు' 'ధాతువుకు 'తేడు', 'వచ్చు' ధాతువుకు 'రాం'డు' వ్యతిరేక రూపాలు. వీటిలో వ్యతిరేకార్థాన్ని బోధించే '-అ-' ప్రత్యయం లేకపోయినా దాని అర్థం నిలిచి ఉంది. ఉండవలసిన అ - అనే రూపం లేక పోయినా ఆ అర్థం వస్తుంది. కాబట్టి '- అ - రావలసిన స్థానంలో '0' గుర్తుపెట్టుకొని దీన్ని ' రూపశూన్య సపదాంశం' అనవచ్చు. ఈ క్రియల్లో వ్యతిరేకార్థకతను సూచించే పదాంశానికి రెండు సపదాంశాలున్నాయని సూచించవచ్చు. 1. - అ -, 2 - 0 -. భాషల్లో శూన్య సదాంశాలుంటాయి. కాని శూన్యపదాంశాలుండవు . అంటే ఒక పదాంశానికి రూపం. క్వాచిత్యంగా లేనిచోట్ల నిర్మాణ పూరణ దృష్టితో సృష్టించుకున్నది శూన్యసపదాంశం. అర్థం స్పష్టంగా లేకపోయినా రూపం కనిపించే పదాంశాలు కూడా కొన్ని ఉన్నాయి. ఉదా. పల్లెటూరు, దుక్కిటెద్దు, పేదరాలు మొదలైన వాటిలో ఆగమాలుగా వచ్చే '-ర్-' వర్ణాలు పూర్వపర పదాంశాల్లో వేటికీ చెందవు. పల్లె, దుక్కి, పేద, ఊరు, ఎద్దు, ఆలు అని వ్యస్తంగా కూడా వీటి రూపాలు కనిపిస్తాయి. '-ట్' -, '-ర్'- రూపాలకు ప్రత్యేకమైన అర్థం లేదు. కాబట్టి వీటిని అర్థశూన్య పదాంశాలు అనవచ్చు. కాని ఒక దృష్టితో చూస్తే 'పల్లె - ఊరు' , 'దుర్తి - ఎద్దు' , ' పేద - ఆలు' అనే పదాలు ఆగమ రహితంగా రావు కాబట్టి ఈ రెండు రూపాల సార్థకత, ప్రయోగ యోగ్యత ఈ ఆగమాల వల్లనే సిద్ధిస్తుంది కాబట్టి రెండేసి పదాలను కలపటమే వీటి అర్థంగా చెప్పు కోవచ్చు. అలాంటప్పుడు అర్థశూన్య పదాంశాలు భాషలో ఉండవనే చెప్పవచ్చు. వీటి అర్థం భాషా నిర్మాణపరమైనదిగాని విశ్వజ్ఞాన పరమైనది కాదు. పదహారు, పదిహేడు మొదలైన వాటిలో వచ్చే 'హ' కారం ఇలాంటిదే.

పదాంశాలు - పరిసరభేదాలు :

పదాంశానికి ఒకటికంటే ఎక్కువ రూపాలు ఉండ వచ్చుననీ, అవి ఎప్పుడూ భిన్న పరిసరాల్లోనే వస్తుంటా యని, అలాంటి పరిసరభేదాన్ని బట్టి వాటి రూపభేదం సూత్రప్రాయంగా నిరూపించవచ్చుననీ అనుకున్నాం. సపదాంశాలకు రూపంలో కొద్ది తేడాలుంటాయి. కాని అర్థంలో మార్పుండదు. ఇలా కొద్ది తేడాలతో వచ్చిన రూపాంతరాలనన్నిటినీ ఏకపదాంశ భాగాలుగా గుర్తిం చాలి.

ప్రతి సపదాంశమూ వేరువేరు పరిసరాల్లో వస్తుంది. కాని రెండు, మూడు సపదాంశాలకు ఒకే పరిసరం ఉం డదు.

1. వస్- తూ- : వస్తూ, వచ్- ఇ : వచ్చి, రా-క : రాక
2. విన్ - టూ : వింటూ, విన్ - ఇ : విని, విన్ - అక : వినక
3. చూస్- తూ : చూస్తూ, చూస్ -ఇ : చూసి, చూడ్- అక : చూడక

మొదటివరసలో ధాతువు వస్-, వచ్-, రా- అని మూడు రూపాలతో కనిపిస్తుంది. ఈ మూడూ మూడు రకాల పరిసరాల్లో వస్తున్నాయి. అచ్చు ముందు 'వచ్' అని, తకారం ముందు 'వస్' అని , ఇతరత్రా 'రా' అని. ఈ పరిసరాలను తారుమారు చేస్తే అనిష్టరూపాలు ఏర్పడుతాయి. (వసి , వచ్ - తూ, వస్క) ఈ నియమాన్ని తెలుగు మాట్లాడే ఏ వ్యవహర్తా ఉల్లంఘించలేదు. ఇలాంటి ప్రవృత్తిని 'అన్యోన్య పూరకవ్యాప్తి' అని అంటారు. ఒక పదాంశానికి చెందిన సపదాంశాలను ఈక్రింది విధంగా సూచిస్తారు .

వచ్, వస్ , రా 'come' , విణ్ , విన్ 'hear', చూస్, చూడ్ 'see'

తూ , టూ - శత్రర్థక ప్రత్యయం, అక, 0 - వ్యతిరేక క్వార్థక ప్రత్యయం, ఇ - క్వార్థక ప్రత్యయం

సపదాంశభేదాలు పరిసర పదాంశ భాగాలైన వర్ణాల ఉచ్చారణను బట్టి నిర్దేశించటానికి వీలవుతుంది . 'తూ' లో 'త' వర్ణం 'వస్' లో ఉన్న ' స' వర్ణం దంత్యాలుబీ 'వచ్ - తూ' అనే రూపం తెలుగు ఉచ్చారణలో సాధ్యం కాదు. కాబట్టి చవర్ణం సవర్ణంగా మారింది. ధాతు సపదాంశంలో ఉన్న వర్ణాల ఉచ్చారణకు పరిసర సప దాంశాల ఉచ్చారణకు సన్నిహిత సంబంధం నిరూపించ వచ్చు. కొన్నిటిమధ్య ఇలాంటి సంబంధం నిరూపించటం సాధ్యం కాదు. మెచ్చి , మెచ్చక ' అనే రూపాలు భాషలో ఉన్నా 'వచ్చి, వచ్చక' అనేవి లేవు. 'వచ్' స్థానంలో 'రా' ఉండటానికి 'అక'లోని వర్ణాల ఉచ్చారణకు సన్నిహిత సంబంధం లేదు.

ఒక ప్రత్యేక సందర్భంలో ప్రయుక్తమై దానితో వచ్చే రూపాలు స్వతంత్ర ప్రయోగార్హత కలవిగా గాని, లేదా బహుళ వ్యాప్తిలో ఉన్నవిగాని ఉన్నప్పుడు : పట్టపగలు, నట్టనడుమ , చిట్టచివర , మొట్టమొదట వంటి వాటిలో పట్టు , నట్ట , చిట్టూ , మొట్ట మొదలైనవి పగలు, నడుమ, చివర, మొదట అనే వాటితోనే వస్తాయి కాని మరి ఏ ఇతరపదంతోనూ రావు. కాని పగలు మొదలైనవి స్వతంత్ర ప్రయోగార్హత కలవి కాబట్టి ఇవి పదాంశాలని మనం సులభంగా గుర్తించవచ్చు. వీటితోపాటు, రావడం వల్ల పట్ట - మొదలైనవి కూడా ప్రత్యేక పదాంశాలని గుర్తించవచ్చు. ఇవి అతిశయం అనే అర్థాన్ని సూచిస్థాయి. కూరా నారా, పొలంపుట్రా మొదలైన పదబంధాల్లో రెండో అంశం మొదటి అంశంతో మాత్రమే కలిసి వస్తుంది. వీటిలో మొటి అంశం పదాంశమని సులభంగా తెలు స్తుంది. కాబట్టి రెండో అంశాన్ని కూడా పదాంశంగా పరిగణించాలి.

ఆధార గ్రంథాలు :

1. అనంతరామశాస్త్రి, నేతి, 2001. ఆధునిక తెలుగు భాషాశాస్త్ర విజ్ఞానం, హైదరాబాదు: ఓరియంట్ ల్మాన్. కృష్ణమూర్తి, భద్రిరాజు, 1974. తెలుగుభాషాచరిత్ర , హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
2. దొణప్ప, తూమాటి. 1972. భాషాచారిత్రక వ్యాసావళి, హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
3. భాస్కరరావు, టి. (స్ఫూర్తి శ్రీ), 1979, తెలుగు భాషాచరిత్ర, గుంటూరు : మహతీ గ్రంథమాల.
4. మహాదేవశాస్త్రి, కోరాడ, 2014. భాష సంస్కృతి, అనంతపురం : సరస్వతీ ప్రచురణలు .
5. రాజేశ్వరి, శివుని, 2012. ఆధునిక తెలుగు భాషానిర్మాణం, తిరుపతి : తెలుగు అధ్యయనశాఖ.
6. రాధాకృష్ణ, బూదరాజు, 1990. భాషాశాస్త్ర వ్యాసాలు, హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
7. రామంజునేయులు,కె. 2015. ఆధునిక తెలుగు భాషాశాస్త్ర సంగ్రహం, కృష్ణ చైతన్య పబ్లికేషన్స్, హైదరాబాదు.
8. సుబ్రహ్మణ్యం , పి.యస్ . 1984. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు, హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
9. రామారావు , చేకూరి , 1975. తెలుగు వాక్యం , హైదరాబాదు . ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
10. వెలమల సిమ్మన్న, 2012. ఆధునిక భాషాశాస్త్రం, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, విశాకపట్నం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డా॥సి.నారాయణరెడ్డి సినీగీతాలు – జానపద సాహిత్యంతో సంబంధాలు సామాజికత

– డా॥. యం.వెంకటలక్ష్మమ్మ, తెలుగు అధ్యయన శాఖ, సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు.

'నాపేరు కవి
ఇంటి పేరు చైతన్యం
ఊరు సహజీవనం
తీరు సమభావం
'నావచనం బహువచనం
నాపదం సామ్యవాదం
కవిత్వం రాయలేదు ఇవాళ

అన్న కవిత్వం రాయనిదే వుండలేనని చెప్పిన డా.సి. నారాయణ రెడ్డిగారు 29.7.1931న కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల (తాలుకా) హనుమాజి పేట గ్రామం నందు జన్మించారు. వీరి 1988లో విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ్ అవార్డు వచ్చింది.

'ప్రతి సంప్రపదాయము ఒకనాటి ప్రయోగమే ప్రతి ప్రయోగము ఒకనాటి సంప్రదాయము కాకతప్పదు' అని సి.నారె వారు వాటి ఆవశ్యకతను చెబుతారు.

తెలుగువారి ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి అయితే కాలంతో పాటు అభివృద్ధి ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి, అయితే కాలంతోపాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటికప్పుడు తమ సంస్కృతిలోకి కొత్తనీరును ఆహ్వానించడం సహజం. ఈ పాత కొత్తల మేలు కలయికే ఒక జాతిని చైతన్యంలో నింపుతుంది.

మానవ సంస్కృతిలో జానపద విజ్ఞానం ఒక భాగం. జానవదులకు నంబంధించిన నర్వవరిజ్ఞానం జానపదవిజ్ఞానం అవుతుంది. ఆ విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక ప్రధాన శాఖ. అయితే వాగ్రూపంలో వున్న కథలు, గేయాలు, గేయకథ లాంటివి జానపద సాహిత్యం అవుతుంది. జానపద విజ్ఞానం అంటే మౌఖిక ప్రచారంలో వున్న 'పుక్కిటి పురణాలు, ఐతిహ్యాలు, జానపదకథలు, సామెతలు, పొడుపుకథలు సాంప్రదాయాలు, కవిత్వం మరియు కళాత్మక వ్యక్తీకరణం వున్న అనేక యితర ప్రక్రియలు అన్నీ తెలిపొడు.

ఇక్కడ నేను డా॥సి. నారాయణరెడ్డిగారు రాసిన పాటలు, ఘంటసాల గారు గానం చేశారు. ఆ పాటలను వంద పాటల దాక పరిశీలన చేసి అందులో వున్న వస్తువును జానపద సాహిత్యంతో మేళవించి రాయడం జరిగింది.

సి.నా.రెగారు రాసిన పాటలు ఎక్కువగా వుండటం చేత వీటిని విభజన నాసౌలభ్యం ప్రకారం చేయడం జరిగింది.

1. కుటుంబ కథా గీతాలు
2. భక్తి సంబంధ గీతాలు
3. భాషాసంబంధ గీతాలు

అయితే ప్రతిగీతం ఏ సందర్భంలో పాడారో, వాటి అర్థాన్ని విడమరిచి చెప్పడంతో పాటు, ప్రతిగీతంలో వాడే పదాలు, వస్తువులు, వేడుకలు, పాటించే సంప్రదాయాలు గూర్చి కూడ చెప్పడం జరిగింది.

కుటుంబ సంబంధ గీతాలు :

కుటుంబ సంబంధమునకు సంబంధించినవి, అమ్మ, నాన్న, చెల్లి, బిడ్డల బాంధవ్యాలను వాటి సందర్భాన్ని బట్టి చెప్పడం జరిగింది. అవిధంగా చూసినట్లైతే

2.1 1962 ఆత్మబంధువు' అనే సినిమాకు సి.నా.రెగారు ఈ గీతం రాయడం జరిగింది. "అనగానగాఒక రాజు,

అనగనగా ఒకరాణి, రాజు గుణము మిన్న, రాణి మనసు వెన్న అన్న ఈ గీతంనందు పూర్వం జానపదులు తమ పిల్లలకు, మనుమలకు మనుమరాళ్ళకు అనగా ఒకరాజు, అనగనగా ఒకరాణి అని కథను మొదలు పెట్టి పిల్లలకు అన్నంతినిపించడం, నిద్రపుచ్చడం చేస్తునే పరోక్షంగా పిల్లలకు నైతిక విలువలను ఉగ్గుపాలతో రంగరించి పోసేవారు. అందుకే సి.నా.రె గారు ఈ గీతంలో రాజుకు ఏడుగురు కొడుకులన్నారు, వారు చదువువుండి కూడ, చవటలు, పడక మీద తుమ్ముముళ్లు పరచేవాడు ఒకడైతే, మరి ఒకరు యింటి దీపం ఆర్పించేవాడని, ఇంకొకకడు తల్లిదండ్రులు విషమని భావించే వాడని, జానపదులు సామెతలు చెప్పినట్లుగా 'తల్లి అల్లం పెళ్ళాం బెల్లం' అని ఆ విధంగా పడుచు పెళ్ళామే బెల్లమని భ్రమపడేకొడుకు మరి యొకడు అని చెప్పారు. ఇలా చెబుకుంటూ పోతే

అలాంటి కొడుకులతో పాటు కుక్కను కూడ ప్రేమతో పెంచారని, అదే వారిని గౌరముగా, కంటిపాపవలే కాపాడుతూ గుండెల్లో గూడు కట్టిందని జాలి గుండెలేని కొడుకులకంటే ప్రేమగలిగిన వారంతా కొడుకు లేనని సమాజానికి చాటి చెప్పారు.

'జీవన తరంగాలు' 1973లో వచ్చిన సినిమా, సంగీతం కూర్చిన వారు జె.వి రాఘవులు,

'ఉడతా ఉడతా హుత్
ఎక్కడకెళతా హుత్
కొమ్మమీది జాంపండు
కోసుకొస్తావా మా బేబికిస్తావా'

ఇందులో సి.నా.రెగారు జానపదులు పాడుకునే పిల్లల పాటలో మొదటి రకమైన పెద్దలు పిల్లలకోసం పాడే సరళిని, పదాల విధానంను ఈ గీతం నందు వాడడం జరిగింది.

పసిపిల్లలకు మాటల ఉచ్చారణ సరిగా రావడానికి వారు ఉల్లాసంగా చిట్టి పొట్టి అడుగులు వేయడానికి కడుపు నిండ భోజనం చేయడానికి, తల్లులు తండ్రులు అమ్మమ్మలు, నాయనమ్మలు ఎక్కువగా పిల్లను దగ్గరికి తీపుకొని కాని, ఎత్తుకొని కాని, నడకలు నేర్పుతూ ఇలాంటి బాలగేయాలను పాడుకోవడం తెలుగువారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్య.

'చిలకల పంచదార పలుకులను
జింకల చెంగున చెంగున పరుగులను'

కొమ్మమీద జామపండులను' చూపుతూ సినారె గారు చిన్ననాటి స్మృతులు అందరికి జ్ఞప్తికి తెస్తూనే గేయాలకున్న గొప్పతనమును అనుబంధాలను సమాజానికి తెలియజేస్తున్నారు. అందుకే అలాంటి మరో గీతం 'ధర్మదాత - 1970'లో వచ్చిన సినిమా సంగీత టి. చలపతిరావు.

ఓ.....నాన్న....ఓ నాన్న...

ఓ...నాన్న నీమనసే వెన్న, 'అమృతం కన్నా అది ఎంతో మిన్నా' ఈ గీతంను పరిశీలించినట్లైతే, ప్రతి ఒక్కరికి తనతండ్రీ కళ్ళఎదుట కనబడుతారు. తండ్రీ ప్రేమ, బాధ్యత,, బరువు, కష్టాలు, నష్టాలు గుర్తుకు వస్తాయి. అంత గొప్పగా రాశారు. బహుశా తండ్రి గూర్చి ఇంత గొప్పగా ఎవరూ రాయలేరేమో, ఇలాంటి కథాబలమున్న పాటలు జనంలో స్థిరంగా నిలిచిపోతాయి. తల్లి చని పోగానే నీ చేతులమీద పెంచావు. ఎన్నో కష్టాలు పడ్డావు. నా కడుపునిండా నింపావు. ముళ్ళబాటలో నీవు నడిచావు, పూలతోటలో నన్ను నడిపావు, ఊగింది ఉయ్యాలలో నైనా, నేను దాగింది నీ చల్లని ఒడిలోన, నీ రాచగుణమే, నీ మూలదనం నీవే పాలిదైవం అంటూమరో రచయిత చెప్పనంత గొప్పగా, ప్రేమగా తండ్రిని గూర్చి చెప్పాడు. సమాజంలో మరి కొడుకు తండ్రి విలువను గుర్తించ కుండ వుండరు. వీరిపాట వింటే అంతగొప్పగా వుంది. అలా సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన మరో గీతం.

'బంగారు గాజులు 1968లో వచ్చిన సినిమా' ఈ సినిమాకు టి. చలపతిరావు గారు సంగీతం కూర్చగా ఈ పాటను సినారె గారు రాశారు. ఈ గీతంను మనం

పరిశీలించి చూచినట్లైతే ఇది ప్రజల్లో ఎలా దూసుకెళ్ళిందో తెలుస్తుంది.

'చెల్లాయి పెళ్ళికూతురాయెను
పాలవెల్లువలే నాలో పొంగియెను'

అంటూ ప్రతి అన్న తన చెల్లి మందారవల్లిలా, బంగారు తల్లిలా వుంటుందని ఇటువంటి చెల్లి ఎన్ని జన్మలెత్తినా మళ్ళీ కావాలని, ఆమె బంగారు గాజులు తొడుగుకొని, జడలో అందాల జాజిపూలు పెట్టుకొని, పెళ్ళిపీటలపై కూర్చోవాలని ఆ విధంగా తన చెల్లి వుంటే అదే తనకు నిజమైన దీపావళి అని తన చిన్నారి చెల్లికి పెళ్లైతే, ఆమె పోన్నారి భావతో అత్తారింటికి వెళుతుంటే ఈ అన్నయ్యకు కన్నీరు ఆగదని అది పన్నీటి వాగై సాగుతుంది. అని తన చెల్లి యొక్క ప్రేమను, అన్నయ్య ప్రేమను మెండుగా చెప్పారు సి.నా.రె గారు.

బంగారు గాజులు, అందాల జాజులు, పెళ్ళిపీటలు, ఇవి తెలుగువారి ఆచార సంప్రదాయాలలో స్త్రీలకు ఎంతో ప్రీతి పాత్రమైనది అలంకరణ ముఖ్యంగా గాజులు పూలు సౌభాగ్యానికి గుర్తుగా స్త్రీలు భావిస్తారు. అలాగే తెలుగువారి సంప్రదాయాలలో వివాహంనకు కూడా ఎంతో ప్రాధాన్యం. ఒక పెళ్ళి చేయాలంటే పెళ్ళిపీట తప్పనిసరి.

'ధర్మదాత 1970లో' వచ్చిన సినిమా సంగీత కూర్చిన వారు. టి. చలపతి.ఇలాంటి పాటలు సమాజంపై తప్పని సరిగా ప్రభావం చూపించాయని చెప్పవచ్చు. అటువంటి మరో గీతం రావుగారు ఇందులో సి.నా.రె గారు రాసిన పాట పిల్లలపాట ఇది పసిపిల్లలపాటలో కథా గేయం ఈ గేయం నందు

'జో...లాలి, జో...లాలి' అంటూ పాటను మొదలు పెట్టి అందులో తల్లి చిన్నప్పుడే చనిపోయిందని, ఆ తల్లి మిగిల్చిన బంగారు జ్ఞాపకానివని, నీవు ఏడిస్తే నేను చూడలేనని, నిను వీడి నేను క్షణం అయిన వుండలేనని, రతనాల భవనంలో నిన్ను వుంచలేను. ముత్యాల ఉయ్యాల లూగించలేను కాని కనుపాపలా నిన్నుకాపాడు కుంటానని ఓ తండ్రి బిడ్డను లాలిస్తూ చెప్పిన సంగతులు.

వాస్తవంగా ఆలోచిస్తే ప్రతి తండ్రీ తన కూతురును లాలిస్తూ చెప్పిన సంగతులు ఇలాగే చూస్తూ లాలిస్తాడు. ఇది తండ్రి బిడ్డల అనుబంధానికి చిహ్నమైన మంచిపాట.

భక్తి సంబంధ గీతాలు :

భక్తి సంబంధ గీతాలను అందరూ సృష్టించలేరు. సుఖదు:ఖాత్మకమైన జీవితాన్ని అనుభవించి, సంసార చక్రంలోని కష్టనష్టాలను అనుభూతిలో తెలుసుకొని , జిజ్ఞానంతో భగవంతుని వేడుకోవడం ఇందులో గమనించవచ్చు.

'సర్వమంగళమాంగల్యే శివే సర్వార్థసాధికే
శరణ్యే త్రతయంబికే దేవి నారయణి నమోస్తుతే'

అంటూ సినారె గారు గీతంను మొదలు పెట్టిన ఇది ఒక జానపద భక్తి కథాగేయం మాదిరిగా వుంది. ఎందుకంటే ఇందులో మంత్రతంత్రములు,మాయలు, క్షుద్రుల పీడన బలి నుండి నిరపరాదులైన తల్లిదండ్రు లను కాపాడమని, అమ్మ వారైన ఈశ్వరీని వేడుకుంటారు. ఇందులో కథను పరిశీలించిన ఇది తెలుగువారి ఆచారము. ఇందులో జానపదుల సంస్కృతి సాంప్ర దాయములైన, పూజలు, వ్రతాలు, మంత్ర తంత్రములు, మందులు మాయలు, క్షుద్రపూజలు, బలి మొదలగునవి జానపదులు జీవన విధానంలో భాగములు.

మానవులు పూర్వం నుండి తనకు ఏ కష్టం వచ్చిన, రాక పోయిన భగవంతున్ని స్మరించడం, కొన్ని విధానాలైన ఆచారాల ద్వారా భగవంతుని ప్రసన్నం చేసుకుంటారని రచయిత చెప్పకనే ఆచార సంప్రదాయల గూర్చి ప్రస్తావించడం జరిగింది.

'శ్రీకృష్ణాంజనేయ యుద్ధం - 1972లో వచ్చిన సినిమా దీనికి టి.వి రాజు గారు సంగీతం కూర్చారు ఈ సినిమాలో

'రామా....రఘురామా
ఎన్నాళ్ళు వేచేను ఓ రామా, నీకు ఇకనైనా దయరాద శ్రీ రామ'

అంటూ 'రామాయణం సంబంధపు ' గీతం రాశారు. ఇది కూడ జానపద కథాగేయం. జానపద సాహిత్యంలో గేయాలు ప్రధానంగా రెండు రకాలు గీతం 'రామా ...రఘురామా' అనే దానిలో సీతమ్మ క్షేమ సమాచారం, లక్ష్మణుని ప్రాణం నిలిపారు, మహిరావణుని గుట్టు చెప్పారు. నిన్ను వీపున మోసాను, ఇంత కొలిచన నీ పదదాసుని చేరగరావయ్య అంటూ శ్రీ అంజనేయుడు, శ్రీ రామచంద్రున్ని వేడుకుంటున్నట్టుగా చెబుతూ రామ యణ కథను ప్రజలకు వినిపించుచున్నాడు. రామమా యణం విన్న చదివిన పుణ్యం లభిస్తుంది. మోక్షం సిద్ధిస్తుంది అంటారు. ఈ విధంగా ఎన్నో నైతిక ధర్మాలు కలిగిన రామాయణంను ప్రజలు తెలుసుకోవాలనే ఉద్దేశ్యం కూడా ఇందులో కన్పిస్తుంది.

భాషా సంబంధగీతాలు :

భాష భావ వ్యక్తీకరణ సాధనం. తెలుగుగభాష అమ్మ భాష, మాతృభాష, ఉగ్గుపాలతో రంగరించి పోసిన భాష అలాంటి భాషామాధుర్యాన్ని మేళవించిన రాసిన గీతాలు.

'విచిత్ర కుటుంబం- 1969లో'వచ్చిన సినిమా టి.వి రాజు సంగీతం కూర్చారు.

'ఆడవే, ఆడవే జలకమ్ములాడవే'

ఈ గీతమునందు ఆడవారిని డాన్సు చేయమంటూనే నన్నయ అవతరించిన నేలయని, తెలుగుభారతి అందియలుపల్కే నేలయని తెలుగు నేల, తెలుగుభారతి గొప్పదని చెబుతూ నాగర్జుని బోధన. బౌద్ధమత వృక్షంబు, రాయల పాలన పల్లవించిన చోటని చెబుతూనే, ఇంకా గోదావరి, కృష్ణవేణి, తుంగభద్రా నదులు గల గల ప్రవ హించే నేలయని అటువంటి గొప్పతనాన్ని గూర్చి సి.నా.రె గారు సినిమాకు గీతం రాసిన ఈ గీతం కేవటం సినిమాకే కాకుండ ఆ పాటనందు తెలుగుజాతి గొప్పతనం, ఔన్నత్యం, కిర్తీని ప్రజలకు గుర్తు చేయడం జరిగింది. ఈ విధంగా తెలుగు వారి సంస్కృతిని సమాజానికి చాటి చెబుతున్నారు. అలాంటి మరో గీతం అమరశిల్పి జక్కన్న డా.సి.ననారాయణరెడ్డి గారు గీత రచన యన్. రాజేశ్వరరావు సంగీతం కూర్చాడు. అందులో

'ఈ నల్లనిరాలలో ఏ కన్నులు దాగెనో
ఈ బండలమాటున ఏ కన్నులు దాగెను'

ఇందులో 'జీవమున్న మనిషికన్న శిలనే నమయని పించును' అనే సందేశంను సమాజమునకు చాటి చెబుతున్నారు. పాపాలకు , బహుదూరంలో, మునులవలె కారడవిలో పడివున్నవని, కధలలేవు. మెదలలేవు. పలకవు, ఇవే మనిషికన్న మేలని, మనుష్యులు రాతి బండకంటే కఠినమైన వారని మనుష్యులలో వుండే లోపాలను రచయిత ఎత్తిచూపుతూ, సమాజం మార్పు కోరు కుంటున్నారు.

నిజంగా చెప్పాలంటే ఈ పాట జన హృదయంలో నిలిచిపోయిన పాట అలాంటి మరోగీతం 'తిక్క శంకరయ్య 1968లో వచ్చిన సినిమా' సంగీతం టి.వి.రాజు. సి.నా.రే గారికి ఆచారలన్న, సంప్రదాయాలన్న ప్రాణం అని వారి రాసిన గీతాలను పరిశీలించినట్లైతే తెలుస్తుంది. ఈ గీతంను పరిశీలిద్దాము.

'హై....ఐరస బజ్జా పిల్లమ్మ అరెరెర బుల్లెమ్మా
ఐసర బజ్జా పిల్లమ్మ అరెరెరెరె అరెరె బెల్లెమ్మ
ఓ.....ఓ.....ఓ....ఓ....య్య.'

అద్దిరబన్నా ఓ రాజూ హాయిరే హాయిరే నారాజా' ఈ గీతంనందు తెలుగువారు ఆనందంతో, ఆశ్చర్యంతో పలికే పదాలు హై, ఆహాహా, అరెరె, ఓహో, హయ్‌రే లాంటి పదాలను మనం గమనించవచ్చు. అంతేకాక తెలుగువారి పేర్లు బుల్లెమ్మ, బుల్లోడు ఇవి కూడా గమనించవచ్చు. అంతేకాక ఈ గేయం గీత రచయిత సి.నా.రెగారు తెలుగువారి పాడుపుకథలను రాశారు. ఇందులో సందేశాత్మకమైనవి, వైద్యానికి సంబంధించిన పాడుపు కథలను రాశారు. ఇవి గమనిద్దాం.

'చిటారు కొమ్మన మిఠాయి పొట్లం
కాళ్ళా గజ్జా కంకాళమ్మ

వేగు చుక్కా వెలగా పండు
కిటకిట తలుపులు, కిటారి తలుపులు
ఎప్పుడు చూసిన చప్పుడుకావు
పిల్లపేరు మల్లెమొగ్గ, నాపేరు జమిందారు.

ఇవన్ని జానపదులు జనజీవనా నిత్య జీవితంలో వాడుకునే పొడుపు కథలు మరియు గేయాలు పదాలు బహుశా ఇవి సమాజమును మళ్ళీ బాల్యంలో వెళ్ళి, తెలుగు వారి మధురస్మృతుల గుర్తుకోసం వుండవచ్చు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అమెరికా తెలుగు కథానిక – వస్తు వైవిధ్యం

– డా॥. ఎన్. ఈశ్వరరెడ్డి , సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

కథానిక దేశ కాలమాన పరిస్థితులకు దర్పణంగా నిలిచే సాహిత్య ప్రక్రియ. ఆధునిక సాహిత్యం నవలగా, కవిత్వంగా, గేయంగా, నాటకంగా విభిన్న రూపాలతో విస్తరిస్తున్నా, కథ లేదా కథానిక రూపం మానవ సమాజ చిత్రణలో ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. సంఘటనలు, సందర్భాలు, సమస్యలు, మానవ మనస్తత్వాలు మొదలైన అంశాలను ప్రపంచానికి చెప్పడంలో కథానిక ప్రక్రియ ఒక అడుగు ముందు నిలబడుతోంది.

అమెరికాలో స్థిరపడ్డ తెలుగు వారి జీవితాల్లో తొంగి చూసిన సమస్యలకు లేదా జరిగిన సంఘటనలకు ప్రతి రూపంగా వచ్చాయి అమెరికా తెలుగు కథానికలు. వాస్తవాలను, జరిగిన సంఘటనల నేపథ్యంలో అమెరికాలోని తెలుగు కథకులు కథలను రాసినట్టే కనిపిస్తోంది. 'తెలుగువారు ప్రపంచంలోని ఏ దేశంలో ఉన్నా, తెలుగు తనంలోని సంప్రదాయాలను, ఆలోచనలను వదులు కోరు' అని అమెరికా తెలుగు కథానికలు నిదర్శిస్తున్నాయి.

2006 అక్టోబరులో వంగూరి ఫౌండేషన్స్ ఆఫ్ అమెరికా వారు ప్రచురించిన 'అమెరికా తెలుగు కథానిక' (తొమ్మిదో సంపుటి) లోని కథలు అక్కడి జీవితాన్ని విభిన్న రీతిలో చిత్రించాయి.

'దూరపు కొండలు నునుపు' అన్న సామెత అచ్చంగా అమెరికా అందాన్ని కలలుగనే భారతీయులకు వర్తిస్తుంది. ఒక ప్రాంత ప్రభావం మనిషిపై ఎంత ఉంటుందో, వేరొక సమాజ బలహీనతలు కూడా అంతే ఉంటాయని తెలిపే వరకట్న వేధింపుల సంగతుల నుండి మంచు తుఫానుల్లో కూరుకుపోయి పడే ఇబ్బందుల వరకు అమెరికాలో భారతీయులు జీవిస్తున్న విధానాన్ని అమెరికా తెలుగు కథానిక ప్రస్ఫుటంగా తెలియజేస్తోంది.

గృహ హింస

అందమైన అమెరికా కలలుగనే అమ్మాయిలకు, వారి తల్లిదండ్రులకు హెచ్చరికలు పంపిన కథ 'మరణ ముహూర్తం'. సత్యం మందపాటి ఈ కథా రచయిత.

ఈ కథలో 'కోటి కలలతో అమెరికాలో అడుగు పెట్టిన సునేత్ర ఒక ఒరిస్సా అమ్మాయి. అమెరికన్ సిటిజన్, మెక్కాలెస్ అనే ఊర్లో ఉంటుంది. అదనపు కట్నం కోసం వేధించే మొగుడు పెట్టే చిత్రహింసలు భరించలేక మొగ్గుణ్ణి చంపేస్తుంది. అనాథలైపోయే పిల్లలను కూడా కడతేర్చి, చివరికి తానూ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. భర్త పిల్లలు చనిపోతారు. ఆమె ప్రాణాలతో మిగిలిపోయి జైలు పాలౌతుంది. మరణ శిక్ష విధిస్తారు. ఆమె మానసిక పరిస్థితి చక్కబడ్డాక శిక్ష విధించాలని ఎదురుచూస్తూ, మానసిక వైద్యురాలితో కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. "జైల్లో డెట్ రోలో మరణశిక్ష కోసం ఎదురు చూస్తూ నరకం అనుభవిస్తోంది. తలను గోడకు కొట్టుకొని చావాలని ప్రయత్నిస్తుంది. ఒక రోజు పోలీసు నుండి తుపాకీ లాక్కొని చావాలని ప్రయత్నం చేస్తుంది. మరో పోలీసు చేతిలో ప్రాణాలు కోల్పోయింది" ఇదీ సునేత్ర కథ.

నరక కూపంలో ఏడేళ్ళు కాపురం చేసి, ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా అదనపు కట్నం కోసం మాటలతో చేతలతో రోజూ వేధించే భర్త నుండి దూరంగా వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తుంది సునేత్ర. అతను వెళ్ళనివ్వలేదు. ఇండియాకు వెళ్ళనివ్వక, ఫోన్ చేసుకునే అవకాశాన్ని కూడా లేకుండా చేసి, గొంతు పట్టుకొని నులుముతూ చంప చూస్తున్న భర్త నుండి విముక్తి పొందడం కోసం, చివరికి భర్తను హతమార్చే అంత తీవ్ర నిర్ణయానికి 'సునేత్ర' రావడం సగటు మనిషిని ఆలోచనలో పడేస్తుంది.

అమెరికా, సాఫ్ట్‌వేర్ మోజులో పడి ఆడపిల్లల్ని కట్టబడితే, వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందనే వాస్తవాన్ని గ్రహించేలా చేస్తుంది. నేటికీ అమెరికా వైపు ఎగబడుతున్న అమ్మాయిలకి ఈ కథ ఒక హెచ్చరిక ఇస్తోంది.

ఊహాత్మక మిత్రులు (ఇమేజనరీ ఫ్రెండ్స్)

అమెరికా సంస్కృతిలో ఊహాత్మక మిత్రులకు స్థానం ఉంది. అందవైన భవంతుల్లో, విశాల గదుల్లో మనుషుల్లేక, బొమ్మల్నే ప్రాణస్నేహితుల్లా భావించే ఒక కొత్త విషయాన్ని కథగా అందించారు. రెంటాల కల్పన, 'టింకూ ఇన్ టెక్సాస్' అనే శీర్షికతో రాసిన ఈ కథలో 'టింకు' ఒక పిల్లవాడు. సుస్మిత, ఆనంద్‌లు టింకూ తల్లిదండ్రులు. హౌరీ (బొమ్మ - టింకూ స్నేహితుడు) తో నిత్యం సంభాషిస్తూ, ప్రాణమున్న మనిషిలా భావించే టింకూను ఇండియాకు తీసుకొని రావాల్సి వస్తుంది.

సుస్మిత ఇండియాకు టింకూతో కలిసి రావాలని నిర్ణయించుకుంటుంది. టింకూ రాలేనంటాడు. ఇండియా అంటే బోర్ అండ్ డర్టీ అంటాడు. సమ్మర్ యాక్టివిటీస్ అన్నీ మిస్ అవుతానని, అందువల్ల రాలేనంటాడు. కంప్యూటర్, గేమ్స్ అన్నీ ఇండియాలో ఉన్నాయని, తప్పక వెళ్ళాలని తండ్రి గట్టిగా చెప్తాడు.

"డాడీ మై రియల్ ప్రాబ్లం ఈస్ హౌరీ. హౌరీకి ఫ్లైట్ జర్నీ అంటే భయం. ఇంతవరకూ ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు కదా. భయపడుతున్నాడు..." అంటాడు టింకూ.

'హౌరీ కేవలం నీ ఆటబొమ్మ. అచ్చం పిల్లాడిలా ఉన్న ఓ బొమ్మ. దానికి నీ కిష్టమైన పేరు పెట్టుకున్నావ్. అంతేగానీ అది నీతో మాట్లాడదు. ఆడుకోదు. నువ్వే దానితో ఆడుకుంటావు. దాన్ని ఫ్రెండ్‌లా నువ్వు ఊహించుకుంటున్నావు" అని తండ్రి దబాయించి ఇండియాకు ప్రయాణం అవ్వమంటాడు.

మరుసటి రోజుకు టింకూకు జ్వరం వస్తుంది. ఆసుపత్రికి వెళ్తారు. డాక్టరును సంప్రదిస్తారు. టింకూ, సుస్మితను బయటకు పంపి డాక్టర్ ఆనంద్‌తో "ఒకే మిస్టర్ ఆనంద్. పిల్లల్లో ఇదంతా మామూలే. మనకు ఇదంతా ట్రాష్‌లా కనిపిస్తుంది. కానీ అమెరికాలో సగానికి పైగా ఈ ఇమేజనరీ ఫ్రెండ్స్ ఉంటారు. వాళ్ళ మానసిక ప్రపంచంలో అదంతా ఒక భాగం. ...ఇమేజనరీ ఫ్రెండ్‌షిప్ లోపమో, అసహజమో కాదు. ఇలాంటి వారు స్నేహశీలురు. సృజనశక్తి ఎక్కువ. ఎదుటి వాళ్ళ ఇష్టాఇష్టాల్ని గౌరవించడంలో, స్నేహ భావంతో మెలగడంలో నార్మల్ పిల్లల కంటే ముందుంటారని" హౌరీకి ఫ్లైట్ జర్నీ అంటే ఉన్న అనవసర భయాన్ని, ఆందోళనను తొలగించేలా నచ్చచెప్పమని చెప్తాడు డాక్టరు. టింకూనూ ప్రేమగా దగ్గరికి తీస్తాడు తండ్రి. కొందరు పిల్లలు లోన్లీగా ఫీలవుతున్నారని, ఫ్యామిలీలో సరైన ప్రేమ ఆప్యాయతలు పొందలేక ఇలాంటి ఇమాజినరీ ఫ్రెండ్స్‌ను ఏర్పరుచుకుంటారనుకోవడం అవగాహనారాహిత్యమే' అంటారు డాక్టర్. అయితే, దీన్ని మానసిక రుగ్మతగా గుర్తించే వారికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

మంచు తుఫాన్లు

అమెరికా దేశంలో వాతావరణం విపరీత హెచ్చుతగ్గులతో ఉంటుంది. మంచుతుఫాన్లు కురిసే సమయాల్లో జీవనం అస్తవ్యస్తంగా మారిపోయి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. విపత్కర పరిస్థితుల్లో మానవ ఆలోచనలు, మానసిక సంఘర్షణలు, సంబంధాలు ఎలా ఉంటాయో స్నోస్టార్మ్, మంచుకురిసిన రాత్రి కథల ద్వారా తెలుసుకోవచ్చు.

డా॥ వేద రాసిన స్నో స్టార్మ్‌లో విసు, శ్రీలు భర్త భార్యలు, సరోజ స్నేహితురాలు. ప్రీతి, చేతన్‌లు, శ్రీవిసు దంపతుల సంతానం.

విసు కుటుంబంతో కలిసి డిన్నర్‌కు వెళ్ళి వస్తూ, జరిగిన విషయాలను మాట్లాడుకుంటారు. అందరూ తలా ఓ వంటకం చేసుకొని వచ్చి, కలిసి భోజనం చేసే పద్ధతి ఉన్న అమెరికాలో ఉంది. ఆ రోజు డిన్నర్‌లో శ్రీ స్నేహితురాలు వంకాయ వంటకానికి సరిపోయే దినుసుల్లేక,

పచ్చడి చేసి తెచ్చి సరిపెట్టిందని, 'అదొక ప్రత్యేక రుచి' అని చెప్పి ఊదరగొట్టిందని బాధపడుతుంటే విసు శ్రీని ఓదారుస్తాడు.

రోడ్డుపై నెమ్మదిగా వెళ్తున్న కారులోని వృద్ధ జంటను చూసి, మనం కట్టే టాక్స్‌లతో ఎంజాయ్ చేస్తున్నారని అసూయ ప్రకటించి, వేగంగా వెళ్ళి మంచు తుఫానులో ఇరుక్కుపోతారు. కారు టైర్లు స్కిడ్ అయ్యి, లోయ ముందున్న రైలింగ్ ఆసరాతో బతికి పోతారు. ఆ దారిలో వెళ్ళిన వగ్రో (ట్రక్కు డ్రైవర్) క్షేమం అడిగి ఆగకుండా వెళ్ళిపోతాడు. ఆ డ్రైవర్ సాయం చేయలేదని కూడా తిట్టుకుంటారు. చివరికి ఆ ట్రక్కు డ్రైవర్ పోలీసుల్ని సాయం కోసం పంపుతాడు.

వీళ్ళు ప్రయాణంలో చిక్కుకున్న మరుక్షణంలో వీరికి గుర్తొచ్చిన స్నేహితురాలు సరోజ. ఆమెకు సమాచారం ఇవ్వగానే తన వాహనంతో వచ్చి, వీరిని క్షేమంగా ఇల్లు చేర్చి వెళ్ళిపోతుంది. నా తర్వాత చిన్న చిన్న విషయాలకే మనుషులను అపార్థం చేసుకోకూడదనే సందేశాన్ని పంచుకుంటారు భార్యాభర్తలు.

అమెరికా వాతావరణం, అమెరికాలోని తెలుగువారి సంబంధాలు, వారి ఆలోచనా ధోరణులను తెలియ జేస్తూనే, మనసును ఇంకాస్త విశాలం చేసుకోవాల్సిన అవసరాన్ని తెలుపుతుంది ఈ కథ.

సుందరశ్రీ దువ్వూరి రాసిన 'మంచు కురిసిన రాత్రి' కథ కూడా మంచువల్ల ఏర్పడే సమస్యలను చిత్రించింది.

హరి, సాధన దంపతులు బతుకు తెరువు కోసం అమెరికా వచ్చి ఉంటారు. సాధన గర్భవతి. హరి ఉద్యోగంలో బెటర్‌మెంట్ కోసం టాక్సింగ్, జావా కోర్సులు నేర్చుకుంటూ ఉంటాడు.

ఒక రోజు కాలేజీలో ఇవ్వాల్సిన అసెన్‌మెంట్ గుర్తొచ్చి, సాధనను అడుగుతాడు. తనకు ఆ పని చెప్పలేదని అంటుంది. వాగ్వాదం తీవ్రమౌతుంది. చేసేది లేక, ఆఖరు తేది అయిపోతుండడంతో 'తనే వెళ్ళి అసైన్‌మెంట్‌ను కాలేజీ ప్రొఫెసర్ డ్రాప్ బాక్స్‌లో వేసి రావాలని బయలు దేరతాడు. మంచుతుఫాను ప్రారంభమై ఉంటుంది. కష్టం మీద కాలేజీకి చేరుకొని, అసైన్‌మెంట్ డ్రాప్ బాక్స్‌లో వేసి తిరుగు ప్రయాణం అవుతాడు. దారి మధ్యలో యాక్సిడెంట్ అయ్యి ఉంటుంది. గంటల కొద్దీ వాహనాలు కదలవని భావించి, వేరే మార్గం గుండా బయలుదేరి తెలియని ప్రాంతంలో ఇరుక్కుపోతాడు. టైర్లు మంచులో కూరుకు పోయి కారు ఆగిపోతుంది. కిందికి దిగిన హరి మంచుపై జారి కిందపడతాడు. తన చేతిలోని రిమోట్ 'కీ' జారి కారు కిందికి పోతుంది. తన కాలు మంచు బొరియలో ఇరుక్కుపోతుంది. కార్ కీ పై వేలుపడి లాక్ అయిపోవడంవల్ల (సైడ్‌వాల్‌కు, కారు టైర్‌కు మధ్యలోని సందులో) కారు తలుపు తెరుచుకోదు.

మంచు కురుస్తూ ఉటుంది. 15 నిమిషాలు గడిచిపోతాయి. భయం మొదలౌతుంది. టోపీ, గ్లౌసులు, ఫోన్ కార్లో ఉన్నాయి. ఎమర్జెన్సీ నంబర్ 911కు ఫోన్ చేసే అవకాశం కూడా లేదు.విస్తున శీతల పవనాలు 'చిగురుటాకు'ను చేసి వణికిస్తున్నాయి. నిర్మానుష్యమైన ఆ వీధిలో ఇంకో రెండు గంటల్లో దిక్కులేని చావు ఖాయం అనుకుంటాడు. హెల్ప్, హెల్ప్ అని ఎంత గొంతు చించుకున్నా, వినేనాధుడు కనిపించడు. ఒక కారు వచ్చి వెళ్ళిపోతుంది. ఇతని ఆర్తనాదాలు వినడు. మరో కారు వచ్చి వెళ్ళి పోయింది. హరి అరుపులు విని కొంత సేపటికి తిరిగొచ్చిన కారులోని వ్యక్తి గర్భవతి అయిన తన భార్య ప్రోత్సాహంతో వెనక్కి వచ్చానని చెప్పి, కాపాడి వెళ్ళిపోతాడు.

గతంలో ఇలా సహాయపడబోయి డబ్బు, ఉంగరాలు పోగొట్టుకున్న జ్ఞాపకం హరిని వెంటాడగా, ఒక మంచు తుఫానులో ఇలా ఇబ్బందిపడే వ్యక్తిని వదిలి వెళ్ళిపోతే అతను చనిపోయిన జ్ఞాపకం అతన్ని గాయపరుస్తుంది.

మంచుకురిసే ప్రాంతాల్లో జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో ఈ కథ వివరిస్తుంది.

అత్యాశ, ఆన్‌లైన్ మోసాలు

మనుషుల్లోని అత్యాశలు కష్టపడకుండా సులభంగా వచ్చే డబ్బు కోసం విజ్ఞతను నశింపచేస్తాయనే కథాంశంతో కె.వి. గిరిధరరావు రాసిన కథ 'పేపాల్'.

సురేష్ అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. భార్య సుజాత కూడా అతనితోనే ఉంటుంది. ఏదో ఒకటి చేసి, త్వరగా డబ్బు సంపాదించి బాగా స్థిరపడాలనే కోరిక సురేష్‌ది. ఇండియా వెళ్ళి పోవాలన్న కోరిక సుజాతది.

'ఇంటి నుంచి పనిచేయండి... వారానికి రెండు వందల నుంచి, 9వేల డాలర్ల వరకూ సంపాదించండి' అనే ఇ-మెయిల్ ప్రకటన సురేష్ జీవితాన్ని మలుపులు తిప్పింది.

'విలియం ఫాన్స్ అనేవాడు జెకోస్లోవేకియాలోని లెస్ క్రైమ్ సాఫ్ట్ ఇంక్' అనే కంపెనీకి ప్రతినిధి అని, ఆ కంపెనీ కంప్యూటర్ నేరాలు నిరోధించే సాఫ్ట్‌వేర్‌ను తయారు చేస్తుందని, అన్ని దేశాల్లో కష్టమర్లు ఉన్నారని, ఉత్తర అమెరికా కష్టమర్లు కొన్నప్పుడు డబ్బును క్రెడిట్ కార్డుతో చెల్లిస్తారని, చట్టపరమైన కారణాలవల్ల తమ దేశంలో 'పేపాల్' వినియోగించడానికి అనుమతి లేదని చెప్తాడు. జెకోస్లోవేకియా బయట నివసిస్తూ, పేపాల్ ద్వారా స్వీకరించి, 10 శాతం కమీషన్ మినహాయించుకొని మిగిలిన నిధులను మాకు పంపిస్తే చాలు' అనే సందేశంతో సురేష్ తన ఖాతా వివరాలను అందజేస్తాడు.

నెలరోజుల్లోనే 50వేల డాలర్లు వస్తాయి. అంటే 5 వేల డాలర్లు సురేష్‌కు మిగులుతాయన్న మాట. తన 10 శాతం ఉంచుకొని మిగిలిన మొత్తాన్ని ఆ కంపెనీకి పంపేస్తారు.

కొట్టేసిన క్రెడిట్ కార్డుల నుండి ఆ డబ్బు వచ్చిందని, దాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని 'పేపాల్' కంపెనీ నుంచి హరికి వత్తిళ్ళు ప్రారంభం అవుతాయి. 'తను వెస్ట్రన్ యూనియన్ ద్వారా క్యాష్ ట్రాన్సాక్షన్ చేయడం వల్ల, తను పంపిన డబ్బు వెనక్కి వచ్చే అవకాశం ఉండదు.

కష్టమర్‌లకు ఇచ్చిన సాఫ్ట్‌వేర్ సీడీలు గానీ, తను పంపిన డబ్బుకు రసీదులు గానీ లేకపోవడం వల్ల, తను కలిసిన లాయర్, ''మీరు పెద్దగా చేయగలిగిందేమీ లేదు' అన్న మాటలకు ఉసూరు మంటాడు. అంతేగాక 'ఆ ఫ్యాక్స్ గానీ ఏ ఉగ్రవాద సంస్థకు చెందినవాడో అయితే, నువ్వే ఫ్రాడ్ చేసి వారికి నిధులు చేకూర్చావని ప్రభుత్వం నీపై కేసు పెడుతుంది అంటాడు.' కష్ట నిష్టూరాలతో ఇంటికి పోతారు సుజాత, సురేష్. అత్యాశలతో, రాత్రికి రాత్రే సంపన్నులు అయిపోవలనే వారు ఇలాంటి ఉచ్చులో పడతారని ఈ కథ హెచ్చరిస్తుంది.

మూఢ నమ్మకాలు

సాంకేతిక పరంగా అమెరికా ఇతర దేశాలకు దిశానిర్దేశం చేయగల స్థాయిలో ఉన్నా, అక్కడ పాతుకుపోయిన మూఢనమ్మకాలు కూడా అంతే లోతుగా ఉన్నాయని తెలిపే కథ ఇది. గవరసాన సత్యనారాయణ రాసిన 'అమెరికాలో అద్దెకొంప' కథ దెయ్యాలు నిజంగానే ఉన్నాయనే భ్రమను కల్పిస్తుంది.

బోస్టన్ ప్రాంతంలోని బెడ్‌ఫర్డ్ పట్టణంలో స్మశానం దగ్గర ఇల్లు తక్కువ అద్దెకు దొరుకుతుంది ఒక భారతీయ వైద్యుడికి. అర్ధరాత్రి 12 గంటలకు కాలింగ్ బెల్ కొట్టి ఒక వృద్ధుడు కేక్ ఇస్తాడు. తను పక్కనే ఉంటానని, 'వెల్‌కం టు నైబర్‌హుడ్ డే' అని చెప్తాడు. ఆ వృద్ధుడి నాన్న ఐర్లాండు నుండి వచ్చాడని, అమ్మ జర్మనీ నుండి వచ్చిందని, జర్మనీ వాళ్ళు ఇంజనీరింగ్‌లో ముందుంటారని, ఐర్లాండు వాళ్ళు మద్యం ప్రియులని చెప్పి వెళ్ళిపోతాడు.

అమెరికాలో వృద్ధులు ఒంటరి జీవితం గడుపుతారని, పిల్లలు పెద్దై ఉద్యోగరీత్యా దూరప్రాంతాలకు పోయి స్థిరపడతారని, న్యూక్లియర్ ఫ్యామిలీస్‌గా ఏర్పడి ఎవరి దారిలో వారు ఉంటారని, క్రిస్‌మస్ రోజునో, థాంక్స్ గివింగ్ రోజునో కలిసి మళ్ళీ విడిపోతారని రచయిత అక్కడి సంస్కృతిని తెలియజేస్తాడు. వృద్ధులకు పొద్దుపోక గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, ఆసుపత్రుల్లో స్వచ్ఛంద

సేవ, సీనియర్ సిటిజన్స్ క్లబ్బులో కాలక్షేపం వంటివి చేస్తుంటారంటాడు.

రెండు నెలల తర్వాత మళ్ళీ అర్ధరాత్రి కాలింగ్ బెల్ మోగుతుంది. ఈసారి చాక్లెట్ బాక్స్‌తో వచ్చిన ఆ వృద్ధుడు భారతదేశ చరిత్రను, యూరోపియన్‌ల రాకను గురించి వివరిస్తాడు. లైబ్రరీకి వెళ్ళే టైం లేదని డాక్టర్ చెప్పిన సమాధానం విని తానే పుస్తకాలు తెచ్చి ఇస్తానంటాడు.

మూడో నెల ఒక అర్ధరాత్రి మళ్ళీ కాలింగ్ బెల్ మోగుతుంది. గిఫ్ట్ ప్యాక్‌తో ఉన్న పుస్తకాన్ని ఇచ్చి, జేబులో ఉన్న షాంపేన్ ఓపెన్ చేస్తాడు. 'హేపీ బర్త్‌డే టు బోత్ ఆఫ్ అస్' అని చెప్పి సంతోషాన్ని పంచుకుంటారు.

డాక్టరు చేతిలో పెట్టిన ఆ పుస్తకం 1920లో వచ్చిన 'ఎ మిస్టమరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్'. మరుసటిరోజు ఆసుపత్రిలో 'బెడ్‌ఫర్డ్ న్యూస్' పత్రికలో వచ్చిన 'మిస్టరీ ఆఫ్ ఎ మిస్సింగ్ బుక్' అనే శీర్షికతో ఉన్న వార్తను చదివి చర్చించుకుంటూ ఉంటారు.

'గత పది సంవత్సరాలుగా థామస్ (టామ్) పుట్టిన రోజున 'ఎ మిస్టరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్' పుస్తకం గ్రంథాలయం నుండి మాయమై పోతుందని, ఆ పుస్తకం రాసిన థామస్ చనిపోయి 60 సంవత్సరాలు అయ్యిందని, అప్పటికే ఆయన వయసు 70 ఏళ్ళు అని, ఆ పుస్తకాన్ని ఎవరు దొంగిలిస్తున్నారో గ్రంథాలయ సిబ్బందికి గాని, పోలీసు వాళ్ళకు గాని అంతు చిక్కడం లేదని, థామస్ చరిత్రను క్లుప్తంగా పేపర్‌లో రాశారని చర్చించుకుంటూ ఉంటారు. ఆయన మనిషిలా ఉంటూనే దెయ్యంలా గాలిలో తేలిపోతూ ఉంటాడని, తన పుట్టిన రోజున బెడ్‌ఫర్డ్ నగరానికి కొత్తగా వచ్చిన వారికి ఆ పుస్తకాన్ని బహుమానంగా ఇస్తుంటాడని పేపర్‌లో రాసివున్న విషయం డాక్టర్‌కు తెలుస్తుంది. తనకు కనిపించి పుస్తకం తదితరాలు ఇచ్చిన ఆయనే దెయ్యం రూపంలో ఉన్న థామస్ అని గ్రహిస్తాడు. స్మశానం దగ్గర ఉండే ఇళ్ళకు అద్దె అందుకే తక్కువ అని నిర్ధారించుకుంటాడు.

ఈ కథ చదివితే అమెరికాలో దెయ్యాలు నిజంగానే ఉన్నాయనే నమ్మకం కలుగుతుంది. రచయిత ఏ కోశానా ఇందులోని శాస్త్రీయతను అంచనా వేయలేదు. ఇదొక సస్పెన్స్ సినిమా కథలా తోస్తుంది.

స్త్రీలపై చూపుతున్న వివక్షను ఎత్తిచూపడం

కొమరోలు సరోజ 'గీతాభవనం' పేరుతో రాసిన కథ స్త్రీల పట్ల సమాజం చూపిస్తున్న ఉదాసీన వైఖరిని ఎత్తి చూపిస్తుంది. కెనడాలో ఉన్న గీతాభవనం (వృద్ధాశ్రమం) కేంద్రంగా సాగే ఈ కథలో నాలుగు పీజీలు చేసిన నీలవేణి, గీతాభవన యజమానురాలు గోమతి, తమిళ వృద్ధురాలు మామీలు ప్రధాన పాత్రలు. ఆధునిక లౌకిక స్త్రీగా, సంప్రదాయాల ముసుగులో స్త్రీలపట్ల చూపుతున్న వివక్షను ప్రశ్నించడం కథలో కీలక అంశం.

నిత్యం చలాకీగా ఉండే నీలవేణి (40 సంవత్సరాల లోపు వయసున్న యువతి) కెనడాలో ఒక హైస్కూల్‌లో ఇంగ్లీషు టీచర్. పంక్చువాలిటీ, సిన్సియారిటీ, పెద్దల పట్ల గౌరవం కలిగిన ఒక ఆధునిక సంప్రదాయ యువతి. ఉద్యోగంతోపాటు 'గీతాభవనం'లోని అనేకమంది వృద్ధులకు స్వచ్ఛంద సేవ చేయడం ఆమెకు ఇష్టం. గీతా భవనం యజమానురాలు 'గోమతి'కి ప్రతిరోజూ పురాణ అంశాలు చదివి వినిపిస్తూ ఆధ్యాత్మిక విషయాలను అలవోకగా తెలియజేస్తూ ఉండేది (జ్ఞాననవాసిష్ఠం, భగవద్గీత లాంటివి వినిపించేది).

ఆమెకు ప్రపంచంలో, ముఖ్యంగా మన దేశంలో స్త్రీలకు మాత్రమే ఉన్న కొన్ని కట్టుబాట్ల పట్ల, వివక్షపట్ల తిరస్కార భావం ఉంటుంది. తాళి తెంపడం, బొట్టు చెరపడం, తెల్లచీర కట్టడం వంటి ఆచారాలు ఆమెకు నచ్చవు.

ఆమె పెంపుడు తల్లి చిలకలూరిపేట నుండి రాసిన ఉత్తరం, ప్రయాణానికి సిద్ధమౌతున్నప్పుడు వచ్చిన ఫోన్ కాల్ ఆమె గతాన్ని బయటపెడుతుంది. ఆమెను కంటికి

రెప్పలా పెంచిన తల్లి మరణం, జన్మనిచ్చిన తండ్రి ఆచూకి తెలియడం ఆమెను ఇండియాకు పరుగులు తీయిస్తున్న అంశాలు.

"నాకు తండ్రెవరో తెలియదు. మా అమ్మ నన్ను, మా చెల్లిని పెంచలేక ఎడాప్షన్ ఏజన్సీకి ఇచ్చింది. పిల్లలు లేని వృద్ధ దంపతులు మమ్మల్ని పెంచుకున్నారు. చెల్లి సినిమా పిచ్చితో పారిపోయింది. ఆమె ఆచూకీ తెలియ లేదు. ఆ దిగుల్తో పెంపుడు తండ్రి చనిపోయాడు. ఇప్పుడు ఆ తల్లి కూడా చనిపోయింది. నా పదిహేనేళ్ళప్పుడు నా కన్నతల్లినీ, నా హాఫ్ బ్రదర్స్‌ను (కన్నతల్లి రెండో పెళ్ళి చేసుకున్న తర్వాత పుట్టిన వారు) చూపించింది.

జన్మనిచ్చిన తండ్రిని, హాఫ్ బ్రదర్స్, సిస్టర్స్‌ను కలుసు కోబోతున్నానని, నాన్న అలా అమ్మను ఎందుకు వదిలేశాడో తెలుసుకోవాలనుకుంటోంది. చివరికి ఒక్క నైట్ ఎంజాయ్‌మెంట్ కోసం ఇలా చేశాడా అని సందేహిస్తుంది. మన దేశంలో ఒకే తల్లి, వేరు వేరు తండ్రులు, అమెరికాలోనూ ఒకే తల్లి వేరు వేరు తండ్రులు అక్కడ స్త్రీలే, ఇక్కడా స్త్రీలే అంటూ - స్త్రీలను బలిపెడుతున్న సంస్కృతిని ఎత్తి చూపిస్తుంది. ఎప్పుడు జవాబులు దొరకని ప్రశ్నలకు సమాధానం తెలుసుకొని రావడానికి ఇండియాకు బయలుదేరుతుంది నీలవేణి.

మాతృభాష సంస్కృతుల కోసం తపన

అమెరికాలో ఉన్న తెలుగువారు కొంతమంది మాతృ భాష పట్ల, తెలుగు సంస్కృతి పట్ల ఎంతో గౌరవాన్ని కలిగి ఉండడమే గాక, వాటిని కాపాడుకోవడం కోసం వారు పడే తపన ఆంధ్రదేశంలో ఉంటూ పరాయీకరణ కాబడుతున్న అనేకమందిని సిగ్గుపడేటట్లు చేస్తుంది. ఈ నేపథ్యంతో నిడదవోలు మాలతి రాసిన 'ఉభయ భాషా ప్రవీణ' కథ తెలుగు వారిని ఆలోచింపచేస్తుంది.

"దేశ భాష ఏదో కూడా తెలియని ఒక కుటుంబం రచయిత పక్క వాటాలో దిగుతారు. వారికి ఇంగ్లీషు రాదు. వారు మాట్లాడే భాష రచయిత్రికి తెలీదు. చేతి సైగలతో ఏదో సాగిపోతుంది.

వాళ్ళబ్బాయి ఫిల్ (హిబ్రు యెమేన్) ను స్కూల్లో వేయడానికి రచయిత సహాయం తీసుకుంటారు. ఫిల్ స్కూల్లో ఆకతాయి పనులు చేస్తూ, ఇంగ్లీషు కూడా సరిగా నేర్చుకోడు. యెనీనా అనే టీచర్ పట్టుదలతో వాడికి ఆంగ్లం నేర్పాలని ప్రయత్నించి విఫలం అవుతుంది. స్కూల్లో ఆ అబ్బాయిని తీసేస్తామని ప్రిన్స్‌పాల్ వార్నింగ్ ఇస్తే - యెనీనా ఇంకో అవకాశం ఇవ్వమని బతిమాలి ఒప్పిస్తుంది.

టీచర్ పిల్లవాడి ఇంటికి రచయిత్రితో కలిసివెళ్తుంది. 'ఫిల్' వీళ్ళకు అర్థం కాని భాషలో అరుస్తాడు. ఉచ్చరించ లేని బూతు మాట్లాడతాడు. అమెరికా చేరాక ఎలాగైనా ఇంగ్లీషు వచ్చేస్తుందని, అది సమాజ పరిసరాలను బట్టి ఉంటోందని సరిపెట్టుకోకుండా, ఇంట్లో కూడా ఇంగ్లీషే మాట్లాడాలని టీచర్ పెట్టిన షరతు రచయితకి కోపం తెప్పిస్తుంది.

"నా బాధ - పరాయి గడ్డన బతుకు సాగించుకున్న ప్పుడు, భాషే సంస్కృతి. ఇల్లొక్కటే అది నిలబడగల ప్రదేశం. తమ మట్టికాని చోట, తమ అస్తిత్వాన్ని నిలుప కోడానికి ఆఖరి మజిలీ" అనుకుంటుంది రచయిత్రి.

తమ్ముడు గోపి, ఫిల్‌లు ఆడుకుంటూ ఉంటే ఆమెకు తోచిన వాక్యాలు, దేశం, భాష, రంగు, ఆచారాలు, నమ్మకాలు ఏమీ స్పృహ లేని ఇద్దరు పిల్లల్లా కనిపిస్తారు.

అమెరికా టీచర్లు - 'అమెరికానే గొప్పదని, వాళ్ళు చెప్పినవే ప్రపంచం నేర్చుకుంటోందని, పుస్తకాలు, కంప్యూటర్లు, వీడియో గేమ్స్ ఇచ్చి పుట్‌బాల్, చదరంగం, బేస్‌బాల్ వంటి ఆటలు నేర్పి వాళ్ళని విజ్ఞానవంతులు చెయ్యాలి" అనే టీచర్ మాటలు విని రచయిత్రికి కోపం వస్తుంది. చదవడం కూడా వాళ్ళే కనిపెట్టినట్లు మాట్లాడిన ఆమె అజ్ఞానం రచయిత్రికి కోపం తెప్పిస్తుంది. "భారతదేశ ఔన్నత్యాన్ని పెంచిన అనేక అంశాలు ప్రపంచానికి అనేక జ్ఞానాలు ఇచ్చిన సంగతి గుర్తు చేస్తున్నట్టు ఉంది. భారతీయ సంస్కృతి, మాతృభాషలపట్ల ఉండాల్సిన ఆదరణను వివరిస్తుంది రచయిత్రి.

స్త్రీల కష్టం గుర్తింపుకు నోచుకోవడం లేదనే వ్యథ

భారతదేశంలో స్త్రీల బాధ్యత చాలా ఎక్కువ. ఇంటి పని, వంటపని, వృద్ధులను, పిల్లలను చూసుకోవడం, అవసరమైతే బయట పనిచేయాల్సి ఉండడం వంటి బాధ్యతలు ఇల్లాళ్ళకు సంప్రదాయబద్ధంగా చుట్టు కుంటాయి. అలాంటి పరిస్థితుల్లో మహిళల మనోవేదన ఎలా ఉంటుందో తెలిపే కథ 'ఊర్మిళ రేఖ' గొర్తి సాయి బ్రహ్మానందం ఈ కథా రచయిత.

"రాముడి వనవాసం - ఊర్మిళ లక్ష్మణుడి కోరిక మేరకు అంతఃపురంలో ఉండిపోవడం, ఆ తర్వాత భరతుడు, కైకేయితో వెళ్ళి అడవిలో రామలక్ష్మణ సీతలను కలవడం, వారి యోగక్షేమాలు వివరించడం - ఊర్మిళ త్యాగాన్ని ప్రశంసించడం రామాయణ కథ అయితే, ఒకవైపు భర్త మాట కాదనకుండా అత్తమామలకు సేవలు చెయ్యడానికి భర్తను ఒంటరిగా దుబాయ్‌కి పంపి పిల్లలను చదివించుకుంటున్న నిర్మల పడ్డ కష్టం గుర్తింపుకు నోచుకోకపోవడం ఈనాటి నిర్మల కథ.

నెలరోజులుగా అత్తను (ఆసుపత్రిలో చేర్చి) చూసు కుంటూ అన్నీ మంచం మీదే అవుతున్నా, వాటిని భరించి బాధ్యత నిర్వర్తిస్తూ ఉంటుంది నిర్మల. ఒక రోజు మరిది, తోడికోడలు డా॥ విజయ ఇంటికి వస్తారు. ఇరుకైన ఇంటి గదిలో ఉండలేక రాత్రి అత్తగారున్న ఆస్పత్రిలో ఉంటారు. ఆ రాత్రి అత్తకు గుండెపోటు వస్తుంది. డా॥ విజయ నిద్రపోకుండా మేలుకొని ఉండడం వల్ల ఆమెకు సరైన ట్రీట్‌మెంట్ ఇచ్చి బతికించుకుంటుంది.

ఆమెకు ఒక రాత్రి సేవ చేసిన విజయను అందరూ పొగుడుతూ ఉంటారు. ఐదేళ్ళు ఆమెకు సేవ చేస్తున్న నిర్మల ఊసు కూడా ఎత్తకపోయిన తన భర్త తత్వాన్ని కూడా ఆమె గుర్తిస్తుంది. భర్త కోసం త్యాగం చేసిన ఊర్మిళ రామాయణంలో, భర్త కోసం సేవలు చేసిన నిర్మల ఈ కాలంలో గుర్తింపుకు నోచుకోవడం లేదని చెప్తాడు రచయిత.

సగం కథ రామాయణం, సగం కథ నిర్మల జీవితం ఇలా విభిన్నాంశాలను సంవిధాన పరిచి రాసిన కథ "ఊర్మిళ రేఖ". 'కథలో అరణ్యంలో సీత వేసిన ముగ్గులో ఒక గీత సీత రేఖ, రెండో గీత ఊర్మిళ రేఖగా చెప్పి కథా శీర్షికకు ప్రాధాన్యం కల్పించే ప్రయత్నం చేశారు సాయిబ్రహ్మానందం.'

మితిమీరిన భక్తి

'అతి సర్వత్రా వర్జయేత్' అనే మాట గాలికి పుట్టలేదనిపిస్తుంది. అమెరికాలో మితిమీరి పోతున్న 'భక్తి' వ్యాపారాన్ని లేదా 'భక్తి' కార్యక్రమాన్ని అధిక్షేపిస్తూ వ్యంగ్య ధోరణిలో వచ్చిన కథ "సంకట్ కాల్ మె బాహర్ జానేకా మార్గ్". వంగూరి చిట్టెన్ రాజు ఈ కథను రాశారు. ఈ కథ స్వీయానుభవం నుండి పుట్టినట్టుగా ఉంటూ, బారిస్టరు పార్వతీశం నవలా శైలిలా గిలిగింతలు పెడుతూ సాగిపోతుంది.

రచయిత బాంబేలో చదువుకునే రోజుల్లో మిత్రులు మూర్తి, రావులతో కలిసి బొంబాయిలోని 'పవాయ్' క్యాంపస్‌లో చదువుకుంటూ అందమైన పార్సీ అమ్మాయి లను చూడడానికి 'కొలాబా' దాకా వెళ్ళేవాళ్ళు. సౌందర్యా రాధన కోసం 'విక్రోలి' అనే స్టేషన్ దాకా తీసుకెళ్ళి, అక్కడి నుండి విక్టోరియా టెర్మినస్ దాకా రైల్లో వెళ్ళేవారు.

ఆ రైలు ప్రయాణం ఎలా ఉంటుందో, ఎక్కే జనం, దిగే జనం పడే పాట్లు, తోసివేతలు, గొడవలు ఎలా ఉంటాయో హాస్యపూరితంగా చెప్తాడు.

ఒకసారి తెలుగు జంట రైల్లో ఎక్కుతుంది. "... జన సందోహంలో నేను ఈ తోపుడు కార్యక్రమంలో ఒకానొక పెద్దావిడను అనుకోకుండా నా రామబాణం, అనగా నా మధ్య వేలు కొంచెం దాటిగా ఆవిడ వీపు మీద ఆనించి ముందుకు జరుగుతుండగా ఆయన పక్కనున్న ఆయనతో 'ఈ వెధవ ఎవడో వేలుతో పొడుస్తున్నాడండీ' అని శుద్ధ తెలుగులో విన్నవించుకొంది. శ్రీవారు నాకేసి ఒక చూపు చూసి తన అర్ధాంగితో 'ఈ పొట్టి వెధవ అంతకన్నా ఏం

చేస్తాడులే. కంగారు పడకు' అంటాడు. వేలుతీయడం, తెలుగుకు మొహం వాచి వారితో మాట్లాడాలనుకోవడం, ఈ పరిస్థితిలో బాగుండదని జనంలో కలిసి దూరంగా వెళ్ళిపోవడం వెంట వెంటనే జరిగిపోతాయి. అక్కడ ఓ కిటికీ దగ్గర రాసి ఉన్న 'సంకట్ కాల్‌మే బాహర్ జానేకా మార్గ్' (ఎమర్జెన్సీ ఎక్జిట్) దగ్గరికెళ్ళి తమను తాము కాపాడుకునే మార్గం చూసుకుంటాడు.

అమెరికాలో సంకట్ కాలం స్వయంకృతాపరాధం. పక్కింటి వాళ్ళకు 15 వంకాయలు కాస్తే, ఇంకో ఇంట్లో 20 వంకాయలు కాయడం ముందోడికి సంకటం - కొలస్ట్రాల్ పక్కోడికన్నా తక్కువ ఉన్నా సంకటమే అంటాడు రచయిత.

''హిందూ మతంలో ఉన్న గొప్పతనమే అది. ఎటువంటి తరహా సంకట్ కాలానికి ఏదో ఒక బాహర్ జానేకా మార్గ్... అనగా 'ఎమర్జెన్సీ పూట' ఉంటోందని అధిక్షేపిస్తాడు.

- ఇన్సూరెన్స్, బంగారం రేటు పెరిగినా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పోయినా, ఇలా చివరికి తన కూతురికి మ్యారేజ్ బ్యూరోలో పేరు నమోదు చేయించడానికి సైతం వ్రతం చేయించాలని భార్య చెబితే విని అవాక్కయిపోతాడు భర్త. అమెరికాలో పెరిగిపోతున్న అతిభక్తి, ప్రతి దానికి చేస్తున్న వ్రతాలను అధిక్షేపిస్తూ రాసిన కథ ఇది.

అవి - ఇవీ

జె.యు.బి.వి. ప్రసాద్ రాసిన 'జన్మదిన రాహిత్యం' జన్మదినాలకు, పెళ్ళిరోజులకు వేడుకల పేరుతో చేస్తున్న దుబారాను చిత్రించింది.

వేలూరి వెంకటేశ్వరరావు రాసిన 'అంటు - అత్తగారు' కథ అంటు, మైల, మడి, ఎంగిలి, వంటి సంప్రదాయాల్లో పనికొచ్చే అంశాలు ఉన్నాయని, వాటిని మరిచిపోయి అధునికులు అతిచేస్తారని రచయిత చేస్తున్న 'ఫిర్యాదు' సమాజ కట్టుబాట్లకు వత్తాసు పలుకుతుంది.

శ్రీనాథ్ జొన్నవిత్తుల రాసిన 'కలయిదనీ నిజమిదనీ తెలియదులే' కథ ఈ (మెయిల్) లేఖల విధానాన్ని అనుసరిస్తూ భారతదేశానికి అమెరికాకు మధ్య ఉన్న భేదాలను, సంబంధాలను వివరిస్తుంది.

విప్లవ్ రాసిన 'ఫిష్ దట్ గాట్ అవే' కథ వారాంతాలలో సరదాలు తీర్చుకోవడానికి చేపలు పట్టే అభిరుచిని గురించి తెలియజేస్తుంది.

మహేష్ శనగల రాసిన 'గుగ్గుళ్ళమ్మ గుడి', తాడికొండ శివకుమార్ శర్మ రాసిన 'స్టిల్ ఎన్ ఇండియన్', నోరి రాధిక రాసిన 'పండగ', పూడిపెద్ది శేషశర్మ రాసిన 'ముసురు చీకట్లో మెరుపు కిరణం', దశిక శ్యామలాదేవి రాసిన 'జానకి', డా॥ దారా సురేంద్ర రాసిన 'దొరబాబు దూరదర్శిని', నిర్మలాదిత్య గారి సర్‌ప్రైజ్ పార్టీ, దేశిబొట్ల ఉమ రాసిన 'చేతులు కాలాక ఆకులు', డొక్కా శ్రీనివాస ఫణి కుమార్ రాసిన 'లిటిల్ సైంటిస్ట్' కథలు విభిన్న కథావస్తువుతో అమెరికా జీవితాన్ని, ఆంధ్రుల సంస్కృతీ సంప్రదాయాలను, సమకాలీనంలో జరుగుతున్న మార్పులను పరిశీలిస్తాయి.

అమెరికాలో కథలు రాస్తున్నవారు అమెరికా జీవితాన్నే గాక, వారిలో జీర్ణించుకు పోయిన భారతీయ జీవన విధానాన్ని కూడా గొప్పగా చిత్రిస్తున్నారు. ప్రవాస కథలపై పరిశోధనలు జరిగితే, మరిన్ని లోతైన అంశాలు బయటి కొస్తాయి.

ఆధార గ్రంథాలు

1. అమెరికా తెలుగు కథానిక - సంపాదకులు డా॥ పెమ్మరాజు (తొమ్మిదవ సంకలనం) (2006), వేణుగోపాలరావు, డా॥ వంగూరి చిట్టెన్ రాజు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఐఎన్‌సి. హ్యూస్టన్, టెక్సాస్.
2. కథాశిల్పం (1995) - వల్లంపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జోగిని వ్యవస్థను ప్రతిబింభించిన అపూర్వ నవల

- డా॥. ర్యాగట్ల సాయిలక్ష్మి

ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాలకు దగ్గరలో ఉన్న బుద్దిపల్లి అనే ఒక కుగ్రామంలో కల్పన, రంగరావులకు జన్మించిన శాంతి ప్రబోధ 4, 5వ తరగతులు ప్రైవేట్‌గా 6, 7, 8వ తరగతులు ఊరికి కాస్త దూరంలో ఉన్న మరో ఊరు గవర్నమెంట్ స్కూల్లో చదివింది. 9, 10 వ తరగతి నిర్మల్, ఇంటర్ ఎల్లారెడ్డి, కరీంనగర్‌లలో డిగ్రీ కాకతీయ యూనివర్సిటీలో, ఎంఎ తెలుగు పూర్తి చేశారు. శాంతి ప్రబోధ మెట్టినిల్లు వర్ని ఆమె జర్నలిజం చేసేటప్పుడు చుట్టుపక్కల వారిని ఇంటర్వ్యూ చేయటం ముఖ్యంగా జోగినులను కలవటం వారి సమస్యలను తెలుసుకోవటం, వారిని కలిసాక మనసులో ఏదైనా వ్రాతపూర్వకంగా వ్రాసి వీరి సమస్యలను సమాజానికి తెలియచెప్పాలి అనుకోవటం, ఆమె సంకల్పానికి నిదర్శనం.

ముఖ్యంగా సంస్కార్ అధినేత్రి హేమలత లవణం గారిని కలవటం ఇంటర్వ్యూ చేయడం, వృత్తిపరంగా వారి సంస్కార్ సంస్థలో చేరటం జోగిని నవలకు ముఖ్య కథ వస్తువులు అయ్యాయి అంటారు శాంతి ప్రబోధ.

శాంతి ప్రబోధ కలం నుండి జాలువారిన జాతి మేల్కొలుపు నవల జోగిని. ప్రత్యక్షంగా దగ్గరగా కొన్ని సంఘటనలను చూసి, గమనించిన తర్వాత నవలకు వస్తువును రూపొందించారు. సమాజం దళిత స్త్రీల పట్ల అనుసరిస్తున్న ప్రక్రియలను కళ్లకు కట్టినట్లుగా ఈ నవల ద్వారా తెలిపారు కవయిత్రి. ఈ నవలలోని వ్యక్తులను పరిచయం చేసింది విద్య అనే అమ్మాయి. ఆమె పీజీ పూర్తి చేసి పీహెచ్‌డీలో జోగినీలపైన పరిశోధన చేయాలనే ఆలోచనలతో ఉంటుంది. అనుకోకుండా కవిత అనే స్నేహితురాలితో సిరిపురం అనే ఊరికి వస్తుంది. ఒకరోజు ఊర పండగలోని తతంగం అంతా చూసి కవిత వాళ్ల నాన్న రాజాగౌడ్‌ని అడుగుతుంది. ఒక్కొక్కరి గురించి అడిగి తెలుసుకొని జోగిని ప్రస్తావన రాగానే చెప్పడం ఆపేస్తాడు రాజాగౌడ్. ఎన్నో ధైర్య సాహసాలతో జోగినిలుగా ఉన్న దళితులు సాయవ్వ పోశవ్వల దగ్గరికి వెళుతుంది. ఎంతో వినయంగా వారి బాధలని, వారిని జోగినిగా ఎవరు మార్చారో, ఎందుకు మార్చారో సాయవ్వ ద్వారా వివరంగా తెలుసుకుంటుంది. పోశవ్వ మాత్రం ఏదో సంశయంలో ఉండిపోతుంది. పోశవ్వ కూతురు సబిత విద్యతో కలుపుగోలుగా ఉంటుంది. అక్క, అక్క అంటూ ఆప్యాయంగా చుట్టుకుపోతుంది. అస్సలు జోగిని అంటే ఎవరు అనే విద్య సందేహానికి సాయవ్వ సమాధానం చెబుతుంది. జోగిని ఇంటిలో పుట్టిన ఆడపిల్లకి పెళ్లిళ్లు చేసి సంసారిగా మార్చారు. ఏ ఎల్లమ్మకో, ఏ పోశమ్మకో ఇచ్చి పెళ్లి చేస్తారు. పెద్దదయినంక ఎవరికి ఇష్టం ఉంటే వాడితో ఆ పిల్ల గడపాలే. వారిచ్చిన డబ్బుతోనే బ్రతకాలి. ఇష్టమున్న లేకున్నా ఒళ్లు గుళ్లైనా ఒక్కోరోజు ముగ్గురు నలుగురితో కూడా గడిపే గండాలు వచ్చినా కాదనకుండా ఉండాలి. ఈ విధంగా జోగిని జీవితాలను గూర్చి చెప్పుకుంటూ పోతున్న సాయవ్వ మాటలు విద్యని ఎంతగానో బాధిస్తాయి. కానీ అనుకోకుండా ఆమెకు పెళ్లి జరిగి అమెరికా వెళ్లిపోతుంది. సబిత నాన్న గురించి పోశవ్వని అడిగినప్పుడు నా నాన్న, నీ నాన్న ఒక్కరే అన్న బాధ పోశవ్వ సంశయానికి కారణం కావచ్చు. రాజాగౌడ్ అన్నింటి గురించి చెప్పి జోగినుల గురించి చెప్పకపోవడం, అటు వెళ్తానంటే వద్దనటం ఇందుకేనేమో అనుకుంటుంది. వీరి గురించే కాకుండా పోతురాజుల గురించి, ఊరపండగలో కొన్ని వృత్తులవారి గురించి తెలుసుకుంటుంది. రెండు సంవత్సరాలు అమెరికాలో భర్తతో గడిపిన విద్య భారతదేశానికి వచ్చి మళ్లీ పోశవ్వని వారి కుటుంబాల్ని కలుస్తుంది. అమ్మ

అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా జోగినిలను, వారి జీవితాలను మార్చి కుట్లు, అల్లికలు వంటి చిన్న చిన్న పనులను నేర్పించి, వారి జీవన విధానాన్ని మార్చాలనుకుంటున్నారని తెలుసుకొని ఆమెని కలుస్తుంది. ఆమె ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకుంటుంది. ఇదిలా ఉండగా సిరిపురంలో గ్రామసర్పంచ్‌కి మహిళ జనరల్ కింద నామినేషన్ వస్తుంది. పోశవ్వని గెలిపిస్తే కుక్కిన పేనులా పడి ఉంటుందని, ఎన్నో సమస్యలు ఎదుర్కొని పోశవ్వని నామినేషన్ వేయించి గెలిపిస్తాడు రాజాగౌడ్. ఏం తెలియని పోశవ్వ వాడు చెప్పినట్లు చేస్తుంది. ఇలా సర్పంచ్‌లుగా గెలిచిన వారికి ట్రెయినింగ్ ఇస్తున్నారని రవి అనే ఉపాధ్యాయుని ద్వారా తెలుసుకొని అక్కడికి వెళుతుంది. ఎన్నో విషయాలు తెలుసుకుంటుంది. తిరిగి వచ్చి తన సీటులో తానే కూర్చొని రాజాగౌడ్, కర్ణం లాంటి పెద్దవాళ్లు ఎన్ని రకాలుగా హింసించినా ఎదుర్కొంటుంది. తప్పుడు లెక్కలు చూపి నేరుగా పనులన్నీ నిర్విఘ్నంగా చేసుకు పోతుంది పోశవ్వ. రోడ్లు వేయించడం, సక్రమంగా రేషన్ అందరికీ చేరేలా చేయటం, నీళ్ల సరఫరా, విద్యుత్ దీపాలు, విద్య, మహిళా సంఘాలు వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాలుపంచుకుంటుంది. తన గ్రామంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన "నీరజా బానోత్" అవార్డు పోశవ్వను వెతుక్కుంటూ వస్తుంది. ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటుంది. లక్షా యాభై వేల రూపాయల నగదు పురస్కారం అందుకుని, ఆ డబ్బుని ప్రజలకే చెందేలా చేస్తుంది పోశవ్వ. సరిగ్గా అదే సమయంలో బ్రిటిష్ యువ మహిళ జర్నలిస్టులు ఇండియాలో పర్యటిస్తున్నారు. ఆమె గురించి తెలుసుకుని జర్నలిస్టులు మిస్ జేన్ ఫిలప్స్, మిస్ అలెగ్జాండ్రియానాలు అనే టైటిల్‌తో పోశవ్వతో పాటు మరికొందరి ఫొటోలు, రైటప్స్‌ని రిలీజ్ చేశారు.

ఇదంతా విద్య మెయిల్ ద్వారా చూస్తుంది. ఎంతో ఆనందం వ్యక్తం చేస్తుంది. తాను చూసిన పోశవ్వ ఎదుగుదలకి కారణాలు తెలుసుకుంటుంది. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసిన రాజాగౌడ్, మిగతా పెత్తందారుల ఆగడాలు సాగలేదు. నిజం, నిజాయితీ ముందు అన్యాయాలు, అక్రమాలు ఓడిపోయాయి. మామలాగే కవిత భర్త అమెరికన్ లేడీస్‌తో విచ్చలవిడిగా తిరిగేవాడు. అలా రాజాగౌడ్ కూతురు మానసిక స్థితిని భరించింది. ఇదంతా తెలిసిన విద్య ఏం చెప్పలేక, పరిస్థితిని చూడలేక బాధపడుతుంది.

పోశవ్వ ఈ సమాజం నుండి అనునిత్యం అణచివేత, అత్యాచారాలు, అవమానాలు, అసమానతలు ఎప్పటి కప్పుడు ఎదుర్కొంటుంది. తనకు తాను శక్తివంతం చేసుకుంటూ ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ పరిపూర్ణ వ్యక్తిత్వంతో ముందుకు సాగుతుంది. తనలో బద్ధలవుతున్న అగ్నిగుండాలు, కణకణమండే అగ్ని సెగలు ఉవ్వెత్తున ఎగుస్తుంటే ఏమి ఎగురనట్లు భరించి విశ్వ కళ్యాణానికి రోజుకో కొత్త అందంతో, ద్విగుణీకృతమైన శక్తితో ముందుకు పోతుంది. తూర్పున అరుణారుణ కిరణంలో వేల్కొలిపే జగతికి వెలుగునందించే సూరీడులా పోశవ్వ రూపం విద్య ముందు తొణికి సలాడుతుంది. మహిళా లోకానికే ఆదర్శంగా నిలుస్తూ మార్గ దర్శకంగా కనిపిస్తూ పోశవ్వ ఉన్నత శిఖరాలని చేరుకుంటుంది.

ఎలాగైనా పోశవ్వని తొక్కేయాలనే రాజాగౌడ్ ఆటలు సాగవు. ఆమె చేసిన మంచి పనులకు ఆమెకు ఉత్తమ మహిళ ప్రతినిధిగా అవకాశం వస్తుంది. ఇలా నడుస్తున్న సమయంలో 16 మండలాల ప్రాదేశిక స్థానాలున్న ఎల్లారెడ్డి మండలంలో జిల్లా మంత్రి, మాజీ అధ్యక్షుల ఆశీస్సులతో మండల అధ్యక్షురాలుగా ఎంపికవుతుంది. పుట్టినప్పటి నుండి పడిన శారీరక, మానసిక హింసల కంటే తాను అనుభవించే ఆటుపోట్లు పెద్దవి కావనుకుంటుంది. ఆశ్రిత పక్షపాతానికి, అన్యాయాలకు, అక్రమాలకు తావివ్వకుండా తనకు సాధ్యమైనంత వరకు మండల అభివృద్ధి కృషి చేస్తుంది. స్కూళ్లలోని పరిస్థితులు

తెలుసుకొని పరిష్కరిస్తుంది. ఎందరో చిన్నారులను చేరదీసి న్యాయం జరిగేలా చేస్తుంది. అమ్మ సహకారంతో జోగిని దురాచారాన్ని నిర్మూలించి, పునరావాస కార్య క్రమాల్లో భాగంగా 10వేల రూపాయలు ఎకరం భూమి జోగినులకు అందేలా తన వంతు కృషి చేస్తుంది. టీచర్స్ యూనియన్ మీటింగ్‌లో సభ దద్దరిల్లేలా తన భావాలని వినిపిస్తుంది. ఆ సభలో పాల్గొన్న మంత్రి పోశవ్వని ఎంతగానో అభినందించి సహపంక్తి భోజనాలకి అన్ని కులాలను ఆహ్వానిస్తాడు. దళితులు తప్ప ఎవ్వరు అక్కడికి రారు. దళితులని గుడిమెట్లు ఎక్కిస్తాడు. మంత్రికి అందరూ ఆనందంతో అభినందనలు తెలుపు తారు. మంత్రితో ''అయ్యా మాకు ఇంత మడిచెక్క వచ్చేటట్లు చూడండి. అప్పుడు మా పనులు మేము చేసుకుంటాం. మాకు అందరిలో సమానంగా బ్రతికే అవకాశం కల్పించండి'' అని వేడుకుంటుంది. జోగిని దురాచార నిర్మూలనలో 'అమ్మ' సంస్థకు సహకరిస్తూ దళిత నాయకురాలిగాను, మహిళా సంఘం నాయకురాలి గాను, మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలి గాను వ్యవహ రిస్తుంది పోశవ్వ.

ముగింపు :

హేమలత లవణం గారు నడుపుతున్న సంస్కార్‌లో చేరాక జోగిని వ్యవస్థని రూపుమాపటం కోసం ఆమె వంతు కృషి చేశారు. పూర్తిగా జోగిని వ్యవస్థను నిర్మూలించడం కోసం ఆ బాధ్యతలను ప్రభుత్వాలే చూసుకోవటం శాంతి ప్రబోధ శ్రమకి ఫలితం లభించిందనే సంతోషాన్ని కలిగి స్తాయి. శాంతి ప్రబోధ వ్రాసిన ''అతివ ఆదిశక్తిగా మారిన వేళ'', 1993 లో రేడియో ద్వారా ప్రజలలోకి చేరింది. డా॥ అమృతలత అమృతకిరణ్ పక్షపత్రికలో ''చెల్లి పెళ్లి కథ'' గా 1995 లో అచ్చు వేయబడింది. ''బాలల హక్కుల భావవీచికలు'' 2003, ''గడ్డిపువ్వు గుండె - సందూక, కథలు'', ''ఆలోచనలో ఆమె కథల సంపుటి'' ''అమర్ సహస్రయాత్ర'', ''బతుకు సేద్రం'' (అముద్రితం)లు వెలువరించినప్పటికీ, ఈ జోగిని నవలకు దక్కినంత గౌరవం దేనికి అంతగా రాలేదంటారు రచయిత.

2006లో తెలుగు యూనివర్సిటీ వీసీ ఆవుల మంజుల గారు నాకు ఫోన్ చేసి మీ నవల ఉత్తమ నవలగా ఎంపిక చేయ బడిందని చెప్పినప్పుడు చాలా ఆశ్చర్యపోయానంటారు రచయిత ప్రబోధ. ఇవే కాకుండా ఇంకా నాలుగు అవార్డులు ఆమెని వరించాయి. ఇలాంటి సందేశాత్మక నవలలు కథలు శాంతి ప్రబోధ వ్రాస్తూ సమాజానికి మంచి సందేశం ఇవ్వాలి. మరెన్నో అవార్డులు ఆమెను వరించాలి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాచీన ఒరియా సాహిత్యంపై భక్తి – భక్తి ఉద్యమ ప్రభావాలు

– డా॥. పళని, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రాచీన భారతీయ సమాజంలో సామాజిక సామరస్యం పరిఢవిల్లింది అని చెప్పడం ఒక పార్శ్వం. ప్రాచీన భారతీయ సమాజంలో కులం చాలా కఠినమైన వ్యవస్థ. ముఖ్యంగా మధ్య యుగం నుండి శూద్రుల మీద ప్రత్యేకించి అస్పృశ్యుల పేరుతో అట్టడుగు వర్గాల వారిమీద వివక్షత కొనసాగుతూనే ఉంది. కాబట్టి భారత చరిత్రలో స్వర్ణయుగం ఏది లేదని చెప్పడం మరొక పార్శ్వం. అగ్ర కులాలు, భూస్వామ్య వర్గాలు, పెద్ద స్థాయి వర్తక సంఘాలు సమాజంలో ఎల్లప్పుడు సంతోషంగా ఉండేవారని, అణగారిన వర్గాల ధన మాన ప్రాణాలకు రక్షణ ఉండేది కాదని ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొఫెసర్ డీ.ఎన్. ఝా అభిప్రాయం. (బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూ) మధ్యయుగాల్లో ఈ దారుణమైన వివక్షలపై స్పష్టమైన పోరాటాన్ని ప్రకటించినవారు భక్తి ఉద్యమకారులు.

ఉత్తర, దక్షిణ భారత దేశాల్లో విభిన్నమైన సాంస్కృతిక జీవనం ఉందన్నది స్పష్టం. అయినప్పటికీ ఉత్తర, దక్షిణ భారతీయ సాహిత్యాలన్నింటిలోనూ భారతీయ ఆత్మ దర్శనమిస్తుంది. భారతీయ సమాజం బహిరంతర రూపాలు భిన్నత్వంతోను, భారతీయ ఆత్మ ఏకత్వంతోను దర్శనమిస్తుంది. నదులన్నీ సముద్రంలో సంగమించినట్లు భారతీయ సమాజంలోని ఏ భాషలో వెలువడిన సాహిత్యమైనా ఈ భారతీయుతలోనే సంగమిస్తుంది.

కొన్ని వేల సంవత్సరాల నుండి భిన్నమైన జాతి మత ప్రాంతాల వారు భారతదేశానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. భిన్నమైన మత విశ్వాసాలు, విభిన్నమైన ఆచార వ్యవహారాలు, విరుద్ధమైన జీవన విధానాలు భారతీయ ప్రజల్లో ఉన్నప్పటికీ వీరందరిని కలిపే ఒక అంతస్సూత్రం మాత్రం దండ లోపలి దారం లాగా అదృశ్య రూపంలో ఉన్న భారతీయ ఆత్మ మాత్రమే. ఇది దేశ భౌగోళిక పరిధిని బట్టి ఏర్పడింది కాదు. తరతరాలుగా ఇక్కడి ప్రజలు ప్రోది చేసుకున్న ఒక మహత్వ పూర్ణ మైన వ్యక్తిత్వం ఇది.

హిందూ, బౌద్ధ, జైనమతాల్లోని వివిధ శాఖలు, సిక్కు, ఇస్లాం, క్రైస్తవ మతాలు భారతీయ సాహిత్యంపై తిరుగులేని ప్రభావాన్ని చూపించాయి.

హైందవ సంస్కృతిలో వివిధ మత శాఖలు ఉన్నాయి. శైవ వైష్ణవ శాక్తేయ గాణాపత్యాది శాఖల ప్రభావం కూడా సాహిత్యంపై ప్రతిఫలిస్తుంది. శైవ వైష్ణవ శాక్తేయ విభేదాలు దక్షిణాత్య సాహిత్యం పై కూడా విశేషంగా ప్రభావాన్ని చూపాయి. మురుగ ఆరాధన కూడా సింధు నాగరికత నుండి కొనసాగుతుందని కొందరు చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు. దక్షిణ సాహిత్యంపైశైవ నాయనార్లు, వైష్ణవ ఆళ్వార్లు బౌద్ధ, జైన మతావలంబకులు తమ రచనల ద్వారా గొప్ప ప్రభావాన్ని చూపారు. మురుగ ఆరాధన ప్రభావం (కౌమార శాఖ) కూడా స్పష్టంగానే కనిపిస్తుంది.

భారతదేశంలో దాదాపుగా అన్ని భాషల సాహిత్యం పైనా భారతీయ ఆత్మ తనదైన ముద్రను వేసింది. భారతీయ సమాజం కొన్ని వేల సంవత్సరాలుగా ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొన్నప్పటికీ తనదైన ఆత్మను ఎప్పుడూ కోల్పోలేదు. ఈ సాహిత్యాలపై వివిధ దర్శనాల ప్రభావం, వివిధ మతాల ప్రభావం, భక్తి ఉద్యమ ప్రభావం స్పష్టంగానే కన్పిస్తుంది. భారతదేశంలో వైదిక సాహిత్యంతోనే భక్తి ఉద్యమానికి పునాదులు పడ్డాయని ఎక్కువ మంది వాదిస్తారు. ఉపనిషత్తు కాలంనాటికి భక్తి స్వరూపం మరింతగా ప్రస్ఫుటమైంది. భక్తి మధ్యయుగం నాటికి మాత్రం ఉద్యమ స్వరూపాన్ని పొందిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. నిర్మలమైన మనసుతో జన్మ నుంచి విముక్తిని పొందడానికి భగవంతుని ప్రార్థించడమే భక్తి

అంటారు. అంటే మోక్షాన్ని సాధించడం కోసం దేవునికి చేసే పూజ లేదా ఆరాధన. భగవంతుని పై గల రతి భక్తి అని, భగవంతుని పట్ల నిర్వ్యాజమైన ప్రేమ కలిగి ఉండడం భక్తి అని ఇలా పలు విధాలుగా భక్తిని గురించి చెప్పారు.

ఏది ఏమైనప్పటికీ భక్తి ఉద్యమం వలన సమాజానికి ఒక గొప్ప మేలు జరిగింది. భక్తి ఉద్యమ కారులు భక్తులకు చెప్పిన లక్షణాలు సమాజంలో శాంతియుతమైన, సామరస్యపూర్వకమైన జీవన విధానానికి బాటలు వేశాయి. మరొక పార్శ్వంలో పురోహిత వర్గ దోపిడీ కూడా పెరిగింది అంటారు. అయితే, భక్తి ఉద్యమకారులు ఈ దోపిడీని, వివక్షను కూడా విస్పష్టంగా ఖండించారు.

భారతదేశంలోకి ఇస్లాం ప్రవేశించిన తరువాత భక్తి ఉద్యమానికి తోడుగా సూఫీ ఉద్యమం కూడా మొదలైంది. తద్వారా హిందూ ఇస్లాం మతాల మధ్య సామరస్యానికి అవకాశం ఏర్పడింది. భక్తి, సూఫీ ఉద్యమకారుల ఆధ్యాత్మిక భావనలు సాంఘిక సంస్కరణలకు బాటలు వేశాయని కచ్చితంగా చెప్పొచ్చు.

భక్తి ఉద్యమం మధ్యయుగంలో ప్రారంభమైనప్పటికీ నేపథ్యం మాత్రం ముందే చెప్పుకున్నట్టు వైదిక కాలం నుండి కనిపిస్తున్నది. వైదిక మతంలో పెరిగిపోయిన బ్రాహ్మణ ఆధిక్యతను, కర్మకాండను కుల వివక్షతను భక్తి ఉద్యమం ఖండించింది. ప్రాచీన యుగం లోని భక్తి ఉద్యమానికి మధ్య యుగంలోని భక్తి ఉద్యమానికి స్వభావంలో స్వల్పమైన తేడా ఉంది. ప్రాచీన కాలంలో మోక్షము ప్రధాన లక్ష్యం కాగా మధ్యయుగంలో సాంఘిక సంస్కరణ, హిందూ మత సంరక్షణ ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తాయి.

వైదిక కాలం నుండి ఉన్న కర్మ కాండలను, పూజా పునస్కారాలు తిరస్కరించి నిర్మలమైన జీవనాన్ని, మానవీయ విలువలను భక్తి ఉద్యమం ప్రబోధించింది.

కులరహిత సమాజం కోసం, సౌభ్రాతృత్వం కోసం, ఏకేశ్వరోపాసన కోసం భక్తి ఉద్యమం ప్రయత్నించింది. భక్తి ఉద్యమ కారులు చాలామంది సంస్కృత భాషను తిరస్కరించి స్థానిక ప్రజల భాషలోనే సాహిత్యాన్ని అందించడం మరొక గొప్ప అంశంగా చెప్పుకోవచ్చు.

భక్తి ఉద్యమం అందించిన సాహిత్యం అతి విస్తృతమైంది. అది సాహిత్యంపై చూపిన ప్రభావం కూడా మరింత విస్తృతమైంది. దేశ వ్యాప్తంగా అన్ని భాషలలోని సాహిత్యం పైన ప్రభావాన్ని చూపిన ఉద్యమంగా భక్తి ఉద్యమాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ఒరియా సాహిత్యంపై భక్తి ఉద్యమ ప్రభావాన్ని పరిశీలిద్దాం.

క్రీస్తు పూర్వం 3వ. శతాబ్దం నాటి అశోకుని శాసనాల్లో కూడా ప్రాచీన ఒరియా శబ్ద రూపాలు ఉన్నాయి. సంస్కృతం, ద్రావిడ భాష, మాగధీ ప్రాకృతం కలగలిపి కళింగ ప్రాకృతం ఏర్పడిందంటారు. ఉడ ప్రాకృతం క్రీస్తుశకం 11 వ. శతాబ్దం ప్రాంతంలో ప్రత్యేకమైన ఒరియా భాష గా పరిణామం చెంది ఉండొచ్చని భాషా శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. క్రీస్తుశకం 7, 8 శతాబ్దాల తర్వాత బౌద్ధ సిద్ధాచార్యులు మాండలిక పదాలతో రాసిన చర్యా పదాల్లోని భాషకు ప్రాచీనమైన ఒరియా, అస్సామీ, బెంగాలీ, మైథిలి భాషలకు చాలా సన్నిహితత్వం కనిపిస్తున్నది. తాంత్రిక బౌద్ధ సిద్ధాచార్యులు ఘనమైన తాత్విక దృక్పథంతో ఈ చర్యా పదాలను రాశారు. బౌద్ధ సిద్ధాచార్యులు కణ్హపా, కుండలినీ శక్తి జాగృతమై సహస్రార చక్రం చేరుకోవడాన్ని ఉద్దేశిస్తూ తాంత్రిక బౌద్ధ సంప్రదాయానికి అనుగుణంగా రాసిన 'అస్పృశ్య సేవిక' ఇందుకు ఉదాహరణ.

బౌద్ధుల చర్యా పదాలు క్రీస్తుశకం 7వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం మధ్య వెలువడినట్లు పండితులు నిర్ధారించారు. క్రీస్తుశకం 15 వ శతాబ్దంలో సారళా దాసు యుగం ప్రారంభమైంది. ఈ రెండింటి మధ్య కాలంలో అంటే క్రీస్తు శకం 12వ శతాబ్దం నుండి 14 వ శతాబ్దాల మధ్య ఒరియా సాహిత్యంలో నాథ, సిద్ధ సంప్రదాయ సాహిత్యాలు కనిపిస్తాయి. మచ్ఛీంద్ర నాథుడు, గోరక్ నాథుల ప్రభావంతో విశేష ప్రచారంలోకి వచ్చిన నాథ

ధర్మం ఒడిష ప్రాంతం పై, ఒరియా సాహిత్యం పై గొప్ప ప్రభావాన్ని చూపింది. అలాగే శైవ తాంత్రిక సంప్రదాయం లోని సిద్ధుల ప్రభావం కూడా ఈ కాలంలో కనిపిస్తుంది. 'శిశు వేద', 'గోరఖ్ సంహిత' వంటి సంకలన గ్రంథాలు కొన్ని ఈ కాలంలో వెలువడ్డాయి. శిశువేద 22 దోహాల సంకలనం. క్రీస్తు శకం 11 వ. శతాబ్దం నుండి ఒరియా శాసన సాహిత్యంలో ఎన్నో వచన రచనలు కూడా కనిపించడం విశేషం. రాజా బలభద్ర భంజు 'భాగమతి' పేరుతో గొప్ప ప్రేమ కథను రాశాడు. 'సోమనాథ బ్రత కథా', 'నాంగల చౌతి' 'కలశ చౌతీశ' వంటి గ్రంథాలు ఈ కాలంలో వెలుగుచూశాయి. అబధూత నారాయణ స్వామి రచించిన 'రుద్ర సుధానిధి' గ్రంథాన్ని ఒరియా సాహిత్యంలో వెలువడిన మొట్టమొదటి వచన రచనగా విమర్శకులు పేర్కొంటున్నారు. రుద్ర సుధానిధి గ్రంథం శైవ తాంత్రిక ధర్మాలను చెప్తుంది. మార్కండ దాసు 'కోయిలి' అనే పదకవితలను మొదటగా రచించాడు. ఈయన రచించిన 'కేశవ కోయిలి' యశోదా దేవి తన కుమారుడైన కృష్ణునికి దూరమై పడిన వేదనను వర్ణిస్తుంది. మార్కండ దాసు ఇతర రచనలుగా 'దశగ్రీబ బధ', 'జ్ఞానోదయ కోయిలి' అనేవి కనిపిస్తున్నాయి. సిద్దేశ్వర దాసు రచించిన 'బిచిత్ర రామాయణం' కూడా ఈ కాలం నాటిదే. వీటి ద్వారా ఒరియా ప్రాంత ప్రజల పూజా విధానాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు అనేకం తెలుస్తున్నాయి.

క్రీస్తుశకం 15వ. శతాబ్దంలో సారళా దాసు రచించిన మహాభారతం వ్యాసుని మహాభారతానికి పునఃసృష్టి లాగా కనిపిస్తుంది. ఒడిశా ప్రాంత జీవన సంస్కృతికి ఈ గ్రంథం ఒక విజ్ఞాన సర్వస్వం వంటిదని అంటారు. ప్రపంచ సాహిత్యంలో ఉండే అతిపెద్ద గ్రంథాలలో ఇది ఒకటి. సారళా దాసు గజపతి మహారాజు కపిలేంద్ర దేవుని కాలంలోని వాడు. శూద్ర ముని గా ప్రసిద్ధుడైన ఈయనకు 'ఆదికబి' బిరుదం ఉంది. సారళా దాసు మహాభారతం బెంగాలీ సాహిత్యం పై కూడా గొప్ప ప్రభావాన్ని ప్రసరించింది. ఈయన ఇతర రచనలు 'చండీ పురాణం', 'విలంక రామాయణం'. సారళా దాసు సమకాలికుడైన అర్జున దాసు 'రామ బిబాహ', 'కల్పలత' కావ్యాలను వ్రాశాడు.

ఒరియా సాహిత్యంలో తొలిదశలో బౌద్ధం తరువాతి దశలో నాథ, సిద్ధ సంప్రదాయాల ప్రభావం ఆ తరువాత హైందవ సిద్ధాంతం లోని శైవ, వైష్ణవ శాఖలు రెండింటికి ప్రాతినిధ్యం కనిపిస్తుంది.

ఒరియా సాహిత్యం ప్రారంభం నుండి భక్తి కవిత్వం వెలువడుతూనే వుంది. ఇక భక్తి ఉద్యమ కవిత్వాన్ని పరిశీలిస్తే, ఒరియా సాహిత్యంలోని భక్తి ఉద్యమ కవిత్వానికి ఒక ప్రత్యేకత ఉంది. పూరీ క్షేత్రంలో వెలసిన జగన్నాథ స్వామి ఆరాధన వల్ల ఒరిస్సా ప్రాంతంలో ప్రత్యేకమైన, మిశ్రమమైన మత సంస్కృతి ఏర్పడిందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

భక్తి ఉద్యమ ప్రవర్తకుల్లో ఒకరైన చైతన్య స్వామి క్రీస్తుశకం 1510 లో పూరీ క్షేత్రాన్ని సందర్శించారు. అంతకంటే ముందే ఒరిస్సా ప్రాంతంలోని వైష్ణవ కవులు జ్ఞాన మార్గాన్ని అనుసరించి నిరాకార నిర్గుణ సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ భక్తి సాహిత్యం విశేషంగా సృష్టించారు. క్రీస్తుశకం 16వ శతాబ్దం మధ్య కాలంలో వెలువడిన అనేక గ్రంథాలు నిరాకార నిర్గుణ బ్రహ్మ సిద్ధాంతాన్ని, ఆత్మ తత్వాన్ని ప్రధానంగా గ్రహించి వ్రాసినవి.

శ్రీ చైతన్య మహా ప్రభువు ప్రచారం చేసిన రాధాకృష్ణ సంప్రదాయాన్ని ఉత్కళీయ వైష్ణవం పూర్తిగా అనుసరించక పోయినప్పటికీ ప్రభావానికి మాత్రం లోనయింది. అలాగే, ఉత్కళీయ వైష్ణవం రామానుజులు ప్రతిపాదించిన విశిష్టాద్వైతం కంటే ప్రత్యేకమైంది. ఈ వైష్ణవం పై బౌద్ధమత ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని చెబుతారు. ఉత్కళీయ వైష్ణవాన్ని అనుసరించి పూర్ణ బ్రహ్మ మైన జగన్నాథుని నుండి విష్ణుమూర్తి దశావతారాలు ఆవిర్భవించి మరలా జగన్నాథుని లోనే ఐక్యం చెందాయి. ఉత్కళీయ వైష్ణవులు కులవ్యవస్థకు పూర్తిగా వ్యతిరేకం. వీరి దృష్టిలో జీవులన్నీ సమానమైనవి. వీరు మహమ్మదీయులకు కూడా వైష్ణవ దీక్షను ఇచ్చారు. పంచ సఖా యుగంలో వెలువడిన

సాహిత్యంలో భక్తి అన్నది ఉద్యమంగా పరిణామం చెందడం మనం స్పష్టంగా చూడవచ్చు.

ఒరియా సాహిత్యంలో బలరామ, అచ్యుత, యశో వంత, అనంత, జగన్నాథ అనే ఐదు మంది ప్రసిద్ధులైన వైష్ణవ కవులు కనిపిస్తున్నారు. అందుకే వీరి కాలాన్ని "పంచ సఖా యుగం" అంటారు. వీరిలో బలరామదాసు వాల్మీకి రామాయణాన్ని 'జగమోహన రామాయణ' పేరుతో ఒరియాలోకి అనువదించాడు. ఈ రామాయణం చాలా చోట్ల వాల్మీకి రామాయణంతో విభేదిస్తుంది.

జగన్నాథ దాసు రాసిన 'భాగవత పురాణ' అక్కడి ప్రజల నిత్య పారాయణ గ్రంథం. చైతన్య మహా ప్రభువు తన సమకాలికుడైన జగన్నాథ దాసును "అతిబది" అని గౌరవించే వాడని తెలుస్తున్నది. జగన్నాథ దాసు రాసిన భాగవతం ఒరిస్సా ప్రజల విశేష ఆదరణను పొందిన గ్రంథం. ఈ భాగవతం ఒరిస్సా ప్రజల భక్తి, నైతిక, ధార్మిక జీవన విధానాలకు నిజమైన మార్గదర్శిగా మారింది.

అచ్యుతానంద దాసు సంస్కృత హరివంశాన్ని 'హరి వంశ' పేరుతో అనువదించాడు. అచ్యుతానంద దాసు అనేక శాస్త్రాలలో పండితుడు. అచ్యుతానంద దాసును మహా పురుషుడుగా సంభావిస్తారు. అనంత దాసు రచించిన 'హేతు ఉదయ భాగవత' ఉత్కళీయ వైష్ణవ సిద్ధాంతంలో పేర్కొనదగిన గ్రంథం.

జశోబంత దాసు (యశోవంత దాసు) చైతన్య మహాప్రభు నుండి వైష్ణవ దీక్షను పొందాడు. ఈయన రచించిన 'ప్రేమ భక్తి బ్రహ్మ గీత', 'గోబీంద్ర చంద్ర తిక' వైష్ణవ సాహిత్యంలో ప్రసిద్ధమైన గ్రంథాలు. పంచసఖా యుగంలో అనేక పదాబళులను (పదావళి) సంకలనం చేసిన సన్యాసి రఘు అరక్షిత. ఈయన పంచ సఖులతో సమానుడుగా ప్రసిద్ధుడు అయినందువలన ఈయనతో కలుపుకుని షడ గోస్వామి (6 మంది గురువులు) అని వ్యవహరిస్తారు. ఒరియా సాహిత్యంలో మొదటి కవయిత్రిగా పేర్కొనబడుతున్న మాధవి పట్నాయక్ ఈ యుగానికి చెందిన వైష్ణవ కవయిత్రి. వీరందరూ భక్తి ఉద్యమ తత్వాన్ని అనుసరిస్తూనే సామాజిక స్పృహను ప్రకటించిన ఉద్యమకారులు.

నరసింహ సేన ('గోపకేళి', 'పరిమళ'), బనమాలి దాసు ('చతా ఇచ్చా మతి', 'రస') విష్ణు దాసు ('ప్రేమ లోచన', 'బడ శకుంతల', 'కళాబతి') చైతన్య దాసు ('నృసింగ పురాణ', 'నిర్గుణ మహాత్య',) రఘునాథ హరిచందన్ ('లీలాబతి') శిశు శంకర్ దాస్ ('ఉషా బిలాస') ప్రతాప్ రాయి ('శిశు సేన') దేవ దుర్లవ దాస్ ('రహస్య మంజరి') రామచంద్ర చోత్ రాయి ('హిరాబతి') భూపతి పండిత్ ('ప్రేమ పంచామృత') కార్తీక్ దాస్ ('రుక్మిణి వివాహ') దనాయ్ దాసు ('గోపరాస') పురుషోత్తమ దాస్ ('కాంచీ కావేరి') వంటి ఎందరో కవులు పంచ సఖా యుగంలో కనిపిస్తారు. అలాగే ఈ యుగంలో ధరణీధర మిశ్రా, బృందావన దాస్ వంటి కవులు జయదేవుని 'గీతగోవిందం' కావ్యాన్ని ఒరియా లోకి అనువదించారు.

ఒరియా సాహిత్యంలో పంచసఖా యుగంలోనే రీతి యుగానికి నాంది పడిందని అంటారు. ఈ యుగంలోనే అనేక పౌరాణిక, కాల్పనిక కావ్యాలు వెలువడినప్పటికీ భక్తి ఉద్యమ ప్రభావం మాత్రం తప్పించుకోలేక పోయాయి.

ఒరియా సాహిత్యంలో కవిసామ్రాట్ ఉపేంద్ర భంజ్ రీతి యుగంలోని కవుల్లో అగ్రగణ్యుడు. భంజ్ రచించిన 'బైదేహీశ బిలాస', 'లావణ్యబతి', 'కోటి బ్రహ్మానంద సుందరి' కావ్యాలను విశిష్టమైనవి గా పేర్కొంటారు. ఈయన 50కి పైగా రచనలు చేసినప్పటికీ ప్రస్తుతం అవన్నీ లభించడం లేదు. వీటిలో 'సుభద్రా పరిణయ', 'బైదేహీ విలాస', 'లావణ్యవతి', 'కోటి బ్రహ్మాండ సుందరి' కావ్యాలు భక్తి ఉద్యమంలోని ప్రేమ తత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఈయన సంస్కృతంలో శ్రీ హర్షుని కి ధీటైన వాడని ఒరియా పండితులు ప్రశంసించారు.

ఒరియా సాహిత్యంలో ఉపేంద్ర భంజ్ వలె ప్రసిద్ధుడైన మరొక కవి దీనకృష్ణదాసు. ఈయన రాసిన

'రసవినోద' కావ్యం భక్తుల దారిద్ర్యాన్ని దైన్యాన్ని చిత్రిస్తే, 'రస కల్లోల' కావ్యం భగవంతుని ప్రేమను, వాత్సల్యాన్ని చిత్రిస్తుంది. ధనుంజయ భంజ్ రాసిన 'రఘునాథ బిలాస', లోకనాథ విద్యాధర రాసిన 'నీలాద్రి మహోత్సవ' త్రిబిక్రమ భంజ్ 'కనకలత', ఘన భంజ్ 'త్రైలోక్య మోహిని', 'రసనిధి', 'గోబింద బిలాస', లోకనాథం విద్యా ధర రాసిన 'సర్బాంగ సుందరి' అన్నవి బాగా ప్రాచుర్యాన్ని పొందిన కావ్యాలు. ఒరిస్సాలోని రీతి కవులు సంస్కృత రీతి సంప్రదాయంలో వలె ఆలంకారిక మైన శైలికి కాకుండా రసానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. వైష్ణవ భక్తుల ప్రేమను, భక్తిని, తాదాత్మ్యాన్ని వర్ణిస్తూ అనేక కావ్యాలు ఈ కాలంలో వెలుగుచూశాయి. కవయిత్రి బృందావతిదాసి రాసిన 'పూర్ణతమ చంద్రోదయ' వీటిలో ఒకటి. అలాగే రామ పంథి మార్గాన్ని అనుసరించిన కేశవ పట్నాయక్ రామ లీల నృత్య ప్రదర్శన కోసం రాసిన రామాయణం గొప్ప గేయ కావ్యం.

ఒరియా సాహిత్యంలో 18వ శతాబ్ది మధ్య కాలం నుండి వ్యంగ్య రచనలు ప్రత్యేకంగా కనిపిస్తాయి. అయితే ఈ సందర్భంలో కూడా భక్తి ప్రధానమైన కావ్యాలే కొంచెం ఎక్కువగా వెలువడ్డాయి. బ్రజ్ నాథ్ బడజనా 'అంబికా బిలాస' కావ్యం శైవ సంప్రదాయంలో, అభిమన్యు సమంత సింహార 'బిదగ్ధ చింతామణి' వైష్ణవ సంప్ర దాయంలో వెలువడిన కావ్యాలు. బిశ్వనాథ్ ఖుంటియా రచించిన 'బిచిత్ర రామాయణ' 18వ శతాబ్దం ప్రారం భంలో వెలువడిన అత్యంత ప్రసిద్ధ రచన. పీతాంబర్ దాస్ 18వ శతాబ్దంలో 'నరసింగ పురాణ' ను రత్నాకరాలు అనే ఏడు భాగాలుగా రచించాడు. రీతి యుగం చివరిలో ఉన్న ఇతర ప్రధాన కవులు బనమాలి, జాదుమణి మోహపాత్ర. ఈ సమయంలోనే భక్తచరణ కవి జగన్నాథ భక్తిని ప్రబోధిస్తూ 'మన బోధ చౌతీశా' కావ్యాన్ని, ప్రేమ భక్తిని ప్రతిపాదిస్తూ 'మధురా మంగళ' కావ్యాన్ని రాశాడు. విశ్వంభర దాసు మహాభారతాన్ని ప్రదర్శన యోగ్యంగా చేస్తూ 'విచిత్ర భారతం' అనే పేరుతో రాశాడు. కృష్ణ సింగ్ మహాభారతం కూడా పేర్కొనదగింది. హరిబంధు, గౌరహరి, గౌరచరణ, కృష్ణసింహ వంటి వారు ఒడియా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

ఒరియా కవితలో కోయిలీ, భజన, పోయి, చౌపది, చౌతీశావంటి గేయ రీతులు కనిపిస్తాయి. ఈ కాలంలో వెలువడిన చౌతీశా ప్రక్రియ ప్రధానంగా ఆధ్యాత్మిక విశేషాలను తెలియజేసే దేవతా సంబంధమైన విషయా లను వివరిస్తున్నది. ఒరియా భాష లోని 34 అక్షరాల్లో ప్రతి అక్షరంతో ఒక్కొక్క చరణం ప్రారంభించి 34 చరణాలు కలిగిన పద్యరచన చౌతీశా.

రీతి యుగం చివరి దశలో నలుగురు కవులు ఒరియా సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. బలదేవ రథ్, భ్రజనాథ్ బడజనా, గోపాలకృష్ణ పట్నాయక్, భీమా బోయ్. ఒరియా సాహిత్యంలో బలదేవ్ రథ చంపూ కావ్యాలకు దారి చూపినవాడు. జయదేవుని గీత గోవింద కావ్యంలోని ఇతి వృత్తాన్ని బలదేవ 'కిశోర చంద్రానన' అనే చంపూ కావ్యంగా రాశాడు. ఈ కావ్యం కవితా సౌందర్యంలో గీత గోవింద కావ్యం కంటే విశిష్టమైనదని అంటారు. ఒరియా సాహిత్యం లోనే ఈ కావ్యం మణిపూస లాంటిది. బలదేవ రథ రచించిన భక్తి గీతాలు ఒరియా సమాజంలో బహుళ ప్రచారం పొందాయి.

గిరిజన ఖోంధ్ కుటుంబంలో జన్మించిన అంధ కవి భీమాభోయి. ఈయన రచించిన 'స్తుతి చింతామణి', 'బ్రహ్మ నిరూపణ గీత', 'శ్రుతినిషేధ గీత' వంటి గ్రంథాలు తాత్విక దృక్పథంతో ఆయన స్పృశించిన మానవీయ కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. అలాగే ఒరియాసాహిత్యంలో కవితకు మార్గదర్శకుడు గోపాలకృష్ణ. ఈయన రచనలోని భక్త్యావేశం పాఠకుల్ని మైమరిపింప చేస్తుంది.

మొత్తం మీద భారతీయ సమాజంలోని అన్ని సాహిత్యాలపై భక్తి ఉద్యమం చూపించిన అసామాన్యమైన ప్రభావాన్ని విస్తృతంగా చర్చించే అవకాశం, అవసరం కూడా

ఉంది. ఎందుకంటే భక్తి ఉద్యమ సాహిత్యం కేవలం భక్తి మాత్రమే ప్రబోధించేది కాదు. అది సామాజికమైన అనేక వివక్షలను ఖండిస్తూ, మానవత్వాన్ని ప్రేమతత్వాన్ని ప్రబోధిస్తూ వెలువడిన సాహిత్యం.

ఆధార గ్రంథాలు :

1. History of Oriya Literature Shri Jitendra Mohan Mohanty ISBN 9788190343800, 2006
2. Encyclopaedia of Literature Volume -1(1946) Philosophical library, New York, Joseph T. Shipley
3. Encyclopaedia of Indian Literature, Sahitya Akademi 1987, ISBN 81-260-1803-8 Bhartiya Sahitya Sankalanam, Anuvada Vangmayam – 38, Telugu Academy 1978

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కట్ట బ్రహ్మన చరిత్రము – దేశభక్తి కావ్యం

– డా॥ పి. విశ్వ ప్రసాదు, అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్.

రాణుల ప్రేమ పురాణాలు, ముట్టడులకైన కర్చులు మాత్రమే చెప్పేది చరిత్ర కాదు. తారీఖులూ, దస్తావేజులు కూడ చరిత్ర కాలేవు. బలవంతుల దౌర్జన్యాల గురించి, పాలకుల వంచన గురించి పీడితుల కష్టాల గురించీ, సామాన్య జనాల జీవన విధానాల గురించి, అప్పటి సామాజిక ముఖచిత్రాల్ని విపులంగా వర్ణించేది చరిత్ర. ఈ చరిత్రను మలుపుతిప్పిన వీరుని గురించి రాయవలసి వస్తే, అతని వీరత్వం గురించి, అతని శౌర్యప్రతాపాల గురించీ, తన దేశం కోసం, తన వాళ్ళ కోసం ఆ వీరుడు ఎన్నుకున్న మార్గం గురించి రాయాలి. అదే వీరుని చరిత్రను కావ్యంగా రాయాలంటే, కావ్య ప్రయోజనాలని సాధించాలి. అవి ఆనందమూ,

ఉపదేశము. వీరుని కావ్యం గాధ వింటుంటే రోమాంచితమై దేశభక్తితో ఉప్పొంగిపోవడం జరుగుతుంది. ప్రాచీన చరిత్రను కావ్యరూపంలో మలిస్తే 'ఆనందం' మాత్రమే లక్ష్యం అయితే సరిపోదు. అప్పటి చరిత్ర ఇప్పటి సమాజానికి ఏం నేర్పుతుంది? దాని ద్వారా ప్రస్తుత సమాజం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకుంటుంది? ఇదే అసలైన 'ఉపదేశం'. ఒక వీరుని చరిత్రను వస్తువుగా తీసుకొని కావ్యరచన చేయడంలో ఔచిత్యమిదే. వర్తమాన కాలంలోని సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేసేది గతకాలపు నిర్మాణాలే. గతం యొక్క గాంభీర్యం వర్తమానాన్ని కదుపుతుంది. చరిత్రలోని ఉద్విగ్న ఘట్టాల్ని స్మరించుకోవడం ద్వారా వర్తమానాన్ని ప్రయోజనవంతంగా రూపొందించుకోవడంలో సౌకర్యం ఉంటుంది. అని అనడంలో ఉద్దేశమిదే. ప్రస్తుత సమాజాన్ని కుదిపేస్తున్న అనేక సమస్యల్ని దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తున్న 'మూక'ల ఆగడాల్ని ఎండగట్టి, దేశ ప్రజలకు సరైన దిశానిర్దేశాన్ని సమాజానికి స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కలిగింప జేస్తూ సామాజిక స్పృహ కలిగి, సాహిత్య సృజన చేసే నిత్య జ్వలితుడే కవి.

ఈ కవి నిర్మించే సాహిత్యం 'దేశభక్తి' కవిత్వంలోకి వస్తుంది. ఈ రకమైన కవిత్వం ఆధునిక కవిత్వంలోనే కనిపిస్తుంది. ప్రాచీన కావ్యాల్లో దైవభక్తి ఉండేది. ప్రస్తుతం దేవుని స్థానంలో దేశం నిలిచింది. దేశం తల్లిలాగ, శక్తిలాగ దర్శనమిచ్చింది. తల్లిని పరాయిపాలన నుండి, దాస్య శృంఖలాల నుండి విముక్తి కలిగించడమే దేశభక్తి, జాతికి, దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టడమే ఆ సాహిత్య లక్ష్యం.

ఎందరెందరో మహావీరులు నిస్వార్థంగా కేవలం దేశ ప్రయోజనం కోసం, తమ సర్వస్వాన్ని త్యాగం చేసి సాగించిన పోరాటాల ఫలితమే స్వాతంత్ర్యం. దీన్ని కాపాడుకోవడం, అంతరంగికమైన, ఆత్మనాశనమైన, వైరుధ్యాలను తొలగించుకోవడానికి ఉద్బోధ కోసం వీరుల కావ్యాల అవసరం ఉంటుంది. ఎప్పుడెప్పుడు దేశానికి ఆపద కల్గుతుందో ఏనాడు జాతికి ముప్పు ఏర్పడుతుందో, ఆయా కాలాల్లో సమాజంలో ప్రధాన భాగస్వాములైన కవుల గుండెలవిసిపోతాయి. అగ్నికీలలు లాంటి కవిత్వం జాతీయ జీవన ఐక్యతా సూత్రం అవుతుంది. కనుక దేశభక్తి, దేశీయుల హృదయంలో నిరంతరం ప్రవహించే జీవనది. దాని నిరాదరణ జాతి పతనానికి ప్రధాన కారణం. తను పుట్టిన దేశం మీద నిష్కళంకమైన, నిరుపమానమైన భక్తి ఆచారాల మీద, సంప్రదాయాల మీద అపారమైన అభిమానం. తన జాతి శ్రేయస్సుకై పాటుపడాలనే తపనా దేశభక్తికి మూలసూత్రాలు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో 'భరత ఖండంబు చక్కని పాడియావు' అనే చిలకమర్తి గేయం దేశభక్తి

కవిత్వానికి పునాదులు వేసింది. జన్మభూమియే ఈనాటి దైవము. దేశభక్తే దైవభక్తిగా దేశసేవనే ఉపాసనగా మారి, అనేక రచనలు వచ్చినయి, వస్తున్నాయి. దేశం దాస్యంలో మగ్గుతుంటే ఎందరో దేశభక్తులు స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలర్పించడం అప్పటి కవులకు నిత్యం కని పించేది. వాళ్ళను ఒకచోట కుదురుగా ఉండనీయని దుర్భర పరిస్థితులే ఈ దేశభక్తి కవిత్వానికి ఊపిరిలాడాయి. పంజరం నుంచి ఆకాశం వైపుగా ప్రయాణం సాగించడమే అసలైన జీవితం - కవిత్వం. జీవితానికి అసలైన అర్థాన్ని చ్చేది దేశంపై సానుకూల వైఖరి. దేశ ప్రజల పట్ల, వనరుల పట్ల నిర్వ్యాజమైన ప్రేమ, దేశ పరిస్థితులకు తగిన సర్దుబాటు, కవిత్వ పరమావధి వీటన్నిటిని హృద్యంగా చిత్రించడం.

భారతదేశం వలసపాలనలో ఎన్నో కష్టాలు, అవ మానాలు పొంది, భయంకరమైన స్థితిలోకి నెట్టివేయ బడింది. స్వాతంత్ర్యేచ్ఛ జాతికి ఊపిరిగా మారడంతో స్వేచ్ఛా వాయువులు భారతావని నిండా వీచాయి. ఈ సందర్భంలో తెలుగు పద్యం ఒక శివభారతంగా, రాణా ప్రతాపసింహ చరిత్రగా, వందేమాతరంగా తన ప్రయత్నాన్ని కొనసాగించింది. స్వాతంత్ర్యానంతరం కూడ దేశ ప్రజలను జాగృతం చేసే రచనలు అనేకంగ వస్తున్నాయి. నల్లదీగ శ్రీనివాసచార్యుల "వీరపాండ్య కట్ట బ్రహ్మన చరిత్ర' ఆ ఆశయ సిద్ధి కోసం వచ్చిందే. ఈ కావ్యాన్ని కేవలం చరిత్రను స్మరించడమే కాక, దేశభక్తిని ప్రేరేపించడమే కాక, ప్రస్తుతం దేశంలో నిరాసక్తులుగ, సోమరులుగ, చైతన్యరహిత స్థితిలో పడిపోయిన సమూహాల్ని, తట్టిలేపే జాగ్రత్తలు చెప్పేదిగా చూడాలి. దేశ సమగ్రతకు వ్యక్తిగా, సమూహంగా చేయవలసిన పనులూ, తీసుకోవలసిన జాగ్రత్తలు ధారా ప్రవాహంగా చెప్పాడీ కవి. సుమారు మూడువేల గద్యపద్యాలు గల ఈ కావ్యంలో సుమారు వెయ్యి పద్యాలు దేశభక్తి ప్రేరేపితాలు కావడం గమనార్హం. కట్టబ్రహ్మన జీవితాన్ని ఆలంబనగా తీసుకొని కవి తన నిరుపమాన దేశభక్తిని చాటుకున్నాడు. దీనిని 'ఏకనాయిక వీర కథ' ప్రాముఖ్య పద్యకావ్యంగా కవి చెప్పుకున్నాడు.

గురజాడ 'దేశభక్తి' "దేశమును ప్రేమించుమన్నా", రాయప్రోలు "ఏ దేశమేగినా ఎందు కాలిడినా", శ్రీశ్రీ "ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం" - ఈ మూడు గేయాలను పరిశీలిస్తే మొదటిది సమాజం కోసం వ్యక్తి కర్తవ్యాన్ని, రెండోదాన్లో కర్తవ్య నిర్వహణ జాతి గౌరవాన్ని కాపాడేందుకు 'ఓడల జండాలు ఆగేంతవరకు' మాతృదేశ కీర్తన చెయ్యాలనీ, మూడో దాంట్లో గతితార్కిక భౌతికవాదం దృష్టిలో. దేశం లోపల, దేశం బయటా జరిగే కల్లోలాల గురించి ఆవేదన కనిపిస్తుంది. మానవతా వాద, కాల్పానిక వాద, అభ్యుదయ వాద కవితలకు ఇవి ఉదాహరణలు. సరిగ్గా ఈ మూడుపాయలను ముడి వేసిందీ నల్లదీగ వారి దేశభక్తి కావ్యం కట్టబ్రహ్మన. ఈ బృహత్రంధం యొక్క పూర్వపరాలు, కట్ట బ్రహ్మన పుట్టుపూర్వోత్తరాలు, యుద్ధాలు కథా వివరణ. చరిత్ర జోలికి పోకుండా కేవలం ఈ మహా కావ్యంలో 'దేశభక్తి' ప్రేరకమైన కొన్ని పద్యాలను పరామర్శించడమే ప్రస్తుత వ్యాస ఉద్దేశ్యం.

కవి పరిచయం :

తెలంగాణలోని సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు దగ్గరలో వున్న వరదరాజపురం వీరి తాతగారి జన్మస్థలం. బతుకు దెరువు కోసం వీరి తండ్రిగారు నల్గొండ జిల్లా రావుల పాలెం తరలివెళ్ళారు. శ్రీ నల్లదీగ గారు 15-12-1933న జన్మించారు. బాల్యమంతా రావులపాలెంలో గడిచినా ఉ న్నత విద్య తిరుపతి శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో, హైదరాబాద్ మూసారాంబాగ్ లోని వేదాన్తవర్ధిని కళా శాలలో జరిగింది. తర్వాత 1956 నుండి 1992 వరకు 36 సంవత్సరాలు మహబూబ్ కళాశాల - సికింద్రాబాద్ లో తెలుగు అధ్యాపక వృత్తి నిర్వహించారు. కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడే "అమర భారతి" అనే పత్రికను నిర్వహిస్తూ, దానికి ఎన్నో చిత్రాలు గీశారు. వీరి చిత్రాలు కొన్ని 'గోలకొండ' పత్రికలో కూడ నిర్వహించబడ్డాయి.

వీరికి కవిత్వంలోనే కాకుండా చిత్రలేఖనం, శిల్పకళలలో కూడ మంచి ప్రావీణ్యం ఉంది. సంగీతం, నాట్య రంగాల్లో ప్రావీణ్యం సంపాదించి ప్రదర్శనలు కూడ ఇచ్చారు. లలితకళలు ఐదింటిలో ప్రవేశమూ, ప్రావీణ్యము ఉన్న నరసులు వీరు. అంతకంటే ముఖ్యంగా, మిగతా నాలుగు లలిత కళల్ని కవిత్వంలో అద్భుతంగా ఆవిష్కరించారు. మంచి దేహధారుడ్యం గలవారు. వస్తారు. సాహిత్యంలో, వ్యాయామంలో సాము గారడీలు చేయగల సిద్ధహస్తులు. తెలంగాణలోని గొప్ప పండిత వంశమైన 'మరింగంటి' వారి ఆడపడుచు జగన్నాయకమ్మ వీరి ఇల్లాలు. సుమారు 50 సంవత్సరాలు 50కి పైగా రచనలు చేశారు. అన్ని దైవాంకితాలే. వీరు 22-12-2015 నాడు స్వర్గస్తులైనారు. వీరి రచనలను, చిత్రాలను బూర్గుల, సురవరం, దాశరథి, ఉత్పల, దేవులపల్లి రామానుజ రావు, దివాకర్ల, తిరుమల రామచంద్ర, వానమామలై, సి.నారాయణరెడ్డి, నటరాజ రామకృష్ణ, మధునా పంతుల, బి.యస్.శాస్త్రి, జి.వి. సుబ్రహ్మణ్యం వంటి ఎందరో ప్రముఖ సాహితీవేత్తలు ప్రశంసించారు. కట్ట బ్రహ్మన కావ్యం సుమారు 25 సంవత్సరాల పాటు సాగిన రచన. 1986లో ప్రారంభమై, 2011లో పూర్తి చేయబడింది.

ఈ కావ్యంలో ప్రాచీన లాక్షణికులు నిర్వహించిన కావ్య లక్షణాలన్ని ఉన్నాయి. అష్టాదశ వర్ణనలు, రసపోషణ ఔచితీవంతంగ నిర్వహింపబడినది. రాజనీతి, యుద్ధనీతి, వర్ణనలు, ధార్మిక - జాతీయ దేశభక్తి ప్రబోధక విషయాలు చక్కగా నిరూపింపబడినాయి. భారతీయ స్వతంత్ర ధర్మం సంపూర్ణంగా ఇందులో కనిపిస్తుంది.

ఇష్టదేవతా స్తుతి. ప్రాచీన తెలుగు కవులు, నవీన కవులు, శ్రేయోభిలాషులు. ఆచార్య స్తుతులతో మొదలౌతుందీ కావ్యం. మొదటి ఖండంలోనే కావ్యం యొక్క పరమార్థాన్ని, పరమ ప్రయోజనాన్ని, 'యోధా గ్రేసరులు' అని '22" పద్యాలలో కూర్చి చదువరుల ఛాతీ వైశాల్యాన్ని ఆమాంతంగా పెంచేస్తాడు. "పుణ్య సుశ్లోకు లను జన్మభూమియైన, భరతధాత్రికి నెనలేదు వసుధ నొకటి" అంటూ ఇచ్చటి గుట్టెన, చెట్టెన, మిట్టయైన, పల్లమైననూ ఏటి లోపల వెలిగే గులకరాయైన సౌందర్యవంతమైనదేననీ పరసీమ వాసులే నమస్కరించి అన్నారని పులకరించి పోతాడు కవి. విదేశీ యాత్రికుల్ని తలుచుకుంటూ, ఇక్కడి సంపదను చూసి, తెల్లవారికి కన్ను కుట్టించారంటాడు. గుంటనక్కల్లాగ వచ్చి దురాక్రమణతో దేశాన్ని ఆక్రమించారని శోకిస్తాడు. అప్పటి దేశభక్తులు అగ్గిపిడుగులుగా మారి భగ్గమని తిరుగుబాటు జెండా ఎగురవేస్తారని, యోధుల గురించి వర్ణిస్తాడు. ఉత్తర దక్షిణ భారతంలో బ్రిటిష్ కుటిల సామ్రాజ్యంపై దండెత్తిన అందర్నీ పేరు పేరునా తలుచుకొని పరవశించి పోతాడు. "గిరులు, తరువులు నదీనదుల్ వరలు వరకు నిత్యమై నిఖిలమై ఇల సత్యమౌచు ఎ నిలిచి యాచంద్ర తారార్కములరు వరకు మసలు మీ కీర్తి గీర్తించు మమ్మ యెపుడు..." అని ఉప్పొంగిపోతాడు.

భారతదేశ వైభవాన్ని భౌతిక, ఆధ్యాత్మిక జీవనాలకు తోవ చూపుతున్న దానిగా "ఇహపరమ్మిచ్చు నిగమాది నిధుల గల్గి / భువన వైభవ మెచట పెంపొంది యెదగె / పరవ పావన గుణజాత భక్తి గీత మాతలకు మాత భరతమాత" అంటాడు. ప్రపంచంలో భారతదేశ ఔన్నత్యానికి కారణమైన ప్రాచీన సాహిత్యాన్ని, ప్రాచీన కవుల్ని, పురాణాల్ని, సాధ్వీమణుల్ని, శాస్త్ర పాండిత్యాన్ని, పుణ్య నదుల్ని, పరివ్రాజకులను, వీర సైనికుల్ని, స్వాతంత్ర్య సమరయోధుల్ని, కన్నులారా వర్ణిస్తాడు. అయితే ఇలాంటి ఉజ్వలమైన చరిత్రగల భారతదేశం 'నేడు' "పెడదారుల భరతజాతి దొర్లుతుందని' గింజుకుంటాడు. తన్ను తాను మరిచెను తనను గన్న / కన్నతల్లిని మరిచెను. ఘనమనోజ్ఞ, మైన తన దేశమునె మర మనిషి యయ్య ఎ మరిచె నీ నాడు సుఖముల మాయ జిక్కి' అని దుఃఖిస్తాడు.

షష్యంతములలో కవి వీరబ్రహ్మనతో పాటు భారత జాతి దాస్య విముక్తికి ప్రాణాలర్పించిన వీరులందరినీ భక్తితో స్మరించుకున్నాడు. అలాగే ఆత్మాభిమానాన్ని, స్థిత

ప్రజ్ఞతను, ధీరత్వాన్ని, దేశభక్తినీ చాటుకునడమే కాక, అప్పటి భారతీయ పాలనలో ప్రజలు ఎంత సుఖంగా జీవనాన్ని సాగించారో కూడ వర్ణిస్తారు. వంచన, కుతంత్రంతో దేశరాజులను మోసం చేసే వలస మూలక దాష్టీకాన్ని, వ్యసన పరులైన దేశద్రోహులను ఎండగడుతాడీ కవి. ఇక్కడి మట్టి పౌరుషాన్ని వర్ణిస్తూ కవి "అచటి జన్మించు ప్రతి జీవియు మితమైన / పౌరుషోద్వేల గాంభీర్య పటెరులెల్ల తల్లి చనుబాలతో పాటు ద్రావి మిగుల / నొంట బట్టించుకొని యుండు నోర్పుగదర" అంటారు.

బ్రహ్మనను కప్పం కట్టమంటారు బ్రిటిష్ వారు. దానికి మహోగ్రుడైన బ్రహ్మనతో పాటుగా కవి కూడ తీవ్రతలో "అర్థసిద్ధికి ఆత్మనమ్ముకునే జాతి కాదనీ", అవని తలక్రిందులైనా, దోసిలొగ్గబోను"అంటూ పచ్చి పసికందు పాపలకు కూడ తల్లి పౌరుషమనే ఉగ్గు పెడుతుందనీ రాజసాన్ని ప్రకటిస్తాడు. "మాదిరా! భారతావని మాకు మీకు దాసులెపుడు వ్యాపారవాసులచట ఎ గుండెలేవో మా ముందు కూరుచుండ ఎ తెల్లదొరలారా! యిటనుండి తిరిగిండి' అని ఇంకా తీవ్ర స్వరంలో "..... మీకురా! కప్పమిచ్చుట మేము నేడు అడుగ సిగ్గున్నదా! తొత్తు కొడుకులారా!" అంటూ "పన్ను మీకిచ్చుట నీళ్ళ పైన వ్రాత ఎ వంటి దేయగు మా తోడవైరములను / పెట్టుకొనువాడు నిట బట్ట కట్టబోడు బ్రతుకదలచిన మా జోలిరాడు నెవడు' అని హెచ్చరిస్తాడు. అసలు ఇతర రాజ్యాలను కొల్లగొట్టాలని, ఇతరుల సంపదలను దోచుకోవాలనే బెంపరితనాన్ని, దోపిడీ స్వభావాన్ని కవి ఈ కావ్యంలో అడుగడుగునా నిలదీస్తాడు. "నీతిమాలిన మీ జాతి మూతి నాకు కుక్క తీరు"గ ఉన్నదంటూ "మీరు మీ తల్లిపై ప్రేమ మీరి యుండు తీరు మా తల్లి దేశముపై రవంత / ప్రేమగల వారమగుచు మీరెరుగరేమొ ఎ తల్లి మీకెట్లో మాకు తల్లి యట్లు' అని నీతిబోధ చేస్తారు. నిజానికి దేశ స్వతంత్రత పౌరుడేమి చేయాలె? కొడుకు తల్లి ఋణం ఎలా తీర్చుకోవాలె? లాంటి ప్రాథమిక భావనలు దీర్ఘంగా చర్చిస్తాడీ కవి. దేశ భద్రత విషయంలో ఎలాంటి సడలింపులూ ఉండరాదనీ "బొందిలో ప్రాణముండగ బూని జనని నాదుకొను వాడె పుత్రుడు నవని నెందు తల్లి నొరులకు నమ్మెడి తనయుడౌనె? / వాడు నే పాటి వాడైన వ్యర్థుడగును" అని మాతృమూర్తికి, మాతృదేశానికి అభేదాన్ని చూపి, దేశీయుల హృదయంలో రక్తాను ప్పొంగించే ప్రయత్నం చేస్తారు.

కట్టబ్రహ్మన సాహసాలు ఈ రచన నిండా మనకు కూర్చోనీయకుండా చేస్తాయి. ప్రతీ పద్యం రక్తాన్ని మరిగి స్తుంది. ప్రతీ అక్షరం పిడికిలిని బిగిస్తుంది. ప్రతీ వర్ణన ప్రతీ సందర్భం అప్పటి చరిత్రలోకి మనల్ని లాక్కెళ్తుంది.

దారిదోపిడి చేస్తున్న దొంగలను కట్టడి చేస్తూ, వారు దొంగలుగా మారడానికి సమాజమే కారణమని, వారిని దారిలో పెట్టేందుకు ప్రయత్నిస్తాడు. ప్రజల హితాన్ని కోరి, ధర్మబద్ధుడై పరిపాలన చేసేవాడే ప్రభువౌతాడనీ, అలాంటి ప్రభుత్వమే వర్ధిల్లుతుందంటాడు. "ఏది యెవరికి సాధ్యమో యిష్టమేదో ఒరులకి సుమంతహాని రాకుండు నట్టు / లట్టి సద్వృత్తి గైకొని యాదరించి / మానవత్వంబు లెసగంగ మనగవలయు' అని ఎవ్వరైనా ఇతరులకు హాని తలపెట్టకుండా 'సద్వృత్తి' కలిగి వుండాలంటాడు. దేశభక్తి ఉపన్యాసాల్లోనూ ప్రదర్శనల్లోనూ కాకుండా సమాజ హితమే తన హితముగా భావించి, త్రికరణ శుద్ధిగా 'మంచి' వైపుగా నడవడమే దేశం పట్ల మన అభిమానాన్ని, భక్తినీ, బాధ్యతనీ నిరూపిస్తుంది. ఇంకా బ్రహ్మన వారితో "దేశమాత తల్లి / దేశాధిపతి తండ్రి తల్లిదండ్రి గొలిచి ధన్యులగుడు అన్నదమ్ములట్లు నరయుడు ప్రజల గుణ సఖ్యతలను బెంచి జగతి మనుడు' అంటూ దేశమాత సేవతో ప్రజల గుణ సఖ్యతలను బెంచి జగతిమనుడు' అంటూ దేశమాత సేవతో అన్నదమ్ముల్లాగ జీవించాలని ఆకాంక్షిస్తాడు. కప్పం కట్టి బతికే దాస్యపు బతుకును చీదరించుకున్నాడు. అలాంటి బతుకు బతుకే కాదని, భారతమాత గర్భాన అలాంటి పిరికిపందలకు చోటు లేదంటాడు. ఇహాన్ని, పరాన్ని కోరే ఏ ప్రాణి అయినా పరాన్నజీవిగా మారేందుకు ఇష్టపడరనీ, "ఉదరపోషణకై

దేహమొరులకమ్మి ఎంచి బ్రతుకుట హేయాతిహ్య మగును / కష్టముల కోర్చి స్వాతంత్ర్య గరిమనెంచి / మెరియపన్నపు బ్రతుకది మేలుగాదె" - "పరుల పెత్తనము నకు దాసోహమనుచు పంచ భక్ష్యాన్నముల దిని బ్రతుకు వవాడు కుక్క బ్రతుకుల కంటెను కూడ మిగుల హీనుడై బ్రతుకు వాడు విహీనుడతడు" అంటూ దాస్యపు వృత్తిని అసహ్యించుకుంటారు. కవి నల్లదీగకు ధారశుద్ధి ఎక్కువ. ఎలాంటి ఆవేశమైనా, ఆనందమైనా గాఢత పెరిగే కొద్ది పద్యాలు జాలువారుతుంటై. అప్పుడప్పుడు పునరుక్తి భావాలు కూడ కనిపిస్తాయి. అయినా వాటిని సరిచేసుకునే ప్రయత్నం కనిపించదు. ఏ మాత్రం భావనియంత్రణకు పూనుకున్నా, ధారాశుద్ధికి భంగం కలుగుతుందేమోనన్న దిగులు కవిగారికి ఎక్కువ. అందుకే ఎకాఎకి ఏ సందర్భాన్నైనా ఐదు పది పద్యాలకు ఆస్కారమున్నా, ముప్పై పద్యాల వరకు కలం ఆగే ప్రసక్తే కనిపించదు.

అప్రతిహత బాహుబల పరాక్రమ శాలియైన దేశ భక్తుడు బ్రహ్మన దక్షిణ భారతదేశంలో ఇతన్ని మించిన యోధుడు లేడు. ఈయన రాజ్యాన్ని వశపరచుకోవడమే కుంపినీ నాయకుల కర్తవ్యము. సైనికాధికారులకు కూడ బ్రహ్మన తేజస్సును చర్చించుకుంటారు. రాజ్యం చిన్నదే కావచ్చు కానీ అతని దేశభక్తి చాలా గొప్పది. కాబట్టి తన దేశాన్ని కాపాడుకునేందుకు ఎంతటి పరిణామాన్నైనా ఎదుర్కొనేందుకు బ్రహ్మన సిద్ధంగా ఉంటాడు. ఇలాంటి స్వాతంత్ర్య వీరుడు ఒకడున్నా దేశం ధన్యత చెందుతుంది. నచ్చజెప్పినా, శిస్తు తగ్గించి ఇమ్మన్నా, తాకీదులు పంపినా ఇవేవి బ్రహ్మన్న ధీశక్తిని లొంగదీయలేకపోయాయి. దేశభక్తి మినహా మిగతావన్నీ బ్రహ్మన్నకు భ్రమలే. సూర్యుడు కుంగని కుంపినీ దొరలు "గెలిచినను వీనినే యని గెలువవలెను / చచ్చినని వీని చేతిలో జావవలెను ఎ పులిని గెలిచిన వీరుడు పొందు కీర్తి / ఏలికగ బుట్టు పులిచేత గ్రోలువాడు" అంటూ శత్రువైన బ్రహ్మన్నను కీర్తించక ఉండలేకపోయారు. అయితే శక్తియుక్తులను కుయుక్తులుగా మార్చి "కాని నీతని ధర్మమార్గంను గలువల / నైతికోన్నత పథముల నణచలేము" అని అడ్డదారిలో ప్రయత్నించారు.

తన బంధువులను లొంగదీసుకొని తనపై యుద్ధానికి సిద్ధమౌతున్న బ్రిటిష్ మూకల్ని అవలక్షణాన్ని ఎండ గడుతూ "దేశమాత కీర్తికి అపఖ్యాతి తెచ్చే ఎవ్వడైనా శిక్షార్హుడే నంటాడు" తల్లిని తల్లి దేశమును ధార్మిక భక్తిన గొల్వలేనివాడు... ఎడారిలో వాడిన చెట్టు లాగ మేక చండ్లలాగ వ్యర్థుడు కాక ఏమౌతాడని ప్రశ్నిస్తాడు. తల్లిని, తల్లి నేలను దాస్యంవైపు నెట్టివేసేవాడు పుత్రుడెలా అవుతాడని మౌలికమైన ప్రశ్న వేస్తాడు. మన సంస్కృతిని ధర్మాన్ని ఇతరులు తూట్లు పొడుస్తుంటే, మనసున్న భారతీయుడు ఎంతటి సాహసానికైనా వెనుదీయడని నినదిస్తాడు. 'చిన్న పామే కదాని, ఊరక ఉండక, పెద్ద కఱ్ఱతోని దాన్ని వెన్ను విరగొట్టినట్లుగా, చిన్న పగతుడైనా చిదుమవలెను అనడం శత్రువు పట్ల ఎలాంటి ఉపేక్ష భావం ఉండరాదని బ్రహ్మన్న చెప్తాడు. ఇది దేశభక్తికి పతాక సన్నివేశం లాంటిది. శత్రువు పొంచి ఉండి అదును దొరగ్గానే కాటువేస్తాడు కాబట్టి, శత్రువు బలం నిజానికి కొంతైనా, దేశం యొక్క సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలనే ఆ తలంపే క్షమించరాదు. ఏమాత్రం నెమరుపాటుగ ఉన్నా భారీమూల్యం చెల్లించక తప్పదనే జాగ్రత్త కవి బ్రహ్మన్న చేత పలికిస్తాడు. స్వాతంత్ర్యం కోసం, స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజల్లో, నాయకత్వంలో నెలకొన్న నిర్లిప్తతను, ఉదాసీన భావాన్ని కవి కమ్మీతో చరిచే ప్రయత్నం చేస్తారు.

దేశ రక్షణకై ప్రతీ పౌరుడు బాధ్యత వహించాలని "భారతదేశ రక్షణపు భారము నూనెడు భావి భారత... త్యాగ బుద్ధితో / భారత భారతీయులకు భద్రత గూర్చుచు బెంపు జేయుడి" అంటాడు. ఈ స్వాతంత్ర్య భారతదేశాన్ని ప్రేమతో కాపాడాలి. త్యాగమయమయిన జీవితం జీవితానికి అర్థాన్నిస్తుంది. మనుషుల్లో మానవీయ కోణాన్ని దర్శింపజేస్తుంది. దేశ రక్షణకై ప్రాణాలనైనా అర్పించేందుకు సిద్ధం చేస్తుంది. స్వార్థపూరిత జీవితం

మరణంతో సమానం. నిన్ను కన్న దేశం కోసం 'పిలుపు' వస్తే ఎలాంటి ఆలోచన చేయక రంగంలోకి దూకడమే ఏకైక లక్ష్యంగా భావించాలి. అలాగే 'భారతీయత'కు భద్రత కూర్చాలి. ఇక్కడ సంస్కృతి, సాంప్రదాయ కళలు, ఇక్కడి 'జీవితం' ఎలాంటి పరిస్థితుల్లో అదుపు తప్పరాదు. కాగా, దేశాన్ని దీప్తిమంతం చేసే ప్రయత్నం చేయాలి. దేశం గర్వించేలా జీవిస్తేనే - జీవించినట్లుగా భావించాలి.

యుద్ధ సమయం ఆసన్నమైనప్పుడు బ్రహ్మన్న తల్లి, భార్య జక్కమ్మ దేవి ఇద్దరూ బ్రహ్మన్నను కోటను విడిచిపెట్టి వెళ్ళకూడదంటాడు. బ్రహ్మన్న లేని సమయంలో శత్రువులు దొంగ దెబ్బ తీసి, వారికి ఖైదు చేస్తారని భయపడతారు. అది బ్రహ్మన - మాతృప్రేమ - దేశభక్తి రెంటి మధ్య నలిగిపోయే సందర్భం. సన్నివేశాన్ని ఉద్విగ్నభరితం చేస్తుంది. అప్పుడు కవి సుమారు 20 పద్యాల్లో 'దేశభక్తి' యొక్క గొప్పదనాన్ని కీర్తిస్తాడు. "అమ్మ! యే దెట్లు జరిగిన సమ్మతమ్మె! ఎ అవని బుట్టుట గిట్టుట నందరికిని ఎ సమమె. వీరుడు దేశైక జనని కొరకు ఎ అనువులర్పించిన నదియెగా సమరసుఖము" అని మాతృసేవ కన్నా దేశసేవే మిన్న అని ఆకాశమంత గంభీరంగా అంటాడు.

చివరగా బ్రహ్మన్న చరిత్ర స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలనే జాతికి "పరుల మోచేతి బ్రతుకులో పాలకంటె / కనగ స్వాతంత్ర్యమున గల్గు గంజి మేలు" అనే సత్యాన్ని ధృడపరుస్తుంది.

ఆధార గ్రంథం :

1. శ్రీ అరిగజ సింహ వీరపాండ్య కట్ట బ్రహ్మనాయక చరిత్రము - 2013 - నల్లదీగ - శ్రీనివాసాచార్యులు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రజాకవి సుంకర సత్యనారాయణ సాహిత్యోద్యమం

– పాత శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సుంకర సత్యనారాయణ ప్రజాకవిగా పేరుగాంచారు. సాహిత్య పరంగా వీరు ప్రజల మధ్య ఉంటూ చేసిన రచనల వల్లనే ఈయన ప్రజాకవి అన్పించుకోగలిగారు. చిన్ననాడే పద్యాలు రాయడం మొదలు పెట్టారు. నూజివీడు జమీందారీ విధానానికి వ్యతిరేకంగా పద్యాలు రాశారు.

"కన్ను విప్పి చూడుమటు
కానగవచ్చె తాళవృక్షముల్
కన్య రజస్వల అయినదని
కారణము గనపర్చి
తాటియాకన్నది తేగల
హక్కులేదుగ...." ఈ పద్యం ఈ విధంగా సాగుతుంది.

అలాగే పార్టీలో కొన్ని కోలాటపు పాటలు కూడా రాసి విద్యార్థుల చేత వేయించేవారు. వాటిలో ఒక దానిని చూడండి.

"సాధుమూర్తులకు ప్రజలకు నెప్పుడు
చాకిరి చేసెదము / దేశ సేవకులమయ్యెదము
దేశ చరిత్రను చాటెదము / నీ నా భేదము
లేక నిచ్చట నెప్పుడు మెలిగెదము....." అనే కోలాటం పాట కొణతమాత్మకూరులో భూకామందులకు కంటగింపైనది. సత్యనారాయణను ఊరినుండి పంపించి వెయ్యాలని వారు నిర్ణయించారు కూడా అయినప్పటికీ అది సాధ్యం కాలేదు. తునికిపాడులో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దానికి విరాళాలు సేకరించేందుకు 'కష్టజీవి' అనే బుర్రకథ రాసి ప్రదర్శించారు. బుర్రకథ లంటే ఆయనకు చాలా ఇష్టం.

"పాలబుగ్గలా బంగారు బిడ్డడు తందాన తాన
గద్ద తన్నిన కోడిపిల్లవలె... తందాన తాన
గిలగిల లాడుచు కెవ్వున ఏడ్చుచు... తందాన తాన
అమ్మా... అమ్మా... అమ్మాయని అల్లాడసాగెనండీ... తందాన...
ఆ పసివాణ్ణి గుడాల్ కత్తితో పొడిచి చంపాడు
తల నరికిన ఒక పక్షి చందమున - గిలగిల కొట్టుకొని
అయ్యో కొడుకా పోయితివా నన్నన్యాయం చేసి
అన్నెం పుణ్యం ఎరుగని నిన్నీ అధములు చంపారు
దేవుడ నీవే ఉంటే తీర్పు చెప్పవేరా....." ఇలా సాగుతుంది అల్లూరి సీతారామరాజు బుర్రకథలోని ఒక ఘట్టం.

ఆ తర్వాత విజయవాడ వచ్చినప్పుడు 'ఓ సాయి బన్నయ'.... 'ఓ మిట్టిపడే హిట్లరయ్యా' 'సెల్యూట్... సెల్యూట్' అనే పాటలు రాశారు. ఈ పాటలు ఆనాడు ప్రతి కష్టజీవి నోట విన్పించేవి. ఆ సమయంలోనే వీరుల పాడు వాస్తవ్యులు వాసిరెడ్డి భాస్కరరావు గారితో కలసి 'ముందడుగు', 'మా భూమి' అనే నాటకాలు రాశారు. గెరిల్లా నాటకం కూడా గొప్ప ప్రదర్శన. అవి తెలంగాణా పోరాటపు రోజులు, ఆనాడు తెలంగాణా రైతాంగం ఈ పాటలను పాటి నాటకిలను ప్రదర్శించేవారు.

తెలంగాణ పోరాటాన్ని ప్రతిబింబించే ముందడుగు, అపనింద, మా భూమి అనే నాటకాలు అనేక వందల సార్లు ప్రదర్శించారు. వీటితో పాటుగా ఐక్యత అనే నాటికను కూడా కొన్ని వందల సార్లు ప్రదర్శించారు. ఒకేరోజు ఒకే నాటికను రెండుసార్లు ప్రదర్శించిన ఘనత వీరికే దక్కింది. సుంకర సత్యనారాయణ సంధర్భాన్ని బట్టి అనేక గేయాలను రచించగా వాటిని అన్నింటినీ ప్రజాశక్తి పత్రిక ప్రచురించింది. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆ గేయాలను వీనుల విందుగా పాడేవారు. వాటిని తరువాత 'జయగీతి' అనే పేరుతో ప్రచురించారు.

అల్లూరి సీతారామరాజు చరిత్రను వెలికితీశారు. సంవత్సరం పాటు మన్యంలో పొన్నలూరి రాధాకృష్ణ మూర్తితో తిరిగి ఆయన చరిత్రను ప్రపంచానికి తెలిపారు.

అల్లూరి సీతారామరాజు బుర్రకథను తెలుగువారికి అందించారు. ఆయన రచించిన బుర్రకథ ఈనాటికీ ఆంధ్ర దేశంలో నిలిచి ఉన్నది. ఈ బుర్రకథే కాకుండా వీరేశ లింగం, రైతువిజయం, తెంగాణా, రుద్రమదేవి, అమరజీవి, కర్ణుడు, కుమ్మరిమొల్ల, అమరయోధులు, రైతు శిక్షణ యాత్ర, నవయుగం, లెనిన్, పల్లవ చక్రవర్తులు వంటి బుర్రకథలను రచించారు. 'భూమికోసం' 'కోతలరాయుడు' వంటి నాటకాలను వ్రాశారు. అంతే గాకుండా తన నాటకాలలో తనూ పాత్ర పోషణ చేశారు. ఇక నాటకాల విషయానికి వస్తే సమాజంలోని లంచ గొండతనానికి అద్దంపట్టే 'నూరు కాకుల్లో' అనే నాటకాన్ని రచించారు.

భూమికోసం నాటకాన్ని గుంటూరు జిల్లా కారంచేడుకు చెందిన వెంకన్న చౌదరిగారు సినిమా తీసేందుకు ఒప్పు కున్నారు. అందుచేత ఆ సినిమా కోసం 1957లో సుంకర మరల తన మకాంను మద్రాసుకు మార్చారు. 'మా భూమి' నాటకానికి రెండ భాగం వ్రాయాలనది ఆయన చిరకాల వాంఛ. చివరకు 'మా భూమి' నాటకానికి న్యాయం చేకూర్చడానికి 'గెరిల్లా' నాటకాన్ని రూపొందించారు. దీని ప్రదర్శనకు భీమడోలు వాస్తవ్యులు సుంకర చంద్ర మౌళీశ్వరరావు పూర్తి సహకారం అందించారు. ఆ తర్వాత మద్రాసులో ఉంటూ డైరెక్టర్ తిలక్ గారి నిర్మాణంలో శ్రీశ్రీ సుంకర కలసి వ్రాసిన భూమికోసం సినిమాకు కథ, మాటలు వ్రాశారు. దానితోపాటు సినిమాలో నాయకుని తండ్రి పాత్రను పోషించారు. భూమికోసం సినిమా విడుదలైన తర్వాత మరలా సుంకర 'గెరిల్లా' నాటకాన్ని ప్రదర్శించారు.

సుంకర జమీందారి విధానాలకు, నిరంకుశ విధానా లకు వ్యతిరేకంగా తన రచనలను చేశారు. అప్పటికి అణగారి ఉన్న వ్యవసాయ కార్మికులు వెట్టిచాకిరి లోనై అణగారి ఉన్నవారిని ఆకర్షించి వాగితోడ్పాటుతో వెట్టికి వ్యతిరేకంగా హరిజన వ్యవసాయ కార్మికులను జాగృతి పరిచారు. వెట్టికి స్వస్తి పలికారు. అంతేగాక త్రాగుడు, జూదం మున్నగు దుర్వసనాలు, దుష్పలితాలపై నాటికల్ని వ్రాసి తన విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. అయితే ఆయన వ్రాసిన ఎన్నో నాటికలు అచ్చుకాలేదు. రాత ప్రతులు కూడా లేకుండా పోయాయి. పొన్నలూరి రాధా కృష్ణమూర్తి మన్యంలో తిరిగి సీతారామరాజు పోరాటానికి ఉత్తేజితులై, ఏమైనా సరే ఆ వీరుని గాథను గ్రంథస్థ చేయాలనే కోరికతో సీతారామరాజు తిరిగిన ప్రదేశాలు, బంధువుల ఇళ్లు, మొదలైన వాటిని సందర్శించి అక్కడి వారి సహాయంతో ఎన్నో వివరాలను సేకరించి సీతా రామరాజు నవలను పొన్నలూరి రాధాకృష్ణమూర్తి గారిచే రచింపచేశారు. పట్టుదలతో సుంకర తన వాటాకు వచ్చిన రెండెకరాల భూమిని అమ్మి ఆ డబ్బుతో దాన్ని అచ్చు వేయించారు. అయితే దాన్ని పసిగట్టిన బ్రిటీష్ ప్రభుత్వం దానిపై నిషేధాన్ని విధించింది. ఆయన స్థావరాలపై దాడులు చేయించింది. సుంకర సోదరుడు వీరభద్రరావు ఆయనకు అండగా ఉండేవాడు. 1946 ఎన్నికల అనంతరం మద్రాసులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు బహిరంగంగానే ప్రజాశక్తి ప్రెస్‌లో 'మన్యంలో విప్లవం' అనే పేరుతో ఆ గ్రంథాన్ని నవలగా ముద్రిం చారు. ఆ నవలే సుంకరవారికి 'అల్లూరి సీతారామరాజు' బుర్రకథగా ఉపయోగపడింది.

సుంకర రాసిన బుర్రకథలు చాలా ఉన్నాయి. వాటిలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ ఒకటి. ఇంకా సుంగర రచించిన బుర్రకథలు... తెలంగాణా కథ, వీరేశలింగం బుర్రకథ, రుద్రమదేవి బుర్రకథ, కుమ్మరి మొల్ల బుర్రకథ.... ఇలా చెప్పుకోవచ్చు వీటిలో అల్లూరి సీతా రామరాజు బుర్రకథ ఒకటి వీటిలో... ఆనాడు మన్య ప్రాంతంలో ఉన్న సంఘటనలను గమనించవచ్చు...

''మన్యవాసులకు తగవులు పెట్టుచు - మనల దోచుకొనిరి
అన్యాయపు ఈ పద్ధతులన్నీ - అంతరించకున్నా
శాంతి లేదు ఈ దేశానికి - విశ్రాంతి లేదు మనకు''

దేశంలో జరిగే విషయాలు... మన్య ప్రాంతంలో జరిగే సంఘటనలు చెప్పున్నారు.

"అగ్నిపర్వతము పగిలె - గుభిల్లున ఆ మన్యములోన
ధణ ధణ ధణ మ్రోగించండి - రణభేరి అపుడు
ఘనుడా సీతారామరాజు - తన ఖడ్గమునూ దూసె
రక్షక భటులె గాము సోదరులు - రయమున నిల్చారు
సాయుధులై స్త్రీ పురుష సమూహము - సాగె రాజు తోడ' అల్లూరి సీతారామరాజు తర్వాత స్వాతంత్ర్యం వచ్చింది. దాన్ని గురించి....

"రాజురయించెను సూర్యుడు గృంకని - రాజ్యమస్తమించె
రాజు కొలుపుదీరెను - పోలీసుల రాజ్యమంతరించె"
అంటూ ఆశాభావాన్ని వ్యక్తం చేస్తారు.

వీరేశలింగం బుర్రకథ... నుండి కొంత భాగం చూడండి..

''వేదంబులు మనుధర్మ శాస్త్రమును వెదకి చూచినాను.
ఈ దరిద్రమగు దుష్టాచారములెచ్చట కనపడవు".

అంటారు పంతులుగారు. దీన్ని పండితలోకం ఎలా తిడ్తుందో చూడండి

"మతము జెరచు ఈ మహాద్రోహినీ
జాతిని తిట్టిన నీతిహీనువీ
నిపుణుల పెద్దల నిరసించినా ఈ
కులద్రోహినీ మనమందరము వెలివెయ్యాలి".

అంటారు పంతులుగారికి ఎంతటి అవాంతరాలు కలిగినా తను అనుకున్నది నెరవేరేదాకా విశ్రమించలేదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రవాసంలో తెలుగువారు – ఆశలు అక్కరలు – బాధ్యతలు

– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక సాంకేతిక రంగాలు ప్రవాసాంధ్రులు అనే మూడు రోజుల అంతర్జాల అంతర్జాతీయ సదస్సు(18-20 నవంబరు, 2021) తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చాలా దిగ్విజయంగా జరిగింది. ప్రవాసాంధ్రుల పదం కంటే భిన్నమైన పదం వాడితే బావుంటుందనే అభిప్రాయం వెలువడింది. ప్రవాసాంధ్రులనే పదం రూఢిలో ఉన్నా, ఇప్పుడు రెండు రాష్ట్రాలయిన నేపథ్యంలో తెలుగువారు తెలంగాణలో కూడా ఉండటం ఒక కారణం. మరొక కారణం శతాబ్దాల క్రితమే ఇతర దేశాలకు వెళ్ళిన తెలుగువారి సంతతి ఆ దేశం మాతృభూమిగా ఉన్నవారూ ఉన్నారు. వారిని ఎ.అప్పలనాయుడు గారు(మలేషియా) విదేశీ తెలుగువారుగా పిలవమంటారు, అక్కడే పుట్టారు కనుక.

ప్రవానంలోని తెలుగు వాళ్ళ ఆలోచనలు ఏమున్నాయి, వాళ్ళకు ఇక్కడి నుండి తెలుగు వాళ్ళు అందించగలిగిన అవకాశం సహకారం ఏముంది, ఇక్కడి నుంచే కాదు పరస్పరం వాళ్ళు ఒకరికి ఒకరు ఏమైనా అనుసంధానం చేసుకోవడానికి వీలుంటుందా అనే ఆలోచన, అవసరం, అవకాశం ఈ మూడు రోజుల సదస్సు కల్పించింది. నిజానికి ఈ సదస్సు ఒక సమగ్ర రూపంగా పెట్టడమే తప్ప ఇది సంపూర్ణం కాదు. ఏ దేశానికి ఆ దేశానికి ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంగా చాలా సదస్సులు జరగడానికి ఇది మూలం కావాలి. ఈ ప్రయత్నం వటవృక్షంగా విస్తరించాల్సిన అవసరం ఉంది. దానికి ఈ సదస్సు విత్తనంలా పనిచేయాలని దృష్టి.

మొదటి రోజు సదస్సులో ప్రారంభ సభలో మాట్లాడుతున్నప్పుడు చాలా లోతైన విషయాలకు ఒక రకంగా అతిథులు విత్తనాలు వేసి వెళ్ళారు. వాటిని గురించిన ఆలోచన చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. తెలుగు భాషా సాహిత్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో భాషా సంస్కృతుల గురించి కృషి బాగా జరుగుతోంది ప్రపంచ వ్యాప్తంగా వున్న సంస్థల ద్వారా. భాష కంటే కూడా సంస్కృతి గురించి ఇంకా బాగా కృషి జరుగుతోంది.

సభకు అధ్యక్షత వహించిన ఆచార్య దేవిరెడ్డి శారద గారు(రెక్టార్) తెలుగు భాషను బోధించటం, సంస్కృతిని ఆచార్య వ్యవహారాలను, ఆహారపు అలవాట్లను కళలను ప్రవాసాంధ్రులు ఆయా దేశాలలో పరిపోషించటం హర్షణీయం అన్నారు. ప్రవాసాంధ్రులకు మనం ఉపయోగ నడుతూ వారిని ఉపయోగించుకొంటూ, అభివృద్ధి చెందాలని కాంక్షించారు. తెలుగు మృతభాష అవుతుందనే భయం పోవటానికి కుటుంబ సభ్యులు తెలుగులో మాట్లాడుకోవటం ఒక ప్రాథమిక మార్గమన్నారు.

ప్రారంభ సమావేశంలో సభా ప్రారంభకులుగా ఆచార్య ఇనాక్‌గారు చాలా కీలకమైన అంశాలు ప్రవాసాంధ్రుల గురించి మాట్లాడారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ ఇప్పటి వారి ప్రవాస భాష స్వస్థల భాష కంటే వేరు కాదు అన్నారు. తెలుగు ప్రాంతాల దగ్గరగా ఉన్న సరిహద్దు రాష్ట్రాలలో ఎక్కువగానూ మిగిలిన చోట్ల తక్కువగానూ ప్రపంచంలో అన్ని చోట్లా ప్రవాసాంధ్రులు ఉన్నారు, విస్తరించారు. ఆఫ్రికా, మారిషస్, దక్షిణ తూర్పు ఆసియాలలో ఎక్కువగా ఉన్నారన్నారు. ఆరంభంలో వీరు కూలీలు, కార్మికులు. ఇప్పుడు ఉద్యోగులు, వ్యాపారులు, కళాకారులు, శాస్త్రవేత్తలు, మేధావులు. వలన ఆంగ్లేయులు భారతదేశాన్ని పాలించినట్లు వీరు ఏ దేశాన్నైనా పాలిస్తారేమో అంటారు. ఈ దృష్టి మారిషస్ ఆఫ్రికాలను చూశాక కలిగిందన్నారు.

నేడు సాంకేతికత పెరిగింది. సాంకేతికత పెరగటం దాపరికాలు అంతం కావచ్చు ప్రపంచ యుద్ధాలు

తగ్గవచ్చు. అన్నీ అందరికీ తెలుస్తాయి. అరమరికలు లేని స్వతంత్ర జీవిగా మనిషి బతికే రోజు రావచ్చు అనే ఆశావహ దృష్టి వ్యక్తం చేశారు. ఇప్పుడు సాంకేతికత వల్ల దూరంగా ఉన్నవారి రూపం శబ్దం చూడగలుగుతున్నాం, వినగలుగుతున్నాం. అక్కడ యాంత్రిక సౌకర్యం లేక పోయినా ఇక్కడ నుంచి చూసే, వినగలిగే యంత్ర వాతావరణాన్ని మనిషి సృష్టి చేయగలడు అనే ప్రబల విశ్వాసాన్ని ప్రకటించారు. మూడు నాలుగు తరాల ముందు వెళ్ళిన వాళ్ళలో ఆ దేశంలో ఆ నాటి తెలుగు భాష నేడు కూడా మన్నుతూ ఉంది. కాని స్థానిక భాషతో కొత్త సమన్వయం సంతరించుకొని అద్భుతాంధ్రంగా పరిణామం చెందింది అన్నారు. రెండు మూడు భాషల సంబంధంతో సాహిత్యం వికాసం చెందుతూ ఉంది. వీరి సాహిత్య సృష్టి, మూలాలు తడుముకొనే తపనగా కనిపిస్తుంది. రెండు ప్రాంతాల సాహిత్యం సమన్వయమై నూతన సాహిత్య సంపద జన్మించి అవిష్కరణ పొంది, నేడు సాహిత్యం తెలుగులో సుసంపన్నమయ్యే దశను చేరుకొంటూ ఉంది అన్నారు. సాంస్కృతిక సంపద స్వదేశ కళలను, ఉన్న దేశ కళలతో పోల్చుకొనేటప్పుడు, నూత్న సమన్వయం పొందే అవకాశం ఉంది. ఇది మెట్టిన దేశం కంటే భిన్నంగా నూత్నంగా ఉంటుంది అన్నారు.

సాంకేతిక రంగంలో ప్రవాసాంధ్రులు అద్భుతాలు సృష్టిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ఎక్కడి పనులైనా చేయగలుగుతున్నారు. యంత్ర నాగరికత మనుషులను చేరువ చేస్తున్నది. సాంకేతిక రంగ నూత్న పరిశోధన ఫలితాలు విధ్వంసక శక్తులుగా కాక నిర్మాణ శక్తులుగా రూపొందే క్రమం తెలుస్తూ ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఐటి రంగం జీవితాలను వాటితో పాటు భాషలను సాహిత్యాన్ని సంస్కృతి విశేషంగా ప్రభావితం చేస్తూ వచ్చాయన్నారు. ప్రవాసంలో పోయినా, ఎక్కడేం జరుగుతున్నా శబ్దం రూపం ఇక్కడ తెలుస్తూ ఉంది. టివీలు, రేడియెలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు అక్కడి రూపాన్ని శబ్దాన్ని పంపే యాంత్రిక సౌకర్యం లేకపోయినా, అవి పంకపోయినా, అక్కడ రూపాన్ని శబ్దాన్ని ఇక్కడ స్వీకరించే చూసే కనిపింపచేసే యంత్ర వాతావరణం సృష్టి చేయగలడు మనిషి అనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. శబ్దం మరణించదు. శబ్దం ఎప్పటిదో అయినా వినే వాతావరణం ఏర్పడుతుంది. ఆంధ్రుడు ప్రవాసాంధ్రుడు ప్రపంచ మానవుడు ఈ సృష్టి చేయగలడని, భావిలో రికార్డు కానివి కూడా వినగలం, వచ్చే తరమైనా ఈ ప్రగతిని అందిస్తారని, తద్వారా ప్రపంచ పరిణామ ప్రయత్నం మొత్తం తెలిసివస్తుంది అని ఆశించారు ప్రపంచాంధ్రులు. ప్రవాసాంధ్రులు ద్వారా విశ్వాంధ్రులు కావడం తథ్యం అన్నారు ఆచార్య కొలకలూరి ఇనాక్.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి సదస్సు ఉద్దేశ్యాలను చెప్తూ భాషా సాహిత్య సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో జరిగిన కృషి, జరగాల్సి ప్రయత్నాలను ప్రస్తావించారు.

ఆచార్య కె.హేమచంద్రారెడ్డి గారు మాట్లాడుతూ తెలుగును అంతర్జాతీయంగా ప్రభావిత భాషగా ఎలా తీసుకెళ్ళవచ్చో ఈ సదస్సు చెబుతుంది. కన్నడ కస్తూరి తేట తెలుగు కలిసి ఉన్నది తెలుసు. గిడుగు రామ్మూర్తి తెలుగును అందుబాటులోకి తెచ్చిన విప్లవాన్ని చూశాం అన్నారు. 1990లో ప్రపంచాన్ని కుగ్రామం చేసింది ప్రపంచీకరణ. 21వ శతాబ్దంలో ఎక్కువగా తెలుగువారు విదేశాలకు వెళ్ళారు. ఆంగ్ల మాధ్యమంలో చదివినా మాతృభాషపై మక్కువ ఉండాలని తన తెలుగు భాషాభిమానాన్ని ఉదాహరణగా చూపించారు. విశ్వ విద్యాలయాల నుంచి విశ్వనరులు ఉత్పన్నం కావాలని గ్లోబల్ సిటిజెన్స్ కావాలి. ఈ రెండూ విశ్వ నరుడిగా విశ్వవిద్యాలయాల నుంచి రావటం, మాతృ భాషపై అభిమానం-సమాంతరంగా ఎదగాలన్నారు.

జీవనానికి ఆంగ్లం నేర్చుకోవాలి. కాని తెలుగును మరచిపోవటం తప్పు. మాతృభాష మీద ప్రేమ పెంపు చేయాలి ఉభయ భాషలతో మానవుడు 'విశ్వనరుడు' కావటం హర్షణీయం అన్నారు ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి గారు. జ్ఞానం పెరిగే కొద్దీ, ఎక్స్‌పోజర్ పెరిగే కొద్దీ

భాష ఎక్కువగా ప్రాధాన్యత సంతరించుకొంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాలు - ప్రవాసాంధ్రుల గురించి జరుగుతున్న మూడు రోజుల సదస్సులో ఏవైనా తీర్మానాలు చేస్తే నివేదికలు వస్తే, నిర్ణయాలు వస్తే సిఫారసులు వస్తే ప్రభుత్వంతో పాటు నేను హైయర్ ఎడ్యుకేషన్‌లో వున్నాను కాబట్టి వాటి గురించి ఆలోచన చేస్తాను అని ఒక హామీని ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి గారు ఉన్నత విద్యా మండలి అధ్యక్షులుగా ఇచ్చారు.

ఆచార్య దువ్వూరు జమునగారు (ఉపాధ్యక్షులు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం)తెలుగువారు లేని దేశం లేదు అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఆస్ట్రేలియా, ఐరోపా, గల్ఫ్ దేశాలలో ఎక్కువగా ఉన్నారని తెలుసు. భాషా సంస్కృతుల పట్ల వీరెంతో కృషి చేస్తున్నారు. NATA ATA TANA వారి కృషి అభినందనీయం అన్నారు. ప్రవాసాంధ్రులు అన్ని రంగాలలో కనిపిస్తున్నారు. పిల్లలకు తెలుగు నేర్పటంలో ప్రవాసాంధ్ర సంస్థల కృషి అనన్యం అన్నారు. సృజనాత్మకంగా వైవిధ్యంతో తెలుగుపట్ల మక్కువ కల్పిస్తున్నారు అంటూ తన మనుమ సంతతి తెలుగు నేర్చుకొంటున్న తీరును పేర్కొన్నారు. సాంకేతికత తెలుగు అభివృద్ధికి ఎలా దోహదం అవుతూ ఉందో తెల్పటానికి కృత్రిమ మేధకు సంబంధించిన నిపుణులను ఆహ్వానించినందుకు ఈ సదస్సులో భాగం చేసినందుకు అభినందించారు. తెలుగును మరచిపోయే రోజుండదని ఘంటాపథంగా పేర్కొన్నారు.

సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.కృతిగంటి శ్రీనివాస రావు గారు మాట్లాడుతూ తెలుగువారి పుట్టుకమూలాలు దాని ద్వారా వచ్చిన సంస్కారం తర్వాత తరాలకు చేర వేయవలసిన గురుతర బాధ్యత అందరిపై ఉంది అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారూ సంస్థలూ, ఇతర దేశాల్లో స్థిరపడి భాషా సాహిత్య రంగాలలో విశేష సేవ చేస్తున్న తెలుగువారి కోసం ప్రవాసీ మంచ్ అనే ఒక కార్యక్రమం సాహిత్య అకాడమి చేస్తుందన్నారు, దానిని వినియోగించుకోండి అనే మాటని ప్రపంచ దేశాలలోని తెలుగు వాళ్ళందరికీ చెప్పారు. సాహిత్య అకాడమి. పరస్పరం ఉపయోగించుకోవలసిన విషయాలు ఒకరి నుండి ఒకరికి అందుబాటులో కొస్తూ వున్నాయి. ఈ వేదిక ద్వారా అందుబాటులోకి రావాలనే దృష్టితోనే ఈ సదస్సును ఏర్పాటు చేసింది.

మండలి బుద్ధ ప్రసాద్ గారు, భాషా వ్యవహర్తల సంఖ్య తగ్గి పోవటాన్ని గూర్చి ఆవేదనతో పేర్కొన్నారు. సంస్కృతి ప్రవాసిల వల్ల వ్యాప్తి చెందటాన్ని ఆనందంగా పేర్కొన్నారు.డా.బుద్ధా చంద్రశేఖర్‌గారు (ఎ.ఐ.సి.టి.ఇ., న్యూ ఢిల్లీ) సాంకేతికత ఆవశ్యకతను పేర్కొన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు ప్రవాస సమస్యను ప్రస్తావిస్తూ స్థానికేతర ముద్ర నుంచి వారిని కాచుకోవాలి అన్నారు. తొలినాళ్ళలో అమెరికా వెళ్ళిన తొలితరం ఆంధ్రుడు శ్రీ వంగూరి చెట్టిన్ రాజు గారు అక్కడ తమ పట్ల వివక్షతను చూపటంతో ఎంతో కష్టపడ్డానని చెప్పారు, తెలుగు రాష్ట్రాల విద్యా విధానం ఒక మాధ్యమంలోనే ఎందుకు బోధించాలి. శాస్త్ర సాంకేతికాలు(గ్రుజువీ) ఆంగ్లంలో బోధించవచ్చు. చరిత్ర రాజకీయం భారతదేశ వేదాంతం వంటివి తెలుగులో ఉండాలి. విశ్వనరుడు కావటానికి ముందు తెలుగు నరుడు కావాలి అని ఉభయ భాషా బోధనను సూచించారు. రావు కొంచాడ గారు ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వైభవాన్ని చాటారు.

ఆచార్య డి. మునిరత్నం నాయుడుగారు (ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం, నెల్లూరు) కీలకోపన్యాసంలో ఇతర రాష్ట్రాలలోని, ఇతర దేశాలలోని తెలుగువారి స్థితిగతులు, వారి పాఠ్యపుస్తకావసరాలను తెలిపారు.

- భారతదేశంలో ఒకప్పుడు అత్యధికంగా మాట్లాడుతున్న తెలుగు భాష కనుమరుగవుతున్నది అని శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు వ్యధ చెందారు. ఒకప్పుడు రెండవ భాషగా తెలుగు ఇప్పుడు నాలుగవ భాషగా పడిపోవడాన్ని ఆవేదనగా చెప్పారు. తెలుగు భాష రెండో స్థానం నుంచి

నాలుగో అంకెకు పడిపోతూ ఉంది అనే ప్రమాద ఘంటిక భాషా వ్యవహర్తలు తగ్గిపోతూ వుండటం వల్లనే. దీనిని తెలుగు రాష్ట్రాలలో కాదు తెలుగేతర రాష్ట్రాలలో ఇతర దేశాలలో కూడా రక్షించుకొనే పని చేయాలి. నాలుగో భాషగా పడిపోవడానికి కారణాలను పలువురు పేర్కొన్నారు. దానికి నిదర్శనం వేదవతి నాయుడు అనుభవం. ఆమె మాట్లాడుతూ శ్రీలంకలో తెలుగువారున్నారు కాని మాట్లాడలేరు. సింహళ భాషను మాట్లాడతారు కాని, తెలుగు భాష నేర్చుకోవడానికి ఇష్టపడటం లేదు. తెలుగు వినియోగం కాని భావ వినిమయం కాని లేదు. కనుక వారు ముందుకురావటం లేదు. ఇదే తీరు తమిళనాడులోనూ కనిపిస్తూ ఉందని డా.యజ్ఞశేఖర్ తెలిపారు. తెలుగు కేవలం తెలుగు ప్రాంతాలలో కాదు బయట ప్రాంతాల్లో నిలుపుకోలేకపోవటం వలన నాలుగో స్థానానికి పడిపోయింది. భాషను మరిచి పోతున్నారు తాతల తరం మాట్లాడింది, రాసింది, చదివింది. నేటి తరానికి వచ్చేసరికి కేవలం మాట్లాడగలగుతున్నారు. భవిష్యత్ ప్రశ్నార్థకమే అనుమానమే. సగిలి సుధ భాషా మార్పులను. అచ్చ తెనుగు పదాల వినియోగాన్ని తమిళనాడులో ఎలా ఉందో తెల్పారు. తమిళనాడులో 40%-45% తెలుగు వారున్నారంటారు. 60 వేల మంది తెలుగువారు ఉన్నారంటారు అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో నీలకంఠం గారు, ఎం.జి.శ్రీనివాస్ గారు.

ఇతర రాష్ట్రాలలోని తెలుగువారు తమ మాతృభాషగా తెలుగును నమోదు చేసుకోకపోవటం ఒక కారణం తెలుగు నాలుగో స్థాయికి పడిపోవడానికి. జనాభా లెక్కల సమయంలో తెలుగు సంఘాలు చైతన్యంతో సంకోచాలను వదిలి మాతృభాషగా తెలుగుని నమోదు చేసుకొమ్మని తెలుగువారికి చెప్పాలి. సంఖ్య పెరిగేలా చూసుకోవాలి. భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషగా తెలుగును పునరుద్ధరించడానికి తెలుగు ప్రజలందరూ తమ భాషను తెలుగుగా నమోదు చేసుకోవాలి అని శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు సూచించారు.

- ఈ సదస్సులో మాట్లాడేటప్పుడు చాలా మంది విదేశీ తెలుగువారు, ఇతర రాష్ట్రాల తెలుగువారు తమ సంఘాలకు సంబంధించిన పరిచయాలు బాగా చేశారు శ్రీలత(న్యూజిలాండ్), రాపోలు సీతారామరాజు (దక్షిణాఫ్రికా), వెంకటనాగం (అమెరికా), రావూ కొంచాడ, సారధీమోటమర్రి (ఆస్ట్రేలియా) రాధిక మండిపూడి (సింగపూర్) పి. నందీశ్వరరావు(ఇండోనేషియా) వ్యాసకృష్ణ బురుగుపల్లి (ఉగాండా) ఎస్.డి.వి. రమణారావు (బ్రూనె) రాపేట కనకారావు(జపాన్).

ముగింపు సభకు అతిథులుగా విచ్చేశారు తోటకూర ప్రసాద్ గారు, రాజు చమర్తిగారు. 'తానా' చేస్తున్న భాషా సాహిత్య సామాజిక సేవలను విపులంగా వివరించారు తోటకూర ప్రసాద్ గారు. సిలికానాంధ్ర మన బడి ద్వారా చేస్తున్న భాషా సాహిత్య సామాజిక సేవలను దాని విస్తరణను వివరించారురాజు చమర్తిగారు. కె.వి.చంద్ర శేఖర్(భోపాల్), మాడగుల శివలింగం(ప.బెంగాల్) వంటివారు అయా రాష్ట్రాలలో తెలుగు స్థితిగతులను తెలిపారు. ఈ పరిచయాలు మూలంగా అక్కడ ఆ సంఘాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుస్తున్నాయి. భాష నేర్పే వాళ్ళు కావలసిన అవసరాన్ని ఎవరికి వారు గుర్తిస్తున్నారు. తదనుగుణంగా తమలో తామే పూనుకొని అవసరాలు తీర్చుకొంటున్నారు.

మరొక అంశం తెలుగేతర రాష్ట్రాలలోని తెలుగు వాళ్లు తమ భాషను నిలబెట్టుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. పోరాడుతున్నారు. ఇతర రాష్ట్రాలలోని తెలుగువారు భాషా సాహిత్య సంస్కృతుల పరివ్యాప్తి కోసం సహాయం చేయాలని కోరుతున్నారు. తెలుగు రాయటం చదవటం వంటివి నేర్పుతున్నారు. Telugu Association of London (TAL) ద్వారా తెలుసుకొని నేర్పటం అన్ని

దేశాలలో లాగా జరుగుతూ ఉంది. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం (యు.కె) తెలుగు కోర్సును నడుపు తున్నారు అని అక్కడ తెలుగు కోర్సు పరీక్షల అధికారిగా ఉన్న రాజేష్ తోలేటి తెల్పారు. దాన్ని విస్తృతపరిస్తే ప్రపంచ దేశాలలోని తెలుగువారికి ఉపయోగంగా ఉంటుందని వీధి అరుగు ప్రతినిధిగా స్కాట్‌ల్యాండ్ నుంచి వచ్చిన విజయకుమార్‌రాజు పర్రి సూచించారు. దాన్ని విస్తృత పరచాలని కోరుతున్నారు. ఉగాండా, బ్రూనె, శ్రీలంక, జపాన్ దేశాల ప్రతినిధులు కూడా భాషార్తిని వ్యక్తం చేశారు. వీరు తెలుగు మరచిపోతున్నాం. పిల్లలకు తెలుగు నేర్పాలి, నేర్చుకోవాలంటే ఎలా అనే ప్రశ్న వేశారు.

ఉగాండా, బ్రూనే పిల్లలకు తెలుగు చెప్పాలి అనే కోరిక పెద్దలకు ఉంది. అక్కడ సంపాదిస్తున్న వాళ్ళు కూడా పరిమితమైన వనరులతో వున్న పరిస్థితి సందర్భం ఒకటి కనిపిస్తుంది. తెలుగు విశ్వవిద్యాలయం అందించే విద్య ఖర్చుతో కూడుకొన్నది అని వారు వెనుకంజ వేస్తున్నారు. సిలికానాంధ్ర లాంటి వాళ్ళు పూనుకొంటే వాళ్ళు చాలా ఆనందిస్తారు. సిలికానాంధ్ర అధికారి స్థానంలో రాజు చమర్తి గారు దానికి తమ సంసిద్ధతనూ వ్యక్తం చేశారు. ఇప్పటికీ మారిషస్‌లో మహాత్మా గాంధి విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవ స్థాయిలో తెలుగు బోధన ఉంది. అలా ఉన్న ఒకే ఒక్క దేశం ఇది. సిలికాంధ్ర విశ్వవిద్యాలయం రెండవది కానుంది.

శైశవాన్నుంచి ఉన్నత విద్య వరకు కూడా తెలుగు అభ్యసించే అవకాశం (మలేషియా) ప్రభుత్వం కల్పించింది. తెలుగు సామాజిక భాషగా ఆస్ట్రేలియాలో వున్నతిని పొందింది. తెలుగు భాషను అధికారికంగా, ప్రభుత్వ పరంగా గుర్తింపచేసిన ఘనత ఆస్ట్రేలియాలోని తెలుగు వారిదే. ఆస్ట్రేలియాలో తెలుగు వాళ్ళలో స్పృహ పెంపొందించటం వల్ల 60 వేల నుంచి ఒక లక్ష వరకు తెలుగు భాషని వ్యవహర్తలు పెరిగారు. వీరి సంఖ్య గణాంకాలలో బాగా పెరిగింది. ఇలా ప్రభుత్వాలతో గుర్తింపబడటంలో ఆస్ట్రేలియా ప్రపంచంలో మొదటిది. దీని వల్ల తెలుగు భాష్యకారుల అనువాదకుల ప్రాధాన్యం పెరిగింది అన్నారు శాయి రాచకొండ.

తెలుగు వాడైనా మాట్లాడలేని రాయలేని చదవలేని స్థితి ఉంది బంగ్లాదేశ్ నుంచి హాజరయిన మిఖా పిరెగుకు. బంగ్లాదేశ్‌లోని తెలుగువాళ్ళ పరిస్థితి, ఇప్పటికీ దుర్భరమే. పేదతనమే. తెలుగు వాళ్ళు తెలుగులో విద్యాభ్యాసావ కాశం లేక బంగ్లా భాషలో చదువుకోవలసి వస్తూ ఉంది. అది కష్టం అయి చదువుకు దూరం అవుతున్నారు. ఇంకోవైపు తెలుగుకూ దూరం అవుతున్నారు. మిఖా పిరెగు (బంగ్లాదేశ్)తో మాట్లాడుతుంటే బంగ్లాదేశ్‌లో వున్న జీవితాన్ని తెలుసుకోవటానికి, తెలుగు 10 నిమిషాలు 15 నిమిషాలు మాట్లాడితే నరిపోదువాళ్ళు పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవటానికి. మరొక సమావేశం ఆ దేశం వాళ్ళ కోసమే పెట్టాల్సిన అవసరం వుంది. ఇలాంటివి చూస్తున్నప్పుడు ఈ సదస్సు కేవలం మొదలు మాత్రమే, తొలి అడుగు మాత్రమే. ఈ అడుగును అందుకొని విస్తరింప చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని స్పష్టం అవుతూ ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంకలో తెలుగు వాళ్ళే అయిన తెలుగు మాట్లాడలేకపోతున్న సందర్భాన్ని గుర్తిస్తే బాధ్యతా గుర్తు వస్తుంది, తప్పేం చేస్తున్నామో అనే స్పృహ వస్తుంది.

కొన్ని రాష్ట్రాలలో తెలుగు పాఠశాలలు లేకుండా పోతున్నాయి. పాఠశాలల సంఖ్య పడిపోవడం బాధాకరం. 34 సంఖ్యలో వున్న పాఠశాలలు ఏక సంఖ్యకు పడిపోవడాన్ని బాధగా వ్యక్తం చేశారు పి.వి.పూర్ణచంద్ర ప్రసాద్ గారు(గుజరాత్). నేడు నాలుగే ఉన్నాయి. 5 లక్షలు తెలుగు మాట్లాడే జనాభా ఉన్నా కేవలం ప్రాథమిక పాఠశాలలు మాత్రమే నడుస్తున్నాయి(సూరత్‌లో). పదివేల మంది, పాఠశాల విద్యతో సంబంధ లేకుండా ఐచ్ఛికంగా తెలుగు నేర్చుకొంటున్నారు. ప్రభుత్వం కాని స్వచ్ఛంద సంస్థలు గాని వయోజన విద్యగా కాని అందరికి కాని భాషను నేర్పించాలి. చిన్న పుస్తకాలు (తెలుగు-గుజరాతి) తెస్తే మంచిది అనే ఆశను వ్యక్తం చేశారు.

భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలోని తెలుగువారికి తెలుగు ప్రాంత ప్రభుత్వాలు పాఠ్య పుస్తకాలు అందుబాటులో ఉండేలా చేయాలని ఇతర రాష్ట్రాల తెలుగువారు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. చెయ్యగలిగిన సామర్థ్యంలో వుండి మన రాష్ట్రాలు వెనుకంజ వేయరాదు. మూతపడకుండా ఉన్న పాఠశాలల్లో అయినా, శ్రమపడి సంస్థలు కాని ప్రభుత్వం గానీ తగు చర్యలు తీసుకొని వాటిని కొనసాగేలా చేయాలి.

పశ్చిమ బెంగాల్‌లో తెలుగు వారు విశేష సంఖ్యలో ఉన్నారు. వారు పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు కాని, క్రమబద్ధంగా నేర్పాలి అంటే అది ఖర్చుతో కూడిన పనిగా ఉంది. అంత ఖర్చు పెట్టలేని స్థితిలో తెలుగువారు ఉన్నారు. ఖర్చు తక్కువగా తెలుగు నేర్పాలని వారి కోరిక. ఒక లైబ్రరీని కూడా కోరుతున్నారు.

- మండలి బుద్ధప్రసాద్ గారు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు 16 కోట్ల మంది ఉన్నారని 100కు పైగా తెలుగు సంఘాలున్నాయి అన్నారు. 150 సంవత్సరాల పూర్వం వెళ్ళినవారు కూడా ఉన్నారు దక్షిణ ఆఫ్రికా శ్రీలంకలలో. మలేషియాలో గోవింద పూజ మహారాం భజన ఇక్కడ లేదు అక్కడ ఉంది. వీటిని ప్రభుత్వ పండగలుగా గుర్తించి అక్కడ నిర్వహిస్తున్నారు.

ప్రవాసాంధ్రులు భాషా సంస్కృతుల గురించిన రక్షణలో బాగా వున్నారు గాని వాళ్ళైనా తెలుగు ప్రాంతాల వారైనా చరిత్రను గురించి పట్టించుకోవలసిన అవసరం వుంది. వ్యక్తులుగా చరిత్రను చూస్తున్న పరిశోధన చేస్తున్నవారు డి.పి. అనురాధ, సావెం రమేష్, ఉమా మహేశ్వరరావు గార్లు. ఇలా వ్యక్తులు వ్యక్తిగత ఆసక్తితో కనిపిస్తున్నారు గాని వ్యవస్థీకృతంగా జరగవలసిన కృషి చాలా ఉంది. చరిత్రను చరిత్ర మూలాలను అన్వేషించు కోవాల్సిన స్థితి గురించి పట్టించుకోవలసిన అవసరాన్ని ఈ సదస్సు బాగా గుర్తు చేసింది. తెలుగు భాషా పరంగా మాట్లాడేవాళ్ళు వుంటున్నారు వాళ్ళకు బర్మా లాంటి దేశాలలో సరైన స్థితి గతి లేవు. చరిత్ర అధ్యాపకురాలు డా.బి.సుదక్షణ మాట్లాడుతూ వాళ్ళల్లో చాలా మంది కింద స్థాయి ఉద్యోగాలుగా కార్మికులుగా వున్నారన్నారు. వారు తెలుగు మాట్లాడలేకుండా ఉన్నారంటూ అసలు వారికి పౌరసత్వమే లేకుండా వున్న స్థితిని చెప్పారు. బర్మా వంటి దేశాలు ఒకప్పుడు వలసలకు పూనిక. అక్కడ ఇప్పటికి ఉన్న తెలుగువారిని గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తున్నది ఈ సదస్సు. ఇండోనేషియా, థాయ్ ల్యాండ్, బ్యాంకాక్, బంగ్లాదేశ్, మలేషియా, మారిషస్ వంటి దేశాలలో తెలుగు చరిత్ర ఎంతో ముందు నుంచి ఉంది. ఆ చరిత్రని కాపాడుకోలేకపోతున్న స్థితి వ్యక్తులు పోరాటం ద్వారానే తెలుస్తోంది. 1511లోనే శ్రీకృష్ణదేవ రాయల కాలంలోనే తెలుగువారు వెళ్ళారు అన్నారు సుధీర్‌రెడ్డి పామిరెడ్డి (మలేషియా). ఆ చరిత్రను జాగ్రత్త పరచుకోవలసి ఉంది. డి.పి.అనురాధ ఏడవ దశాబ్దంలోనే బర్మాకు తెలుగువారు వెళ్ళారు అన్నారు. తెలుగు ప్రాంతాల నుంచి మయన్మార్‌కు క్రీస్తు పూర్వమూ, క్రీస్తు శకంలోనూ ఆంగ్లేయుల పాలనా కాలంలోనూ వీరి వలసలు సాగాయి. బర్మీస్ చరిత్రకారులు, తెలుగువారు కృష్ణ గోదావరి నుంచి వెళ్ళినట్టు రాజులుగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ చరిత్రను నమోదు చేయాలి. అక్కడకు వెళ్ళినవారు తెలుగు సంస్కృతిని పాటించారు. బర్మాలోని తెలుగువారు కులం పాటించరు అన్నారు. మంచి పరిశోధకురాలు వ్యక్తిగా అనూరాధ చాలా కృషి చేశారు. ఆమె కృషికి ఎలాంటి ఆర్థిక సహాయమూ లభించక పోవటం, చరిత్రను సంరక్షించుకొనే ప్రయత్నమూ జరగకపోవటం గుర్తించాల్సిన విషయం. ఈ సదస్సు చర్చల్లో గమనించిన అంశం.

- సాహిత్య పరంగా అమెరికాలో జరిగినంత కృషి కొంత ఆస్ట్రేలియాలో ఉన్నా ఇతర ప్రాంతాలలో జరగడం లేదనేది నిర్వివాదాంశం. పరిమితంగా అయినా సరే అనువాదాలు కొన్ని వచ్చాయి. సాహిత్యం గురించి విభిన్న కోణాలలో మెహజబీన్(కెనడా), కె.గీత

(USA), దారా సురేంద్ర(అమెరికా), మూర్తి జొన్నల గడ్డ (యు.కె) మాట్లాడారు. పాలుకర్ గంగాధర్ నాయక్ తెలుగు మలయాళ లిపి వ్యాకరణాల మీద విశేష పరిశోధనలు చేశారు. రెండు సాహిత్యాలలోని సారూప్యాలు ఉదహరించి చెప్పారు. సంక్రాంతి ఓనం పండుగల వెనక ఉన్న కథలు రెండు చోట్ల సాధారణంగా ఉండటం చెప్పారు. ఇలాంటి తులనాత్మక పరిశీలన అన్ని ప్రాంతాల భాషలతో అవసరమని సూచించారు మాదిరాజు యజ్ఞ నారాయణ గారు (కేరళ).

సాహిత్య రంగంలో అయితే ఈ పత్రికా ప్రపంచంలో కొంత సాహిత్యం వుంది. తాము సృజించే సాహిత్యాన్ని ఈ పత్రికలలో ముద్రించే మార్గాలు తెలియకుండా చాలా మంది ప్రవాసాంధ్రులు వున్నారు. ఈ సదస్సు గురించి మాట్లాడినప్పుడు జర్మనీ, ఫ్రాన్స్, గల్ఫ్, యు.కె. నుంచి మాట్లాడినవాళ్ళు పత్రికలు ఆన్‌లైన్‌లో వున్నాయి అని కాని తమ ఆలోచనలు పంచుకొనే అవకాశం ఉందని కాని తెలియక ఇబ్బంది పడటాన్ని చెప్పారు. వాళ్ళకి ఈఈ పత్రికలు వున్నాయి ఈఈ వెబ్‌సైట్ లు వున్నాయి అని పరిచయం కావడం లేదు. ఈ సదస్సు సమాచార వినిమయానికి కూడా ఉపయోగపడుతూ ఉంది. ఈ సదస్సులో 160 మంది పాల్గొంటే ముప్పై నలుగురు విదేశీ ప్రతినిధులు, 21 దేశాల నుంచి, పదిహేను మంది ఇతర రాష్ట్రాల నుంచి పాల్గొన్నారు. 138 పత్రాలు సమర్పణకు వచ్చాయి. తమ ఆలోచనను సూక్ష్మంగానైనా అందించే ప్రయత్నం చేశారు. ఇది చేసేటప్పుడు వారు భాష గురించి మక్కువతో మాట్లాడారు, సరిహద్దు రాష్ట్రాల్లో వున్న భాష గురించి మాట్లాడారు. ప్రవాసంలో వున్న తెలుగు వాళ్ళందరూ మాట్లాడారు. సాహిత్యం గురించి పత్రాలు అత్యధికంగా వచ్చాయి. పత్ర సమర్పకులు సాహిత్యం గురించే ఎక్కువ ఆలోచన చేస్తున్నారని తెలుస్తూ ఉంది.

♦ ఖచీజుూజూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో peace makers cultural celebrations చేస్తుంటారు. అన్నిచోట్ల దాన్ని ఏర్పర్చే ప్రయత్నం చేయవచ్చు అని జయా పీసపాటి (హాంగ్‌కాంగ్) సూచించారు.

ప్రభుత్వం కాని విశ్వవిద్యాలయాలు కాని, తెలుగు సంఘాలతో ఒప్పందం చేసుకొని సాంస్కృతిక లక్ష్యాలతో ఫోరంగా సాంస్కృతిక సంస్థగా ఏర్పడటం అవసరమని గురుదత్(స్వీడన్) సూచించారు. ఇలాంటి వాటి ద్వారా ఫ్రాన్సు, చైనా, యు.కె., జర్మనీలు సంస్కృతిని వ్యాప్తి చేయటానికి కృషి చేస్తున్నాయి. అలాగే మనమూ చేయటం సమంజసమని సూచించారు.

వారి వారి ఉన్నతి ఎలా వున్నా, పేదరికపు దేశాలు, సంపన్న దేశాలలో తెలుగు భాషను సంస్కృతిని సంరక్షించుకోవాలని తాపత్రయం చాలా వుంది. ఆర్థిక పరంగా స్థిరంగా లేని తెలుగువారు తమ దేశంలో దానిని ఎలా సంరక్షించుకోవాలో తెలియని స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. వారికి మార్గ నిర్దేశం కావాలి. ఆ పేద దేశాలను తెలుగు భాషా సంస్కృతుల సంరక్షణ కోసం చరిత్రను రక్షించడానికి దత్తు తీసుకోవాల్సిన అవసరం వుంది.

'వీధి అరుగు' నుంచి మాట్లాడిన విజయ కుమార్ రాజు పరి భాషా సంస్కృతులు తర్వాత తరాలకు అందించాలనే వ్యక్తం చేసిన ఆలోచన బాగుంది. సంస్కృతిని పిల్లలలో నిలపడానికి, తెలుగుదనంతో ముడిపెట్టడానికి, తెలుగు వాళ్ళతో లంకె వెయ్యడానికి పనికొస్తున్నటువంటిది పెద్ద పీఠ వేస్తున్నటువంటి అంశం సినిమాలు. కాని సినిమాలకంటే విశేషమైన జానపద జీవితం తెలుగు ప్రాంతంలో వుంది. దానిని పిల్లలకు పంచాలి సంరక్షించాల్సిన అవసరం దేశ విదేశాలలోని తెలుగువారి బాధ్యత. ధనమున్న అమెరికా, ఆస్ట్రేలియా దేశాలలో డాక్టర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఇతర సాంకేతిక రంగాల్లో తెలుగువారు ఉన్నారు. కనుమరుగవుతున్న, ఆసక్తి కొరవడి పోతున్న జానపద కళారూపాలను తిరిగి బ్రతికించాల్సిన అవసరం ఇక్కడ ప్రభుత్వాల మీదనే కాదు అక్కడ ఉన్న వాళ్ళ మీద కూడా వుంది. సినిమాలతో సినిమా రంగ వ్యక్తులతో అనుబంధం మంచిదే కాని అది

ప్రామాణికం కాదు. అది వ్యాపార రంగం, వినోదభరితం. ప్రామాణికం కాని వాటికి పెద్ద పీట వేసుకొంటూ మిగుల్చుకోవలసిన విశేష జానపద విజ్ఞానం కను మరుగయిపోతూ ఉండటం జాగ్రత్తపడవలసిన విషయం.

- తెలుగు వారు దేశ విదేశాలలో రాజకీయం ఎదిగిన తీరును గుర్తించాలి, సేకరించాలని మండలి బుద్ధ ప్రసాద్‌గారు మనవి చేశారు. తమిళ, కన్నడ ప్రాంతాలలో తెలుగువారు రాజకీయ ప్రాబల్యం కలిగి ఉండటంలో ఆశ్చర్యం లేదు కాని పశ్చిమ బెంగాల్‌లో గుంటూరు మహిళ శశి పంజా సాంఘిక సంక్షేమ శిశు అభివృద్ధి శాఖామాత్యులుగా ఉన్నారు. ఇలాంటి సంఘటనలు స్ఫూర్తిదాయకాలు వాటికి ప్రచారం కావాలి అన్నారు.
- మొదట్లో వలస వెళ్ళినవారు మాట్లాడటం, రాయటం, చదవటం చేసేవారు. క్రమంగా తెలుగు భాషపై పట్టు తగ్గిపోతూ ఉంది. నేటితరం కేవలం మాట్లాడగలుగుతున్నారు. భవిష్యత్ తరాలను గురించిన భయం వీరిలో ఉంది. తెలుగువారు భాషను పోకుండా చేయాలని కోరుకొంటున్నారు. దానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. విశ్వవిద్యాలయాలు పూనుకోవాలి.
- సంస్కృతి నాశనం కాకుండా ఉండాలి అంటే జాగ్రత్త పడాలి. సంస్కృతి నాశనమయితే భాష, భాష నాశనమయితే సంస్కృతి మిగలకుండా పోతాయి. ప్రభుత్వాలు చేయగలిగే పని ప్రభుత్వాలు చెయ్యడంతోపాటు కార్పొరేట్ రంగంలో వుండే వ్యాపారవేత్తలు దీని వైపు దృష్టి సారించవలసిన అవనరం ఉంది. ప్రభుత్వం పరిమితమైన పరిస్థితులలో ఉన్నప్పుడు వ్యాపారవేత్తలు ముందడుగు వేయాలి. దేశవిదేశాల్లో బౌద్ధంతో పాటు విస్తరించిన తెలుగువాళ్ళు ప్రాచీన చారిత్రకు ఆనవాళ్ళు. ఆపై శ్రామికులుగా వలస వెళ్ళిన వారు చాలా మంది వున్నారు. వాళ్ళతో భాష విస్తరించింది. ఆయా దేశాలలో ఉన్న ప్రత్యంశాన్ని సంరక్షించుకోవలసిన అవసరం ఉంది. తపన పడాల్సినవాళ్ళు ప్రభుత్వాలు, తెలుగువాళ్ళు, తెలుగు సంఘాలు మాత్రమే కాదు. వ్యాపార దిగ్గజాలు కూడాను అటువైపు దృష్టి సారించాలి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీని ఈ కోణం వైపు మళ్ళించాలి.
- సాంకేతిక రంగంలో ప్రవాసాంధ్రులు గాని తెలుగు ప్రాంతాల వారు గాని చేయాల్సిన కృషి చాలా వుంది. సాంకేతిక పరంగా జరుగుతున్న చర్చల్లో సాహిత్యాన్ని మనం నేర్చుకొన్నంత తొందరగా ఇష్టంగా సాంకేతికత జోలికి పోవడం లేదు, అవసరం అయిన ఏ కొంత మాత్రమో నేర్చుకొని ఆగిపోతున్నాం అనేది స్పష్టం అవుతూ ఉంది. జాతీయ నూతన విద్యా విధానం కోసం రూపొందించిన అనువాద పరికరం (translation tool) ద్వారా 11 భాషలలో అనువాదం సునాయాసంగా జరుగుతూ ఉంది. సంస్కృతి సంప్రదాయాలను సంరక్షించుకోవలసిన అవసరం ఉంది. అది దీని ద్వారా సాధ్యం అవుతుంది. త్వరలో ఈ పరికరాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు. డా.బుద్ధా చంద్ర శేఖర్ గారు (ఎ.ఐ.సి.టి.ఇ., న్యూ ఢిల్లీ). Data sets తెలుగులో లేవు.సూజువీ అంశాలకు నిఘంటువును తయారు చేసివ్వాలని విశ్వవిద్యాలయాలను కోరారు. ఈ పరికరాన్ని సాధారణ రైతుకు కూడా ఉపయోగపడేలా చేయాలని చూస్తున్నారు. తెలుగులో ఉన్న మంచి పుస్తకాలను సాహిత్యాలను ఇస్తే, వాటిని ఇతర భాషలలోకి తీసుకొస్తామన్నారు డా. బుద్ధా చంద్రశేఖర్ గారు.

తెలుగుకు అనోటేషన్స్ ఇంజన్‌ను వాడటం ఒక నూతన సాంకేతిక కోణం. అన్ని భాషలకు దీనిని వాడవచ్చు. ఒక్కసారి చేస్తే కొన్ని వేల డాక్యుమెంట్స్‌ను ఇచ్చినప్పుడు అనొటేట్ చేయటం సులువుగా జరుగుతుంది. దానికి అనొటేషన్ ఇంజన్ చాలా అవసరం. అని తిరుపతి

ఐ.ఐ.టికి చెందిన డా. కాళిదాసు పేర్కొన్నారు. అల్గరిథమ్ తయారు అయి ఉంది. దానికి ఆర్థిక తోడ్పాటు అందించే మార్గం కోసం ఎదురు చూస్తున్నారు. దానిని విరివిగా వాడే పరిస్థితి ప్రోత్సాహం ఇంకా కావలసి ఉంది.

సెల్‌ఫోన్లో ఆంగ్లాక్షరాలు టైప్ చేస్తే తెలుగు లిపి వస్తుంది. కంప్యూటర్లలోనూ ఆ అవకాశం ఉంది. దానికి మూలం RTS(Rice Translation Standard). దాని రూపకర్తలలో ఒకరు డా.కన్నెగంటి రామారావు గారు శాస్త్రానుగుణంగా భాషను సాంకేతికంగా వాడటం ఇంకా నేర్చుకోవాల్సి ఉంది. స్పెల్ కరెక్షన్, గ్రామర్ కరెక్షన్, క్రియేటివ్ ఆక్టివిటీ లాంటివి చేయవలసిన అవసరం ఉంది. తెలుగు భాషా నిపుణులు కంప్యూటరు నిపుణుల మధ్య సయోధ్య అవసరం. ఆ అనుబంధం ఏర్పడితే తప్ప ఈ అడ్డంకిని దాటలేం అని సూచన చేశారు. కేవలం తెలుగు, కంప్యూటర్ శాఖలు మాత్రమే కాదు భాషా శాఖలు అన్నీ కూడా కలవాల్సిన అవసరం వుందని అర్థమవుతూ ఉంది.

KÔáT\T(fonts) ఎవరు తయారు చేసినా Unicode consortium ప్రోత్సహిస్తుంది. పొన్నాల రవిప్రకాశ్ లక్కిరెడ్డి ఖతులు వివిధ సంస్థల వ్యక్తుల ఆర్థిక ప్రోత్సాహంతోనూ. ప్రభుత్వ సహకారంతోనూ రూపొందించారు. తాను రూపొందించిన ఖతుల గురించి పురుషోత్త కుమార్ రూపొందించిన ఖతుల గురించి అప్పాజి అంబరీష ధర్భ పేర్కొన్నారు. ఎవరు కోరినా తాము ఖతులు రూపొందించి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అధికార భాషా సంఘ అధ్యక్షులుగా ఉన్నప్పుడు 17 ఖతులు రూపొందించి గూగల్ ద్వారా ఉచితంగా వాటిని అందు బాటులో ఉంచామన్నారు డా. మండలి బుద్ధ ప్రసాద్ గారు.

వీవెన్ తెలుగు భాషాభివృద్ధిని అంతర్జాలంలో సామాన్యులకున్న అవకాశాలను గూర్చి చెప్పారు. సామాన్యులకు బ్లాగు, మైక్రో బ్లాగు, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వికీపీడి వికీడేటాలలో లాంటి వాటిలో తెలుగులో ఎన్ని రకాలుగా కంప్యూటర్లో అవకాశాలు ఉన్నాయో తెల్పారు. బ్లాగ్, వెబ్‌సైట్ల సృష్టించే మార్గాలను తెలుగు రికార్డింగ్‌ను పేర్కొన్నారు. యంత్రాలకు పద స్వరూపాన్ని నేర్పించే క్రమాన్ని తెల్పారు.

జర్మనీలోని గోపి. వి. ప్రసాద్ గీత విద్యను నూతన సాంకేతిక విధానంలో బోధించటం సాంకేతికతలో ఓ కొత్త పంథా. సాంకేతిక రంగంలో జ్ఞాన సముపార్జనావకాశాలూ భవిష్యత్తూ ఉన్నాయి. డా. తొట్టెంపూడి గణేష్(జర్మని) తెలుగు భాషా సాంకేతిక రంగాలలో కృషి ఎంత వేగంగా జరుగుతూ ఉందో చెప్తూ digital humanitiesకు పెరుగుతున్న ప్రాచుర్యాన్ని అవసరాన్ని తెల్పారు.

సాంకేతికమైన ఆలోచనలను గురించి ఖతులు (ఫాంట్స్) గురించి డిజిటలైషన్ గురించి గాని, ఆర్.టి.ఎస్. గురించి రూపొందుతున్న విభిన్నాంశాలు ఇంకా ఎక్కువగా వాడుకలోకి రావాలి, తెలియాలి.

ఈ సదస్సు ద్వారా జరిగిన పత్ర సమర్పణలో విభిన్న మైన పార్శ్వాలు కనిపిస్తున్నాయి. చరిత్రలో మూడు నాలుగు తరాల క్రితం వెళ్ళినవాళ్ళు ఉన్నారు. వాళ్ళంతా కార్మికులుగా నాలుగో తరగతి ఉద్యోగులుగా ఉంటూ ఎదగలేక, ఎదగడానికి ప్రయత్నం చేస్తూ ఇంకా ఘర్షిస్తూనే వున్న పరిస్థితి ఒక పక్క ఉంటే, మరొక పక్క ఈ తరంలో వెళ్ళి స్థితిమంతులైన విద్యావంతుల పరిస్థితి. వీరి తొలి, మలి తరాల విద్యావంతులు వీరు. అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలలో సంపన్నులుగా ఉంటే వందల ఏళ్ళ క్రితం వెళ్ళినవారు ధన హీనతతో ఉన్నారు. ఈ రెండింటి మధ్య వున్న వైరుధ్యం తగ్గాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భాషా సంస్కృతుల మధ్య సమ్మేళనాన్ని సాధించ టానికి ఈ దూరం తగ్గాలి. ప్రపంచ సభలు జరిగినా మేము వ్యక్తిగతంగా వెళ్ళి పాల్గొనలేం అనే పరిస్థితి కొన్ని దేశాల వారిది(ఉగాండా). వ్యవస్థగా సంఘాలుగా సంస్థలుగా ఉన్నవారు దీనికి పూనుకొంటే పరస్పర అవసరాలు తెలు స్తాయి. అవి తీరే మార్గాలు తెలుస్తాయి.

ముగింపు సభకు అధ్యక్షత వహించిన ఆచార్య టిఈ భారతి(డీన్) గారు సదస్సుకు ప్రత్యేకాంసాన్ని ఎంచు కొన్నందుకు అభినందిమచారు. ముప్పై రెండు మంది విదేసీ ప్రతినిధులు పాల్గొనడం సాధారణ విషయం కాదన్నారుఈ ఔ ఇశ్వవిద్యాలయంలోనే ఇది మొదటిదిఇ ఇది చరిత్ర అని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య తంగెడ కిషన్‌రావు గారు (ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం)మాట్లాడుతూ ఈ సదస్సు లాంటిది మేము చేయవలసిన పని అనటం ఆనందం. నివేదికను ఇస్తే తాను ఉపాధ్యక్షులుగా చేయగలిగిన పనిని తాను చేస్తానని మాట ఇవ్వటం ఆశాజనకంగా ఉంది. పెద్దలు దీనికి పూనుకోగలిగితే ప్రపంచవ్యాప్తంగా తెలుగును నిలుపుకొని అద్భుత విజయాలు పొందవచ్చు.

- ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు వారి సంక్షేమం కోసం ఒక మంత్రిత్వ శాఖను ఏర్పరిచి, రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి తద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, అక్కడ నివసిస్తున్న తెలుగు వారి విద్యా సాంస్కృతిక అవసరాలు తీర్చడానికి కృషి చేయాలి. దాని కోసం ఒక కార్పస్ ఫండ్‌ను ఏర్పర్చాలి. నాడు తెలుగు విశ్వ విద్యాలయం భావించింది కాని ఆచరణలోకి రాలేకపోయింది అని ఆచార్య మునిరత్నం నాయుడు గారు అన్నారు.
- వివిధ దేశాలలో ఉన్న విశ్వవిద్యాలయాలలో తెలుగు అధ్యయన కేంద్రాలు నెలకొల్పాల్సిన అవసరం ఉంది. గతంలో తెలుగు విశ్వవిద్యా లయం ద్వారా కొంత జరిగింది. ఇంకా జరగాల్సి ఉంది. తెలుగు పీఠాలు ఏర్పడితే ప్రపంచ భాషగా తెలుగు ఏర్పడుతుంది. దానికి ఆలోచన జరగాలి అని మండలి బుద్ధ ప్రసాద్‌గారు సూచించారు.

ఈ సదస్సు నిర్దేశించిన నాలుగు అంశాలతో పాటు అందరూ మాట్లాడే అంశాలను కలిపి పంపించవలసిన విషయాలను ప్రభుత్వానికి, ప్రభుత్వ శాఖలకు సంబం ధిత శాఖలకు అధికారులకు పంపుతాం. ఈ రంగాలలో జరగాల్సిన కృషి చాలా వుంది. తెలుగు పరిరక్షణకు గాని ఈ నాలుగు రంగాలకు సంబంధించి కాని ఎవరికి వాళ్ళుగా వాళ్ళ వాళ్ళ దేశాలలో ముక్కలుగా చేస్తున్న ఆలోచనకు, జరుగుతున్న ప్రయత్నానికి ఒక వేదిక అవసరం అవుతూ ఉంది. ఎక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఇలా తెలియటం మరెందరికో అవకాశాన్ని కల్పిస్తుంది.

భాషా, సాహిత్య, సాంస్కృతిక సాంకేతిక రంగాల్లో సాంస్క ృతిక రంగం మాత్రమే చాలా దేదీప్యమానంగా అన్ని ప్రాంతాల్లో ప్రవాసాంధ్ర జీవితాలలో కనిపిస్తూ ఉంది. భాషాపరంగా తపన పడుతున్నవారు వున్నారు, సాంకేతికపరంగా అన్ని వైపుల నుంచి ప్రయత్నాలు జరగాల్సిన అవసరం వుంది. ఎవరికి తోచిన చెయ్యగలిగిన సహాయాన్ని సహకారాన్ని అందరికీ అందించవలసి ఉంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆంధ్రకవయిత్రులు – కవితా దృక్పథం

– డా॥ డి. ఉదయకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రాచీనాంధ్ర సారస్వతంలో స్త్రీ :

రామాయణంలో "ఏ దేశంలోనైనా భార్య దొరుకుతుంది గానీ సోదరుడు లభించడని రాముడనటమూ" ఉంది. ఊర్మిళ నిద్రకూడా ఆనాటి స్త్రీ స్థితిని తెలుపుతుంది. అదేవిధంగా ద్రౌపది పాత్ర ఆమె ఇష్టంతో ప్రమేయమే లేని పరిస్థితి. తరువాత ప్రబంధయుగాన్ని తీసుకుంటే స్త్రీ వర్ణన శృంగారభూయిష్టమైంది. "శ్రీకాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి "సంసారం మోక్షసాధనానికి అడ్డంకి అని, సంకెల" అని అంటాడు. 'సుమతీశతకం'లో కూడా "అంగన నమ్మరాదు" అనే మాటలు మనం చదివాం. ఇంకా కొంతమంది కవులలో స్త్రీకి సముచిత స్థానాన్నిచ్చారనిపించదు. ఆనాటి సామాజిక నేపథ్యాన్ని అనుసరించి, కావ్యాల్లో స్త్రీ స్థితిగతులు ఉండిఉండవచ్చు. ఆ సమయంలో వచ్చిన కావ్యాల్లో స్త్రీ వర్ణనలు ఆ విధంగా ఉండి ఉండవచ్చు.

ప్రబంధ యుగము తరువాత పన్నెండవ శతాబ్దంలో అంటే ప్రబంధ నాయికల వర్ణనలు శృంగార భూయిష్టమై, కావ్యాలలో రసడోలికలూగిస్తున్న తరుణమది ఆ సమయంలోని ప్రదానంగా కవయిత్రులను సంస్కృత, ఆంధ్ర కవయిత్రులని వర్గీకరించవచ్చు. అటువంటి నేపథ్యంలో పన్నెండవ శతాబ్దంలో చానమ్మ, ప్రోలమ్మలు (13వ శతాబ్దం) చాటువులను చెప్పిన తొలి తెలుగు కవయిత్రులుగా మనకు కనిపిస్తారు. తరువాత తాళ్ళపాక తిమ్మక్క మొల్ల (15వ శ.) చిన్నాదేవి, మోహనాంగి, బాలపాపాంబ అనామిక వేశ్య, మరొక మొల్ల (16వ శ.) ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ, (18వ శ.) సిద్ధిపాని, అనామిక వారకాంతలు. 19వ శతాబ్దంలో కూడా కవయిత్రులున్నారు. వారు దార్ల సుందరమ్మ, మతుకుల పల్లి జానకమ్మ, అనామిక వారకాంత, బలభద్రదాశి మొదలైనవారు ఆంధ్ర కవయిత్రులుగా కనిపిస్తారు. తరువాత శతక కవయిత్రులు, యక్షగాన కవయిత్రులు కూడా కనిపిస్తారు.

ప్రబంధయుగంలో కవులు ప్రధానంగా కావ్యాలు రాస్తున్న తరుణంలో, అందునా స్త్రీకి సముచితమైన గౌరవాదారాలు తక్కువగా ఉన్న, ఆ నేపథ్యంలోంచి ఒక స్త్రీ కవయిత్రిగా కావడమనేది చాలా గొప్ప విషయం. ఆనాటి సామాజిక పరిస్థితులలో కవయిత్రులు పుట్టుకు రావడం, వారి కావ్యాలకు ఆదరణ లభించడమనేది, ఆనాటికది సాధారణమైన విషయం కాదు.

కవయిత్రుల కవితా దృక్పథం :

ఆనాడు మతం, భక్తి సమాజంలో ప్రధానమైన అంవాలుగా ఉండేవి. ప్రాచీనాంధ్ర కవయిత్రులందరూ దాదాపుగా తీసుకున్న వస్తువు భక్తి ప్రధానమైందే. హిందూ మత ప్రవర్తకమైనదే. కవిత్వానికి సబంధించి ప్రముఖంగా భక్తి &ప్రకటనే కన్పిస్తుంది. ఒక్కొక్క కవయిత్రిలో ఒక్కొక్క భావన, భక్తి ప్రభావం కన్పిస్తాయి. అయితే కవయిత్రులు స్వభావ చిత్రణే వారి కవితా దృక్పథంగా చెప్పుకోవాలి. ఆనాటి సామాజిక నేపథ్యం, స్త్రీ సహజ స్వభావం వారి కవిత్వంపై ప్రభావాన్ని చూపాయి. ప్రాచీనాంధ్ర కవయిత్రులందరు స్త్రీ స్వభావ చిత్రణలో బాహ్య ప్రవృత్తుల్ని, అంత:ప్రవృత్తుల్ని స్పష్టంగా గుర్తించి, రచనలు సాగించారు. వారి మనస్సులోని భావాల అభివ్యక్తీకరణే వారి కవితా దృక్పథంగా చెప్పుకోవచ్చు. కవయిత్రుల అనుభూతుల వ్యక్తీకరణను కూడా వారి కవితా దృక్పథంగా మనం చెప్పుకోవచ్చు. కొన్ని అనుభూతులు స్త్రీకి మాత్రమే సొంతమై ఉంటాయి. ఆది పురుషుని అనుభవానికి, అనుభూతులకు అందవు. ఉదాహరణకు స్త్రీ సహజమైన సిగ్గు, ఇటువంటి భావ వ్యక్తీకరణను స్త్రీ చేసినట్టు పురుషుడు చెయ్యలేడు.

వీరిలో తాళ్ళపాక తిమ్మక్క, ఆదుకూరి మొల్ల, ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ మొదలైన కవయిత్రులను ప్రధానంగా తీసుకుని వారి కవితా దృక్పథాన్ని చర్చిస్తారు.

తాళ్ళపాక తిమ్మక్క :

దేశికవిత్వంలో రచనలు చేసినది పద కవితా పితామహుడైన అన్నమయ్య ధర్మపత్ని తిమ్మక్క ప్రాచీన కవయిత్రులు స్త్రీ స్వభావాలకు అనుగుణమైన కథల్నే ఎన్నుకున్నారని చెప్పుకోవచ్చు. కవుల రచనల్లో కంటే కవయిత్రుల రచనల్లో స్త్రీ స్వభావ చిత్రణ మనకు స్పష్టంగా కన్పిస్తుంది. యవ్వనంలో ఉన్న స్త్రీలలో కొన్ని కలలు, కొన్ని ఊహలూ ఉంటాయి. అవన్నీ వివాహం పైన వచ్చే ఊహలే. తిమ్మక్క "సుభద్రా కళ్యాణం"లోని వస్తువును ఎన్నుకోవడానికి బహుశా కారణం అదే కావచ్చు. "కళ్యాణ దృశ్యం" స్త్రీలో ఒక చెరగని ముద్ర, చెదరని నిజం. స్త్రీ జీవిత పునాది భావాలపై ఏర్పడినదే. ఈ కళ్యాణం అనే ప్రక్రియ.

భారత కథాభాగంలోనిదే 'సుభద్రాకళ్యాణం' 'భారతం'లో కానీ 'సుభద్రా కళ్యాణం'లో కానీ సుభద్రార్జునుల వివాహం బహురమ్యం. సుభద్రార్జునుల వివాహానంతరం ధర్మరాజు, ద్రౌపదికి సుభద్రార్జునుల కార్యాన్ని జరిపించమని అప్పగిస్తాడు. ఆ సమయంలో ద్రౌపది అనుభవించిన బాధను తిమ్మక్క వర్ణించిన తీరు అద్భుతం. ఒక స్త్రీ పడే మానసిక వేదనను సహజంగా, తాను స్త్రీ గనుక వర్ణించగలిగింది. ద్రౌపది మానసిక స్థితి వర్ణనిది. ఆ సమయంలో రకరకాలు ఆలోచనలు ద్రౌపదీదేవిని ముసురుకుంటున్నాయట. మనసు మూగబోతున్నదట. పళ్ళు బిగించి పాంచాలి కార్యానికన్నీ ఏర్పట్లు చేసిందట. ద్రౌపదీ దేవిలో చెలరేగిన బడబాగ్నిని ఈ పద్యం ద్వారా వ్యక్తం చేవారు కవయిత్రి.

"ఏమి వస్తువులైన నియవచ్చుగాని
ప్రాణేశునిచ్చి మఱి బ్రతుకంగరాదు
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని"

.....

..... (సు.క.52)

స్త్రీకి సిగ్గే అందం, ఆభరణం. రకరకాలైన సన్నివేశాల్లో సిగ్గు ప్రకటితమైంది సుభద్రాకళ్యాణంలో. సిగ్గు స్త్రీ సహజసిద్ధమైన ఒక చర్య. శ్రీకృష్ణుడు సుబద్రను మునివేషదారియైన అర్జునునికి సేవ చెయ్యడానికి పంపడం జరుగుతుంది. ఆ సమయంలో కాషాయ వస్త్రాలను ధరించిన అర్జునుడు అకస్మాత్తుగా సుబద్ర చెయ్యి పట్టుకోవడం జరుగుతుంది. ఈ హఠాత్పరిణామానికి సుభద్ర జలదరించి సిగ్గుతో పారిపోవడం జరుగుతుంది. స్త్రీలు పడే సిగ్గు, బిడియాలను చాలా చక్కగా వర్ణించింది తిమ్మక్క.

యౌవనంలో కనిపించే ఆంగిక విన్యాసాన్ని సుభద్ర పాత్రద్వారా చూపించారు తిమ్మక్క. కృష్ణుడు సుభద్రను రమ్మని కబురు పెట్టినపుడు సుభద్ర నడిచివచ్చే తీరును అత్యద్భుతంగా వర్ణించారు కవయిత్రి. ఈ అందమైన వర్ణనులు కథాముఖంగా చేసినా, తాను స్త్రీ సహజమైన భావాలను అనుభవించి, తరువాత గావించిన రచన గనుక తన మనస్సులోని భావాలను సుబద్రపాత్రలో ప్రవేశపెట్టి తన కవితాదీక్షథాన్ని చాటారు తిమ్మక్క.

ద్రౌపది పడే ఆవేదవనను, సవతిని చూసి ఆమె మనస్సు రగిలిపోయే తీరును ఈ కావ్యంలో మనం గమనించవచ్చు. లలిత శృంగారాత్మకంగా దేశీయత వెల్లివిరిసేట్లు, ఆనాటి ఆచార వ్యవహారాలను ప్రతిబింబచేటట్లు, లోక సహజాలైన స్వభావాలు ఈ కావ్యంలో ప్రకటితమైనాయి.

మొల్ల :

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారన్నట్లు శారదాదేవీ విమల దరహాసరేఖయే మొల్ల రామాయణం. రామాయణ, భారతాలు రెండూ ఆదర్శగ్రంథాలే. రామాయణ సంగ్రహ కావ్యాల్లో మొల్ల రామాయణమే విశిష్టమై కీర్తిని గడించింది. ఈ అద్భుతమైన రచనను సైతం నిరాకరించడం. శూద్రకుల సంజాత రచన వెనుక ఆమె కవిత్వం

నిషిద్ధమనడం జరిగాయి. కానీ మొల్ల రామాయణానికున్న ప్రవస్తి, ప్రాచుర్యాలు తక్కిన సంగ్రహరామాయణాలకు, లేవన్నది నిజం. ఎన్నిమార్లు సుతిస్తే మాత్రం మాత్రం ''తప్పకల్గునే''? అని ప్రవ్నించింది మొల్ల. తనకన్నా మందొచ్చిన రామాయణాలు సంస్కృత భూయిష్టమై, సామాన్య ప్రజలకు అర్థంకాని రీతిలో ఉన్నాయని చెప్పిన ధైర్యవంతురాలు మొల్ల. మొల్లం రామాయణం పద్య కవిత్వమైనప్పటికీ తేటతెలుగు మాటలతో సులబంగా అర్థమయ్యే రీతిలో ఉన్నది. కనుకనే అంతటి ఆదరణను పొందగలిగింది. సహజంగా ఈమె స్త్రీ కావడం వల్ల త్రిమూర్తుల దేవేరుల వర్ణనలోనిప్రత్యేకత ఈ రామాయణ పద్యంలో భాసించింది. అదేవిధంగా లక్ష్మీదేవి వర్ణన ఉదా॥.

''సామజయుగ్మ మింపలర జల్లని నీరు పసిండి కుండలన్
వేమఱు సంచివంచి కడువేడుకతో సుభిషిక్త జేయగా
దామర పువ్వు గద్దియ ముదంబున నుండెడి లోక మాత మా
కాముని తల్లి సంపద లఖండముగా నిడు మాకు నెప్పుడున్''

ఇందులో 'కాముని తల్లి' అనే పదాన్ని వెయ్యడం మొల్ల ప్రత్యేకత. స్త్రీత్వాన్ని దాతృత్వమూ మాతృత్వాన్ని కూడా పై పదంలో మనం చూడవచ్చు.

సహజంగా భర్తను పొగడడం స్త్రీ స్వభావం. ఇక్కడ సీత రావణునితో ఈ విధంగా అంటుంది.

''నీ పరాక్రమం కేవలం భౌతికమూ, పాశవికమూ మాత్రమే. అందులోనూ నీవు నీచగుణరతుడవై సగము హీనసత్త్వుడవైనావు.''

హనుమంతుడు. లంకలో సీతమ్మను వెదికి ఎక్కడా ఆమె జాడ కనిపించకపోతే ''త్రంతు విదాత జందెములు'' అంటాడు. ఇక్కడ మొల్ల స్వభావ పరిశీలనా నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేం. అలాగే సహజంగా స్త్రీలకుండే ఆభరణాలపై మక్కువ ''నీతి చందాన ఇంద్రనీలమహిమ'' అనే దానిలో స్పష్టమౌతుంది. ప్రకృతి రామణీయకంలోని, ప్రతి భాగంలోనూ ఆమె కవితా హృదయం గోచరిస్తుంది.

స్వభావ సిద్ధంగా వర్ణించడం మొల్లలోని ప్రత్యేకత అంత:పురాలలో ఉన్న సీతమ్మ అడవులలో వెళ్లూ ఉన్న ఆ స్థితిని వర్ణించిన తీరు స్త్రీ సహజమైన సౌకుమార్యాన్ని మొల్ల అనుభవించినది కనుక ఆ రాసిన తీరు సహజ సిద్ధంగా అత్యద్భుతంగా ఉన్నది. సీతాసాధ్వి శీల సంపదను మలచిన తీరులో మొల్ల మహనీయమైన కవితాశిల్పం మనకు గోచరిస్తుంది. సీతాదేవి ఔన్యత్యాన్ని చాటి చెప్పటడంలో మొల్ల కృతకృత్యురాలైంది.

తరిగొండ వెంగమాంబ :

వేంకటేశ్వరుని అనుగ్రహంతో జన్మించడం వలన 'వేంగమాంబ' అని నామకరణం జరిగింది. వెంగమాంబ కృతులు పద్దెనిమిది. వీటిలో నారసింహ విలాసకథ. రుక్మిణీనాటకం, గోపికానాటకం ద్విపద భాగవంతంలో చివరి ఆరు స్కంధాలు అలభ్యం. తక్కినవి లభ్యాలే వాటిలో శివనాటకం, కృష్ణనాటకం శ్రీ భాగవంతంలోని మొదటి ఆరుస్కంధాలు అముద్రితాలు మిగిలిన తరిగొండ నృసింహశతకం, విష్ణుపారిజాతం, రమా పరిణయం, చెంచునాటకం, శ్రీకృష్ణమంజరి, వేంకటాచల మహాత్మ్యం, అష్టాంగ యోగసారం, ముక్తికాంతా విలాసం, తత్త్వకీర్తనలు, వాసిష్ఠరామాయణం భాగవంతంలో కొంత భాగం ముద్రితాలు. శతకాలు,యక్షగానాలు, కీర్తనలు, కావ్యాలు, పురాణాలు రాసిన బహుగ్రంతకర్త్రి వేంగ మాంబ. వెంకగమాంబ తొలి తరానికి చెందిన కవయిత్రు లలోనేగాక, అగ్రశ్రేణికి చెందిన కవయిత్రులలో కూడా స్థానాన్ని నంపాదించుకొన్న అద్వితీయ ప్రతిబా నంపన్నురాలు. ఆంధ్రవాఙ్మయ జగత్తులో విశిష్ట వ్యక్తిత్వంలో విలసిల్లు మమాకవులలో, కవయిత్రీమ తల్లుల్లో గననీయ సారస్వతమూర్తి.

భాగవత రచనకు ఆద్యుడు పోతనామాత్యుడైతే ద్విపద భాగవతానికి వేంకగాంబ గుర్తుకు రావడం సహజం. ఈమె దృక్పథం మొదటి నుండీ ఆధ్యాత్మికమే.

బహిక జీవన పరిస్థితులు కూడా పారమార్థిక దృక్పథానికి దారితీశాయి. అమ కృతులన్నీ ఆమెకున్న వేదాంత ధోరణిని, మోక్షకాంక్షను వెల్లడిస్తున్నాయి. ఆమె కవితా ప్రతిభ ఆమె కృతులలోని తాత్త్విక సందేశాన్ని తెల్పు తున్నది. నిజజీవితంలో ఛాందన సాంప్రదాయాలను ఎదిరించి నిలువగలిగిన కవయిత్రిగా వేంగమాంబను మనం చెప్పుకుంటున్నాం.

వేంగమాంబకు వెంకటాచలపతితో వివాహం చెడింది. "కేశఖండనానంతరం మళ్ళీ వెంట్రుకలు మొలవకుండా ఉంటాయా?" అని ప్రశ్నించింది. "తలలు బోడులైతే తలపులు బోడులా" అన్నది. కానీ వేంకటేశ్వరుణ్ణే తన మనస్సులో భర్తగా ఊహించుకున్న స్త్రీమూర్తి వేంగమాంబ. ఆమెకు ఇహంతో పనిలేదు. ఆమె భర్త మరణించగానే వెంట్రుకలు తీయననడంలోని ఉద్దేశ్యాన్ని లౌకికంగా ఇక్కడ తీసుకోకూడదు. ఎందుకంటే ఆమె భర్తైన వెంకటా చలపతిని ఆమె భర్తగా అంగీకరించలేదు. ఇక్కడ ఆమె తాత్త్వికతనే మనం గుర్తించవలసి ఉంటుంది.

ఆమె వేదాంత రచనలలో ఆమె ఆత్మీయాంశ మనకు గోచరిస్తుంది. అక్కడక్కడ సుకుమారంగా చేసిన సంఘ విమర్శ కూడా ఆమె దృక్పథంలో నవ్యతా ప్రదర్శనకు ఆలంచనాలైనాయి. తాత్త్విక సందేశం అందిస్తూనే స్త్రీగా సాంఘికాచారాలను ఎదిరించే చొరవ ఈమె రచనలో కన్పిస్తుంది. స్వభావత: వేదాంతి కనుక ఆమె రచనలలో ఈ ధోరణి ప్రతిఫలించింది. యోగసాధనమొనర్చిన యోగినిగా ఈమె కనిపిస్తుంది. 'శివనాటకము' మొదలైన కృతులలో తన అద్వైత మతత్వాన్ని ప్రదర్శించింది. నిత్య జీవితంలో తాను ఆచరించి, ప్రబోధించిన వేదాంతం ఆమె కృతులన్నిటిలో ప్రతిబింబించింది. చిత్తశుద్ధిలేని కర్మాచరణాలను ఆమె తిరస్కరించింది.

వెంగమాంబ రచనలో అక్కడక్కడ నన్నయ, మొల్లల ప్రభావాలు కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. ఉత్తతమైన రాజయోగాన్ని "రాజయోగామీతసారం"లో వివరించారు కవయిత్రి. రాజయోగం సారాంవాన్నిందులో చెప్పారు వేంగమాంబ. యోగశాస్త్ర గ్రంథాల్లో తరిగొండ వెంకగ మాంబ రచనలకొక ప్రత్యేకస్థానం ఉందని చెప్పవచ్చు. తిరుమలలో రచించిన మొదటి కృతి "విష్ణుపారిజాతం" మనే యక్షగానం ఆమ్మెఉ స్వతస్సిద్ధమైన భక్తి ఇందులో ప్రకటితమైంది.

పదిహేడవ శతావబ్దిని 'యక్షగానవాఙ్మయం' వికాస దశగా 18వ శతాబ్దిని పరిణతిపొందిన దశగానూ పరిగణిస్తారు. తరిగొండ వెంకగమాంబను యక్షగాను కవుల్లో ప్రథమగణ్యగా పేర్కొనవచ్చు. తొమ్మిది యక్ష గానాలను రచించింది. వెంగమాంబ. 'ద్విపద' ఈ కవ యిత్రికి ప్రియమైన దేశిఛందస్సుగా చెప్పుకోవచ్చు. 'ద్విపద' వేంకగమాంబ, వాఙ్మయ జీవితంగా చెప్పుకోవచ్చు.

ముద్దుపళని :

ఈమె అసలు పేరు 'పళని' 'ముద్దు' అనేది బిరుద నామం. విద్వత్కవయిత్రి. భగవత్ కైంకర్యాన్ని, భాగవత కైంకర్యాన్ని సమానంగా చేపట్టిన భక్తురాలు. ఈమె రచించిన శృంగార ప్రబంధం 'రాధికాసాంత్వనం' ఈ గ్రంథానికే 'ఇళాదేవీయమనే' పేరుకూడా ఉంది.

ఇళా కృష్ణుల వివాహం, రాధావిరహం, అటు తర్వాత చిలుక రాయబారం, శ్రీకృష్ణుడు, రాధను అనునయిం చడం ఇందులోని ఇతివృత్తం.

సాంత్వనమంటే ఓదార్చడం. రాధ, ఇళకు, కృష్ణుడికి వివాహానంతరం, నిషేకానికి సిద్ధంచేసి, తను వెళ్ళి పోతుంది. తన ప్రియుడైన కృష్ణుణ్ణి ఇంకొక ఆడుదాని వశం చేసిన రాధ మనస్సు పడే ఆవేదన, ఆమె మానసిక స్థితి ఒక స్త్రీగా ముద్దుపళని సహజ సిద్ధంగా వర్ణించింది. తెల్లవారిన తరువాత వారి నిషేకం గదికి వెళ్ళి తలుపు తడుతుంది రాధ. ఇదిస్త్రీ ఆగ్రహావేశాలు, తొందర పాటును చెప్పకనే చెబుతున్నాయి. విధిలేక కృష్ణుణ్ణి, ఇళను అమ్మగారింటికి పంపింది రాధ. కానీ కృష్ణుని వియోగాన్ని భరించలేకపోయింది.

ఈ ప్రబంధంలో ఇళాకృష్ణుల శృంగార కేళీ విలాసాలు, అలాగే రాధాకృష్ణుల శృంగారం మోతాదుకు మించి

ఉన్నదనే చెప్పవచ్చు. ఈ కావ్యంలో పాత్రచిత్రణ, వారి మానసిక భావాలు వారి చర్యల ద్వారా వ్యక్తం చేయించింది కవయిత్రి. ఇళ పాత్రను అద్భుతంగా చిత్రీకరించడం వల్ల ఇళా దేవియం అనే పేరు ఈ కావ్యానికి మరో పేరైంది కవయిత్రి. వ్రేపల్లె వర్ణన, తంజావూరులోని భోగలాలసత్వాన్ని సైతం కావ్యంలో పెట్టింది. ఈ కావ్యంలో శృంగారం పాలు ఎక్కువైందనే విమర్శ ఉండనే ఉంది. ఒక కవయిత్రి అయి ఉండి ఇంతటి శృంగార కల్పితాలను పాత్రల మధ్య కల్పించడం ఆశ్చర్యమే. ఈ కావ్యాన్ని కవయిత్రి బాలకృష్ణునకే అంకితమిచ్చింది. స్త్రీ హృదయభావాలను చాలా సున్నితంగా చిత్రించింది. తానొక స్త్రీ అయి ఉండి అంతటి శృంగార భావాలను వెలయించడం సాహిత్య లోకన్ని అబ్బురపరచింది.

కాని ఏది ఏమైనా ఈమె రచనా మాధుర్యం మెచ్చుకోదగింది. మధుర శృంగార భావాలను, రాధికా కృష్ణుల పవిత్ర ప్రణయాన్ని వర్ణించిన ముద్దుపళని విశిష్ట కవయిత్రి అని చెప్పక తప్పదు. రస మధువులున్న రసమయ కావ్య ప్రసూనమీకావ్యం.

పైన చెప్పుకున్నప్పటికీ ఈ కావ్యాన్ని లౌకిక దృష్టితో చూసే వీలు లేదు. ఎందుకంటే ఈ కావ్య నాయకుడు శ్రీకృష్ణుడు. కవయిత్రి వర్ణించింది లీలామానుష విగ్రహమైన పరమాత్ముడ్ని. కృష్ణుడు లౌకిక నాయకుడు కాదు. ఇక్కడ రాధాకృష్ణుల శృంగారాన్ని పారలౌకికదృష్టితోనే చూడవలసిన అవసరముంది. రాధాకృష్ణుల పవిత్ర ప్రణయానికి లౌకికతత్వాన్ని ఆపాదించడం సరికాదు. వీరి ప్రణయం పారలౌకికం. ఇక్కడ మళ్ళీ మధురభక్తి కూడా కనిపిస్తూ ఉంది. రాధ జీవిత్మ, కృష్ణుడు పరమాత్మ. జీవిత్మ, పరమాత్మకై పడే ఆరాటమే మధురభక్తి. కవయిత్రి సాక్షాత్తు భగవంతుని శృంగారాన్ని వర్ణించింది. అందునా ఆమె కృష్ణభక్తురాలు. కనుక ఈ ప్రబంధాన్ని పారలౌకిక శృంగార ప్రబందంగా భావించవచ్చు. ఈ విధంగా కవయిత్రుల భావ వ్యక్తీకరణమే వారి కవితా దృక్పథంగా చూడవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష, - జి. నాగయ్య
2. ఆంధ్ర విదుషీమణులు - ఆంధ్ర శేషగిరిరావు
3. ప్రాచీనాంధ్ర కవయిత్రులు - స్త్రీ స్వభావ చిత్రణ, - ఆచార్య కె.సత్యోత్తమరావు
4. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం - డా.కడియాల రామ్మోమన్‌రాయ్
5. మాతృశ్రీ తరిగొండ వెంకగమాంబ కృతులు పరిశీలనము (సిద్ధాంతగ్రంథం) - ఆచార్య కె.జె.కృష్ణమూర్తి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కొండేపూడి నిర్మల 'హక్కు' కథానిక - పరిశీలన

- డా॥. జి. పార్వతి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఆధునిక తెలుగు సాహిత్యం అనేక సాహిత్య ఉద్య మాలకు, ధోరణులకూ, ప్రక్రియలకూ పురుడుపోసింది. అక్షర సొగసులకు, లక్షణ గ్రంథాల మర్యాదలకు కాకుండా వస్తువును మానవ జీవితానికి ఆధునిక సాహిత్యం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మానవ జీవితంలోని వైరుధ్యాల్ని చిత్రించే క్రమంలో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు సంభవించాయి. నవ్య సంప్రదాయ కవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం అనే ధోరణులే కాకుండా స్త్రీవాదం, దళితవాదాలు కూడా తోబుట్టువుల్లా పుట్టుకొచ్చాయి. తరువాత ముస్లిం మైనార్టీవాద సాహిత్యం కూడా నేనున్నానంటూ తలుపు తట్టింది. అయితే ఈ వర్తమాన సాహితీ ధోరణులు అన్నీ కూడా తొలినాళ్ళలో కవిత్వరూపంలో వచ్చాయి. ఆ తరువాతనే కథ, నవల వంటి ఇతర ప్రక్రియలతో పెన వేసుకున్నాయి. ఇప్పుడు మనం చెప్పుకున్న కవితా ధోరణుల్లో స్త్రీవాదానికి ప్రత్యేక స్థానం ఉంది. భూమి మీదన్న ప్రతి అవకాశంలోనే కాదు, ఆకాశంలో కూడా సగభాగం మా హక్కు అని స్త్రీవాద కవయిత్రులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. అలాంటి స్త్రీవాద రచయిత్రుల్లో ఒకరు శ్రీమతి కొండేపూడి నిర్మల.

స్త్రీవాదాన్ని తాత్వికంగా అధ్యయనం చేసిన అతికొద్ది మంది కవయిత్రుల్లో శ్రీమతి కొండేపూడి నిర్మల ఒకరు. స్త్రీవాదానికి సంబంధించి అనేక అంశాల్ని, ఆమె కవిత్వీ కరించారు. కొన్ని సంపుటాలుగా ప్రకటించారు. అసంఖ్యాకంగా కవితా ఖండికలు రాసినా అంతటితో ఆగక మరో పదునైన ప్రక్రియ అయిన కథ ప్రక్రియలో కూడా కొన్ని కథల్ని రచించారు. వాటిని ఒక సంపుటంగా ప్రచురించారు. ప్రక్రియ మారినా స్త్రీవాదానికి సంబం ధించిన అనేక అంశాలు కథల్లోనూ విశ్లేషించారు. ప్రస్తుత పరిశోధనాంశం అయిన శ్రీమతి కొండేపూడి నిర్మల గారి హక్కు కథానిక అనే అంశాన్ని విశదీకరించడానికి ఆమె రచించిన "శత్రుస్పర్శ" అనే కథాసంపుటి ఆధారం. 1980 తర్వాత స్త్రీల వెతలను చిత్రించే కథలు వేగాన్ని పుంజుకొని విరివిగా వచ్చిన కథా సంపుటాల్లో ఇది ఒకటి. పేరులోనే వెగటుగా అనిపించే "శత్రుస్పర్శ" కథాసంపుటిలో లోపించిన మానవ సంబంధాలను ప్రశ్నించడం తన హక్కుగా కొండేపూడి భావించారు. కుటుంబం, రాజ్యం, చట్టం, చరిత్ర ఎన్ని విధాలుగా స్త్రీలను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి అణచివేస్తుందో. ఆ అణచివేత ప్రయత్నాలే ఆత్మీయ సంబంధాలుగా ఎలా భ్రమపెడుతున్నాయో పరిశీలించాక వాటిని బద్దలు కొట్టడమే తన విధిగా ఆమె స్వీకరించారు. వీటన్నింటి ఫలితమే "శత్రుస్పర్శ" కథల సంపుటం. "శత్రుస్పర్శ" కథల సంపుటంలో అబద్ధం, మొద్దురాచిప్ప, అతనిభార్య, పురుగు, శత్రువు, వెలి, ఎద్దుపుండు, వాక్కు, పిన్ని, ముత్యమంత ముద్దు, అనౌచిత్యం, అమ్మకూచి హీరో, ఉష్ణపక్షి, జరీ అంచు తెల్లచీర, నరకంలో నాలుగు నిమిషాలు, ఫీనిక్స్, బ్రెక్ ది ఐస్, మిస్ ప్రమీల, మేరాభారత్ మహాన్, కిరాయి బతుకులు అని మొత్తం 20 కథానికలున్నాయి. ఈ కథానికుల్లోని విశిష్టమైన కథ 'హక్కు'. ఇందులో స్త్రీల హక్కులు ఎలా ఉన్నాయో? అవి ఎలా దుర్వినియోగం అవుతున్నాయో? పరిశీలిద్దాం.

జీవితానికి సంబంధించిన కొన్ని ప్రధాన విషయాల్లో నిర్ణయం తీసుకునే హక్కు స్త్రీకి లేకపోవడాన్ని చిత్రించిన కథ హక్కు. ఈ కథ మొత్తం కోర్టు హాలులోనే నడుస్తుంది. భారతీయ సాంస్కృతిక జీవనంలో వివాహ వ్యవస్థకు ఉత్కృష్ట స్థానం ఉంది. స్త్రీ పురుషులిద్దరూ తమ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి ఎన్నో ఊహలతో పెళ్ళి

అనే బంధంతో ఒకటవుతారు. అలాంటి భార్యాభర్తల మధ్య ''సర్దుబాటు'' కుదరనపుడు వారు విడాకుల గురించి ఆలోచిస్తారు. అయితే మన సమాజంలో పురుషుడు స్త్రీ నుండి విడిపోవడానికి చాలా తొందరగానే నిర్ణయం తీసుకొంటాడు. 'నిన్ను వదిలేస్తున్నా పో' అని సులభంగా అనేయగలడు. 'నా యింట్లో నుండి బయటకు పో' అనికూడా అనగలడు. కానీ స్త్రీ పురుషుడు అనేస్తంభాన్ని అల్లుకున్న తీగ. అంత సులభంగా ఆ మాటలు అనలేదు. కానీ భర్తతో సర్దుకోలేనపుడు ఆమె స్వతంత్రంగా జీవించాలని కోరుకోవడం ఆమె హక్కు అలాంటప్పుడు ఏ స్త్రీ అయినా ముందుకు వచ్చి విడాకులు కావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఆమె ఎగతాళికి గురికాబడటం ఈ 'హక్కు' కథలో మనం గమనించవచ్చు.

విడాకుల కేసులో న్యాయస్థానం ముందు నిలబడిన గంటా సరోజినిని 'ఇదెన్నో వాయిదా' అని న్యాయమూర్తి ప్రశ్నించింది. అందుకు సమాధానంగా సరోజిని 'మూడు' అని గొంతెత్తి గట్టిగా అరిచింది. అప్పుడు అక్కడ జరిగిన ఇతరుల సంభాషణల ద్వారా స్త్రీలకు సంబంధించిన అంశం ఎంత చులకనగా హేళన చేయబడుతుందో

కొండేపూడి విశ్లేషించారు. 'మూడు' అని సరోజిని గొంతెత్తి అరిచినపుడు 'మూడో నెలట్రోయ్' కారిడార్లో వున్న వాడెవడో కూశాడు. అలా అయినా ఆశ్చర్యం లేదు. 'ఈ ముండలకి యిటు కాపురమూ కావాలి, అటు భరణమూ కావాలి' అదే కేసు మీద ముద్దాయి తరపున వచ్చిన ఒక ముసలాయన అక్కసు వెళ్ల గక్కాడు.

''ఎందుకండీ ఈ కోర్టులు, ఆడాళ్లంతా పతివ్రతులైనట్టు వాళ్లవైపే మాట్లాడతాయి. వీళ్లు విడాకులు తీసుకున్నాకా యింకా పిల్లల్ని కంటూనే వున్నారు'' అన్నాడింకొకాయన.

''మొగుడే కావాలా పిల్లల్ని కంటానికి'' ఇంకెవరో, వెటకరించారు.

పై సంభాషణలను పరిశీలించినపుడు వీళ్ళంతా పురుషులు కాబట్టి స్త్రీల వెతలు అర్థం చేసుకోలేక పురుషాధిపత్య భావజాలం ప్రభావం వల్ల అవిధంగా వ్యాఖ్యానాలు చేసి ఉంటారని సరిపెట్టకోవచ్చు.

కానీ ఈ భావజాలం ఈ పితృస్వామ్య వ్యవస్థలలో స్త్రీలను కూడా ప్రభావితం చేస్తుంది. భర్త నుంచి ఎన్ని విధాలుగా హింసను భార్య ఎదుర్కొంటున్నా సాటి స్త్రీలు కూడా ఆ పీడలలోని స్వభావాన్ని ప్రశ్నించక పోవడం పురుషాధిపత్య వ్యవస్థలో ఒక భాగమే. పీడించే పురుషుణ్ణి ప్రశ్నించకుండా, హింసను భరించలేక విడాకులు కోరుకునే స్త్రీలను వేలెత్తి చూపడంలో స్త్రీలు కూడా పురుషులకు ఏమాత్రం వెనకాడక పోవడం పితృస్వామ్య వ్యవస్థ ఫలితమే. ఈ కథలో ఒక తల్లీ కూతుళ్ళ మధ్య జరిగిన సంభాషణ ఈ విషయాన్నే ధ్రువపరుస్తుంది.

''మన ఇంటా వంటా లేవు. దిక్కుమాలిన విడాకులు, దిక్కుమాలిన విడాకులని'' ఓ తల్లి కూతుర్ని నతాయిస్తోంది.

''ఏం చెయ్యమంటావే చావమంటావా నన్ను'' తల్లిమీద విరుచుకు పడింది కూతురు.

చావమని సైతం చెప్పాలనే ఉంది తల్లికి, చావుకి కారణం విడాకులని తెలీడం ఇష్టం లేదు. అంచేత మాట్లాడకుండా వూరుకుండిపోయింది.

స్త్రీలలో కూడా పురుషాధిపత్య భావజాలం ఎంత బలంగా స్థిరపడిందో పై సంభాషణలు నిరూపిస్తున్నాయి. పేగుబంధాన్ని కూడా తెంచుకొని కన్నబిడ్డకు సైతం చావమనైనా చెప్పడానికి ఆ కన్నతల్లి సిద్ధపడింది గాని, విడాకుల కోసం ప్రయత్నించడాన్ని తట్టుకోలేక పోయింది.

ఇదే కథలో మరో స్త్రీ తన మొగుడు స్థానంలో ఉన్న వ్యక్తి అసలు మగాడే కాదన్న కారణంగా విడాకుల కోసం కోర్టునాశ్రయించింది. ఇంతటి బలమైన కారణం కూడా మరో స్త్రీకి చాలా అల్పంగా కన్పించింది. ''కొట్టడంట - తిట్టడంట - తిండికి లోటు లేదంట. మొగోడు కాదంటుందనుకో - అయితే మటుకు అదొక బాధా! విడాకులిచ్చేంతా....'' అంటూ గళ్ల చీరను చూసి ఎర్రచీర గొణుక్కుంది.

కోర్టు హాలులో న్యాయమూర్తి స్థానంలో కూర్చున్న వ్యక్తి కూడా స్త్రీయే అయినప్పటికీ ఆమెకూడా చట్టప్రకారం వ్యవహరించవలసి రావడం వల్ల సరోజిని భర్త కోర్టు వాయిదాకు రాలేదన్న సాంకేతిక కారణం వల్ల మరో వాయిదా వేయక తప్పలేదు. సరోజిని తల్లి న్యాయమూర్తి కాళ్ళా వేళ్ళా పడింది. పచ్చి కడుపున పుడతానంది. మరోవాయిదా సెప్పొద్దని బతిమాలుకుంది. అయినా ఆమెకు వాయిదావేయక తప్పలేదు. చట్టం స్వభావమే పురుషపక్షంగా ఉందన్న వాస్తవాన్ని ఈ అంశం నిరూపిస్తుంది. ఆ స్త్రీ ఎంతో విద్యావంతురాలై న్యాయ మూర్తి స్థానాన్ని సైతం అందుకున్నప్పటికీ ఆమె కూడా పురుష భావజాల ప్రపంచంలో ఎదగడం వల్ల ఆమెలో కూడా ఆ భావజాలమే జీర్ణించుకొని పోయిందని కూడా ఈ ఘటన తెలియచేస్తుంది. ..

ఈ కథలో మొత్తం మూడు విడాకుల కేసులు కోర్టు ఆవరణలో ఉన్నాయి. కోటి ఆశలతో వివాహం చేసుకున్న ఆ వివాహితులు ముగ్గురు ఎంత నరకయాతన అనుభ వించకుంటే విడాకులు కోరుకోరు. భారతీయ సమాజంలో అందులోనూ హిందూనమాజంలో స్త్రీలు ఎంత సంప్రదాయ బద్ధంగా ఉంటారో అందరికీ తెలుసు. ప్రతి భారతీయ మహిళ వైవాహిక బంధాన్ని పవిత్ర బంధంగానే భావించి పెళ్ళిచేసుకుంటుంది. తన పుట్టుకతో ఏర్పడిన బంధాలు వదలుకొని 'వివాహ బంధం' అనే తంతుతో కొత్త బంధాల్ని ఏర్పరుచుకుంటుంది. ఆ బంధాల్లో ఇమడలేక విడాకులు కోరుకోక తప్పని పరిస్థితి. ఇంతటి పరస్థితికి మూలమైన వివాహ సందర్భంలో పురుషుడికి ఎంత విషవాహ స్వేచ్ఛ ఉంటుందో స్త్రీకి కూడా అంత వివాహ స్వేచ్ఛ అవసరం అని సమాజం గురిస్తే ఇలాంటి విడాకులు తీసుకొనే అవసరం రాదు. ఎందుకంటే వివాహానికి పూర్వం ఉన్న స్వేచ్ఛను. వివాహం తర్వాత కూడా స్త్రీ పురుషులిద్దరూ సమాన సమానం కోరు కుంటారు. సమానమైన అభిరుచులు కలిగిన స్త్రీ పురుషులైతే వైవాహిక జీవితం సజావుగా సాగుతుంది. భిన్న దృక్పథాలు కలిగిన దంపతులైతే జీవితంలో ఒడిదుడుకులు చవిచూడాల్సి వస్తుంది. వివాహ స్వేచ్ఛ స్త్రీకి ఒక్క హక్కు - ఆ హక్కును సరిగ్గా పాటిస్తే ఇంతటి సమస్యలు రావు.

ఈ కథలో గంటా సరోజిని విడాకులు కోసం కోర్టుకెళ్ళ న్యాయమూర్తి ఎన్నో వాయిదాలని అడిగినప్పుడు "మూడు" అని సమాధానం చెబుతుంది. ఆ సందర్భంలో ఎన్నిరకాల అవమానాలుకు గురి అవుతుందో మనం గుర్తించవచ్చు. పురుషుడు విడాకులు కోరితే అదేమి పట్టించుకొని జనం స్త్రీ విడాకులు కోరితే మాత్రం సవాలక్ష వ్యర్థమైన ఊహలతో ఆడిపోసుకుంటారు. అక్కడ పుట్టుకతో ప్రతిమానవుడు సమానం అని అంటూం. కానీ స్త్రీ పై వివక్ష చాలారూపాల్లో చూపబడుతుంది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 15 లింగ వివక్షతను నిషేధించింది. అయినా సరే ఆ హక్కు ఎన్ని వేలకోట్ల సార్లు దుర్వి నియోగం అయ్యిందో చెప్పాల్సిన అవసరం లేదు.

ఇదే హక్కు కథలో అత్తింటి అలుళ్ళు భరించలేక విడాకులు కోసం ప్రయత్నించి పుట్టింట్లో ఉంటే ఆ విషయాన్ని కన్నతల్లి కూడా జీర్ణించుకునే స్థితలో లేదంటే సమాజం ఎంత తీవ్రంగా ఆడవారి స్వేచ్ఛా హక్కును హరిస్తుందో మనం అర్థంచేసుకోవచ్చు. ఒక స్త్రీ విడాకులు కోరుకొని ఆమె స్వేచ్ఛగా జీవించాలనుకోవడం ఆమెహక్కు మరో కుటుంబాన్ని ఏర్పరచుకోవాలనుకోవడం కూడా ఆమె హక్కు మరో కుటుంబాన్ని ఏర్పరచు కోవాలను కోవడం కూడా ఆమె హక్కు ఇదే విషయాలను భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21 విశదీకరిస్తోంది. కానీ తన పుట్టిల్లు మాత్రం 'పరవు'ను గురించి ఆలోచిస్తుంది. సమాన, భయాన ఇలాంటి భయాలు ఆడవారికి పెట్టడం వల్ల వాళ్ళ హక్కులను ప్రశ్నించకుండా హరిస్తూ వాళ్ళను బానిసలుగా చేస్తున్నారనేది వాస్తవమైన విషయం.

వైవాహిక సంబంధాల విషయంలో స్త్రీకి తగిన స్వేచ్ఛ ఉండాలని స్త్రీవాదం చెపుతుంది. పురుషాధిపత్య

భావజాలం తమకనుగుణంగా వివాహ వ్యవస్థను రూపొందించుకుంది. అందుకే స్త్రీకి "విడాకులు అనేది కొన్నిసార్లు ప్రాణరక్షణ హక్కు" అని కొండేపూడి నిర్మల ఈ 'హక్కు' కథలో సరోజిని పాత్ర ద్వారా పలికించింది. పురుషాధి పత్య భావజాలాన్ని ఆ పాత్ర ద్వారా ధిక్కరించింది.

ఆధార గ్రంథాలు

1. శత్రుస్పర్శ (కథాసంపుటి) - కొండేపూడి నిర్మల
2. మానవ హక్కుల విద్య - రాజీవ్ విద్యామిషన్

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ 'కవితా! ఓ కవితా!' – భాషా వైదుష్యం

– డా॥. కూనము మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై .

ఆధునిక కవిత్వాన్ని అందులోనూ అభ్యుదయ కవిత్వాన్ని గురించి మాట్లాడేటప్పుడు శ్రీశ్రీ రాసిన కవితా! ఓ కవితా గురించి. మాట్లాడకుండా దాచెయ్యడానికి వీలుకాదు. దానిక్కారణం అది కవిత్వానికి సంబంధించిన కవిత, కవిత్వం ఏ విధంగా ఉండాలి అన్న అంశంమీద ప్రాచీన కవులు, ఆధునిక కవులు చాలామంది తమ తమ అభిప్రాయాలను రాశారు. అవన్నీ ఫ్యూడల్, బూర్జువా వర్గాలకు సంబంధించిన భావాలను ప్రతిబింబించేవి. వాళ్ళు ప్రతిపాదించిన కవితాగుణాల్లో ప్రజల పాత్ర లేదు. కేవలం సంపదకు, సంప్రదాయానికి మాత్రమే పెద్ద పీటవేశారు. అందుకు భిన్నంగా 'కవితా! ఓ కవితా పూర్తిగా వస్తువులోను, భాషలోను, శిల్పంలోను, ప్రయోగాల్లోను అత్యున్నతమయిన, అధునాతనమయిన పోకడలను పోయి ఆధునిక కవిత్వానికి - నిజానికి కవిత్వానికే ఒక లక్ష్యంగా నిలిచింది. అందుకని కవితా! ఓ కవితా!ను ఆధునిక మహాకావ్యంగా భావించవచ్చు. ఒక కావ్యానికుండవలసిన లక్షణాలన్నీ ఒకే కవితలో ఉండడమే దాని ప్రాశస్త్యానికి ప్రధాన కారణం. 'కవితా! ఓ కవితా'లో మానవ జీవితంలోని చీకటి కోణాలన్నిటినీ స్పృశించి, శ్రీశ్రీ కవికున్న విస్తారమయిన పరిధిని పేర్కొన్నాడు. 'కవిత్వ మొక తీరని దాహం' అన్నాడు శ్రీశ్రీ. ఆ దాహాన్ని తీర్చుకోడానికి ఆషామాషీ కవిత్వం రాస్తే కుదరదు. అందుకే సుదీర్ఘ కవితరాయాల్సి వచ్చింది. ఇది కేవలం సుదీర్ఘమయిన కవితేకాదు. కవిత్వానికి సంబంధించిన శ్రీశ్రీ అభిప్రాయాలన్నిటినీ పొందుపరచిన కవిత. కవిత్వానికి, శ్రీశ్రీకి ఉన్న అనుబంధాన్ని తెలియజేసే కవిత, కవిగా తన పరిణామాన్ని శ్రీశ్రీ తనకుతానుగా చెప్పుకొన్న కవిత. వచన కవితకు లక్ష్య లక్షణంగా నిలిచే కవిత. భారతీయ భాషల్లో తక్కాల కవితల్లో ఇలాంటిది లేదంటే అతిశయోక్తి కాదు. శ్రీశ్రీ భావ జాలానికి వ్యతిరేకమయిన కవులు కూడా ఈ కవితను కీర్తించడం విశేషం. 'కవితా! ఓ కవితా! అనే గేయం నిస్సందేహంగా అతడి గేయాల్లో ఉత్తమోత్తమం. కవితా రూప సాక్షాత్కారంలో అతడు అద్వితీయ ప్రతిభా పాటవాలను ప్రదర్శించాడు. నణుగుతూ గొణుగుతూ తన సహజ ధోరణిలోనే నవ్యసాహిత్య పరిషద్వేదిక మీద నిలబడి ఈ గేయాన్ని శ్రీశ్రీ చదివినప్పుడు కూడా సభాధ్యక్షుడైన విశ్వనాథ సత్యనారాయణ ఆర్ధనయనాలతో ఆమూలనుంచి ఈ మూలకు నడిచి కౌగిలించుకొని ప్రస్తుతించాడంటే ఈ గేయంలోని కవితాగుణాన్ని వేరే వ్యాఖ్యానించనక్కర్లేదు. ఎన్నడూ ఎవరినీ ఎందులోనూ సాటికపులను - ప్రశంసించే స్వభావంలేని విశ్వనాథ, చిల్లరమల్లర జనం మెప్పులను ఖాతరు చేయని వ్యక్తి. అటువంటివాడు ముగ్ధుడై తానే దీన్ని ప్రచురిస్తానంటూ నీవు పీఠిక రాయమని చలాన్ని కోరుతూ మరో ప్రసిద్ధకవి చింతా దీక్షితులద్వారా కబురు పెట్టడమే విడ్డూరం.

ఈ మహారచనలో శ్రీశ్రీ తనది అనితర సాధ్య మార్గమన్న మాటను దక్కించుకొన్నాడు' (మహాకవి శ్రీశ్రీ, బూదరాజు రాధాకృష్ణ). అందుకే శ్రీశ్రీ కవితల్లో ఇది విశిష్టమయిన కవితగా పేరుపొందింది. అదే సమయంలో ఈ కవితను అర్థం చేసుకోవడం కూడా కష్టమే. భిన్న భావాలు, దృక్పథాలు మిళితమయిన ఈ కవిత శిల్పం రీత్యా అత్యంత క్లిష్టమయింది. భావజాలం దృష్ట్యా అతి గాఢమయింది. అందువల్ల అటు శిల్పంలోనూ, ఇటు భావజాలంలోనూ శ్రీశ్రీ దృక్పథాన్ని అవగాహన చేసుకొంటే తప్ప ఈ కవితాభిప్రాయం అర్థంకాదు. శ్రీశ్రీ వస్తువుకు ఎంత విలువ ఇస్తాడో, అంతకన్నా ఎక్కువ విలువ శిల్పానికి - సౌందర్యానికి - సంవిధానానికి ఇస్తాడు.

కుక్కపిల్ల, అగ్గిపుల్ల లాంటి వస్తువులను కూడా కవితా వస్తువులను చెయ్యవచ్చునంటూనే, ఔనౌనను శిల్పమ నర్హం అంటాడు. ఈ కవితలో కూడా ప్రపంచంలో ఎన్ని కవితా వస్తువులున్నాయో చూపించడానికి మనల్ని ఆకాశానికి, పాతాళానికి తీసుకెళతాడు. సర్వం కవితా మయమే! ఇంత విస్తారమయిన కవితను అర్థం చేసుకోవడం, అర్థమయినదాన్ని వివరించడం సాధారణ మయిన విషయం కాదు. అందుకే మహాప్రస్థానంలోని ఇతర కవితలను గురించి వచ్చినంత విస్తారంగా విమర్శ దీనిపైన రాలేదు. విమర్శకులు ఈ కవితను స్పృశించ డానికే వెనుకాడే పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయులు ఈ కవితను బోధించడానికే జంకే స్థితి వచ్చింది. వస్తు వైవిధ్యానికి, బాషా వైదుష్యానికి, శైలీ విన్యాసానికి, ప్రయోగ వైశిష్ట్యానికి పెట్టింది పేరయిన ఈ కవితను వివరించడానికి పూనుకోవడం సాహసమే అవుతుంది. ప్రస్తుతం భాషా వైదుష్యానికి సంబంధించిన అంశాలను మాత్రం పరిశీలిద్దాం.

కవిత్వానికి భాషకు ఉండే అవినాభావ సంబంధం గురించి ఎప్పటినుంచో చర్చ జరుగుతోంది. కవిత్వానికి బాష మాధ్యమం. ఆ మాధ్యమం ఎంత పటిష్టంగా, అందంగా ఉంటే కవిత్వం అంత మనోరంజకంగా ఉం టుంది. అందుకనే కవిత్వం అనగానే అందులోని భాషను గురించిన ప్రస్తావన వస్తుంది. కవితాశైలి, వస్తువు అన్నీ భాషమీదే ఆధారపడి ఉంటాయి. కాబట్టి కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు అందులో ఉపయోగించిన భాషను విశ్లేషించడం అనివార్యం. భాషను విశ్లేషించడం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి - కవిత్వంలో ఉప యోగించిన భాషలోని ధ్వనులను, పదాలను, వాక్యాలను విశ్లేషించడం. ఇది పూర్తిగా బాషాశాస్త్ర పరిధిలో జరిగే పని. రెండు-కవిత్వంలో ఉపయోగించిన ప్రయోగాలను గురించి విశ్లేషించడం. ఇది భాషాశాస్త్ర పరిధిలోనే జరుగుతూ అంతకుమించిన ప్రయోజనం సాధిస్తుంది. కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు దీన్నే పరిగణనలోకి తీసుకోవాలి.

కవిత్వ భాష

కవిత్వానికి భాషకు అవినాభావ సంబంధం ఉందని తేలిన తరువాత, కవిత్వానికి ప్రత్యేకంగా భాష ఉంటుందా? అన్న ప్రశ్న మొలకెత్తుతుంది. భాషలో ప్రధానాంశం దాని కూర్పు. కూర్పును బట్టే భాషకు ప్రత్యేకత ఏర్పడుతుంది. ఆ కూర్పే సాధారణ భాషకూ, కవిత్వ భాషకూ ఉండే భేదాన్ని తెలియజేస్తుంది. సాధారణభాషలో లేని కూర్పు కవిత్వ భాషలో ఉంటుంది. వాక్య నిర్మాణంగానీ, ప్రయోగాలుగానీ కవిత్వ భాషలో భిన్నంగా ఉంటాయి. సాధారణ భాషకు అలాంటి ప్రత్యేకత ఉండదు. ఈ కూర్పు ప్రయోగం వ్యక్తిగతంగా కూడా ప్రత్యేకతను కలిగి ఉంటుంది. అందుకనే ఒక్కొక్కరి భాష ఒక్కో విధంగా ఉంటుందని అంటారు. అలాగే కవిత్వ భాషకూడా భిన్నంగా ఉంటుంది. కవిత్వానికి ఉపయోగించే భాషా నియమాలు సాధారణ భాషలో ఉండే నియమాలకన్నా భిన్నంగా ఉంటాయి. భాష ప్రాథమిక ప్రయోజనం భావ వ్యక్తీకరణ. భావ వ్యక్తీకరణకు ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. అయినా వాటికన్నా భాష స్పష్టంగా నిర్దిష్టంగా సమగ్రంగా భావాన్ని వ్యక్తం చేయగలుగుతుందన్న అభిప్రాయంతో విషయ వివరణకు భాషను మాధ్యమంగా ఉపయోగిస్తున్నాం. అయితే కవిత్వ భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే పరిమితమయింది కాదు. అది భావావేశ వ్యక్తీకరణకు సంబంధించింది. ఆ భావావేశం పాఠకుల్ని/శ్రోతల్ని ఆకర్షిం చాలి. అలా ఆకర్షించేదే కవిత్వం. అందుకనే వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు. రసాత్మకంగా ఉండే భాషే కవిత్వ భాష, రసాత్మంకాని భాష సాధారణ భాష, సాధారణ విషయాలను చెప్పడానికి రసాత్మకత అవసరం లేదు. ప్రత్యేక విషయాలను చెప్పడానికి మాత్రమే రసాత్మకత అవసరం.

అందుకనే ఒక విషయాన్ని ఒక వ్యాసంలో సాధారణంగా చెబితే అందులోని భాష సాధారణంగా ఉంటుంది. అదే విషయాన్ని కవిత్వీకరిస్తే అందులోని భాష ప్రత్యేకంగా ఉటుంది. అందుకని కవిత్వభాష సాధారణ భాషకన్నా ప్రత్యేకమయింది. అంతేకాకుండా మామూలు పదాలనే కవిత్వంలో కొత్త స్ఫూర్తితో ఉపయోగిస్తే అవి కొత్త అర్థాలను ఇస్తాయి. ఇలాంటి స్ఫూర్తిని కలిగించడంవల్లే కవిత్వాన్ని ఎవరి మనోభావాలకు తగినట్లు వాళ్ళు అర్థంచేసుకొనే అవకాశం ఉంది. అదే సాధారణ భాషలో అయితే అలాంటి అవకాశం లేదు. చెప్పేవాళ్ళు ఏ ఉద్దేశాన్ని నిర్దేశించాలనుకొన్నారో ఆ ఉద్దేశ్యాన్నే వినేవాళ్ళు కూడా గ్రహిస్తారు. కానీ కవిత్వంలో అలా కాదు కవి ఉద్దేశించిన అర్థాన్నే పాఠకులు గ్రహించవలసిన అవసరం లేదు. దానిక్కారణం దాని సృష్టి జరిపిన తీరే. నిజానికి కవిత్వ భాషనేది ప్రత్యేకంగా ఎక్కడినుంచోరాదు. సాధారణ భాషనుంచే కవిత్వ భాష తయారవుతుంది. ఆ పరిణామ క్రమం ప్రత్యేకంగా ఉంటుంది. కవిత్వ భాషలో ప్రతీకలు - ధ్వనులు ఎక్కువగా ఉంటాయి. ఒక విషయాన్ని చెప్పడానికి ఆ విషయాన్ని నిర్దేశించే మాటను కాక వేరే మాటను ఉపయోగించి అదే అర్థాన్ని స్ఫురింపజేయడం కవిత్వ భాషకుండే ప్రత్యేకత. శ్రీశ్రీ కవిత్వంలో ఇలాంటి ప్రయోగాలు చాలా కనిపిస్తాయి. వాటికున్న సాధారణ అర్థాలువేరు. శ్రీశ్రీ కవిత్వంలో అవి ధ్వనించే అర్థాలు వేరు. యముని మహిషపు లోహ ఘంటలు అన్న మాటకు సాధారణార్థం వేరు. శ్రీశ్రీ తన కవిత్వంలో ఉద్దేశించిన అర్థం వేరు. 'కవితా! ఓ కవితా!'లో ఇలాంటి ధ్వన్యార్థాలిచ్చే ప్రయోగాలు అనేకం ఉన్నాయి.

నిఘంటువు - వ్యాకరణం - ఛందస్సు

భాషను నిర్దేశించే ప్రధానమయిన అంశాలు నిఘంటువు, వ్యాకరణం, ఛందస్సు. కవి తన భావావేశాన్ని వ్యక్తీకరించడానికి భాషను యథేచ్ఛగా ఉపయోగించడానికి ఇవి అడ్డుతగులుతూ ఉంటాయి. అందువల్లే శ్రీశ్రీ వీటిని సంస్కరించాలన్నాడు. తన కవిత్వంలో ఆ పనిచేశాడు. నిఘంటువులను శ్మశానాలని, వ్యాకరణాన్ని సంకెళ్ళని, ఛందస్సును సర్పపరిష్వంగమని నిరసించాడు. అలాగని శ్రీశ్రీ, నిఘంటువుల్లోని పదాలను ఉపయోగించలేదని అర్థంకాదు. వ్యాకరణ విరుద్ధంగా రాస్తాడన్న అభిప్రాయం కాదు. ఆయనకు ఛందస్సు తెలియదనీ కాదు. అయితే అవేవీ తన కవితకు, భావావేశానికి, బాషా ప్రయోగానికి అడ్డురాకుండా చూసుకొన్నాడు. అదే ఆయన వాటిపైన సాధించిన విజయం. కవితా! ఓ కవితా!లో ఈ మూడింటికి అతీతంగా కనిపించే పదజాలం చాలా కనిపిస్తాయి. వాటిని మూడురకాలుగా విభజించవచ్చు.

అగ్నిసరస్సున వికసించిన వజ్రం అనే ప్రయోగం నిఘంటువుల్లో కనిపించదు. అగ్ని, సరస్సు, వికసించు, వజ్రం అనే మాటలు కనిపించినా ఈ మొత్తం ప్రయోగం కనిపించదు. ఈ పదాలకున్న అర్థాలను సంయోజనచేసి చూసినా శ్రీశ్రీ ఉద్దేశించిన అర్థం రాదు. ఇది ప్రతీకాత్మకంగా చేసిన ప్రయోగం. అగ్నిసరస్సు శ్రమకు, వజ్రం సంపదకు ప్రతీకలు. ఇది శ్రీశ్రీ మనఃప్రపంచాన్ని ఎరిగిన వ్యాఖ్యాత ఊహించినదే తప్ప నిఘంటువులద్వారా సాధించిన అర్థంకాదు. అలాగే మనస్సినీవాలి అనే ప్రయోగం లోకవ్యవహారంలో కనిపించదు. నిఘంటువుల్లో మాత్రమే కనిపిస్తుంది. వ్యవహారంలో లేని పదం మృతప్రాయమే. దానికి నిఘంటు అర్థాన్నికాక కొత్త అర్థాన్ని కల్పించి. జీవం పోశాడు శ్రీశ్రీ. కొన్ని పదాలు నిఘంటువుల్లో ఉన్నా కొత్త భావాలను సృష్టించడం కోసం వాటిని పునఃసృష్టిస్తాడు కవి. సమాజంలో ఏర్పడ్డ కొత్త భావనలను వ్యక్తం చేయడానికి ఇలాంటి ప్రయోగాలు పనికివస్తాయి. కవితా! ఓ కవితాలోని వైద్యశాల, శస్త్రకారుని, సమ్మె, తిరుగుబాటు మొదలయినవి ఇలాంటివే.

వెలువడినై, పరుగిడినై, అడుగిడినైలాంటి మాండలిక వ్యవహార రూపాలు సంప్రదాయ వ్యాకరణానికి లొంగనివి.

అయితే శ్రీశ్రీ ప్రయోగాలన్నీ వ్యాకరణ విరుద్ధాలు కావు. ఆయన తన వ్యక్తీకరణకు అడ్డురానంతవరకూ వ్యాకరణాన్ని ఉల్లంఘించరు. గురుత్పరిరంభం, మనఃప్రపంచపు టావర్తాలు, మనస్సినీవాలి మొదలయిన ప్రయోగాలు వ్యాకరణం తెలియని వాళ్ళు చెయ్యలేరు. వ్యాకరణాన్ని వ్యతిరేకించేవాళ్ళు చెయ్యరు. సంప్రదాయ వ్యాకరణాన్ని తనకు కావలసినంతవరకూ అంగీకరించిన శ్రీశ్రీ కొత్త వ్యాకరణ సంప్రదాయాలను కూడా సృష్టించాడు. నడిరేయాకస మావర్తించిన, మేఘాలావర్తించిన, ప్రచండ ఝంఝూ ప్రభంజనం గజగజలాడించిన, నడిసంద్రపు కెరటాల్లో మ్రోగిన, శంఖారావం ఢంకాధ్వానం అన్న వాక్యంలో విశేషణాలన్నీ ప్రత్యేక వాక్యాలుగా కనిపిస్తాయి. ఇలాంటి వాక్య నిర్మాణం కొత్తగా సృష్టించిందే. ఛందస్సును ఎలా నడిపించాలో బాగా తెలిసిన కవి శ్రీశ్రీ. అయితే ఆ ఛందస్సును సర్వపరిష్వంగం అనడం కేవలం తనకోసం కాదు. మొత్తం కవిత్వాన్ని ఆ బంధం నుంచి విముక్తి చెయ్యడానికే. ఛందస్సును తాను బంధించి తనకు కావలసిన రీతిలో కదం తొక్కించినవాడు శ్రీశ్రీ. లయకోసం, గతికోసం, వేగంకోసం ఛందస్సు ఉపయోగపడుతుంది. పద్యాలు వేగంగా లయాన్వితమై నడవడానికి కారణం ఛందస్సే. అయితే శ్రీశ్రీ ఛందస్సును తనకు అనుకూలంగా మార్చుకొని కొన్నిసార్లు, ఛందోరహితంగా కొన్నిసార్లు అంతేవేగాన్ని, లయను సాధించాడు. కవితా! ఓకవితా! వచన కవిత అయినప్పటికీ పద్యంకన్నా, గేయంకన్నా ఎక్కువవేగంతో నడుస్తుంది. ఈ కవితను ఏదో ఒక ఛందస్సులో ఇరికించి చూడ్డం కుదరదు. ఎక్కువ భాగం చతురస్రగతిలో నడుస్తుంది. అదీ అన్ని పాదాలూ సమానంగా ఉండవు.

"మరినిన్ను స్మరిస్తే
నాకగుపించే దృశ్యాలా
వినిపించే భాష్యాల
అగ్నిసరస్సున వికసించిన వజ్రం
ఎగిరే లోహశ్యేనం
ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం"

(మహాప్రస్థానం - పుట:66)

ఈ పాదాల్లో మాత్రలు సమానంగా లేవు. అయినా ఛందోబద్ధంగా ఉన్నట్లు కనిపిస్తుంది. దానిక్కారణం లయ. మరికొన్నిచోట ఒకే వాక్యాన్ని రెండు - మూడు పాదాలుగా విరిచి ప్రదర్శించడంద్వారా వేగాన్ని సాధిస్తాడు.

1. "అపుడే ప్రసవించిన శిశువు నెడద నిడుకొని
రుచిర స్వప్నాలను కాంచే
జవరాలి మనఃప్రపంచపు టావర్తాలు
2. శిశువు చిత్ర నిద్రలో
ప్రాచీన స్మృతులూచే చప్పుడు
3. వైద్యశాలలో
శస్త్రకారుని మహేంద్రజాలంలో
చావుబ్రదుకుల సంధ్యాకాలంలో
కన్నులు మూసిన రోగార్తుని రక్తనాళ సంస్పందన
4. కాలువ నీళులలో జారిపడి
కదలనైనా చాలని
త్రాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన
ప్రేలాపన!"

(మహాప్రస్థానం, పుట:66-67)

ఇవన్నీ ఏకవాక్యాలే. కానీ వాటిని విరిచి అనేక పాదాలుగా చేసి వాటి వేగాన్ని పెంచాడు. లయాన్వితం చేశాడు. ఛందస్సువల్ల జరగవలసిన పనిని శైలిద్వారా సాధించాడు. ఇలా నిఘంటు, వ్యాకరణ, ఛందస్సులను శ్రీశ్రీ తన ఇష్టానుసారంగా ఉపయోగించుకొని సంప్రదాయాల దృష్టిలో వీటి వ్యతిరేకిగా కాక ప్రౌఢకవిగా పేరుపొందాడు. తెలిసి మార్పుచేస్తే ప్రౌఢకవి. అలాంటి కవుల ప్రయోగం గ్రాహ్యం-సమ్మతం. శ్రీశ్రీ భాషకు ఆ గౌరవం దక్కింది.

ఆధార గ్రంథాలు

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
2. 'కవితా! ఓ కవితా' - భాషాశైలి - ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం. - మానమ మునిరత్నం, మద్రాసు విశ్వవిద్యాలయం,2004.
3. కవితా! ఓ కవితా, వస్తువు - భాష- శైలి - మాడభూషి సంపత్ కుమార్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
4. తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు, సి.పి.బ్రౌన్, ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీసస్, చెన్నై, 2005.
5. సాహిత్యం - వాస్తవికత: మార్క్సిస్టు దృక్పథం, వై.విజయకుమార్, శ్రీశ్రీ స్మారకసంస్థ, హైదరాబాద్, 1986.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కథా నేపథ్యంగా తెలుగుభాష – సంస్కృతి – ప్రపంచీకరణ ప్రభావం

– డా॥. వి. శాంతిలక్ష్మి, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగుళూరు, కర్నాటక.

మూడు దశాబ్దాల కాలం నాటి మన చుట్టూ ఉన్న ప్రజాజీవన సరళికి, నేటి జీవన విధానానికి ఉన్న తేడాను పరిశీలించి చూస్తే రెంటికీ మధ్య వ్యత్యాసం స్పష్టంగా అర్థమవుతుంది. వేషభాషలూ, ఆహారపు అలవాట్లు, విద్యావిధానం మొదలైనవి తమతమ స్వాభావిక రూపాల్ని మార్చుకుంటూ నాగరికత వైపు దృష్టి పెట్టి సంపదలపై, సౌఖ్యాలపై మనిషిని ప్రేరేపిస్తున్న ప్రపంచీకరణ తెలుగు సమాజాన్ని ఆక్రమిస్తూ దేశీయమైన జీవనంలో ప్రతి అంశాన్ని విదేశీయం చేసే ప్రయత్నాలను ప్రజలకు తెలియచెప్పే దిశగా తెలుగు కథానికా రచయితలు స్వచ్ఛందంగా కృషి చేస్తున్నారు.

ఆంగ్లం ద్వారా మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా ఉద్యోగాల్ని సంపాదించుకోగలం అనే ఉద్దేశంలో ఆంగ్లభాష పట్ల మక్కువ చూపించడం ప్రారంభమయింది. ఇతర భాషలపై మక్కువ పెంచుకోవడం తప్పుకాకపోయినా మాతృభాషను పూర్తిగా విస్మరించడం తప్పు. దీనికి తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా కనిపిస్తుండడాన్ని రచయితలు తమ కథల్లో చూపించారు.

పిల్లలు పుట్టీపుట్టగానే వాళ్లని ఎక్కడ చదివించాలో, ఏమి చదివించాలో తల్లిదండ్రులు ఊహించేసుకుని అందుకు తగ్గట్టు మాటలు వచ్చీరాకముందునుంచే ఇతర భాషల్ని బలవంతాన పిల్లల నెత్తిన రుద్దుతున్నారు. మాతృభాషను మృతభాషగా చేసి పిల్లలను పాశ్చాత్య వ్యామోహంలో పెంచి తీరా వారు పెద్దవాళ్లయిన తర్వాత మన సంస్కారం అబ్బలేదని బాధపడ్డంలో అర్థం లేదు. ముందు తరాలకు మన సంస్కారం తెలియాలంటే ముఖ్యంగా వాళ్ళకి మన భాషను నేర్పాలి. ఒకప్పుడు వ్యాఖ్యాలలో ఎప్పుడయినా ఆంగ్ల పదాలు రాయవలసి వస్తే బ్రాకెట్లో తెలుగులో అర్థం రాసేవారు కానిప్పుడు అది తారుమారు అయింది. తెలుగు పదాలకే బ్రాకెట్లో ఆంగ్లంలో అర్థాలు కనిపిస్తున్నాయి. అంతగా నేటి తెలుగు సమాజం మాతృభాషకు దూరం అయింది. అవుతోంది. ఈ విషయాన్ని కొన్ని కథల ఆధారంగా తెలియపరిచే ప్రయత్నం చేస్తున్నాను.

తెలుగు కథలలో ఆంగ్లభాష :

తెలుగు కథల్లో, అందుకు వాడుతున్న వాక్య నిర్మాణంలో తెలుగు భాషతో సమానంగా స్థానం ఏర్పరచుకుని మిళితమై ఉన్న ఆంగ్లభాషను ఏ విధంగానూ వేరుచేయలేని పరిస్థితులను ఈ క్రింది కథల్లోని సంభాషణల వాఖ్యాలు నిరూపిస్తున్నాయి.

టింకూ ఇన్ టెక్సాస్ :

"ఇండియా అంటే బోర్ అండ్ డర్టీ డాడ్" (పేజీ - 18)

"డాడ్, డొంట్ సే లైక్ దట్. హీ ఈస్ మై బెస్ట్ ఫ్రెండ్ ఎవర్" (పేజీ - 19)

"లుక్ టింటూ నువ్వు ఇక్కడకు వచ్చి అయిదేళ్లయింది. ఇండియాలో నీకు అమ్మమ్మ, తాతయ్య, నానమ్మ, పిన్ని, బోలెడంత మంది అక్కలు, అన్నలు ఉన్నారు. హైదరాబాద్‌లో సమ్మర్ బ్రహ్మాండంగా ఎంజాయ్ చేయొచ్చు. యు నో, ఇపుడు హైదరాబాద్ కంప్లీట్లీ చేంజ్డ్. నువ్వు ఇక్కడ చూస్తోన్న హారీపోటర్, షైక్-టూ, స్పైడర్ మాన్-2 అవన్నీ అక్కడ కూడా చూడవచ్చు. అక్కడ మన ఇంట్లో కంప్యూటర్ ఉంది. నీకిష్టమైన వీడియో గేమ్స్ ఆడుకోవచ్చు. చక్కగా నాతో రోజూ ఆన్‌లైన్‌లో చాట్ చేయొచ్చు" (పేజీ - 19).

ఈ పై సంభాషణ టింకూ అనే ఆరేళ్ల కుర్రాడు వాడి నాన్న ఆనంద్ లది. అమెరికాలో స్థిరపడిన తెలుగువారి

జీవన సరళి, వారి పిల్లల మనస్తత్వం, భాష, సంస్కృతి తెలియజేస్తోంది.

స్నో స్టార్మ్ :

"నీకు సెలవు కాదూ, నా స్కూల్‌కి సెలవు ఇచ్చుతుంది నా ప్రిన్సిపాల్ (పేజీ - 24)

ఇది న్యూయార్క్‌లో ఐదవ తరగతి చదువుతున్న ప్రీతి తెలుగు పాండిత్య ప్రదర్శన.

"యా, నో నీడ్ టూ ఫినిష్ మై హోంవర్క్ ఫర్ టుమారో" (పేజీ - 24)

తెలుగు నేర్చుకునే అవకాశమూ, అవసరమూ కలగని ఒకటో తరగతి చదువుతున్న ప్రీతి తమ్ముడు చేతన్.

పే పాల్ :

"కాష్ ట్రాన్సాక్షన్... వెస్ట్రన్ యూనియన్ కంపెనీ ద్వారా" (పేజీ - 42)

"నువ్వు కస్టమర్లకు సాఫ్ట్‌వేర్ సీడిలు షిప్ చేసినట్లు" (పేజీ - 45)

"ఫ్రాడ్ చేసి" (పేజీ - 45)

"సంపాదించడానికి ట్రై చేసింది" (పేజీ - 45)

గీతాభవనమ్ :

"ఒక ప్రక్కగా టీ.వీ., కంప్యూటరూ, సోఫాసెట్, చిన్న కిచెన్, డైనింగ్ టేబుల్" (పేజీ - 49)

"ఓల్డేజీ హోం మేనేజరు చేసిన ఎడ్వర్టైజ్‌మెంట్" (పేజీ - 49)

అమెరికాలో అద్దె కొంప :

"గేస్ రేంజ్, రొట్టెలు బేక్ చేయటానికి అవెన్, వంట పాత్రలు కడగటానికి స్టెయిన్‌లెస్ సింక్, కుకింగ్ రేంజి ప్రక్కన ఫ్రిజ్, లివింగ్‌రూము, బెడ్ రూము, ఫర్నీచర్" (పేజీ - 54)

"కంగ్రాట్యూటేషన్స్ డాక్టర్! యూ హిట్ ద టిక్కెట్" (పేజీ - 55)

"థాంక్యూ టామ్ లుకింగ్ ఫార్వర్డ్ టు సీయు" (పేజీ - 57)

"మిస్టరీ ఆఫ్ ఎ మిస్సింగ్ బుక్" (పేజీ - 57)

"మిస్టరీ ఆఫ్ ఫస్ట్ వరల్డ్ వార్" (పేజీ - 57)

మంచు కురిసిన రాత్రి :

"టెస్ట్‌కి ప్రిపేర్ అవ్వాలి"

"ఆఫీస్ పని, కాలేజ్ కోర్స్ రెండు కలిసి టాక్సింగ్‌గా ఉంది".

"వెకేషన్",

"ఎసైన్మెంటు టైంకివ్వకపోతే ఇంకొన్ని మార్క్స్ పోతాయి. దాంతో ఓవరాల్ గ్రేడ్ తగ్గుతుంది" (పేజీ - 59)

"ఐయామ్ నాట్ ఓకే! ఐయామ్ డైయింగ్ హియర్. ప్లీజ్ హెల్ప్ మీ.. ప్లీజ్... ప్లీజ్",

"మై ఫుట్ గట్ స్టక్ ఇన్ హయర్, మై కార్ కీస్ ఆర్ అండర్ కార్.... ప్లీజ్ హెల్ప్ మీ...",

"ప్లీజ్.. ప్లీజ్ స్టాప్! ప్లీజ్ స్టాప్! ఐయామ్ నాట్ గోయింగ్ టు హర్ట్ యూ. ఐ డోంట్ హావ్ ఎ గన్, ఐ జస్ట్ వాంట్ టూ థాంక్ యూ" (పేజీ - 68)

"ఓకే మాన్! టేక్ కేర్!",

"కమాన్ కేట్, వి బెటర్ గెట్ గోయింగ్" (పేజీ - 68)

అంటు - అత్తగారు :

"ఫ్రిజ్‌లో మామూలుగా మనుషులు తినే పదార్థాలు మాయమవుతాయి. వాటికి బదులు కోడిగుడ్డు. కుక్క గోడుగులు, చీజులు, సలామీలు, బర్గర్లూ, బలోనీలు లాంటి పదార్థాలతో ఫ్రిజ్ నిండిపోతుంది" (పేజీ - 91)

"వై ఆర్ యూ డంపింగ్ దట్ సూప్? డిడ్ ఐ డూ సమ్ థింగ్ రాంగ్" (పేజీ - 92)

కల ఇదనీ నిజమిదనీ తెలియదులే :

"ప్లేను దిగగానే పెద్దలైనులు, క్యూలు ఏమీ లేవిక్కడ. చాలా అడ్వాన్స్‌డ్. వీళ్ళు వీసా ఇచ్చినపుడు పాస్‌పోర్టులో కాగితం అతికించారే దాంట్లోనే మైక్రోచిప్ ఉంటుందిట, ప్లేను దిగుతుండగానే అది వాళ్ళు కంప్యూటర్లతో స్కాన్ చేసేసి మళ్లీ అపకుండా పంపించేస్తారు".

"వాళ్లే క్వార్టర్స్ ఇస్తారు. రాత్రికి మళ్లీ ఈమెయిల్ చేస్తాను" (పేజీ - 96)

ఫిష్ దట్ గాట్ అవే :

"డాడ్, నువ్వే పెద్ద న్యూరాలజిస్టువు, మేబీ, యూ నీడ్ టూ స్పెండ్ మోర్ టైం ఇన్ ద హాస్పిటల్" (పేజీ - 110)

"డాడ్, ఎడాప్ట్ ఎనదర్ గర్ల్ బై మై టెన్త్ బర్త్‌డే" (పేజీ - 111)

గగ్గుళ్లమ్మ గుడి :

"విమానం ఎక్కి అమెరికా వెళ్ళాలి అంటూ ఫ్లాష్ బాక్‌లో చెపుతున్నాడు" (పేజీ - 112)

"గుడిలో దేవుడి బదులు ఒక శక్తివంతమైన, వాయిస్ ఇంటర్ఫేస్ ఉన్న మాట్లాడగలిగే కంప్యూటర్, వైర్లెస్ నెట్‌వర్క్ పెట్టారు" (పేజీ - 116)

ఉపసంహారం :

అన్ని కథల్లోని ఈ వాక్యాలద్వార భాష, సంస్కృతి, అభివృద్ధి చెందిన, చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న, మారకతప్పని పరిస్థితులను తెలియ చేస్తున్నాయి. తెలుగు భాషా సంస్కృతులు, ప్రాచీనత, ప్రపంచీ కరణ వల్ల తెలుగు భాషకు సాంకేతిక విస్తృతి పెరగడాన్ని, గూగుల్ సదుపాయాలను, సాంకేతికంగా భాష పెరుగు తున్నా స్థానికంగా ప్రజల నిర్లక్ష్యానికి గురికాబడుతున్న వైనం గుర్తించడమైనది. తెలుగులో మాట్లాడితే నామోషీ అనుకునే పరిస్థితి నేడు దేశంలో నెలకొంది. తమ పిల్లల స్కూలు మెట్లు ఎక్కిన మొదటి రోజునుండే ఇంగ్లీషులో మాట్లాడాలనే తపన నేటి తల్లి దండ్రులలో కనిపిస్తుంది.

ఆధార గ్రంథ సూచి :

1. టింకూ ఇన్ టెక్సాస్ : కల్పన రెంటాల : అమెరికా తెలుగు కథానిక - 2006.
2. స్నో స్టార్మ్ : డా॥. వేద : అమెరికా తెలుగు కథానిక - 2006.
3. పే పాల్ : కె. వి. గిరిధరరావు : అమెరికా తెలుగు కథానిక - 2006.
4. గీతాభవనమ్ : కొమరవోలు సరోజ : అమెరికా తెలుగు కథానిక - 2006.
5. అమెరికాలో అద్దెకొంప : డా॥. గవరసాన సత్యనారాయణ : అమెరికా తెలుగు కథానిక - 2006.
6. మంచు కురిసిన రాత్రి : సుందరశ్రీ దువ్వూరి : అమెరికా తెలుగు కథానిక - 2006.
7. అంటు - అత్తగారు : వేలూరి వేంకటేశ్వరరావు : అమెరికా తెలుగు కథానిక - 2006.
8. కల ఇదనీ నిజమిదనీ తెలియదులే : శ్రీనాథ్ జొన్నవిత్తుల : అమెరికా తెలుగు కథానిక.
9. ఫిష్ దట్ గాట్ అవే : విప్లవ్ : అమెరికా తెలుగు కథానిక - 2006.
10. గగ్గుళ్లమ్మ గుడి : మహేష్ శనగల : అమెరికా తెలుగు కథానిక - 2006.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ వెతలే... కథలై - సమాలోచనం

- ఐ. సునీత, అసోసియేట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ.

తెలంగాణ అన్న పదమే ఉద్యమాలకు స్ఫూర్తి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం అన్నది భౌగోళికంగా రెండు ప్రాంతాల మధ్య గీసే గీతలు కావు దీనిలో ఎన్నో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు ఇమిడి ఉన్నవి.

తెలంగాణలోని ప్రజలు స్వరాష్ట్రం సాధించుకునేందుకు పలు రకాలుగా వారి ఆకాంక్ష ను తెలియజేస్తూ నిరాహార దీక్షలు, బందులు, ర్యాలీలు, ధర్నాలు, సకలజనుల సమ్మె మొదలగు కార్యక్రమాలు చేపట్టారు. ఇంకా రోడ్లపై వంటా-వార్పు, ఆట పాట లాంటి వినూత్నమైన ప్రక్రియల ద్వారా ప్రభుత్వానికి తమ నిరసనను వ్యక్తం చేశారు.

స్త్రీలలో ఉద్యమ స్ఫూర్తిని అధికం చేయడానికి స్త్రీల భాగస్వామ్యం ఉండాలన్న ఆలోచనతో "తెలంగాణ జన జీవన నేపథ్యం తెలంగాణ ఉద్యమ నేపథ్యం" అనే అంశంపై పేపర్ ప్రకటనల ద్వారా, ఫోన్ల ద్వారా, ఈమెయిల్ ద్వారా రచయిత్రుల నుండి కథలను ఆహ్వానించడం జరిగింది. ఇలా రచయిత్రులు వ్రాసి పంపించిన కథలే "తెలంగాణ వెతలే.. కథలై" అనే రచయిత్రుల కథాసంకలనంగా వెలువడింది. ఈ సంకలనానికి ప్రముఖ రచయిత్రులు (కవయిత్రులు) అమృతలత గారు, అనిశెట్టి రజిత గారు, తుర్లపాటి లక్ష్మీ గారు, కిరణ్ బాలా గారు సంపాదకత్వం వహించారు. ఇందులో 56 కథలున్నాయి.

తెలంగాణ ప్రజల్లో అణువణువునా నిండి ఉన్న రాష్ట్ర కాంక్ష సఫలం చేసుకొనుటకు చేస్తున్న ఉద్యమానికి మేము సైతం అండగా నిలుస్తామని రచయిత్రులు తమ కథల ద్వారా తెలిపారు.

అసలు తెలంగాణ ప్రాంతంలో కథా రచయిత్రులు ఎక్కడున్నారు? ఎవరున్నారు? అని ప్రశ్నించిన వారికి సమాధానంగా ఈ చారిత్రక ఉద్యమ సందర్భంలో దాదాపు 60 మందికి పైగా కథా రచయిత్రులు ముందుకొచ్చారు. సంక్షోభంలో కూరుకుపోయిన తెలంగాణ ప్రజల జీవన నేపథ్యాన్ని ఆవిష్కరించడంలో రచయిత్రులు సఫలం అయ్యారు.

తెలంగాణ రాష్ట్ర పోరాటం తెలంగాణ రచయితలకు, కవులకు, కళాకారులకు ఎంతో ప్రేరణ ఇచ్చింది . అస్తిత్వ పోరాటాలు చాలా మందితో కలం పట్టించాయి. ఆ నేపథ్యంలోనే ఉద్యమాలకు అద్దంపడుతూ విరివిగా సాహిత్యం వచ్చింది. ఇలా వచ్చిన సాహిత్యం ద్వారానే తెలంగాణ రచయిత్రులు మా నేల, నీళ్లు, భాష, యాస, బతుకు మాకు కావాలనే సంకల్పాన్ని తమ కథల ద్వారా తెలిపారు. ఈ "తెలంగాణ వెతలే... కథలై" అనే కథా సంకలనంలో ప్రసిద్ధులైన రచయిత్రుల కథలతో పాటు వర్ధమాన రచయిత్రుల కథలు, నూతన రచయిత్రుల కథలు కూడా ఉన్నాయి. వీరిలో తెలంగాణ ప్రాంతం వారే కాకుండా తెలంగాణ నేతలు కూడా ఉన్నారు. వీరంతా అన్ని రచనల్లోనూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ఆవశ్యకత తెలియజేశారు. ఈ కథ సంకలనంలోని కథలను ప్రముఖ రచయిత డాక్టర్ కాలువ మల్లయ్య గారు ప్రధానంగా మూడు భాగాలుగా విభజించారు. అవి

1. తెలంగాణ కోరుతూ వచ్చిన కథలు
2. తెలంగాణ జీవితాన్ని కళ్ళకు కట్టిస్తూ రాసిన కథలు
3. తెలంగాణేతర మహిళలు రాసిన తెలంగాణ కథలు

"ఎవరు రాసిన ఈ కథల్లో తెలంగాణ ప్రాంతీయ ముద్ర కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ప్రాంతీయం కానీ విశ్వజనీన సాహిత్యం ఉందనడానికి ఈ కథలు మంచి ఉదాహరణలు. ప్రాంతీయ ముద్ర తో విశ్వజనీన దృక్పథంతో రాసిన కథలివి" అన్న డాక్టర్ కాలువ మల్లయ్య గారి మాటలు యదార్థం. "తెలంగాణ వెతలే.. కథలై"

ఈ సంకలనంలోని మొదటి కథ డాక్టర్ సమతా రోష్ని రాసిన "అమ్మ". ఈ కథలో ఆంధ్ర అమ్మాయి రాజి ఉద్యోగరీత్యా ఆదిలాబాద్లో ఉంటుంది. రాజిని చూసిపోదామని వాళ్ళ అమ్మ వస్తుంది. వచ్చినప్పటినుండి తెలంగాణ యాసను చూసి వీరి భాష నాకు అర్థం కావటం లేదని చికాకు పడుతుంది. అప్పుడు రాజి మనం ఎవరైనా విదేశీయులు వచ్చినప్పుడు వాళ్ల భాష తెలియక పోయినా సరే వచ్చీరాని ఇంగ్లీష్ లోనో లేక సైగల ద్వారా అన్ని కనుక్కొని వారు ఇబ్బంది పడకుండా చూసుకుంటాం. మరి మన తోటి తెలంగాణ సోదరులు మాట్లాడే భాషను ఎందుకు అర్థం చేసుకోం? పైగా కించపరుస్తూ మాట్లాడతాం. ఇది కేవలం మన అవగాహనారాహిత్యం గాక మరేమిటి? అని ఆలోచిస్తుంది. అమ్మ ఆలోచనలో మార్పు తీసుకురావడానికి తాను ఉద్యోగంలో చేరినప్పుడు మొదటిరోజు స్కూల్ లోకి వెళ్ళగానే ఓ పంతులమ్మ ''మిమ్మల్ని తోల్క రమ్మని మనిషిని పంపిండ్రు'' అంటుంది. రాజితో తోల్క రావడమేమిటి? మన జిల్లాలో పశువుల్ని తోలుకు వెళ్తారు. మనుషులకు ఆ మాట వాడరు. నాకు నిజంగానే కోపం వచ్చింది కానీ కొంచెం ఆలోచించాను. తోడ్కొని రావటం తోలుకు రావడంగా మారి ఉంటుంది. అంతే దీనికి కోపం తెచ్చుకోవాల్సిన అవసరం లేదనుకున్నా. "ఎవరి భాష వారిది పరస్పర గౌరవం అవసరం" అని అమ్మకు చెబుతుంది రాజి.

రాజీ వాళ్ళమ్మను ప్రత్యేక తెలంగాణ సభకు తీసుకు వెళ్ళింది. సభా ప్రాంతమంతా వేలకొద్దీ జనంతో జన సముద్రంలా ఉంది. బతుకమ్మ ఆడుతూ ఉద్యమ గీతాలు పాడుతూ "జై తెలంగాణ" అని నినదించే ప్రజలను చూసి ఆలోచనలో పడింది అమ్మ. సభ ముగిశాక వచ్చేటప్పుడు ప్రత్యేక తెలంగాణ కావాలని ఇంతలా కోరుకుంటున్నప్పుడు తప్పక ఇవ్వాల్సిందే అంటుంది. చివరికి అమ్మలెవరైనా సరిగానే అర్థం చేసుకుంటారు అని అనుకుంది రాజీ.

తెలంగాణ మాండలికంలో సాగిన చక్కని కథ గోగు శ్యామల రాసిన "ఎల్లమ్మ దస్కింది". ఇందులో రచయిత్రి ఎల్లమ్మ సంవేదనను చాలా వాస్తవికంగా తెలంగాణ యాస, నుడికారాలు ప్రయోగించి చిత్రించారు. ఎల్లమ్మ దళిత స్త్రీ కష్టపడి 20 ఎకరాలు భూమిని సంపాదించింది పన్నెండు మంది పిల్లలను కని పెంచింది. ఏడుగురు బిడ్డల పెళ్లిళ్లు చేసింది. పురుళ్ళు పోసింది. ఐదుగురు కొడుకులకు 20 ఎకరాల భూమిని అప్పు లేకుండా ఉంచింది. అటువంటి ఎల్లమ్మ దగ్గరికి ఆంధ్ర వాళ్ళు వచ్చి "ఎల్లమ్మ గారు! అంటూ వినయంగా సంబోధించి "మీ భూమి ఖరీదుకు ఉన్నదట" అని అడిగారు. దానికి ఎల్లమ్మ కోపంగా "నేను భూమిని అమ్ముతనని మీకు చెప్పిన్నా? వచ్చిండ్రు రయ్యిన" అంటుంది. అప్పుడు ఆంధ్ర వాళ్ళు "కొంతమంది అమ్మారు కదా మీరు కూడా అమ్ముతారు ఏమోనని వచ్చినం" అంటారు. అప్పుడు ఎల్లమ్మ " అయితే నన్ను ఏం చేయ్యమంటారు? వాళ్ళు అమ్ముకున్నరు అంటే ఆల్లిష్టం. వాళ్లు అమ్మితే నేను అమ్మలా? మీ మతలబ్ ఏందో మాకు తెల్వదా? నా భూమి మీకు అమ్మి మా పిల్లలు మీ దగ్గర జీతం ఉండాల్నా? మేము కూలి చెయ్యాల్నా చెప్పండి? ఏమనుకుంటున్నారు మా ఎంబడి వడ్డరూ.. ఎములోలె... భూమి అమ్ముతారా... భూమి అమ్ముతారా అని! నడ్వండి ఈడికెళ్లి " అని గుక్క తిప్పుకోకుండా వాళ్ళ ముఖం మీద నే తేల్చేసింది ఎల్లమ్మ.

పట్నంలో రిక్షా తొక్కే భర్త సహాయంతో 12 మంది పిల్లలను సాదనీకి, వ్యవసాయం చేయడానికి ఎల్లమ్మ ఎన్నడూ దస్కలేదు. కానీ ఎల్లమ్మ ఎక్కడో దస్కింది. దిగులుతో భూంబట్టింది. కనుకున్న సంతానం నాగలి పట్టి దున్నే బదులు పట్నం బాట పట్టారు. ఇల్లును భూమిని కాపాడుకుని బతుకుతారనుకున్న కొడుకులు, బిడ్డలు కండ్ల ముందు లేకుండా అయినందుకు దిగులు వడుతున్నది. దినదినానికి భూమి పడావు పడ్తదేమోనని కుదెం పట్టుకున్నది. కుల దేవతలను పంట రాశుల

అప్పుడు కొల్వకుండ వాళ్ల గూడులను పాడు చేస్తారేమో అని దకస్కింది. అల్లారుముద్దుగా పెంచుకున్న నా కొడుకులు, బిడ్డలు భూమికి దూరమైతరేమో, ఇంటికి తాళం పడతదేమో, భూమి పడావ్ పడి అగ్వసగ్వల అమ్ముడై పోయి ఎవుసం బందయితదేమోనని ఎల్లమ్మ దస్కింది.

ఈ కథలో ఆంధ్రా వాళ్లు ఎంత ప్రలోభ పెట్టినా వారిని ఎదుర్కొని భూమిని దక్కించుకున్న తెలంగాణ మహిళ ధైర్యం చిత్రిస్తూ నే తర్వాతి తరంలోని పిల్లలు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస బాట పట్టిన విధానాన్ని చూపించారు రచయిత్రి.

సామాన్య ప్రజల మనసుల్లో నెలకొన్న తెలంగాణ ఆకాంక్షను రచయిత్రులు అన్నిరకాల జీవిత నేపథ్యం గల పాత్రల చిత్రణ తో పాఠకులకు అందించారు. తెలంగాణ భాష మీద జరిగే వివక్షను, వెక్కిరింత లను రచయిత్రులు కొన్ని కథల్లో చిత్రించారు

ఆంధ్ర ప్రాంత అబ్బాయి తెలంగాణ అబ్బాయిని మీకు సరిగ్గా మాట్లాడరాదని వెక్కిరిస్తూ హేళన చేయడాన్ని నిరసించే కథ గర్శకుర్తి శ్యామల రాసిన "ఉక్రోషం".

భిన్న కోణాలలో తెలంగాణ దుస్థితిని దర్శించగలగిన రచయిత్రులు విభిన్న దృక్పథాలతో కథా వస్తువులు ఎన్నుకొని వాటికి తమదైన శైలిలో న్యాయం చేకూర్చే ప్రయత్నం చేశారు. ప్రసిద్ధ కవి అనిశెట్టి రజిత గారు రాసిన కథ "సోపతి". ఇందులో ఓ సభలో అనుకోకుండా కలిసిన తన ఆప్త మిత్రుడు చందుని, అతడి భార్య సరళను తన కూతురు స్వేచ్ఛ పుట్టినరోజుకు వరంగల్‌కి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఊరికి రమ్మని ఆహ్వానిస్తాడు అశోక్. చందు సమైక్యంధ్ర వాది. అందు వలన మిత్రుడు తెలంగాణవాది అయిన అశోక్ ఆహ్వానాన్ని తిరస్కరించాలి అనుకుంటాడు. కానీ భార్య ఒత్తిడితో అశోక్ వాళ్ళ ఊరు వస్తాడు. ఆ రోజు రాత్రి రచ్చబండ దగ్గర వేసిన వేదికపైన ధూమ్ ధామ్ కార్యక్రమం కోసం వేలాది మంది జనం చేరారు. 12 సంవత్సరాల కుమార్ పాడిన జోహారులూ ...జోహరులూ ... వీరులకు జోహార్.... అమరులకు జోహార్ పాటతో సభ ప్రారంభమవుతుంది. "జై తెలంగాణ", "అమరులకు... జోహార్ జోహార్" అంటూ వేలమంది నినాదాలతో చిన్నారి స్వేచ్ఛతో కేక్ కట్ చేయించి ఆమె పుట్టిన రోజును సరికొత్తగా చేస్తాడు అశోక్. ధూమ్ దాం సభ ఆద్యంతం ప్రజా కళాకారుల అద్భుతమైన ఆటపాటలతో ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. "ఇక్కడి నేలా, గాలీ, నీళ్లు, మనుషులు వాళ్ల ఊపిరులు తెలంగాణమయం - ధన్యురాలివమ్మ తెలంగాణ తల్లి" అని అనుకున్నది సరళ. తెలంగాణలోని ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడం వల్ల చందు ప్రవర్తనలో మార్పు వచ్చి తెలంగాణ రాష్ట్ర కోరిక సమంజసమే అనే అవగాహనకు వస్తాడు.

అయాచితం అరుణ కుమారి రాసిన "నా బంగారు తల్లి" కథలో "మా భాషను అవమానిస్తే సహించం. మా ఆచార వ్యవహారాలను కించపరిస్తే ఒప్పుకోం. మా బతుకులను అవహేళన చేస్తే ఖబర్దార్" అని అపర్ణ పాత్ర ద్వారా హెచ్చరించారు.

పోల్కంపల్లి శాంతాదేవి రాసిన "చామంతి" కథ. ఇందులో లో ఒక ఆశయం కోసం, సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగకరమైన పనులు చేయాలని చిన్నారి చామంతి దృష్టి కోణం నుండి చెప్పబడింది. పాఠశాలలో జరిగిన ఒక సంఘటన వల్ల ప్రేరణ పొంది రజిని టీచర్ "అన్నపూర్ణ" అనే పేరుతో ఒక సంస్థ నెలకొల్పి దిక్కులేని వాళ్లకు ఊర్లో అన్నదాన కార్యక్రమం చేపడుతుంది.

కిరణ్ బాల రాసిన కథ "నా తావుల కెల్లి లెవ్వు" ఇందులో పాఠశాలలో దివ్య అనే అమ్మాయి రోజు ఒక చోట కూర్చునేది. అయితే కొత్తగా వచ్చిన ఒక అమ్మాయి దివ్య కూర్చున్నచోట కూర్చుంటుంది. ఆమె కూర్చునే స్థలం మీద హక్కును వదులుకోలేని దివ్య "నా తావుల కెళ్ళి లెవ్వు" అంటుంది. ఈ కథలో అన్యాపదేశంగా

తెలంగాణేతరులను తెలంగాణ వదిలి వెళ్లమన్న నినాదాన్ని ధ్వనింప చేశారు రచయిత్రి. ఈ కథా సంకలనం లోని కథలన్నీ వస్తు రీత్యా తెలంగాణను, తెలంగాణ జీవితాన్ని తెలంగాణ భాషను తెలంగాణ ఉద్యమాన్ని ప్రేమించేటట్లు చేసే కథలు. పేదరికం, కష్టాలు, కన్నీళ్లు, నిరుద్యోగం, నీటి సమస్య ఒకటేమిటి ఏ దిక్కు చూసినా ఏదో ఒక సమస్య. ఎన్ని సమస్యల పరిష్కారం ప్రత్యేక తెలంగాణ మాత్రమే అని స్పష్టం చేశారు రచయిత్రులు.

2011 సంవత్సరంలో తెలంగాణ ఉద్యమం కీలక దశలో సాగుతున్న సందర్భంలో వచ్చిన కథా సంకలనం ఇది. దేశంలో ఇంత సుదీర్ఘ కాలం ప్రజా ఉద్యమం లేదంటే అతిశయోక్తి కాదు. ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమానికి ఆటుపోట్లతో పాటు ఆఖరి తీర్పు కూడా వచ్చింది. తెలంగాణ ప్రజలు చేసిన ధర్మ పోరాటానికి మద్దతుగా 60 ఏళ్ల కల సాకారమైంది. బానిస సంకెళ్లను తెంచుకుంటూ తెలంగాణ సమాజం అపూర్వ విజయం సాధించటానికి అమరుల తోడైంది. ఈ విజయానికి ప్రత్యక్షంగా పరోక్షంగా చేయూతనిచ్చిన చేతులు ఎన్నో. స్వపరిపాలన ఆకాంక్షిస్తూ తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన అమరవీరుల త్యాగానికి పాదాభివందనం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగు బోధనా లక్ష్యాలు - ఒక పరిశీలన

- గుత్తి కొండ చంద్రకళ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ, తెలంగాణ.

విద్యాబోధనలో భాషా, సాహిత్య బోధన అంతర్భాగం. ఈ భాషా సాహిత్య బోధనా లక్ష్యాలు విద్యా బోధన లక్ష్యాల ఆధారంగా నిర్ణయించబడతాయి. మన రాష్ట్రంలోనూ దేశంలోనూ పాఠశాల స్థాయిలో, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో మరియు స్నాతకోత్తర స్థాయి లోనూ భాషలను బోధిస్తున్నారు.పాఠశాల స్థాయిలో మూడు భాషలను, ఇంటర్మీడియట్,డిగ్రీ స్థాయిలో రెండు భాషలను, స్నాతకోత్తర స్థాయిలో ఒక భాషను బోధిస్తు న్నారు. ఈ స్థాయిలన్నింటిలోనూ మాతృభాష, ద్వితీయ భాష, తృతీయ భాషగా, త్రిభాషా సూత్రం పాటిస్తూ పాఠశాల స్థాయిలో ప్రథమ భాషగా మాతృభాషను, రెండో భాషగా జాతీయ భాష హిందీ ని, తృతీయ భాషగా విదేశీ భాష ఆంగ్లాన్ని బోధిస్తున్నారు. దీనిలో మాతృభాష బోధనకు ద్వితీయ, తృతీయ భాషల బోధన కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఉంది . మాతృభాష బోధన లక్ష్యాలు విస్తృత భావనలపై కూర్చబడితే ,ద్వితీయ భాష బోధన లక్ష్యాలు ఆయా స్థాయిల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయించడం గమనించదగిన అంశం. పెరిగిన అవసరం దృష్ట్యానే ఇటీవలి కాలంలో అనగా ఈ విద్యా సంవత్సరం (2021-22)నుండి తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ మూడవ సంవత్సరంలో కూడా తెలుగు భాషా బోధన ప్రవేశపెట్టబడింది.అందువల్ల డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగుభాషా - సాహిత్య బోధన కూడా ఎంతో ప్రాముఖ్యత పొందింది.

డిగ్రీ స్థాయిలో విద్యార్థులకు ఎలాంటి సామర్థ్యాలు, విలువలు అవసరం అనే దార్శనికతను బట్టి సమాజానికి ఎటువంటి సామాజిక రాజకీయ సాంస్కృతిక స్వభావం అవసరం అనే దృక్పథాన్ని బట్టి పాఠ్యాంశాలు నిర్ణయించ బడతాయి. ఈ పాఠ్యాంశాలు ఎప్పుడైనా సమగ్రంగా సమతుల్యంగా ఉండాలి.ఒక జ్ఞాన పునాదిని ఏర్పరిచే అనుభవాలతో నిండి ఉండాలి.తార్కికంగా ఆలోచించే సామర్థ్యం, ప్రపంచాన్ని వివిధ అంశాల ద్వారా అర్థం చేసుకోగలగే నైపుణ్యం పెంపొందించాలి. సంపూర్ణ జీవితానికి అవసరమైన దృఢమైన పునాదిని వేయాలి. కాబట్టి ఈ బోధన లక్ష్యాల దృష్ట్యా డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా తెలుగు పాఠ్యాంశాలు పరిశీలించటం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

విశ్లేషణ :

డిగ్రీ ప్రథమ, ద్వితీయ తృతీయ సంవత్సరాల పుస్తకాలు వరుసగా సాహితీ మంజీర సాహితీ కిన్నెర సాహితి దుందుభి పేర్లతో ముద్రితమైనాయి. ప్రథమ ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాలు ప్రాచీన ఆధునిక వచన విభాగాలుగా ఉండి ఉపవాచకంగా రుద్రమదేవి నవలతో పాటు వ్యాకరణాంశాలుగా నానార్థాలు, పర్యాయపదాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు కాక తెలుగు వాక్యం కూడా చేర్చబడింది. తృతీయ సంవత్సరం లో సాహితీ ప్రక్రియ లైన పద్యం, పాట, వచన కవిత, లఘు కవితా రూపాలైన నానీలు, హైకూలు, మినీకవితల తో పాటు ఉర్దూ కవితా రూపాలైన రూబాయిలు, గజల్స్ మరియు వ్యాసం, ముందుమాట, పుస్తక సమీక్ష, నాటకం, నవల, కథానిక, జీవిత చరిత్ర, జర్నలిజం, అనువాదాలు, ఇంటర్వ్యూలు, ప్రాజెక్టు నిర్వహణ తో పాటు సాహిత్య అధ్యయన ప్రయోజనాలు పాఠ్యాంశాలుగా ఉన్నాయి.

ప్రథమ సంవత్సర ప్రాచీన భాగంలో శకుంతలో పాఖ్యానంతో ప్రారంభం అవుతుంది.ఇది నన్నయ

రచించిన ఆంధ్ర మహాభారతం నుండి తీసుకోబడింది. శకుంతల కొడుకుని ఎత్తుకొని దుష్యంతుని సభలో అడుగుపెట్టిన సందర్భంలో ఈ పాఠ్యభాగం మొదలవు తుంది. దుష్యంతుడు కణ్వాశ్రమానికి వచ్చి శకుంతలతో, వారిద్దరికీ పుట్టిన కుమారుడిని రాజుగా పట్టాభిషేకం చేస్తానని మాట ఇచ్చి గాంధర్వ వివాహం చేసుకోగా అదే విషయాన్ని శకుంతల నిండు సభలో గుర్తు చేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తుంది కానీ దుష్యంతుడు తెలిసి కూడా తెలియని వాడి వలె ఉండి నేను నిన్ను ఎరుగను అని అనగానే శకుంతల తెల్లబోయి ఏడుస్తూ ఆ సభలో సత్య వాక్యము యొక్క గొప్పతనాన్ని, భార్య ప్రాముఖ్యాన్ని, పుత్రుని ప్రాధాన్యతను వివరిస్తుంది. అయినా దుష్యంతుడు కాదనడంతో తన స్థితికి జాలిపడి చేసేదేమీలేక వెనుదిరిగిన సందర్భంలో ఆకాశవాణి జరిగినదంతా అందరి ముందు నిండు సభలో చెప్పడంతో దుశ్యంతుడు నిజాన్ని అంగీకరించి భార్యా పుత్రులను చేరదీసి యువరాజుగా పట్టాభిషేకం చేస్తాడు. ఈ పాఠ్యాంశం విద్యార్థులలో వివాహ వ్యవస్థను గురించి కుటుంబ సంబంధాలను గురించి అన్యాయానికి గురైన స్త్రీ ప్రశ్నించే తీరును గురించి ఆలోచింపజేస్తుంది , కాలం మారినా ఈనాటికీ మారని స్త్రీల సమస్యల పట్ల సానుకూల దృక్పథాన్ని, పరిష్కారం దిశగా జరిగే ప్రయత్నా లను చర్చించేందుకు తోడ్పడుతుంది. పాల్కుర్కి సోమనాధుని బసవ పురాణంలోని గొడగూచి కథ, పోతన భాగవతం లోని గజేంద్రమోక్షం పాఠ్యాంశాలు నవ విధ భక్తితత్వాన్ని తెలుసుకునేందుకు చారిత్రకంగా శైవ వైష్ణవ మతాల స్థితిగతులను అవగాహన చేసుకునేందుకు అవకాశం కలిగిస్తాయి. అద్దంకి గంగాధరుడు రాసిన సంవరణుడి తపస్సు పాఠం ద్వారా సంవరణుడు సూర్య పుత్రిక అయిన తపతిని వివాహమాడటానికి చేసిన తపస్సు తద్వారా సూర్యుని మెప్పించడంతో, వివాహానికి కుటుంబ సభ్యుల అంగీకారం, ముఖ్యంగా అమ్మాయి తల్లిదండ్రుల అనుమతి అవసరమని కుటుంబ సంబంధాల ప్రాధాన్యత మరియు అవతలి వ్యక్తిని వారికి నచ్చిన పనులు చేయడం ద్వారానే వారి మనసు గెలుచుకో గలమని, ప్రేమను పొందగలమనే విలువను తెలియజేస్తుంది. మొల్ల రామాయణం లోని హనుమత్ సందేశము లంకలో దుఃఖిస్తున్న సీతాదేవిని కోతి రూపంలో హనుమంతుడు తాను రామదూతగా పరిచయం చేసుకుని ఆమె దుఃఖాన్ని పోగొట్టి రాముడు త్వరలోనే వస్తాడని ధైర్యం చెప్పి కష్టాలలో ఉన్నవారికి చేతనైనంతగా సహాయం చేయాలని పరోపకారబుద్ధిని పెంపొందించుకోవాలనే లక్షణాన్ని తెలియజేయగా, ఏనుగు లక్ష్మణ కవి రాసిన సుభాషితాలు ఉన్నత వ్యక్తిత్వ నిర్మాణానికి నైతిక ప్రవర్తన అభివృద్ధికి తోడ్పడతాయి.

ఆధునిక కవిత్వభాగంలో ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును అని ప్రేమ కన్నా గొప్ప సంపద ఏదీ లేదని గురజాడ ముత్యాల సరాల లోని కాసులు పాఠ్యాంశం ద్వారా తెలుసుకోవచ్చు. రాజు? కవి వ్యత్యాసం, కవికి గల సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత ఆశించిన వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి తో పాటు రాజకీయ, ఆర్థిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలలో నడుచుకోవాల్సిన తీరుపట్ల చారిత్రక అవగాహన కలిగిస్తుంది జాషువా రాసిన కొత్త లోకం లోని రాజు కవి పాఠ్యాంశం. పల్లా దుర్గయ్య రాసిన గంగిరెద్దు పాఠంలో జానపద కళారూపాన్ని పరిచయం చేయడమే కాక జానపద కళాకారుల జీవితాన్ని గురించిన కొత్త కోణాన్ని పరిచయం చేస్తుంది. శ్రీ శ్రీ రాసిన జయభేరి పాఠం వల్ల వ్యక్తి శక్తిగా ఎదగాలని అభివృద్ధిలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని, దాశరధి కృష్ణమాచార్య రాసిన అంతర్నాదం, సినారె రాసిన ప్రపంచ పదులు పాఠాల ద్వారా నిరాశ నిస్పృహల స్థానంలో ఆశావహ దృక్పథం ,ఆత్మ విశ్వాసం కలిగి ఉండటం, పోరాట పటిమను నేర్పడమే కాక, ఉన్నత స్థానాలకు ఎదగాలనే అంశాలను బోధిస్తాయి. కౌముది రాసిన అల్విదా స్మృతి గీతం మగ్దూం కృషిని తెలపడమే కాక పోరాటం, సేవా దృక్పథం రెండూ

కార్మిక నాయకుల జీవితంలో ఎంతో ముఖ్యమైన అంశాలని, వారి మార్గంలో ప్రయాణించడమే వారికి ఇచ్చే నివాళి అని తెలుస్తుంది. నెల్లూరి కేశవస్వామి రాసిన యుగాంతం కథ హైదరాబాద్ పోలీస్ చర్య నాటి హైదరాబాద్ పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తుంది. నిజాం కాలం నాటి రాజకీయ స్థితిగతులను ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను తెలియజేసి తెలంగాణ రాష్ట్రం పట్ల చారిత్రక అవగాహనను పెంపొందించుకోవడానికి ఈ కథ ఎంతో ఉపకరిస్తుంది. పాకాల యశోదా రెడ్డి రాసిన వెంకన్న కథ తెలంగాణ భాష గొప్పతనాన్ని తెలపడంతో పాటు జంతువులను కూడా కుటుంబ సభ్యులుగా చూసుకునే సంస్కారం, జీవకారుణ్య ధృక్పథం పెంపొందిస్తుంది. సురవరం ప్రతాపరెడ్డి రాసిన మామిడిపండు వ్యాసం మామిడిపండ్ల చరిత్రను, రకాలను, ప్రాధాన్యతను తెలుపగా, కృష్ణశాస్త్రి రాసిన మా ఊరు పోయింది వ్యాసం మారుతున్న గ్రామీణ పరిస్థితులను చర్చించుకునే చక్కటి అవకాశం కలిగిస్తుంది. రుద్రమదేవి నవల కాకతీయ పరిపాలన తో పాటు ఆనాటి పరిస్థితులను గురించి వినోదంతోపాటు విజ్ఞానాన్ని కలిపి అందిస్తుంది. వ్యాకరణాంశాలైన నానార్థాలు, పర్యాయపదాలు తెలుగు భాష పై ఆసక్తిని కలిగించడమే కాక కొత్త పదాల వినియోగం అభ్యాసం చేసేలా చేస్తుంది. తెలుగు వాక్యం నిర్మాణ రీతులు, రకాలు మరియు వాక్య రచనలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి చక్కని అవగాహన ఏర్పడుతుంది. పదాల నిర్మాణం, విభక్తుల ప్రయోజనం వంటి భాషా పరమైన పరిజ్ఞానం సంధులు, సమాసాల వల్ల కలుగుతుంది.

ద్వితీయ సంవత్సర సాహితీ కిన్నెర లో ప్రాచీన కవిత్వంలోని తిక్కన మహాభారతం నుండి తీసుకోబడిన ధర్మజుని వాక్చాతుర్యం పాఠంతో మొదలవుతుంది.ఈ పాఠం మహాభారతము పాత్రలు, ప్రత్యేకతల గురించి చర్చించుకోవడానికి, ధర్మరాజు మాటలలోని ఆంతర్యం గ్రహించడానికి తోడ్పడుతుంది. సందర్భానికి తగిన విధంగా ఆలోచించడం, శాంతి,సహనాన్లతో మెరవడం, యుద్ధ వ్యతిరేకత, బంధుప్రీతి,గురువులు, పెద్దల పట్ల భక్తి కలిగి ఉండటం ఇవన్నీ ధర్మజుని మాటలలోని గొప్ప విషయాలు. విద్యార్థులు వీటిని గుర్తించడం ద్వారా సంస్కారవంతులుగా ఎదగవచ్చు. శత్రువు అయినప్పటికీ శరణన్న వారిని రక్షించే స్వభావం విభీషణ శరణాగతి ద్వారా తెలుసుకుంటే, దుష్టులకు దూరంగా ఉండటం, దుర్వ్యసనాలకు లోనుకాకుండా ఎదిగే వయసులో సరైన నడవడికతో, మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులకు అపకీర్తి తెచ్చే పనులు చేయకూడదని శ్రీనాథుని గుణనిధి పాఠం ద్వారా తెలుసుకోవచ్చు. ఈర్ష్యాద్వేషాలు కూడా సానుకూలంగా మార్చుకొని పోటీ తత్వాన్ని పెంచుకొని అందుకు తగినవిధంగా ప్రేరణ ను కలిగించేది పింగళి సూరన రాసిన నారద గానమాత్సర్యం. అన్నా చెల్లెల అనుబంధంలో భౌతిక సంపదలకు కాక బంధాలకు విలువ ఇవ్వాలని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని వాగ్దాన భంగం ద్వారా తెలుస్తుంది .నరసింహ శతకం భక్తి,వైరాగ్యంతో నిండిన ఆధ్యాత్మిక తత్వాన్ని గుర్తించేలా తోడ్పడుతుంది ఆధునిక కవిత్వంలో వానమామలై వరదాచార్యులు రాసిన రైతు ప్రశస్తి పాఠం రైతు గొప్పదనాన్ని తెలపడమే కాక రామాయణ కథను పోలికగా తెచ్చి రామకథను గుర్తు చేస్తుంది.రైతు రామాయణం అనిపిస్తుంది. గురుదక్షిణ పాఠ్యాంశం గురువుల యెడల భక్తి విశ్వాసాలను పెంపొందిస్తే, బోయి భీమన్న రాసిన గుడిసెలు కాలిపోతున్నాయి పాఠ్యాంశం వర్ణ వ్యవస్థను, ఆర్థిక అంతరాలు చర్చించే విధంగా వాస్తవ సామాజిక స్థితిగతుల గురించి అవగాహన కలిగేలా చేస్తుంది. కాళోజీ రాసిన నరుడ నేను నరుడ నేను, బాలగంగాధర తిలక్ రాసిన ఆర్తగీతం రెండూ మానవుని లోని సున్నితమైన దయార్ద్ర హృదయాన్ని తట్టి లేపుతుంది. ఆర్తి, దయ, సానుభూతి లేకుండా బ్రతుకు కమ్మదనాన్ని పొందలేమని, మానవత్వం కలిగి ఉండాలని ఉద్బోధ

కనిపిస్తుంది. ముకురాల రామారెడ్డి రాసిన దేవరకొండ దుర్గం ఒకనాటి సంస్థానాల స్థితిగతులు తెలుసుకునేం దుకు దోహదం చేస్తుంది.

వచన విభాగం నుండి దాశరధి రంగాచార్య రాసిన అర్ధరాత్రి అరుణోదయం స్వాతంత్రం వచ్చిన నాటి తెలంగాణా పరిస్థితులను తెలిపితే, సి. పి బ్రౌన్ చేసిన సాహిత్య సేవ గురించి చక్కని అవగాహన కలిగిస్తుంది జానుమద్ది హనుమచ్ఛాస్త్రి రాసిన సి.పి.బ్రౌన్ పాఠ్యాంశం. గ్రామ నామాలు ఏర్పడే తీరు ప్రస్తుతం గ్రామ నామాల వెనక ఉన్న చారిత్రక అవగాహన కలిగించి తమ గ్రామాల పట్ల కొత్త ఆలోచన పెంపొందిస్తుంది కపిలవాయి లింగమూర్తి రాసిన మన గ్రామ నామాలు పాఠ్యాంశం. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అందుకు సహకరించిన వారిపట్ల కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలనే నీతిని చెప్తుంది పోల్కంపల్లి శాంతాదేవి రాసిన నివురు తొలగిన నిప్పు కథ. మల్లెల వంటి స్వచ్ఛమైన మనసు కలిగి ఉంటే జీవితం ఎంత కష్టం లో నైనా ఆనందంగా నడుస్తుందని భార్యాభర్తల మధ్య ప్రేమ ముఖ్యమనే అంశాన్ని తెలుపుతుంది ఇల్లిందల సరస్వతీ దేవి రాసిన కొండమల్లెలు కథ. ఇవేకాక ఛందస్సు, అలంకారాలు భాషాపరమైన జ్ఞానాన్ని పెంపొందించడం తోపాటు భావ వ్యక్తీకరణలో నూతన కోణాలను పరిశీ లించేందుకు తగిన జ్ఞానాన్ని అందిస్తాయి. తద్వారా పూర్వ కవుల అలంకారిక ప్రయోగ సౌందర్యం అర్థమౌతుంది.

తృతీయ సంవత్సరం సాహితీ దుందుభి వివిధ సాహిత్య ప్రక్రియల లక్షణాలను తెలపడమే కాక స్వయంగా విద్యార్థులు తమకు ఇష్టమైన ప్రక్రియలో రచనా వ్యాసంగాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని పెంపొందిస్తుంది. పద్యము, పాట, వచనకవిత, నానీలు, రూబాయిలు, గజల్, వ్యాసం, పీఠిక, సమీక్ష, నవల, నాటకం ,కథానిక ,జీవిత చరిత్ర వంటి ప్రక్రియల గురించి లోతైన అవగాహన పెంపొందిస్తుంది. సాహిత్య అధ్య యనం ప్రాధాన్యతను ప్రయోజనాన్ని తెలియ చేస్తుంది. ప్రస్తుత సమాజంలో ప్రచార, ప్రసార మాధ్యమాల్లో తెలుగు భాష తీరుతెన్నులు, వార్త నిర్మాణం, వార్తా కథనాల ప్రసారం అర్థం చేసుకునేలా ఉపయోగపడుతుంది. అనువాద సాహిత్యం తో పాటు ఇంటర్వ్యూల నిర్వహణ పట్ల మంచి అవగాహన కలిగిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని పరిశీలించి పరిశోధనాత్మకంగా నివేదిక రూపొం దించేలా ప్రాజెక్టు అనే కొత్త అంశం పూర్తి నమూనాతో విద్యార్థులు తాము స్వయంగా పరిశోధన దృక్పథాన్ని పెంపొందించుకునేలా చేస్తుంది. తోటి విద్యార్థులతో కలిసి బృందంగా ఏర్పడి పరస్పరం సహకరించుకుంటూ సమైక్యంగా జ్ఞానాభివృద్ధికి తగిన విధంగా కృషి చేసే మంచి లక్షణం ప్రాజెక్టు పని ద్వారా అలవడుతుంది.

ముగింపు :

విద్యార్థులను సమాజానికి పనికి వచ్చే విధంగా మార్చడమే విద్య యొక్క పరమావది. అందుకు తగినట్లుగా విద్యార్థుల జీవితంలో, బతుకుదెరువులో వివిధ దశల్లో ఎదురయ్యే సవాళ్ళతో పాఠ్యాంశాలకు సంబంధం ఉండాలి. విద్యార్థులను మానవీకరించేం దుకు పాఠ్య పుస్తకం ప్రధానమైన ఉపకరణంగా ఉండాలి. అందులో నిర్ణయించబడిన పాఠ్యాంశాలు, బోధనాంశాలు విద్యార్థులలో శాస్త్రీయమైన, హేతుబద్ధమైన, తార్కికమైన ఆలోచనలు పెంపొందించాలి. సమాజ పరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలకు సంబంధించిన గత, వర్తమాన, భవిష్యత్ పరిస్థితుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగించడం ద్వారా శాస్త్రీయమైన పద్ధతిలో సమాజాన్ని, మానవ నాగరికత పరిణామాన్ని అర్థం చేసుకునేలా చేయగలగడమే ఎంతో కీలకాంశం.ప్రతి విద్యార్థి తమ సామాజిక అనుభవాలతో పాఠ్యపుస్తకాల జ్ఞానాన్ని మేళవించి నిత్య జీవితానికి అన్వయించు కోగలగాలి. లేకపోతే ఆ జ్ఞానం కేవలం సమాచారంగా మిగిలిపోతుంది.

విజ్ఞాన శాస్త్రాల తోపాటు, భాషా సాహిత్య బోధన కూడా విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనను హేతువాద

దృక్పథాన్ని పెంపొందించడంలో ఎంతో తోడ్పాటును అందిస్తుంది.సాహిత్యము - సమాజము పరస్పరం ఆధారితాలు కనుక కళాశాల విద్యార్థులు సాహిత్యం ద్వారా శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని అర్థం చేసు కోవడం వల్ల హేతువాద, ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి విశ్వ మానవ సౌభ్రాతృత్వం గల ఉన్నత సంస్కార వంతులు గా రూపొందుతారు.

స్థూలంగా చెప్పాలంటే?

డిగ్రీ స్థాయిలో ద్వితీయ భాషగా పైన చెప్పిన తెలుగు పాఠ్యప్రణాళికను పరిశీలించినట్లయితే ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరపు పాఠ్యాంశాలలో పదవ తరగతి , ఇంటర్మీడియట్ నాటి భాష పరిజ్ఞానానికి కొంత అదనపు జోడింపే తప్ప విశేషమైన మార్పు ఏమి కనిపించదు. సంప్రదాయ పద్ధతిలో నే ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాలు సాహిత్యం, భాషా బోధన పరిచయం మాత్రమే ప్రధానంగా భావించి పాఠ్య ప్రణాళిక రూపొం దించినట్లు కనిపిస్తుంది, అయితే ఆధునిక సమాజ జీవనంలో వస్తున్న మార్పులకు, అవసరాలకు అను గుణంగా భాష ఉపయోగించే నేర్పును, పరిశోధనాత్మక దృక్పథాన్ని మాత్రం తృతీయ సంవత్సర పాఠ్యప్రణాళిక ద్వారా అందించే ప్రయత్నం కనిపిస్తుంది.

విద్యార్థులు భాషా తత్వాన్ని, సాహిత్య ప్రక్రియ రూపాల జ్ఞానాన్ని సంపాదించడం, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, మౌఖికంగా లిఖిత రూపంగా తన భావాలను వ్యక్తీకరించడం, భాష, సాహిత్యం నందు అభిరుచి మరియు అధ్యయన ఆసక్తిని పెంపొందించు కోవడం వంటి భాషాపరమైన జ్ఞానం తో పాటు సమాజ పరమైన అనేక అంశాలను పద్య కావ్యాలు, కథలు, నవల, నాటకం, వంటి భిన్నమైన ప్రక్రియలతో సమాజాన్ని చూడటం, పరిశీలించడం తద్వారా వినోదంతోపాటు చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక విజ్ఞానాన్ని కూడా అందించడం కనిపిస్తుంది. ఇవే కాక భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని సమర్థవంతం చేసి సృజనాత్మక శక్తులను వెలికితీసి స్వతంత్ర రచనలు ప్రోత్సహించడం , పరిశోధన ఆసక్తిని కలిగించడం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ ప్రచార, ప్రసార మాధ్యమాల్లో జీవనోపాధిని పొందుతూ సజీవ చైతన్యం గల వ్యక్తులుగా రూపొందడం లక్ష్యంగా కనబడుతుంది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నల్లగొండ కథ – వస్తు వైవిధ్యం

– దర్శనం ప్రకాశం, పరిశోధక విద్యార్థి తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు కథానిక సాహిత్యానికి వంద సంవత్సరాలు పూర్తయినవి. బండారు అచ్చమాంబ రాసిన కథ 1902లో వచ్చినందువల్ల ఆమెను తొలి తెలుగు కథానిక రచయిత్రిగా గుర్తించవచ్చు. అదేవిధంగా 1910లో గురజాడ దిద్దుబాటు కథ రావడం వల్ల ఆయన్ను తొలి తెలుగు కథానిక రచయితగా గుర్తించవచ్చు. ఇందులో కథానిక లక్షణాలు, శిల్పం ఇత్యాది విషయాల ఆధారంగా గురజాడ దిద్దుబాటు కథనే మొట్టమొదటి కథానికగా విమర్శకులు భావిస్తున్నారు. అదే సమయంలో బండారు అచ్చమాంబ కథలో శిల్పం బలహీనంగా ఉందని వాదించినా ఆమె ప్రయత్నాన్ని కాదనలేరు. అందువల్ల ఆమెను మొదటి కథానిక రచయిత్రి అన్న స్థానం నుంచి తొలగించలేం. మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయశల్యం' మొదటి కథానిక అవుతుంది. బండారు అచ్చమాంబకు తెలంగాణతో ఉన్న అనుబంధాన్ని ఆసరా చేసుకొని ఆమెను తెలంగాణ రచయిత్రిగా భావిస్తే ఆమె తెలంగాణ కథానికకు కూడా ఆద్యురాలవుతుంది. ఈ చర్చతో నిమిత్తం లేకుండా నల్లగొండ కథను పరిశీలిస్తే తెలుగు కథానిక సాహిత్యంలో నల్లగొండ జిల్లా కథానికకు విశిష్టస్థానం ఉందనడంలో విప్రతిపత్తి లేదు.

ఆవిర్భావంలో ఆలస్యమైనా జనజీవనాన్ని చిత్రించడంలో తెలంగాణ కథానిక అగ్రస్థానంలో ఉంటుంది. అందులో నల్లగొండ జిల్లా కథానిక ముందుభాగంలో నిలుస్తుంది. తెలుగులో కథ అన్న ప్రక్రియ అనాదినుంచి ఉన్నప్పటికీ అదొక సాహిత్య ప్రక్రియగా నిలదొక్కుకున్నది మాత్రం 20వ శతాబ్దంలోనే. ఆధునిక కథానికకు ఇంగ్లీషు 'షార్ట్‌స్టోరీ' యే మూలమని ఇప్పటికే విమర్శకులు నిరూపించారు. కాబట్టి ఆ వివరాలకు వెళ్ళాల్సిన అవసరం లేదు. అయితే మిగిలిన ఆంధ్రదేశం బ్రిటిషు పరిపాలనలో ఉన్న కాలంలో తెలంగాణ మాత్రం నైజాం పరిపాలనలో ఉండడం వల్ల ఈ ప్రాంతంలో ఇంగ్లీషు ప్రభావం లేదు. అందువల్ల ఆ ప్రభావంతో వచ్చిన కథానిక సాహిత్యం వికాసంలో తెలంగాణలోని నల్లగొండ జిల్లా కథానిక పాత్ర ప్రముఖమైందనడంలో సందేహం లేదు. దానిక్కారణం నల్లగొండ జిల్లా కథానిక వస్తు వైవిధ్యమే. నల్లగొండ జిల్లా కథకులు ఎప్పటికప్పుడు ప్రాంతీయ సమస్యలను తమ కథానికల్లో ప్రతిఫలింపజేశారు. నైజాం పరిపాలన నుంచి నేటి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు నల్లగొండ జిల్లా కథానికల్లో కనిపిస్తాయి. నల్లగొండ జిల్లా కథానికల్ని వస్తువును బట్టి మూడు పర్వాలుగు విభజించవచ్చు. అందులో మొదటిది నైజాం పర్వం , రెండవది స్వాతంత్ర్య పర్వం, మూడవది ఆధునిక పర్వం. నైజాం కాలంలో ప్రజల జీవన స్థితుగతులను తెలియజేసే కథానికలు నైజాం పర్వం కిందికి వస్తాయి. స్వాతంత్ర్యం తరువాత అంటే నైజాం పరిపాలన నుంచి విముక్తి పొందిన తరువాత వచ్చిన పరిస్థితులకు అద్దంపట్టే కథానికలు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత పరిణామల నేపథ్యంలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, దానిక్కారణాలు, దాని ప్రతిస్పందనలు ఆధునిక పర్వంలోని కథానికల్లో కనిపిస్తాయి. ఇది కాలాన్ని బట్టి చేసిన విభజన. ఇందులో సాధారణంగా వస్తువు పైన పేర్కొనే విధంగా ఉన్నప్పటికీ లోతుగా పరిశీలిస్తే ఈ విభజనలో ఇవికాక ఇతర వస్తువులు కూడా కనిపిస్తాయి. అందువల్ల వస్తువురీత్యా నల్లగొండ జిల్లా కథానికల్ని విభజిస్తే నల్లగొండ జిల్లా కథానిక విస్తృతిని, పరిధిని, పరిణామాన్ని, వైవిధ్యాన్ని తెలుసుకోవచ్చు.

భారతదేశ పరిస్థితి లేదా మిగిలిన ఆంధ్రదేశం పరిస్థితి కన్నా తెలంగాణ పరిస్థితి భిన్నమైంది. అందువల్ల ఇక్కడి

సాహిత్యం కూడా భిన్నమైంది. దేశం బ్రిటిష్ దోపిడీకి గురవుతున్నప్పటికీ సాంఘికంగా, విద్యాపరంగా దేశం అభివృద్ధి పథంలో నడుస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అలాంటి అవకాశం తెలంగాణకు లేకుండా పోయింది. దేశమంతా బ్రిటిష్ రాజ్యమేలుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో దుర్భరమైన నైజాం పాలన సాగుతూ ఉండేది. ఆ సందర్భంలో నైజాం కాలంనాటి తెలంగాణ బతుకుల్ని, వెతల్ని, సంస్కృతీ సంప్రదాయాలను చిత్రిస్తూ కాంచనపల్లి చినవెంకటరామారావు ' చెరువొడ్డున' పి. చిన్నయ్య ' ఇంటిదొగలు' బోయజంగయ్య 'తుపాకులు' అనే కథానికలను రాశారు. ఇందులో చెరువొడ్డున కథ అనాటి తెలంగాణ పరిస్థితులను తెలుసుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

తెలంగాణలోని నల్లగొండ ప్రాంతంలో మరో పెద్ద సమస్య భూమి సమస్య. భూస్వామ్య వ్యవస్థ వేళ్ళూనుకొన్న ఈ ప్రాంతంలో కథా రచయితలు ఈ సమస్యను ప్రధానంగా తీసుకొని అనేక కథానికలు రాశారు. దున్నే వాడిదే భూమి, రైతుల కష్టనష్టాలు మొదలైన అంశాలు కథా వస్తువులయ్యాయి. చెరబండరాజు రాసిన 'చిరంజీవి' కథానిక ఈ కోవలోకే వస్తుంది. భూస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఏ విధంగా కూలీలుగా బానిసలుగా బతుకుతూ భూస్వామికోసం పాటుపడాల్సి వచ్చేదో చిత్రించిన విధం కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. రైతులుగా చెలామణి అవుతున్న వాళ్ళు కూలీలుగా మారిన వైనాన్ని మనం ఈ కథలో చూడవచ్చు. తెలంగాణ కథానికల్లో మార్క్సిస్టు దృక్పథంతో రాసిన కథానికలతో పాటు అంబేద్కరిజంతో రాసిన కథానికలు కూడా ఉన్నాయి. ఇవి దళిత ప్రజల వెతల్ని తెలియజేస్తాయి. వాటిలో బోయజంగయ్య రాసిన 'బొమ్మలు' మేరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన ' ఓటన్న', యన్.కె. రామారావు రాసిన ' విద్యుల్లత' వంటి మొదలైన కథానికలు దళితుల జీవితాల్ని చిత్రించాయి. ఆధునికీకరణలో భాగంగా వివిధ వృత్తులు నశించిపోతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో వివిధ వృత్తులకు సంబంధించిన పనివాళ్ళు ఎక్కువ. వీళ్ళంతా తమ వృత్తుల్ని పోగొట్టుకొని పడరాని పాట్లు పడుతున్నారు. ఇలాంటి వాళ్ళకు సంబంధించిన వస్తువుతో నల్లగొండ రచయితలు అనేక కథానికలు రాశారు. అందులో బోధనం నర్సిరెడ్డి ' బోరుపాక్కలు' చెప్పుకోదగినది.

తెలంగాణలో పల్లెలకి, పట్టణాలకి ఉన్న భేదం ఎక్కువ. పట్టణాల్లోని సంఘర్షణ కార్మికుల జీవితాల్ని అతలాకుతలం చేసింది. పల్లెటూళ్ళలోనుంచి వచ్చి పట్టణాల్లో కార్మికులుగా మారి పట్టణ జీవితంతో సంఘర్షణ పడే ప్రజలకు సంబంధించిన కథావస్తువులు అనేకం వచ్చాయి. వాటిలో ముదిగంటి సుజాతారెడ్డి రాసిన 'గుడిసెలు - గుడిసెలు', కాసుల ప్రతాపరెడ్డి రాసిన ' ఆఫ్టర్ ట్వెంటీ ఇయర్స్ అను మంచి మిత్రుల కథ మొదలైన కథానికలు ఈ కోవలోకే వస్తాయి. తెలంగాణ వస్తువుల్లో ముఖ్యమైంది ముస్లిం జీవనానికి సంబంధించింది. నైజాం సర్కారు కాలంలో ముస్లింలు రాజ్యాధికారంలో ఉన్నప్పటికీ, సామాన్య జనానికి మాత్రం ఇక్కట్లు తప్పలేదు. స్వాతంత్ర్యం తరువాత ముస్లింల పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. దాంతో వాళ్ళ జీవనంలో పరిణామంతోపాటు, మానసిక సంఘర్షణ, ఆందోళన ఇత్యాది భావాలు చోటుచేసుకున్నాయి. అందువల్ల ముస్లిం జీవనమన్నది కథకులకు ప్రత్యేక ఇతివృత్తంగా మారింది. గౌస్‌మొహియుద్దీన్ రాసిన ' గుంగీధడ్‌కన్', షాజహానా రాసిన ' సిల్‌సిలా' మొదలైన కథానికలు ముస్లిం జీవనాన్ని చిత్రించిన కథానికలు.

తెలంగాణలో దళితుల సమస్యలను చిత్రించిన కథానికలు అనేకం వచ్చాయి. దళితుల పరిణామాన్ని సూచించే విధంగా కథానికలున్నాయి. హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాల జీవితానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమవుతుంది. దళిత వర్గాలు సృష్టించిందే దళిత సాహిత్యం అనే భావన సమంజసమైంది కాదు. దళిత వర్గాల అభ్యున్నతి కోసం అగ్రవర్ణాల

వారు సృష్టించిన సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది. అయితే దళితేతరులు సృష్టించిన సాహిత్యం కన్నా దళితులు సృష్టించిన సాహిత్యం వాస్తవ రూపానికి అద్దం పడుతుంది. దళితుల భాషా సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, వారి జీవన విధానాలను మూకుమ్మడిగా ప్రధాన జన జీవన స్రవంతికి దీటుగా నిలబెట్టే క్రమంలో దళిత సాహిత్యం ఒక ఉద్యమరూపం సంతరించుకొని సాహిత్యపు పలు ప్రక్రియలలో మొగ్గ పుట్టి పువ్వులా వికసించింది. అందులో కథా ప్రక్రియ చెప్పుకోదగింది. ఇలాంటి నేపథ్యాన్ని కథా వస్తువుగా తీసుకొని నల్లగొండ జిల్లా రచయితలు కథానికలు వెలువరించారు. బోయజంగయ్య రాసిన ' దొరసాని' కథానికలో దళితులపై అగ్రవర్ణాల ఆధిపత్యం ఏ విధంగా కొనసాగిందో తెలియజేశాడు. మేరెడ్డి యాదగిరి రెడ్డి రాసిన 'నాగులు' అనే కథానికలో బతకడం కోసం ఉపాయాలను అన్వేషించి ఆహారాన్ని సంపాదించి ముందుకెళ్తున్నా దళితులు, రాజ్యాధికారం కోసం అంత తీవ్రంగా ఎందుకు ఆలోచించట్లేదు? అంటూ ప్రశ్నను లేవనెత్తాడు. ఈ విధంగా దళితులను చైతన్యపరచడంలో నల్లగొండ జిల్లా రచయితలు తమవంతు పాత్రను పోషిస్తున్నారు.

నల్లగొండ జిల్లా కథానిక వస్తు వైవిధ్యాలపుట్ట. ఈ కథానికల్లో నిక్షిప్తమైన వస్తువులను ఏకరువు పెట్టడం కూడా పెద్ద కథ అవుతుంది. పోరాటాల ఫలితంగా తెలంగాణలో వచ్చిన మార్పులను, పోరాటాల వల్ల అల్లల్లాడిన గ్రామాలను, తుపాకీ మోతలను, దళితుల, వృత్తిపనివాళ్ళ వెతలను, దళారుల చేతిలో మోసపోవడాలు, గోరుచుట్టపై రోకటిపోటులాగా దేశీయ సమస్యలతో సతమతమయ్యే జనానికి పడగెత్తిన ప్రపంచీకరణ బాధ..... ఇలా అనేకానేక సమస్యలు నల్లగొండ జిల్లా కథానికకు వస్తువులయ్యాయి. నల్లగొండ కథకులు వైవిధ్యమైన కథానికలు రాసి తెలుగు కథకు ఒక దృక్పథాన్ని ఏర్పరిచారు.

నల్లగొండ జిల్లా కథకులు కేవలం రచయితలు మాత్రమే కాదు. సామాజిక ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ కోసం పోరాటాలు చేసిన వాళ్ళు. అందువల్ల వాళ్ళ కథానికలు శిల్పదృష్టితో కాకుండా సామాజిక దృష్టితో సాగాయి. ఈ పరంపరను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు కథకులు.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ కథలు - కాలువ మల్లయ్య, సదానంద శారద, చంద్ర, విశాలాంధ్ర బుక్‌హౌస్ - హైదరాబాద్.
2. తెలంగాణ తెలుగు కథ - పంతంగి వెంకటేశ్వర్లు, తెలుగు విభాగం యూనివర్సిటీ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, 2011.
3. తెలంగాణ కథకులు, కథన రీతులు - బి.యస్.రాములు. సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీమతి సూర్యా ధనుంజయ్ కథల్లో మానవ జీవన చిత్రణ

– ధనావత్ లక్ష్మి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, తెలంగాణ.

ఇటీవల కాలంలో కథల ద్వారా లోతైన మానవ జీవన చిత్రణ కావిస్తూ విభిన్న మనుషుల మనస్తత్వాలను చిత్రిస్తున్న ఆధునిక కథా రచయిత్రి శ్రీమతి సూర్యా ధనంజయ్. వంశీ సంస్థవారు ప్రచురించిన కొత్త కథలు, కథల సంకలనాల ద్వారా, నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం బతుకమ్మ ద్వారా, మూసీ మాసపత్రిక ద్వారా తెలుగు పాఠకులకు బాగా సుపరిచితమైన రచయిత్రి వీరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా తెలుగు బోధిస్తూ, రచయితగానూ మరో కోణాన్ని ఆవిష్కరించుకున్నారు. వీరి రచనలు ఇప్పటికే అనేకం సాహిత్యంలోకి వెలువడినాయి. బంజారా నానీలు, రామాయణ ఆశ్రమాలు శ్రీరాముని దర్శనాలు, నల్గొండ జిల్లా బంజారా సాహిత్యం జీవన చిత్రణ, తాండ్ర అనే వ్యాస సంపుటి, గమనం అనే వ్యాస సంపుటాలను రచించారు.

తెలుగు సాహితీ ప్రక్రియలలో కథ మానవ జీవితాన్ని అతి దగ్గరగా చూపించేటువంటి ఒక సాధనం. కథ తెలుగు సాహిత్యంలో ఎంతో ప్రాచీనమైనటువంటి ప్రక్రియగా భావించవచ్చు. రామాయణం, మహాభారతం, ఉప నిషత్తులు మొదలైన వాటన్నిటిలోనూ చిన్న చిన్న కథలు అనేకం దర్శనమిస్తున్నాయి. దీనిని బట్టి కథ కొన్ని వందల సంవత్సరాల క్రితమే ప్రారంభమైందని చెప్పవచ్చు. తొలుత గద్య కథనాలు, పద్య కథనాలుగా దర్శనమిచ్చిన కథ కాలక్రమేనా మార్పు చెంది వచన కథగా నేడు ఒక స్థిర రూపాన్ని దాల్చింది. "కథ్" అనే ధాతువు నుండి "కథ" అనే పదం పుట్టింది. దీనికి సంభాషించుట, చెప్పుట అనే అర్థాలున్నాయి. అగ్ని పురాణంలో కథానిక ప్రస్తావన ఉందని, సంస్కృతంలో ఇతివృత్త భేదాన్ని బట్టి "కథా, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథా" అనే భేదాలున్నాయని చెబుతారు. ఈనాడు తెలుగులో "కథ", "కథానిక" అనే పదాలు సమానార్థకంగా వాడబడుతున్నాయి. ఇవి ఆంగ్లంలో "Short Story" అనే ప్రక్రియకు పర్యాయాలుగా వాడబడుతున్నాయి. కథ పర్యాయ పదాలు చరిత్ర, గాథ, వృత్తాంతం. కథ ప్రకృతి అయితే కత వికృతి. కథలు చెప్పేవాడిని 'కథకుడు' అంటారు.

బ్రౌన్ నిఘంటువు ప్రకారం కథ అనగా ఇంచుక నత్యమైన కల్పిత ప్రబంధము. కథ చెప్పువాడిని "కథకుడు" అని కథ చెప్పే విధానాన్ని "కథనము" అని చెప్పే విషయాన్ని "కథితము" అని అంటారు. జె. నాగయ్య - ఒకానొక ఎత్తుగడ, నడక తీరు, ముగింపు, పరిమిత పాత్రలు, ఆ పాత్రలకు తగు పోషణ, వస్తు విన్యాస వైశిష్ట్యము, ఒక జీవిత సత్యమును ప్రతిపాదించుట, అన్నింటిని మించి వస్తైక్యము నుండి వినోదమో, విజ్ఞానమో, వికాసమో కలిగించగల చిన్న కథ. పోరంకి దక్షిణామూర్తి - జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్పనైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదే పదే చదవాలనిపింపజేసేది గొప్ప కథ.

అయితే పై నిర్వచనాల కోణంలో చూసినప్పుడు సూర్యా ధనంజయ్‌గారి కథలు ఆలోచింపజేసేవిగా, చదువుతున్నకొద్దీ చదవాలనింపించేవిగా, తర్వాత ఏం జరుగుతుందో అని ఆసక్తిని పురిగొల్పేవిగా ఉంటాయి. అంతేకాకుండా జీవితంలో ఎదురయ్యే ఊహించని మలుపులు, మనిషికి మధ్య ఏర్పడే సంఘర్షణలు వీరి కథల్లో ఇమిడి ఉంటాయి. అవి పాఠకుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

ఈ విషయాలు వారి కథలు చదివితే తెలుస్తుంది. రచయిత్రి సూర్యా ధనంజయ్‌గారు ఇప్పటివరకు

వెలువరించిన కథల్లో కొన్నింటిని ఇక్కడ విశ్లేషణ చేస్తాను. అవి:

1) ఉత్తరమొచ్చింది
2) ఝోళి
3) హిమ్మత్
4) అంబాలి
5) మస్తానన్న డబ్బా

ఈ కథలు రచయిత్రి సమాజ పరిశీలనా శక్తికి అద్దం పడతాయి. వీరిలో ఒక కథ తండ్రి ప్రేమను చెబితే, ఇంకో కథ తల్లి ప్రేమను, కన్న పేగు పడే బాధను తెలుపుతుంది. మరో కథ నమ్మిన సిద్ధాంతం వైపు జీవిత చరమాంకం దాకా నిలబడే వ్యక్తిత్వాన్ని చాటగా, ఇంకోటి కట్టుబాట్లను తెంచుకొని స్వేచ్ఛ వైపు పయనించిన మహిళా సాహసాన్ని తెలుపుతుంది. ఇక చివరి కథ కులమతాలకు తెంచుకొని స్వేచ్ఛవైపు పయనించిన మహిళా సాహసాన్ని తెలుపుతుంది. ఇక చివరి కథ కుల మతాలకు అతీతంగా అల్లుకున్న రాఖీ బంధాన్ని కళ్లకు కడుతుంది. వీరి కథల్లోని పాత్రలు, సంఘటనలు, కథావస్తువులు ఎక్కడో అరువు తెచ్చుకున్నట్లుగా ఉండవు. అవి మన కళ్లముందే తిరుగాడుతున్న భావన, మనకు ఎప్పుడో ఎక్కడో పరిచయం కలిగిన మనుషుల తాలూకు సంవేదన ఈ కథల్లో దర్శనమిస్తుంది.

ఉత్తరం వచ్చింది :

ఈ కథలో తెలిసీ తెలియని వయసులో రంగుల ప్రపంచాన్ని నమ్మి అదే నిజమైన ఆనందాల తీరమనీ ఇల్లు విడిచి చెన్నై నగరాన్ని చేరి పడరాని పాట్లు పడిన యువకుడికై తల్లిదండ్రులు పడే ఆవేదన కనిపిస్తుంది. పార్థ అనే యువకుడు 18 సంవత్సరాల కిందట ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. అతని గురించిన ఉత్తరం పోస్ట్‌మాన్ నారయ్య నుండి అందుకున్న తల్లి బాజు భాయి దాన్ని భర్తకు చూపిస్తుంది. చిన్ననాడు ఇల్లు వదిలిపోయిన కొడుకు చెన్నైలోని హోటల్‌లో ఉన్నాడని ఉత్తరంలోని సందేశాన్ని చదువుతాడు భీక్యా. వెంటనే హైదరాబాదు లోని పెద్ద కొడుకు ఇంటికి వెళ్లి అతడిని తీసుకొని చెన్నై వెళ్లి అక్కడ ఒక హోటల్‌లో పార్థని కలుస్తాడు. అందరూ ఇంటికి బయలుదేరడంతో కథ ముగుస్తుంది.

కేవలం మూడు ప్రధాన పాత్రలతో నడిచిన 'ఉత్తర మొచ్చింది' కథలో భావోద్వేగాలు మాత్రం అడుగడుగునా తారసపడతాయి. కొడుకు నుంచి ఉత్తరం వచ్చిందని తెలుసుకున్న తండ్రి భీక్యా ఉత్తరం రాసిన సమయానికి ఆలస్యంగా చేరిందని తాము పోయేవరకు తమ కొడుకు అక్కడ ఉంటాడో? ఉండడో? అని మదనపడి భోరున ఏడుస్తాడు. గత 18 సంవత్సరాలుగా హృదయంలో మోస్తున్న బాధ తీరబోతుంది అనే ఆశకి మళ్లీ ఏదైనా సమస్య అడ్డం పడుతుందేమోనన్న భయం ఆ తండ్రి హృదయాన్ని కలచివేసిన దుఃఖ వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది. ఇంటి నుంచి హైదరాబాదు చేరిన భీక్యా పెద్ద కొడుకు రాజును చూడగానే మళ్ళీ భోరున విలపిస్తాడు. పార్థ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది అని, మనం పోయేవరకు అతడు అక్కడ ఉంటాడో? లేదో? అని భయానికి గురి అవుతాడు. మనం ఏదైనా ఒక వస్తువు గాని, ఒక ప్రాణిని గాని ఎంత ఎక్కువగా ప్రేమిస్తే అది ఎప్పుడైనా మిస్ అవుతుందేమో దూరం అవుతుందేమో! అనే బాధ కొన్నాళ్లకు భయంగా మారుతుంది.

సైకాలజీలో దీని గురించిన వివరణ మనకు కనిపిస్తుంది. పుట్టినరోజు మొదలు రెండు సంవత్సరాల మధ్య వయస్సు ఉండే నవజాతశిశువు పక్కన తల్లి స్పర్శ లేకుంటే భయానికి గురి అవుతాడు. ఒకవేళ తల్లి అతని పక్కనే ఉన్నాగాని వారి ఇద్దరి మధ్య దూరం ఏర్పడి స్థలంలో నవజాతశిశువులోనే కాదు పెరిగి పెద్దైన తర్వాత జీవితాంతం మనసులో ఉంటూనే ఉంటాయి. ఇదే భీక్యా విషయం పాత్ర ద్వారా మనకి వెల్లడవుతుంది. ఇక చెన్నైలోని పెరియార్ హోటల్ యజమాని మంచి తనం ఇక్కడ చెప్పాల్సిన అవసరం ఉంది. ఎక్కడో తెలుగు రాష్ట్రం నుంచి ఇంట్లో చెప్పాపెట్టకుండా పారిపోయి వచ్చిన ఒక బాలుడిని చేరదీసి పనిలో

పెట్టుకొని అతడికి ఆశ్రయమిచ్చిన అతని గొప్ప మనసు కొనియాడదగినది.

ఈ విధంగా మనుషుల్లోని వారి స్వభావాలను సున్నిత మైన భావాలను వారి స్వభావాలను ఆలంబనగా చేసుకొని రచయిత్రి ఈ కథను అల్లారు. అంతేకాక లంబాడీ సమాజాల్లో ఉండేటువంటి దైవభక్తిని, విశ్వాసాలను కథలలో దృశ్యమానం చేశారు. వర్షం వస్తుందని రాత్రి బాజుభాయి ఉరుములు మెరుపులకు ఇనుప వస్తువు లను ఆరుబయట వేయడం, జొన్నలు చల్లటం, దేవుళ్ళను తలుసుకోవటం ఇంకా కథ చివరలో మంత్రు సాద్ వల్లే నువ్వు మాకు మళ్ళీ కనిపించావు అని వారి ఆరాధ్య దైవమైన మంత్రూసాద్‌ని తలుసుకోవటం ద్వారా వారి జీవితాల్లో వారి జీవితాల్లో విశ్వాసాల ప్రాముఖ్యతని పాఠకుల ముందుంచారు రచయిత్రి. ఈ విధంగా 'ఉ త్తరం వచ్చింది' కథలోని పాత్రల భావావేశాలు ఎంతో సహజసిద్ధంగా చిత్రించారు రచయిత్రి. ఈ కథ 2017 సంవత్సరంలో మూసీ మాసపత్రికతోపాటు అదే సంవ త్సరం 'తెలంగాణ రచయితల కథలు' పేరుతో అనిశెట్టి రజిత సంపాదకత్వం వహించిన గ్రంథంలోనూ ప్రచురిత మైంది. వీరి మరొక కథ 'ఝాళి'.

ఝాళి :

పేదవారు ఆడపిల్లలు పుట్టితే పెంచలేగ, చదివించి పెళ్లిళ్లు చేయలేక, అంగడిలో అమ్ముకునే దీనస్థితి ఈ కథలో కనిపిస్తుంది. శీత్లా తండాలో ఈ కథ నడుస్తుంది. కొడుక చంద్రూ నాయక్ తడి భార్య లక్ష్మి వీరికి ముగ్గురు ఆడపిల్లలు. పేదవాడైన తన కొడుకు ముగ్గురు ఆడపిల్లల పెళ్లి ఎలా చేస్తాడు? అనే దిగులుతో కోటిబాయి తన మనవరాలిని అంగడిలో అమ్మ జూస్తుంది. కాని, దేవర కొండలోని ఆసుపత్రిలో ప్రభుత్వం పెట్టి ఝాళి పథకం గురించి తెలుసుకొని అక్కడ ఆ పాపను వదిలేసి వస్తుంది. కూతురు జాడ తెలియక లక్ష్మి నారాజు అవుతోంది. చంద్రూ నాయక్ కూడా ఎంతో కుమిలిపోతాడు. రామీ బాయ్ బిడ్డ తార లెక్క తన కూతుర్ని కూడా ముంబాయి వాళ్ళకి అమ్మినారు అని భయపడుతుంది లక్ష్మి. చివరికి ఆస్పత్రిలో ఉన్న విషయం తెలుసుకొని హనుమానాయక్ సహాయంతో ఆసుపత్రిలోని కూతుర్ని తెచ్చుకొని బాగా చదివించి విజయను ఐ.పి.యస్. అధికారిని చేస్తుంది లక్ష్మి. ఈ ఉద్వేగభరితమైన కథలో లక్ష్మి హృదయం కన్నబిడ్డ ఆచూకీ కోసం విలవిలలాడి పోవటం పాఠకుడిని కంట నీరు పెట్టిస్తుంది. తల్లిని తిట్టలేక భార్యని ఓదార్చలేక ఇద్దరి మధ్యలో ఎంతో సంఘర్షణకు గురవుతాడు చంద్రూ. ఇతడి పాత్ర సమాజంలోని ఎందరో భర్తల తీరుకి పరిస్థితికి అద్దం పడుతుంది. ఇక అత్త కోటిబాయి కథ ప్రారంభంలో విలన్ పాత్రలా అనిపించినప్పటికీ చివరికి నిజం తెలిసిన తర్వాత సగటు పేద మహిళల ఆలోచనా తీరులా అనిపిస్తుంది.

బతకటానికి అడవిలో తండాలో నానా ఇబ్బందులు బడే బంజారాలు ఎటు ఇటువంటి పరిస్థితుల ద్వారా చిన్న పిల్లలను అమ్ముకుంటున్నారు తెలుపుతుంది. కేవలం కష్టాలు వస్తున్నాయని నిందించుకుంటూ కూర్చోకుండా దూరదృష్టితో ఆలోచించాలని పట్టుదలతో పైకి ఎదగాలని విజయ పాత్రల ద్వారా నిరూపిస్తూ చక్కని సందేశాన్ని అందించింది ఈ కథ. అత్యంత బాధను వ్యక్తపరుస్తూ అదే సందర్భంలో కూతురుపై ప్రేమను వ్యక్తపరుస్తూ చివరికి కొత్తగా ఆలోచించి కూతుర్ని మంచి స్థాయికి చేర్చిన విభిన్న భావాల కలబోతగా లక్ష్మి పాత్రను చెప్పుకోవచ్చు. కథలో ఎక్కువ సంఘర్షణను ఎదుర్కొన్న పాత్రగా అత్త కోటిబాయి చెప్పుకోవచ్చు. ఎందుకంటే కోడలు దృష్టిలో కొడుకు దృష్టిలో సమాజం దృష్టిలో చిన్న పిల్లను అంగడిలో అమ్మేసిన అపనిందను మూట గట్టుకుంది. ఆ నిజాన్ని ఎవరికి చెప్పకుండా మనసులోనే మోసింది. ఇక చివరికి తన మనవరాలిని కోల్పోవటం ఇష్టంలేక ఆస్పత్రిలో భద్రంగా పడుకోబెట్టి ఆ విషయాన్ని ఇంట్లో వాళ్ళకు చెప్పింది. ఇటువంటి సందర్భాల్లో కోటిబాయి ఎంతో బాధకి గురి అయింది. భయానికి గురైంది. ఇట్లా అనేక తీర్ల ఆమె సంఘర్షణకు గురైంది.

మొత్తంగా ఝాళి కథ ఒక కుటుంబంలో ఏర్పడిన కల్లోలం చెరువులో రాయి విసిరితే అలజడికి గురైన నీరు తిరిగి తిరిగి సద్దుమణిగినట్లు దేవరకొండ ఆసుపత్రిలో పాప దొరకడంతో సుఖాంతం అవుతుంది. లక్ష్మి చంద్రు కోటిబాయిల మధ్య ముక్కోణపు సంఘర్షణ సమాహారంగా కథని పొదిగించారు రచయిత్రి. ఈ కథ 2017 సెప్టెంబర్‌లో నమస్తే తెలంగాణ బతుకమ్మ సంచికలో అచ్చయ్యింది.

హిమ్మత్ :

ఈ కథ నెక్కొండ గ్రామంలో జరుగుతుంది. కథలో ప్రధాన పాత్ర రమణీబాయి. ఈమె మనవరాలు లక్ష్మి కొడుకు వెంకట్ రామ్. తండ్రి రానా నాయక్. అడవిలో ఉండి పోరాటాన్ని ఎంచుకున్న పాత్ర భూషణం గ్రామ పెద్దలు కరణం, మునసబు, ఇంకో పాత్ర బ్యాంక్ మేనేజర్. నలుగురికి మంచి చేయాలి అనే తండ్రి నినాదాన్ని వారసత్వంగా పుచ్చుకొని తండా వారందర్ని తన బిడ్డలుగానే భావిస్తూ అందరికి సేవలు చేసే రమణీబాయి అని ప్రజలు భూషణం అపార్థం చేసుకోవడం ఆ తర్వాత ఊరి కరణం, మునసబు, బ్యాంకు మేనేజర్ దొంగలని తెలుసుకోవడంతో మరొక మారు రమణీబాయి వ్యక్తిత్వం తండా ప్రజలందరికి తెలుస్తుంది. ఇది సూక్ష్మంగా 'హిమ్మత్' కథ.

రమణీబాయి కొడుకు వెంకట్‌రామ్ నాయక్ ప్రతిక్షణం తల్లి గురించి, ఆమె ఆలోచన తీరును గురించి ఆందోళన చెందుతున్నట్లు కథలో కనిపిస్తుంది. ఇతడి పాత్ర అట్లా ఆలోచించడానికి కారణం తన తాత, తండ్రి ఇలా ఊరి కోసమే ఎంతో సేవ చేసి కాలం చేశారు. అయినా వారు చేసిన మంచిని మర్చిపోయి ఒక అపార్థం చోటు చేసుకోగానే తన తల్లి అని ఊరి ప్రజలు కొట్టటం, మన పల్లెటూళ్ళలో ఒక సామెత వినిపిస్తుంది "ఊరికి చేసిన సేవ పాడేకు చేసిన సేవ ఎవరికీ గుర్తు ఉండవు, ఎందుకు పనికి రావు అని". అట్లానే ఇక్కడ కథలో రమణీబాయి నెక్కొండ గ్రామానికి ఎంతో సేవ చేస్తోంది. ఎప్పుడూ పక్క ఊరికి పోయి బ్యాంకుల చుట్టూ ఆఫీసుల చుట్టూ, తిరిగి తమ గ్రామ ప్రజలకు ఏవైనా లోనులు ఇప్పించాలని ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ ఉంటుంది. ఈ విషయం గ్రామంలోని ప్రజలందరికీ తెలుసు. అయినప్పటికి ఒక పొరపాటుకి వెనకా ముందు ఆలోచించకుండా ఆమెపై చేయి చేసుకోవడంతో తీవ్రంగా కలత చెందుతాడు వెంకట్ రామ్ నాయక్. చేసిన మంచిని అర్థం చేసుకోకుండా అపార్థం చేసుకున్నప్పుడు మనలాంటివారికి సైతం ఇట్లానే కోపం వస్తుంది.

తెలంగాణ ప్రాంతం నిజాం కబంధ హస్తాల నుంచి స్వాతంత్ర్యం పొందటానికి పూర్వం భూస్వాములు, దొరలు ప్రజలపై పెత్తనాలు చేసేవారు. ప్రజలకు ఏదైనా వసరం పడితే నయానో భయానో వేడుకొని అందుకు ఒప్పించాల్సిందే. అంతే కాని సామాన్య జనానికి ఎటువంటి హక్కులు లేవు. ఈ విషయం ఈ కథలో వెల్లడవుతుంది. ప్రజలను పట్టి పీడించే నాటి పాలకులు గ్రామాల్లో అధికారం చెలాయిస్తూ, అవినీతికి అలవాటుపడి సామాన్య ప్రజానీకాన్ని 'ఎలా దోచుకోవాలి' కథ ద్వారా తెలుస్తుంది. ఇక ఇందులో మరో కీలక పాత్ర భూషణం. అడవికి పోయి తుపాకి పట్టి సంఘంలోని కొన్ని వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ, వారితో రమణీబాయి కలిసి పనిచేస్తున్నప్పుడు నిజనిజాలు తెలియకపోవడంతో ఆమెను అపార్థం చేసుకోవటం సహజమే. మన నిత్య జీవితంలోనూ వాస్తవాలను గ్రహించక ఆవేశానికి లోనయ్యే భూషణం వంటి పాత్రలు, వ్యక్తులు అనేక మంది తారసపడుతూనే ఉంటారు.

కథ చివరకి వచ్చేవరకు రమ్మీ రమణీబాయి గొప్ప తనం తెలిసి ఆమె కాళ్ల మీద పడి క్షమించమని కోరడంతో భూషణం యొక్క ఉన్నత వ్యక్తిత్వం, విశాల హృదయం వెల్లడి అవుతుంది. బ్యాంకు మేనేజర్, కరణం, మునసబు ఒక్కటై ప్రజల భూములను దోచుకోవాలని చూడటం నాటి తెలంగాణ సమాజంలోని అధికారుల దాష్టికాలని, దోపిడీని కళ్లకు కడుతుంది. కథ ప్రారంభంలో ప్రవేశించే

పాత్ర చిన్నదే అయినప్పటికి మన చుట్టూ ఉండే చిన్న పిల్లల మనస్తత్వానికి అతి దగ్గరగా ఉంటుంది. మోతి ద్వారా దాది (నానమ్మ) కొడుతున్నారని తెలుసుకున్న లక్ష్మి ఒక్క ఉదుటున క్లానురూమ్‌లోంచి బయటకు ఉరుకుతుంది. అక్కడి నుండి తన గ్రామమైన నెక్కొండకు 2 కిలోమీటర్లు ఆగకుండా పరిగెత్తి చేరుకుంటుంది.

నగరాల్లో అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య వంటివారు పిల్లలకు అందుబాటులో ఉండరు. దాంతో పిల్లలకు కూడా వారితో అనుబంధం తక్కువగా ఉంటుంది. కాని పల్లెటూళ్ళల్లో అలా కాదు. పుట్టింది మొదలు ప్రతిరోజు అమ్మమ్మ, తాతయ్య ఒడిలో పెరుగుతుంటారు పిల్లలు. దాంతో వారికి ఒకరితో ఒకరికి విడదీయరాని అనుబంధం ఏర్పడుతుంది. లక్ష్మికి కూడా అలా ఏర్పడింది కాబట్టి తన నాయనమ్మను ప్రజలు కొడుతుంటే దారుణంగా భయపడింది లక్ష్మి. కాబట్టే పరుగున తండ్రి వద్దకు చేరే విషయాన్ని చెప్పింది. ఇలాంటి పాత్రలు మనకి నిత్య జీవితంలో ఎన్నో తారసపడుతూనే ఉంటాయి. మన చుట్టూ కదలాడే పాత్రలతోనే కథని రక్తి కట్టించిన రచయిత్రి సమాజ పరిశీలనా శక్తి ఇక్కడ తెలుస్తుంది. ఈ కథ వంశీ కల్చరల్ ప్రచురణలో తెన్నేటి సుధా సంపాదకత్వం వహించిన 'కొత్త కథలు సంకలనం' 2018 సంవత్సరంలో అచ్చు అయింది.

అంబాలి :

పాత కట్టుబాట్లకు లొంగిపోక ఆధునికంగా ఆలోచించి ఆమోదయోగ్యం కాని పాత సంప్రదాయాల ముసుగు చించిన ధీరవనిత గాథ 'అంబాలి' కథ. 2019వ సంవత్సరంలో తెన్నేటి సుధగారు సంకలన కర్తగా ఉన్న కొత్త కథలు కథాసంపుటిలో వంశీ సంస్థవారు ఈ కథను ప్రచురించారు. ఈ కథ భళ్ళూ నాయక్ తండాలో జరుగుతుంది. సేవ్యా, బూరి, అంబాలి తల్లిదండ్రులు. బాలు నాయక్ అంబాలి భర్త. లాలిబాయి అంబాలి అత్త. రాంలాల్, చంపాలాల్ తండా పెద్దలు. సూర్యకళ చదువుకొని మంచి ఉద్యోగం సంపాదించి పట్టణంలో ఉంటున్న మహిళ. ఈ పాత్రలు కథలో ప్రధాన భూమిక పోషిస్తాయి. ఈ కథ ప్రథమార్ధంలో బూరికి పిల్లలు లేరని తన కొడుక్కి రెండో పెళ్లి చేయాలని చూస్తుంది లాలిబాయి. కొన్నాళ్లకు బూరికి అంబాలి పుడుతుంది. అంబాలి పెరిగి పెద్దయ్యాక తీజ్ పండుగలో చూసిన బాలుకి ఇచ్చి పెళ్లి చేస్తారు.

బాలు ఇంకొన్నాళ్లకు పిడుగుపాటుకు గురై బాలు చచ్చిపోతాడు. అప్పుడే కథలో సమస్య ఏర్పడుతుంది. అంబాలిని బాలు తమ్ముడికి ఇచ్చి పెళ్లి చేయాలి అంటుంది లాలీబాయి. తండాలో చాలా సంవత్సరాలుగా ఇటువంటి ఆచారం ఉండటం వలన అందరూ దాన్ని సమర్థిస్తారు. కాని, అంబాలి మాత్రం అందుకు ససేమిరా ఒప్పుకోను అంటుంది. అప్పుడు అంబాలిని అందరూ సంప్రదాయాలను గౌరవించని ఒక అహంకారం నిండిన స్త్రీగా చూస్తారు. చివరికి పంచాయితీలో పట్నం నుంచి సూర్యకళ వచ్చి అంబాలిని తీసుకుని కారులో బయలు దేరడంతో కథ ముగుస్తుంది.

ఈ కథ కొన్ని సమాజాలలో ఇప్పటికి ఆచరించ బడుతున్న కొన్ని అలవాట్లను మన కళ్ళ ముందు ఉంచుతుంది. అన్న సచ్చిపోతే తమ్ముడికి వదినను ఇచ్చి పెళ్ళి చేయడం వాలి సుగ్రీవుల కాలం నాటి నుంచే అమల్లో ఉంది అంటూ కొన్ని గిరిజన సమాజాలు ఆమోదం తెలుపుతాయి. కాని, ఆ వివాహానికి అంగీకరించాల్సిన స్త్రీ అంతరంగం మాత్రం మరోలా కోరుకుంటుంది. సంప్రదాయాలకు, కట్టుబాట్లకు స్వేచ్ఛకు మనసుకు జరిగే ఘర్షణలో అంబాలి వంటి ఎందరో యువతులు తమ కోరికలను చంపేసుకుంటారు. తమ మనసులోని మాటను వెలిబుచ్చరు. నాగరిక సమాజం రూపొందించిన చట్టాలను భరించలేక మనసుకి సమాజానికి మధ్య అంతరాలను చెరిపివేయలేక, ఒక యంత్రంలా జీవితాన్ని వెళ్లదీస్తుంటారనే సత్యం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఆకాశంలో సగం అవనిలో సగం అయిన స్త్రీ హృదయానికి మనం ఇచ్చే గౌరవం ఏ పాటిదో ఇటువంటి కథలు చదివినప్పుడు వ్యక్తమవుతుంది. మరీ ముఖ్యంగా పితృస్వామ్యం వ్యవస్థను ఆచరణలో చూపుతూ స్త్రీల హక్కులను స్త్రీల స్వేచ్ఛను కాలరాస్తున్న కట్టుబాట్లు ఎలా ఉన్నాయో? ఇటువంటి కథల్లో విస్పష్టంగా తెలుస్తుంది. రచయిత్రి స్వయంగా బంజారా సమాజం నుంచి వచ్చిన వారే అయినప్పటికి తమ వ్యవస్థలోని లోటుపాట్లను ఈ కథ ద్వారా ఎత్తి చూపడమే కాక సుందరమైన బంజారా సంస్కృతి మరింత అందంగా అవ్వాలంటే ఇటువంటి విధానాలను విడిచిపెట్టాలని చెప్పకనే చెప్పారు.

ఇక కథలలో సమాజాన్ని చిత్రించిన తీరు చూస్తే 'న సాబ్' బంజారాలు ఏర్పాటు చేసిన పంచాయితీ పేరు. దీన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు. పంచాయితీలో తండా నాయక్ అతను అనుచర గణం ఏ విధంగా ప్రవర్తిస్తారు? తర్వాత సారా పంచడం వంటి అంశాలు వారి జీవితాలను దగ్గరగా మనకు చూపించాయి. ఒక సందర్భంలో కూప్లీబాయి అంబాలి అనే 70 ఏళ్ళ వృద్ధురాలి నిర్ణయాన్ని తప్పుపట్టడమే కాకుండా మా కాలంలో ఇటువంటివి లేవని మగవారిలోకి వచ్చి ఎదురుగా నిల్చొని మాట్లేడేవారు కాదని, ఇప్పుడు అమ్మాయిలు తెలివి నేర్చుకున్నారని, కట్టుబాట్లకు విలువ లేదని తిడుతుంది. ఇది గ్రామాల్లో పల్లెల్లో కూడా మనకు కనిపించేటటువంటిదే. వయసు ఎక్కువ ఉన్నటువంటి వృద్ధులు మార్పును త్వరగా అంగీకరించలేరు. వారు సనాతనమైన వాటిని సమర్థిస్తారు. అది తప్పయినా, ఒప్పయినా ఇదే విషయాన్ని కూప్లీబాయి పాత్ర ద్వారా చూపించారు రచయిత్రి.

మస్తానన్న డబ్బా...:

ఇటీవలనే నమస్తే తెలంగాణ ఆదివారం అనుబంధం బతుకమ్మ సంచికలో వచ్చిన 'మస్తానన్న డబ్బా' కథ సంఘంలోని అనేక విషయాలను మన ముందుంచు తుంది. కులమతాలకు అతీతంగా సోదరసోదరీ భావం పెంపొందడం, చిన్న చిన్న మనస్పర్థలతో సంవత్సరాల పాటు ఉన్న ఊరికి దూరమవడం మాంసం వ్యాపారులు జాగ్రత్తలు పాటించకుండా ప్రజల ఆరోగ్యాల పట్ల చింతన లేకుండా నిర్లక్ష్యంగా వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వదిలి వేయటం వంటి అనేక విషయాలను చర్చిస్తుంది ఈ కథ.

కథలోకి వెళితే మిర్యాలగూడ పాత బస్టాండ్‌లో దర్జీకొట్టు పెట్టుకొని బట్టలు కుట్టే ఒక మధ్య తరగతి వ్యక్తి మస్తాన్. హేమా నాయక్ తండాకు చెందిన ద్వాళిబాయి కూతురు మిర్యాలగూడలో ఆరో తగరగతి చదువుతుంటుంది. మస్తాన్ ద్వాళిని తల్లిలా, సుజాతను చెల్లిలా భావిస్తాడు. క్రమంగా వారి అనుబంధం పెరిగి పెద్దదవుతుంది. దీన్ని చూసి భరించలేని కొందరు మస్తాన్‌ని తండాకి రాకుండా చేయాలని, అతడిపై అపవాదు నెలకొల్పుతారు. అది భరించలేని సుజాత వారి మీద కోపంతో 30 సంవత్సరాలు మళ్లీ అక్కడికి రాదు. 30 సంవత్సరాల అనంతరం మస్తాన్ మరణవార్త విని తిరిగి మిర్యాలగూడ వస్తుంది. అప్పుడు మస్తాన్ కోర్టులో రాఖీలను చూసి ఎవరు కట్టారని విచారిస్తుంది.

తండా ప్రజలు మస్తాన్ మంచితనాన్ని తెలుసు కున్నారని, అపోహలు తొలిగిపోయాయని మస్తాన్ భార్య రజిత చెప్పడంతో సుజాత తేలికపడుతుంది. తాను ఎంతగానో ప్రేమించిన మస్తాన్ అన్న అవమానాలపాలు అవడంతో ఎన్నో ఏళ్లుగా బాధతో ఉన్న సుజాత ఆ బాధనుంచి తేరుకుంటుంది. చివరికి కొసమెరుపు ఏంటంటే సుజాత 30 సంవత్సరాలుగా కట్టిన రాఖీలు వాటితోపాటు ఒక నేసిన చీరను కవర్లో పెట్టి దాన్ని సుజాతకు ఇవ్వమని మస్తాన్ చనిపోవడానికి ముదే భార్యతో చెప్పి వెళ్లిపోతాడు. ఆ సన్నివేశం కళ్ళకు నీళ్లు తెప్పిస్తుంది. ఇది మొత్తంగా మస్తానన్న కథ.

ఈ కథ చదువుతున్నంత సేపు సుజాత మస్తాన్ అన్న సోదర భావం కథ నిండా పరుచుకుని ఉంటుంది. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సుజాత అర్ధరాత్రి ఫోన్ కాల్ వచ్చినప్పుడు తన మనసులో చెలరేగిన

ఆలోచనాసుడులు సగటు మానవుని భయాన్ని ప్రతి బింబిస్తాయి. అట్లానే కారు వేగంగా మిర్యాలగూడ వైపు వెళ్తున్నప్పుడు తన బాల్య జ్ఞాపకాలను సుజాత గుర్తు చేసుకున్న తీరు ప్రతి ప్రయాణంలోనూ మనల్ని మనం అన్వేషించుకోవడం తీరుగానే ఉంటుంది. దారి వెంట ఒక్కొక్కటిగా దాటిపోతున్నా చెట్లు ప్రయాణంలో మనల్ని ఏదో తీరాలకు తీసుకెళ్తాయి. ఇదే అంశం సుజాత ప్రయాణం చేసే సందర్భంలోనూ దర్శనం అవుతుంది. చిన్నతనంలో ఆదివారం సెలవు వస్తే హాస్టల్ నుంచి తండాకు వెళ్ళిన సుజాతకు తల్లి ద్వాళిబాయి జుట్టుకు నూనె పెట్టుతూ బుద్దులు చెప్పటం, మంచిగా బతకాలని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని హితబోధ చేయటం ఆడపిల్ల కలిగిన ప్రతి ఇంటిలో ఇలాంటి సన్నివేశాలు కుటుంబ జీవనంలో కనిపిస్తూనే ఉంటాయి.

దీన్ని బట్టి రచయిత్రి తన కథలతో ఊహలకు రెక్కలు తొడిగి ఆకాశంలో పయనింప చేయకుండా నేల మీద నిల్చొని జీవిత మూలాల్లోకి ప్రయాణించే ప్రయత్నం చేసిందని చెప్పవచ్చు. మస్తాన్‌ను అనుమానించిన కాల్యా, సక్కు, సైదా పాత్రల ద్వారా బంజారాలు అడవి బిడ్డలని వారు అడవి సంస్కృతిని నమ్ముకొని జీవిస్తారని ఎవరైనా తమ సమాజంలోకి ప్రవేశించితే కొత్తగా అంత త్వరగా నమ్మరని, ఒకసారి ప్రేమిస్తే మాత్రం కడుపులో పెట్టుకొని చూసుకుంటారని అర్థమవుతుంది. ఈ విధంగా మస్తాన్ అన్న డబ్బా కథ. అడివిలో జీవించే బంజారా సమాజంలోకి బంజారేతరులు ప్రవేశించితే ఏర్పడే అపోహలు, కలహాలు వాటి పరిణామాలను చక్కగా చర్చించింది.

కథల్లో భాష, సాహిత్యాలు :

శ్రీమతి సూర్యా ధనుంజయ్‌గారి కథల్లో భాష ఎంతో సరళంగా ఉండి చదువరులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా పాత్రోచిత సంభాషణలు ప్రదర్శించడంలో వీరి కలం ఉత్తమ రీతిలో కదలాడిందని చెప్పవచ్చు. ప్రతి కథలోనూ ఈ విషయం అర్థమవుతూనే ఉంది. మచ్చుకి ఒకదాన్ని చూసినట్లయితే హిమ్మత్ కథలో బ్యాంకు మేనేజర్లతో ఇలా అంటుంది "ఓ సారు మా తాండాకి ఓ సారి రాండ్రి గాడ కూడా గిట్లాంటి ప్యా దొల్లు ఇంతకంటే ఘోసతో బతుకుతున్నారు" అన్న సంభాషణలు వీరి కథల్లో పాత్రోచితమైన భాష ఎంత ప్రదర్శితమైంది తెలుపు తున్నాయి. అట్లానే వీరు ఈ కథల్లో ఆంగ్ల, హిందీ, ఉర్దూ పదాలను సందర్భానుసారంగా ప్రయోగించారు. తెలుగు భాషలో అనేక పదాలు ఆదానప్రధానులుగా మారిపోయాయి అనేది జగమెరిగిన సత్యం.

ముఖ్యంగా తెలంగాణ భాషపై ఉర్దూ ప్రభావం ఎంత ఉంది అనేది ఇక్కడి ప్రజల మాటల్లో ఇమిడిపోయింది. అందుకే కాబోలు సూర్యా ధనుంజయ్‌గారి కథల్లోనూ హిమ్మత్, పరేషాన్, దిమాక్, ఖరాబ్, బరాబర్ వంటి ఉర్దూ పదాలు కనిపిస్తున్నాయి. అట్లానే ఇంగ్లీష్ భాషా ప్రభావం తెలుగు భాషపై ఉంది. తెలంగు వ్యవహారంలో ఇంగ్లీష్ పదాలు ప్రయోగించడం పరిపాటి అయి పోయింది. ఇంగ్లీష్ పదాలు మామూలు ప్రజలు సైతం అలవాటుగా వాడుకునే వాటిని ప్రయోగించారు. ఇంగ్లీష్ కథల్లో టీచర్, మేనేజర్, అప్లికేషన్, ష్యూరిటీ, టౌను, రోల్‌మోడల్ మొదలైన పదాలు కనిపిస్తున్నాయి.

ఏదైనా ముచ్చట చెప్పేటప్పుడు ఇప్పుడు సామెతలు జతచేసి వాక్యాన్ని ప్రయోగించడం గ్రామాల్లో ప్రధానంగా కనిపించే అంశం. సామెతలేని వాక్యం ఆమెతలేని ఇల్లు అంటారు అందుకే. సామెతలు అనేకం సందర్భానుసారం కథల్లో పలుపు దెంచుకున్న పశువులే తడిగుడ్డతో గొంతు కోస్తారు వంటి సామెతలు, సన్నివేశాన్ని మరింత లోతుగా పరిస్థితి తీవ్రతను కథలో పాఠకుడికి అర్థం అవటానికి దోహదపడినాయి. తీజ్ సందర్భంలో "మా హుందా సేది బోయి తీజ్/మాకాయతి తేట తీజ్" అనే గేయాలు కథలో కనిపించడం ద్వారా బంజారా మౌఖిక సాహిత్య పరిమళాలు అద్దారు రచయిత్రి.

ఈ విధంగా శ్రీమతి డాక్టర్ సూర్యా ధనుంజయ్‌గారు తన కథల ద్వారా సామాజిక సమస్యలను, స్త్రీల సమస్యలను, ప్రభుత్వ వ్యవస్థల దోపిడీలను కుల మత

సామరస్యాలను లోతుగా చర్చిస్తున్నారు. అదే సమయంలో పాఠకుడిలో ఒక ఆలోచనని, ఒక ఎరుకని కలిగించి దోపిడీకి గురి కాకుండా, హక్కులను కోల్పోకుండా, ప్రశ్నించే తత్వం రగిలిస్తున్నారు. ప్రత్యేకించి స్త్రీలు కాలం చెల్లిన కట్టుబాట్లకు బందీలు కావద్దని ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని ఒత్తిడిలు ఉన్నా వాటన్నింటిని ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని తన కథల ద్వారా, కథ లోని పాత్రల ద్వారా సందేశాన్ని ఇచ్చారు రచయిత్రి.

మానల జీవితం ఎంతో అందమైనది. అది ఒక్కొక్కరికి ఒక్కోలా కనిపిస్తుంది. చలంకి జీవితం ఆస్వాదించ దగిందిగా అందమైనదిగా కనిపిస్తే, శ్రీశ్రీకి జీవితం ఒక పోరాటంలాగా, ఒక యుద్ధంలాగా కనిపించింది. వేమనకు జీవితం ఆశల వెంట పరిగెత్తుతూ నీటి మీద బుడగల పగిలిపోయే బుద్బుదప్రాయంగా మూఢనమ్మకాల వెంట తిరిగే వ్యవస్థగా కనిపించింది. సూర్యా ధనుంజయ్‌గారి కథలు చూసినప్పుడు వీరికి జీవితం పట్ల ఎంతో విశ్వాసం, ప్రేమ ఉన్నట్లు తెలుస్తోంది. జీవితంలోని మాధుర్యాన్ని జీవన ప్రయాణంలో వచ్చే కష్టాలను, సుఖాలను అన్నిం టిని దాటుకుని తీరం చేరటంలోనే జీవిత పరమార్థం ఉందని అర్థమవుతుంది.

సంస్కృతి సంప్రదాయాలు ఎంత అందమైనవో తెలుపుతూ తీజ్ పండుగ, శీతల భవాని పండుగ, పెళ్ళి తంతులు వీరి కథల్లో చెప్పారు. అదే సందర్భంలో నేటి సమాజంలోని అవగాహనలేని తనాన్ని, అమాయకత్వాన్ని, మూఢనమ్మకాలను, ఆచరణ సాధ్యంకాని కట్టుబాట్లను విభేదించారు. మొత్తంగా వీరి కథలు సమాజంలోని మంచిని చెడుని చెబుతూనే పాఠకుడు ఎటువైపు నిలబడాలో మనల్ని మనమే నిర్ణయించుకోవాలి అనే ప్రశ్న మనముందు ఉంచుతున్నాయి.

సావిత్రిబాయి పూలే, ఇందిరా గాంధీ, మదర్ థెరిస్సా వంటి జాతీయ అవార్డులు పొంది ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అంతర్జాతీయ పురస్కారాన్ని పొందిన రచయిత్రి శ్రీమతి సూర్యా ధనుంజయ్‌గారు తమ కథల ద్వారా సమాజాన్ని ప్రతిబింబిస్తూ సంస్కృతి సంప్రదాయాలకు జీవం పోస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికై బాటలు వేస్తున్నారని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1) నమస్తే తెలంగాణ, బతుకమ్మ సంచిక.
2) మూసీ సాహిత్య మాసపత్రిక - కమలాకర శర్మ.
3) శతాధిక రచయిత్రుల కథలు - వంశీ సాహిత్య పీఠం.
4) అంతర్జాలం - ఆన్‌లైన్ కథలు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"భారతం"లో స్త్రీ

- రమాదేవి ఇడికూడ, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

శ్లో॥ ధర్మే చార్థేచ కామేచ, మోక్షేచ భరతవర్ష భ
యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి నతత్ క్వచిత్

చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ కామమోక్షాలకు సంబంధించి ఇందులో ఉన్నదే లోకంలో ఉంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు అని భారతాన్ని ఒక్క మాటలో వేదవ్యాస మహర్షి వివరించాడు.

మహాభారతాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే నేటి భారతీయ సమాజం స్పష్టంగా కనిపిస్తుంది. భారతం నాటి, నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే గాథ. భారతంలోని పాత్రలు నేటి భారతంలోని పాత్రలుగా సమాజంలో తిరుగాడుతూ కనిపిస్తాయి. భారతంలో ఉన్న స్త్రీ పాత్రలు సమాజంలో ఉండే భిన్న మనస్తత్వాలను చూపుతాయి. వాటిని ఒకసారి పరిశీలిస్తే నేటి సమాజంలోని స్త్రీలు కనిపిస్తారు. అలాంటి స్త్రీ పాత్రలను కొన్నింటిని చూద్దాం.

సూర్యుని కుమార్తె తపతి, ఉత్తమ గుణాలు కలది. ఈమెను చూసి సంవరణుడు మోహిస్తాడు. తపతి వద్ద వివాహ ప్రతిపాదనను తీసుకొస్తాడు. సుమనస్కురాలైన తపతి సున్నితంగా తిరస్కరిస్తుంది. తనపై గల అభిలాషను తెలుసుకొని తన తండ్రిని ఒప్పించి వివాహం చేసుకొమ్మని చెబుతుంది. కనిపెంచిన తల్లిదండ్రులకు, విలువనిచ్చిన ఆదర్శ పాత్ర తపతి. నేటికాలంలో కొందరు స్త్రీలు కూడా తన వివాహ విషయంలో తల్లిదండ్రులకు గౌరవమిచ్చి ప్రవర్తించేవారు కూడా కలరు.

దిక్పాలకులను కూడా కాదని నలుడిని ప్రేమించి వివాహమాడిన సౌందర్యవతి దమయంతి తాను ప్రేమించి వివాహం చేసుకున్న భర్త శని ప్రభావం వలన రాజ్యాన్ని, ధనాన్ని కోల్పోయి అడవుల పాలయినా, ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నా చాకచక్యంతో సంసారాన్ని దిద్దుకున్న వనిత, స్త్రీశక్తికి, మేధోసంపత్తికి గొప్ప ప్రతీక దమయంతి నేటి కాలంలో దమయంతిలాగా పతి భక్తి కలిగి, చాకచక్యంతో సంసారాన్ని చక్కదిద్దుకునే స్త్రీలు కలరు.

సునయన జనకమహారాజు భార్య. జనకుడు తన రాజ్యం వదలి, భిక్షవృత్తి స్వీకరించాలనుకుంటాడు. సునయన సన్యాసం స్వీకరించడం రాజు యొక్క కర్తవ్యం కాదని బీదసాదలను ఆదుకోవడం, రాజ్య సంరక్షణ బాధ్యత, రాజు కర్తవ్యం అని బోధ చేస్తుంది. తన భర్తని మార్చుకుంటుంది. పురుషుడు తన బాధ్యతలను విస్మరిస్తున్నప్పుడు, సునయన లాంటి నేటి స్త్రీలు, సరైన సమయంలో స్పందించి పురుషులను కర్తవ్యోన్ముఖులను చేస్తారు.

చెట్టు తొర్రలో నివసించే మగ పావురం భార్య కపోతి. భార్యాభర్తల అనుబంధానికి ప్రతీకలు ఈ కపోతాలు. ఒకరిపై ఒకరికి ఎంతో ప్రేమానురాగాలు గల భార్యా భర్తలు. ఒకరి ఎడబాటును ఒకరు తట్టుకోలేక రెండు మరణం పొంది పుణ్య లోకాలకు చేరుకుంటాయి. అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలు ఈ కపోతాలు. ఈనాటికి అన్యోన్య దాంపత్యం కల ఈ కపోతాల వారసులు ఎందరో కలరు.

విశ్వామిత్రుడు, మేనకల పుత్రిక కణ్వమహర్షి పెంపుడు కూతురు - శకుంతల. దుష్యంతుడి మాటలను నమ్మి, పెద్దలకు తెలియకుండా, రహస్య వివాహాన్ని చేసుకొని భరతునికి జన్మనిస్తుంది. రహస్య వివాహంవల్ల సమాజంలో దోషిగా స్త్రీ ఎదుర్కొనే సంఘర్షణలకు శకుంతల నిదర్శనం. శకుంతల వంచించావని తెలిసి కృంగిపోలేదు. నిండు సభలో ధైర్యంగా ప్రశ్నించి పురుషుల స్వభావాన్ని ఎండగడుతుంది. భారతంలోనే కాదు నేటి భారతంలో కూడా అభినవ శకుంతలలు ఎందరో.

పాండు రాజు భార్య కుంతి, పాండవుల తల్లి, దుర్వాసముని ప్రసాదించిన మంత్ర శక్తిని పరీక్షించగోరి

అవివాహితగానే సూర్యుడి చేత పుత్రుడికి జన్మ నిచ్చిన వనిత. అనాలోచితంగా చేసిన కార్యంవల్ల సమాజంలో ఎదుర్కొనే సమస్యలకు భయపడి పుత్రుడిని నదిలో వదులుతుంది. అవివాహిత తల్లిగా జీవన పర్యంతం సంఘర్షణకు లోనైన కుంతి పాత్ర నేటి ఎందరో స్త్రీలకు కనువిప్పు.

కుర్ణుడి పెంపుడు తల్లి రాధ. సంతాన హీనురాలైన రాధ అనాథ అయిన కర్ణుడిని చేరదీసి పెంచిన తల్లి. కన్న తల్లుల కంటే మిన్నగా ప్రేమను పంచే తల్లులకు ప్రతినిధి రాధ.

జరిత మందపాలుని భార్య. జరిత ఒక పక్షి . మందపాలుని వలన నలుగురు పక్షి పిల్లలకు జన్మ నిస్తుంది. మందపాలుడు లేని సమయంలో ఖాండవ వనదహనం జరుగుతుంది. ఆ వనంలోనే ఉన్న జరితలో తన పిల్లలను అగ్నిజ్వాలల నుండి ఎలా కాపాడుకోవాలో పరితపించే మాతృహృదయం కనిపిస్తుంది. జరిత లాగే సమాజంలో కొందరు స్త్రీలు భర్తలు వృత్తి రీత్య సుదూర ప్రాంతాలలో ఉన్నప్పుడు తమ పిల్లల రక్షణా బాధ్యత కోసం పాకులాడతారు.

సాత్వతి శిశుపాలుని తల్లి. శిశుపాలుడి చావు కృష్ణుడు చేతిలో ఉంది అని గ్రహిస్తుంది. సాత్వతి పుత్ర మమ కారంతో శ్రీ కృష్ణునితో తన కుమారుడు నూరు తప్పులు చేసేంతవరకు క్షమించి వదిలివేయమని ప్రార్థిస్తుంది. పిల్లలు దుర్మార్గులైన తప్పులు క్షమించమని కోరే తల్లిదండ్రులు ఆ భారతం లోనే కాదు నేటి భారతంలో కూడా కలరు.

ధృతరాష్ట్రుడి భార్య గాంధారి, కౌరవుల తల్లి. భర్త అంధుడు, భర్త పొందనిది తాను పొందనని, భర్తకు లేని దృష్టి తనకు అక్కర లేదని వివాహానికి పూర్వమే నేత్ర పట్టం కట్టుకొని కంటి చూపులేని జీవితాన్ని కోరి వరించిన త్యాగశీలి, మహాప్రతివ్రత. గాంధారీ లాంటి స్త్రీలే కాకుండా ప్రద్వేషిణి లాంటి వారు సమాజంలో కలరు. ప్రద్వేషిణి దీర్ఘతముడి భార్య. భర్తపుట్టు గ్రుడ్డివాడు. కావున ప్రద్వేషిణి అతనిని మెచ్చక నేనింకను బరించలేను ఎక్కడికైనా వెళ్ళిపో అని పంపివేస్తుంది. ఇలా వైకల్యం గల భర్తను తిరస్కరించే స్త్రీలు నేటి భారతంలో కూడా కలరు.

దేవయాని రాక్షస గురువు శుక్రాచార్యుని కుమారై. తండ్రి అధికారం, పేరుప్రతిష్టలను తమదిగా భావించి మొండి వైఖరి ప్రదర్శించే పాత్రలో దేవయాని కని పిస్తుంది. నేటి సమాజంలో కూడా తండ్రి ప్రేమను చూపే ప్రేమను అడ్డుపెట్టుకొని భర్త పట్ల, అత్తమామల పట్ల అహంకారంతో హద్దు మీరి ప్రవర్తించే వనితలు ఎందరో కలరు.

సుదేష్ణ విరాట రాజు భార్య. కిచకుడికి సోదరి. కీచకుడి వంటి పరస్త్రీ కాముకుడిని సమర్థించే పాత్ర సుదేష్ణది. నేటి సమాజంలో ఇలాంటి స్త్రీలు కలరు. తమ సోదరులు, పుత్రులు ఇతర స్త్రీలపై చేసే అఘయత్యాలను వెన కేసుకొస్తారు.

మండూక నాయకుని కూతురు సుశోభన. తన రూపును మార్చుకొని వివాహం పేరుతో ఎందరినో మోసం చేసిన స్త్రీ. పరిక్షిత్తు మహారాజును కూడా వివాహం చేసుకొని మోసగించింది. ఇలాంటి యువతులు కూడా నేటి భారతంలో కలరు.

బహుభార్యత్వం గల దేశంలో ఇద్దరు సపత్నుల మధ్య ఉండే ఈర్ష్యాద్వేషాలకి నిదర్శనం వినత,కద్రువ. సపత్నుల్లో సహజంగా ఉండే ఈర్ష్యా ద్వేషాల వలన బలంలో, అధికారంలో, భోగాలలో ఒకరిని మించి ఒకరు జీవిం చాలని ఆరాటపడే వనితలు మన దేశంలో అక్కడక్కడ తారసపడతారు.

మహాభారతంలో కొందరు స్త్రీలు అలా మెరుపులా కనిపించి పోతారు. కాని వారు ఉన్న కొద్ది క్షణంలోనే వెలుగును పంచిపెడతారు. అలాంటి పాత్ర సరమ (దేవతల కుక్క). జనమేజయుడు, యజ్ఞం చేస్తున్నప్పుడు, ఆ యజ్ఞ పరిసరాలలో తిరగాడే కుక్క పిల్లలను కొట్టి బాధిస్తారు. అప్పుడు సమర జనమేజయుని వద్దకు వచ్చిన

ఆయన తమ్ములు చేసిన తప్పు గురించి భయం లేకుండా నిలదీస్తుంది. రాజును సైతం ఎదిరించి మాట్లాడి బుద్ధి చెప్పే వ్యక్తిత్వం నేటి సామాన్య స్త్రీలలో కూడా కలదు. సమాజంలో ధైర్యంగా అన్యాయాన్ని ఎదిరించే ధీర వనితలు ఉండడం అత్యంత ఆవశ్యకం. ఈ విధంగా భారతంలోని మహిళలందర్నీ విశ్లేషిస్తూ వెళితే మరో మహిళా భారతమవుతుంది. లోకంలో భిన్న నడవడిక గల వ్యక్తులుంటారు. మానవులు మంచి నడవడిగల వ్యక్తులను అనుసరించి, ఆదర్శంగా తీసుకొని జీవించడమే మహాభారత గ్రంథ లక్ష్యం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పెన్నా శివరామకృష్ణ సాహిత్యేతర రచనలు - అధ్యయనం

- ఐ.చిదానందం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సాహిత్య రచనైనా సాహిత్యేతర రచనైనా ప్రధాన విషయాన్ని వివిధ అంశాలుగా విభజించుకొని పరిశీలన చేసి అన్వయ విమర్శను పరిపుష్టం చేయడం పెన్నా శివరామకృష్ణ ప్రత్యేకత. వీరి రచనల్లో ఆత్మాశ్రయత్వం, అనుభూతివాదం తాలూకా లక్షణాలు ఎక్కువ. అందుకే విషయ విశ్లేషణ లోతు ఎక్కువగాఉంటుంది. పెన్నా సాహిత్యేతర రచనలు కింది విధంగా ఉన్నాయి.

1. ఆవిష్కరణ సంపుటిలో(2009) - కళాకారుల జీవితాలు కల్లోల సాగరాలు. (వ్యాసం) కన్నీటి కథ (వ్యాసం)
2. రోజురోజుకో చరిత్ర (2004)
3. జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు (2006)
4. నిరాశావాది నిఘంటువు (2006)
5. ప్రేమ... మరికొన్ని సంగతులు (2009)
6. ముద్దుల ముచ్చట్లు (2009)

పెన్ని తన రచనలలో కింది విషయాలను భూమికగా చేసుకొని వారి రచనా ప్రస్థానాన్ని విశ్లేషించవచ్చు.

1. రచనల్లో కొత్త విషయాలను తెలియపరచడం.
2. కొత్త భావాలను క్రోడీకరించడం.
3. సాహిత్యేతర రచనల్లో కొత్త ఒరవడిని, పరిశోధనత్మకతను ప్రవేశపెట్టడం.
4. పరిమితులకు లోబడి ప్రామాణికమైన సిద్ధాంతాలను ప్రతిపాదించడం.

పెన్నా సాహిత్యేతర రచనల్లో అనుభూతి కోణం గమనించవచ్చు. మనోవైజ్ఞానిక విధానంలో పరిశీలనచేశారు. అలాంటి రచనలను ఈ వ్యాసంలో పరిశీలనగా చూద్దాం.

కళాకారుల జీవితాలు కల్లోల సాగరాలు (వ్యాసం)

అన్ని వృత్తులలో విలక్షణమైన వృత్తి కళాకారులది. ఇతర ఉద్యోగ జీవితాలతో పోల్చుకుంటే కళాకారుల జీవనశైలి విభినమైనది. కళాకారుల నిజజీవితంలో అంతా సుఖంగా సాఫీగా సాగినట్లు కనిపించదు. వారి వ్యక్తిగత జీవితం క్రమశిక్షణా రాహిత్యంగా ఉంటుంది.

కళాకారులంటే ఇక్కడ కవులు, రచయితలు, చిత్రకారులు, రంగస్థల కళారులు, ప్రత్యేకించి సినిమా రంగానికి చెందినవారు మొదలైనవారిగా భావించవచ్చు. కళాకారుల జీవితం గందరగోళంలో సాగడానికిగల కారణాలను వారి ఉద్వేగాలను, ప్రతిస్పందనలను, వారి జీవితాలపై పరిశోధనా విషయాలను పెన్నా "కళాకారుల జీవితాలు - కల్లోలసాగరాలు" అనే వ్యాసంలో చర్చించారు. ఇది ఆవిష్కరణ సంపుటిలో చోటుచేసుకుంది. పై వ్యాసంలో పెన్నా కళాకారుల వ్యక్తిగత జీవితంలోని అగాధాలను ఈ విధంగా కారణాలు చెప్పారు. "వివాహం, విడాకులు, పునర్వివాహాలు, అనేక ప్రేమవివాహాలు, భగ్నప్రేమలు, వివాహేతర సంబంధాలు, మధ్యపానం మొదలైన వ్యసనాలకు బానిసలు కావడం అనారోగ్యంతో హఠాన్మరణాలు" (పుట-34).

పైన చెప్పిన విషయాలలో ముఖ్యంగా గుర్తింపు పొందాలనే తపన, కళాకారుల వ్యక్తిగత జీవితాన్ని ఆలోచనలో పడేసి పరిస్థితులను విస్మరించేలా చేస్తుంది. మరో విధంగా చెప్పాలంటే గుర్తింపు కాంక్షకోసం అడ్డదారులు తొక్కవలసిన పరిస్థిని కళాకారులు ఎదుర్కొంటారు. ఇలాంటి విషయాలనే పెన్నా తన వ్యాసంలో విపులంగా వివరించారు. పై కారణాలతోపాటుగా విశృంఖలత్వం, మధ్యపానం వంటి అంశాలు కూడా సృజనాత్మక రంగంలోని వారి జీవితాలపై ప్రభావాన్ని చూపిస్తాయని పెన్నా అభిప్రాయం. కళాకారుల ఆత్మవిధ్వంసక ప్రవృత్తి, ఆత్మ హసనానికి దారి తీస్తుందనడానికి ఉదాహరణలు తన ఇచ్చారు.

కళాకారుల కల్లోల సాగరం వ్యాసంలో కళాకారుల పరిధిని గురించి చర్చించారు. మౌళికాంశాల వివేచన చేసి చాలా ఖచ్చితమైన, నిష్పక్షపాతమైన విమర్శకృషిని సాగించారు. ఈ వ్యాసాన్ని అనువర్తిత విమర్శగా చెప్పవచ్చు.

కన్నీటి కథ (వ్యాసం)

జీవితంలో మనసారా నవ్వనివాడు ఉండవచ్చునేమో కాని ఒక్కసారైనా కన్నీరు కార్చనివారు ఉండరు. నిజానికి ఎవ్వరూ దుఃఖించాలని కోరుకోరు. కాని చాలా సందర్భాలలో కన్నీరు అనివార్యమవుతుంది. ఇలాంటి కన్నీరు గురించి కన్నీటి కథ అనే వ్యాసాన్ని రాసారు పెన్నా. ఇది అవిష్కరణ వ్యాస సంపుటిలో ప్రచురితమైంది.

ఈ వ్యాసంలో కన్నీరు ఏఏ సందర్భాలలో ఏ కారణాల వల్ల వస్తుంది, కన్నీరుకు కారణాలు ఏమిటి? ఏడ్చినప్పుడు కాకుండా నవ్వినప్పుడు కన్నీరు ఎందుకు వస్తాయి? దుఃఖాశ్రువులు మనుషులకేనా? ఇతర ప్రాణులకు ఉన్నాయా? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఆసక్తికరమైన వివరణను పెన్నా ఇచ్చారు. ఈ వ్యాసం కళాతత్వ అవిష్కరణలతో కూడినది. లోతైన ఆలోచన చేసి కొత్త కోణాల నుండి దర్శించి విశ్లేంచి వివేచించారు పెన్నా.

రోజురోజుకో చరిత్ర (2004), జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు (2006), తారీఖులో తెలంగాణ (2020)

వివిధ రంగాలలో ప్రసిద్ధులైన వారిని గురించి రేఖామాత్రముగా సమాచారాన్ని వివిధ రంగాలలో వ్యక్తులు చేసిన కృషిని విలక్షతను సంకలనం చేస్తూ పెన్నా రోజురోజుకో చరిత్ర అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్ వారు ప్రచురించారు. మన దేశంలో, ఇతర దేశాలలో వివిధ సంధర్భాలలో ప్రత్యేకంగా కొన్ని అంశాలలో దినోత్సవాలను జరుపు కుంటాము. అలాంటి దినోత్సవాలను గురించి జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఈ పుస్తక రచనల్లో పెన్నా సమాచార విషయాన్ని సంక్షిప్త వివరణ ఇచ్చారు. ఇది పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరం.

పై గ్రంథాల లాంటిదే తారీఖుల్లో తెలంగాణ దీనిని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారు ప్రచురించారు. ఇందులో సమకాలీన తెలంగాణ ఉద్యమం, చరిత్రలోని ప్రధాన ఘట్టాలు, ప్రముఖ వ్యక్తుల గురించి సంక్షిప్త సమాచారాలు తేదీల వారీగా తెలంగాణ చరిత్రను లఘుపరిచయం చేశారు.

పెన్నా రచనలను అర్థం చేసుకోవడానికి మూడు పద్ధతుల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అవి:

1. నిర్వచన స్థాయి.
2. ప్రయోగస్థాయి.
3. పఠన స్థాయి

తను ఎంచుకున్న అంశాన్ని ప్రాధాన్యత ఇచ్చి విషయాన్ని విపులంగా చర్చించి సిద్ధాంతీకరిస్తారు.

నిరాశావాది నిఘంటువు

ఈ రచన చమత్కారాన్ని కలిగించే హాస్య, వ్యంగ నిర్వచనాల నిఘంటువు. దీనిలో వివిధ అంశాలకు, వివిధ వస్తువులకు ఉన్న విభిన్నమైన కోణాలను అవిష్కరించారు రచయిత. పుస్తకానికి ఉన్న శీర్షికను బట్టి ఇందులోని నిర్వచనాలు నిరాశకు ప్రతిబింబాలు అనుకుంటారు. కాని ఇవన్నీ నిగూఢార్థతను ఇచ్చే నిర్వచనాలు. పెన్నాయే అన్నట్లు "సహృదయత విశాల దృక్పథం ఉంటే వీటిని ఆనందించవచ్చు" ఈ నిర్వచనాలలో వ్యంగాన్ని అంత స్తవాన్ని బహిరంగంగా ఆమోదించకపోయినా అంత రంగికంగా విశ్లేషించి చూసుకోవచ్చు. ఈ నిర్వచనాలు ధ్వనించే సత్యాలను పాక్షిక సత్యాలుగా అర్థం చేసు కోవచ్చు.

జీవితంలో వివిధ సందర్భాలలోని వాస్తవ దృష్టి, లోతైన పరిశీలన దృష్టి మనం గమనించవచ్చు. వీటిలో చాలా నిర్వచనాలు మనల్ని ఆలోచింపచేస్తాయి. అకారాది క్రమంలో రచయిత వివిధ అంశాలను నిర్వచించారు. వాటిలో కొన్ని మనం చూద్దాం.

అదృష్టం : ఇతరుల విజయానికి మనం చెప్పే ప్రధాన కారణం.

అబద్ధం : బుద్ధిహీనుడైనా నిజం మాట్లాడగలడు. అబద్ధం చెప్పేవాడు మాత్రం తెలివికలవాడై ఉండాలి. (శ్యామూల్ బట్లర్)

కమ్యూనిష్టు : నీదగ్గర నుంచే వంట పాత్రను తీసుకొని నీ కోడిని వండుకుతినేవాడు.

కవిత్వం : రాజకీయనాయకులకు కోపం వస్తే కవిత్వం మాట్లాడతారు. కవులకు కోపం వస్తే రాజకీయాలు మాట్లాడతారు.

నిర్ణయం : ఆలోనలతో అలసిపోయిన తర్వాత మనిషి స్వభావం.

న్యాయవాది : ప్రాక్టీస్ చేయడానికి అనుమతించబడిన అబద్ధాలకోరు.

పరిశోధన : ఒకరి నుంచి దొంగలిస్తే కాపీ అంటారు. అనేక మంది రచయితల నుండి దొంగిలిస్తే పరిశోధన (విల్సన్)

పిసినారి : ధనవంతుడుగా చావడం కోసం నిత్యం పేదవాడిగా బతికేవాడు.

పుట్టుక : మరణానికి ప్రారంభం.

హీరో : పారిపోవడానికి భయపడేవాడు (ఇంగ్లీష్ సామెత)

ఈ నిర్వచన కూర్పు సేకరణ అంతా పెన్నా సరదాగా చేసారని అనుకోవడానికి వీల్లేదు. ఇందులో ప్రతి అంశంపై క్లుప్తం, వ్యంగ్యంగా, చమత్కారంగా నిగూఢార్థంగల నిర్వచనాలనే రచయిత ఇచ్చారు. కొన్నింటిలో నిరాశా, ప్రతికూల ధోరణి కనిపించినా వాటిలో కొన్నింటి అంతర్థారం గ్రహిస్తే నగ్నసత్యాలుగా కనిపించక మానవు.

ప్రేమ.... మరికొన్ని సంగతులు

ఇందులో ప్రపంచ ప్రసిద్ధమైన చమత్కారమైన ప్రేమ కొటేషన్లు సమాహారంగా ఉన్నాయి. మనుషులను, ప్రేమ అనే భావనను విడదీసి చెప్పలేము. జీవితంలో ఏదో ఒక దశలో ప్రేమ అనే భావనకి లోనుకాకుండా ఉండలేము. ప్రేమ గురించి మనకు తెలిసినా తెలియని అనేకానేక సంగతుల సమాహారం ఈ పుస్తకం. దీనిలో రచయిత ప్రేమ అనే అంశాన్ని 13 విభాగాలుగా విభజించారు. అవి ప్రేమ, ముద్దు, సౌందర్యం, భార్య, భర్త, శృంగారం, స్త్రీ, పురుషుడు, పెళ్ళి, విడాకులు, బ్రహ్మచారి, ప్రేమలేఖ, కొగిలింత పై విభాగాలలో ఆయా అంశాలకు సంబంధించిన వివిధ కవులు, విమర్శకులు, ప్రముఖులు ఇచ్చిన నిర్వచనాలను ఇచ్చారు. వాటిలో కొన్ని చూస్తే...

1. ప్రేమ ఒక అభిమాన సంఘం లాంటిది. కాకపోతే అందులో ఇద్దరే సభ్యులు.(అడ్రియాన్)
2. ప్రేమను కొనలేవు కాని దానికోసం బాగా ఖర్చు చేయవలసి వస్తుంది.(హెన్రీ హెంగ్‌మ్యాన్)
3. భార్య, భర్త పట్ల అతిగా ప్రేమను ప్రదర్శిస్తుందంటే ఆమె అతనిలోని లోపాలను నవరించాలని అనుకొంటుందనమాట.
4. పెళ్ళి చేసుకొమనే నేను పురుషులకు సలహా ఇస్తాను. మంచి భార్య దొరికితే ఆనందంగా జీవిస్తాడు. లేకపోతే తత్వవేత్త అవుతాడు.(సోక్రటీస్)
5. ఈ ప్రపంచంలో చాలా మంది మంచి మగవాళ్ళు ఉండవచ్చు. కాని మంచి భర్తలు చాలా తక్కువ.
6. చాలామంది స్త్రీలు పురుషుల స్వభావాన్ని మార్చాలని ప్రయత్నిస్తుంటారు. నిజంగా పురుషులు మారితే స్త్రీలు వారిని ఇష్టపడలేరు.
7. స్త్రీలు స్త్రీలుగా పుట్టరు. స్త్రీలుగా పెంచబడతారు.
8. స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి.(చలం)

ముద్దుల ముచ్చట్లు

ముద్దు అనేది ఎవరికైనా మధురానిభూతినే. ముద్దు ప్రేమకు తొలిసంకేతం. ఇలాంటి అంశంపై మహాఅయితే ఒక పెద్ద వ్యాసాన్ని రాయవచ్చు కాని పెన్నా ఏకంగా ఒక లఘు గ్రంథంగా రాయడం సామాన్యవిషయం ఏమీ

కాదు. ఈ పుస్తకం కోసం రచయిత ఎంతో శ్రమ చేశాడనే విషయం విషయ సూచిక చూస్తేనే అర్థమవుతుంది. దీనిలో పెన్నా సృజనాత్మకత శీర్షిక నుంచి చివరి పేజీ వరకు మనం గమనించవచ్చు. విషయ సూచికకు చుంబనశ్రేణి అని పేరు పెట్టడం సమంజసంగా ఉంది. దీనిలో ముద్దు ఎలా ఆరంభమైంది. ముద్దు తొలి లిఖిత ఆధారాలు, ముద్దుల ప్రయోజనం, పెదవుల స్వరూపం, రకారకాల ముద్దులు, వివిధ దేశాల ముద్దులు. ముద్దుల వివాదాలు ఇలా అనేకమైన విషయాలతో 39 శీర్షికలతో వివరించారు. ఈ గ్రంథంలో సాహిత్యపరంగా శాస్త్రీయ పరంగా అనేక విషయాలను చెప్పారు.

పెన్నా శివరామకృష్ణ తన ప్రతి రచనలో తీసుకున్న అంశాన్ని క్రమవికాసాలను ముగింపులను సమన్వయం చేస్తూ చర్చ సాగించారు. సాహిత్యేతర రచనల్లో కొత్తగా ఏ సిద్ధాంగాన్ని ప్రతిపాదించకపోయినా విలువైన సమాచారాన్ని క్రోడీకరించి ఒక క్రమంలో చెప్పారు. పెన్నా సాహిత్య అనుభవ వ్యక్తీకరణకు అధిక ప్రాధాన్యమిచ్చారు. పెన్నా తన అనుభూతి మూలక విమర్శలో కింది విషయాలను ప్రధానంగా గమనించవచ్చు. అవి:

1. ఒక వస్తువు మీద భిన్నకవులు చేసిన వ్యాఖ్యలను ఒక దగ్గర కూర్చడం.
2. వస్తువును, విషయాన్ని ఒక క్రమంలో చెప్పడం.
3. తాను ఎంచుకున్న ప్రతి అంశాన్ని వివిధ భాగాలుగా విభజించుకొని సమగ్రంగా క్రమపద్ధతిలో చెప్పడం.

పెన్నా సాహిత్యేతర రచనల్లో పెన్నా శ్రమ, పరిశోధన, పరిశీలన అనే అంశాలు స్పష్టంగా తెలుస్తాయి. ఎంచుకున్న అంశాన్ని అవగాహన చేసుకొని సంధర్భోచితంగా వివరించారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కడప జిల్లా కథలు - స్థానికత

- యం. రోజి
పరిశోధక విద్యార్థిని
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

- డా॥. డి.యుకశ్రీ
సహాయాచార్యులు, తెలుగు అధ్యయనశాఖ,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 13 జిల్లాలున్నాయి. వాటిలో కడప జిల్లాకు ప్రత్యేకస్థానముంది. ఇక్కడ కరువు తాండవిస్తున్నప్పటికీ సాహిత్యానికి కరువు లేదు. పండితులకు, విమర్శకులకు, రసజ్ఞులకు, కవులకు, రచయితలకు, నాటక కర్తలకు, గాయకులకు, వాగ్గేయ కారులకు ఏమాత్రం కరువు లేదు. ఆంధ్ర కవితా పితామహుడు అల్లసానిపెద్దన, సంకీర్తనా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు, నవ్యతను చూపిన నాచన సోమనాథుడు ఈ గడ్డ ప్రసాదించిన అణిముత్యాలు. ఆధునిక యుగంలో కూడా అనేకులు వెలసి సాహిత్య సృష్టి చేశారు. సమధిక జ్ఞాన వృష్టికి దోహదం చేశారు.

కవులేగాక కథా రచయిత లెందరో తమ కలం బలంతో కడపజిల్లా సౌందర్యాన్ని అన్ని విధాలా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. వారిలో ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, సదుం జయరాం, రాజేంద్ర మొదలైన వారు పేర్కోదగ్గవారు. కడప కథకులు చిత్రించిన స్థానికతను ఈ వ్యాసం రేఖామాత్రంగా పరిచయం చేస్తుంది.

వై.సి.వి.రెడ్డి కథలో స్థానికతా ప్రస్తావన

"రాజమ్మది మహా విచిత్రమైన జీవితం. ఆమె ఎక్కడ పుట్టిందో, ఎక్కడ పెరిగిందో ఎవరికీ తెలియదు. ఆమెకు పెళ్ళీడు వచ్చేటప్పటికి రాజంపేటలో వుండింది. గొప్ప సాహసి" (వై.సి.వి.రెడ్డి సమగ్ర సాహిత్యం - దిక్కులేని బ్రతుకులు, పుట:365.) అంటూ ఒక రైతు కూలి మహిళను పరిచయం చేస్తూ ఆమెది రాజంపేట అంటాడు. రాజంపేట కడపజిల్లాలో ఒక పెద్ద పట్టణం. పార్లమెంటు మరియు అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం కూడా. ఇక్కడ రచయిత కడప జిల్లాలోని ఒక ఊరిని ప్రస్తావించాడు.

కథా రచయిత మోహ్నా తన "రాముల వారి గుడి ముందు" కథలో స్థానికతను ఇలా పేర్కొన్నాడు.

"ఇగో మామా, వీడుండ్లా సాకలి అనుమక్క కొడుకు అదిగాడు. వీనిది బండకింద పంపు. అదే తిమ్మాపురం దావలో మన సెంద్రమ్మ కొడుకు నాగిరెడ్డి సేని పక్కది. ఎకరా వుందిలే" (కడపకథ - కథానిలయం, నందలూరు, జనవరి 2007) అంటూ తిమ్మాపురాన్ని ప్రస్తావించాడు. తిమ్మాపురం కడప జిల్లాలో ఒక పల్లె.

మల్లెమాల వేణుగోపాలరెడ్డి స్థానికతను ఇలా ప్రస్తావించాడు.

"చాగల మర్రి మండలకేంద్రం. నలభైశాతం ముస్లింలున్నారు. అయ్యగారే అక్కడ పెద్ద భూస్వామి" (కడపకథ-మతాతీతం-పుట:149) అంటూ చాగలమర్రి ఊరిని ప్రస్తావించాడు. చాగలమర్రి మండలం కడప జిల్లాలోనే వుంది. తవ్వా ఓబుల్ రెడ్డి స్థానికతను ఇలా ప్రస్తావించాడు.

"చక్రాలపల్లి సమీపిస్తున్న కొద్దీ తల్లి ఒడిలోకి చేరుకొంటున్న ఆనందం చోటుచేసుకోసాగింది వెంకటరావులో" (కడప కథ-కడు ప్రాంతం - పుట : 287) అంటూ కడప జిల్లాలోని ఒక పల్లె గురించి ప్రస్తావించాడు. ఆ పల్లె పేరు చక్రాల పల్లి. ఇబ్రహీం స్థానికతను ఇలా ప్రస్తావించాడు.

"కలసబండ బాయి కూడల్లో ఎవరో సర్కారోల్లు దిగిండ్రు. మైకు ఇన్పిచ్చేది ఆన్నుంచే" అంటాడు జమాల్‌వలీ (కడప కథ-జీవ సమాధి - పుట:316).

కథకుడు ఈ కథలో కడప జిల్లాలోని కలసబండ అనే ఊరిని ప్రస్తావించాడు. డి. రామచంద్రరాజు స్థానికతను ఇలా ప్రస్తావించాడు.

"నీ అనుమానం నాకు తెలుసు. రాజంపేట సిద్ధిరాజు కూతురు, కోడలు అక్కడే ఉన్నారు. ఒంటిమిట్ట గోపాల్ రెడ్డి భార్య కూడా పోయింది కదా! భయపడాల్సిన పనిలేదు" అంటాడు బ్రోకర్ సత్తార్ (కడప కథ- చీకటి సవ్వడి-పుట:330). ఈ కథలో రాజంపేట అనే పట్టణాన్ని, ఒంటిమిట్ట అనే గ్రామాన్ని ప్రస్తావించాడు. దేవిరెడ్డి వెంకటరెడ్డి స్థానికతను ఇలా తెలిపాడు.

"ఒకనాడు కోరుగుంట పల్లె అంటే జిల్లాలో పేరు మోసిన గ్రామం" (కడప కథ - కొత్త చిగురు - పుట : 335). ఇక్కడ కథకుడు కడపజిల్లా లోని ఒక గ్రామమైన కోరుగుంట పల్లెను ప్రస్తావించాడు. నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి స్థానికతను ఇలా తెలిపాడు.

"నల్లమల కొండలు స్వామి పవిత్ర నామాలతో ప్రతి ధ్వనిస్తున్నాయి. సగలేటి దరిదాపుల పల్లెలోని జనం గుంపులు గుంపులుగా బయల్దేరి వరికుంట్ల మీదుగా కొండల్లోకి నడిచారు. చెలిమ బావిలోనో, జ్యోతిక్షేత్రం వద్దో నీళ్ళుతాగి గరుడాద్రి దాకా నడిచి ఆ రాత్రి కొండమీద విడిది చేయాలని కొందరి ఆలోచన. ఇంకొందరు జ్యోతి లోని కాశీనాయన ఆశ్రమం వద్ద గడపాలని నిర్ణయం" తీసుకొన్నారు (బతుకు సేద్యం కథలు - కడితి వేలు - పుట : 1, ప్రచురణ: ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్, సెప్టెంబర్-2009). ఈ కథలో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి నల్లమల కొండలను, సగిలేటిని, వరికుంట్లను, చెలిమి బావి, జ్యోతి క్షేత్రం వంటి వాటిని ప్రస్తావించి కడపజిల్లా స్థానికతను ఆవిష్కరించాడు.

ఈ వ్యాసంలో కడప జిల్లా కథకులు తమ కథల్లో పేర్కొన్న స్థానికతను సోదాహరణంగా పేర్కొనడం జరిగింది. ఇందులో పట్టణ, గ్రామ నామాలే కనిపిస్తాయి గానీ ఇతర అంశాలు గోచరించవు. మొత్తానికి కథకులు తమ ప్రాంతం పట్ల అవగాహన, అభిమానం కలిగి వున్నారని దీన్ని బట్టి గ్రహించవచ్చు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సురభి నాటకరంగం - సాంకేతిక వ్యవస్థ

- రేకందార్ నిరుపమ సునేత్ర

తెలుగునాట 'సురభి' నాటకం గురించి తెలియని వారు లేరు, అంటే అతిశయోక్తి కాదు. 19వ శతాబ్ధి ఆఖరులో పుట్టిన ఆధునిక తెలుగు నాటక చరిత్రలో ఎందరో నటీనటులు, వారి వారసులు, ఎన్నో సంస్థలు కళాపోషణ దృష్టితోను, వ్యాపారదృష్టితోను లేదా ఒక వ్యాపకంగాను నాటక సమాజాలను నడిపారు. 19వ శతాబ్ధి ఆఖరునుంచి ప్రస్తుత 21వ శతాబ్ధి వరకు ఎన్నో సమాజాలు పుట్టాయి-పోయాయి. కానీ ఆధునిక తెలుగు నాటక రంగంకన్నా కేవలం 5 సం॥ మాత్రమే చిన్నదైనది "సురభి" నాటక రంగం. సురభి శాఖోపశాఖలుగా విస్తరించి 136 సం॥ పైబడి, ప్రజల మన్ననతో తెలుగు నాటకరంగాన్ని ఇప్పటికీ పరిపుష్టం చేస్తున్నది. సురభి నాటక సమాజం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కుటుంబ వృత్తినాటక సమాజాలుగా అభివృద్ధి చెందింది.

తెలుగు నాటక రంగంలో సురభి సమాజంతో పాటుగా మరికొన్ని వృత్తి నాటక సమాజాలైన 'మానేపల్లి కంపెనీ', 'మైలవరం కంపెనీ' మరియు 'మోతేవారి కంపెనీలు' నాటకాలు ప్రదర్శించే వారు. అయితే సురభి సమాజంలా తక్కిన సమాజాలవారు ఎక్కువ కాలం నిలవలేకపోయారు. అందుకు కారణం సురభి వారు చేసినన్ని రంగస్థల ప్రయోగాలు చేయలేకపోవడం ఒకటైతే, సురభి కుటుంబ వృత్తి నాటక సమాజం అవ్వడం ముఖ్య కారణం. నాటక రచనాపరంగా, నటన పరంగా, సంగీత పరంగా, రంగా లంకరణ పరంగా, ఆహార్య ముఖాంగ రచన పరంగా, రంగోద్దీపన పరంగా సురభివారు చేసినన్ని ప్రయోగాలు తెలుగు నాటకరంగ చరిత్రలో ఎవరూ చేయలేదు అన్నది సత్యం. అందుకే సురభి వృత్తి నాటక సమాజానికి ఇన్ని సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం సాధ్యమైంది.

అటువంటి సురభివారి సాంకేతిక వ్యవస్థ ఏవిధంగా పరిపుష్టి చెందింది, అసలు వారి సాంకేతిక ప్రయోగాలు విజయవంతంగా ప్రదర్శించడానికి కారణం ఏమిటి, కన్నుమూసి తెరిచేలోగా రంగస్థలం మీద రంగాలంకరణ మారిపోతుంది. ఆకాశంలోనుంచి పాత్రధారులు క్రిందికి దిగుతారు, పైకివెళతారు, భూమిలో నుంచి పాత్రధారుల ప్రవేశ నిష్క్రమణలు, తమ చేతిలో మంటలు పుట్టించగల పాత్రధారులు... ఇలా ఎన్నో ఎన్నెన్నో రంగస్థలం మీద సురభివారు చూపించే వింతలు. అసలు సురభివారు ఇంత చాకచక్యంగా ఈ సాంకేతిక ప్రయోగాలు ఎలా చేయగలుగుతున్నారు... అన్న అంశాలను గురించి ఇక్కడ వివరించదలచాను.

మొదటి ప్రదర్శన కీచకవధ :

'తోలుబొమ్మలాట' ఆడుకునే వనారస సోదరులు, కడపజిల్లా, రాయచోటి తాలూక, సురభిగ్రామంలో భూస్వాములైన అల్లపురెడ్డి చెన్నారెడ్డి గారి కుమార్తెను కొవురు రామిరెడ్డిగారి కుమారునికి ఇచ్చి జరిపే వివాహ సందర్భంలో 'తోలబొమ్మలాట' ఆడమని వనారస సోదరు లను చెన్నారెడ్డిగారు కోరారు. అయితే వనారస గోవింద రావుగారు కొత్త ప్రక్రియగా 'నాటకం' వేస్తామని రెడ్డిగార్లను కోరడం, వారు అంగీకరించడం జరిగింది. అలా కలిసి వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. తాము తోలుబొమ్మలతో ఆడే కథనే నాటకంగా ఎంచుకుని, తెర వెనుక బొమ్మలకు గాత్రం అందించే మనుషులనే తెర ముందు పాత్రధారులను చేశారు. సహజ రంగులతో అద్దళం విధానంతో మేకప్ వేసుకున్నారు. రెడ్డిగారి ఇండ్ల నుండి అడిగి తెచ్చిన చీరలు, నగలు, పంచెలను ఆహార్యంగా ధరించారు. మూడు పక్కలా మూసివేసి ఒకవైపు మాత్రమే ప్రేక్షకులకు కనబడేలా ప్రోసీనియం విధానంలో స్టేజీకట్టి, ఆ స్టేజీని పాత చీరలతో అలంకరించారు. స్టేజీకి ముందు ఎదురెదురుగా రెండు

14వ నెంబర్... లాంతర్లు కట్టారు. అలా అన్నీ తామే అయి, అన్నిటా తామే అయి, మొట్టమొదట 'కీచకవధ' అనే నాటకాన్ని క్రీ.శ. 1885వ సం॥లో ప్రదర్శించారు. తమ తొలినాటక ప్రదర్శన విజయవంతం అయి, ప్రేక్షకుల నుండి అపూర్వ స్పందన రావడంతో వనారస సోదరులు తోలుబొమ్మలాట పూర్తిగా వదిలేసి నాటక ప్రదర్శనలు చేయడం ప్రారంభించారు. ఆ తరువాత రాప్తాటి సుబ్బ దాసు అనే రచయిత, దర్శకుడిని పిలిపించి, వారి నిర్దేశకత్వంలో కొత్త నాటకాలు నేర్పించారు. మద్రాసు (నేటి చెన్నై) నుంచి వేణు, రంగనాయకులు అను నిపుణులను ప్రత్యేకంగా పిలిపించి వారితో తెరలు (కర్టెన్స్) రూపొందించుకున్నారు. ధార్వాడ వారి శైలిలో దుస్తులు కుట్టించారు. "తెలుగు నాట మొద్దమొదట టిక్కెట్ పద్ధతిని ప్రవేశపెట్టిన కుటుంబ వృత్తి నాటక సమాజం సురభివారే". ఆ విధంగా అన్ని రంగాలలో ఆరి తేరుతూ సురభి వృత్తి నాటక సమాజంగా స్థిరపడిందని చెప్పవచ్చును.

సురభివారి ప్రదర్శన - జీవన విధానం :

సురభినాటక సమాజాల వారు ఆరంభం నుంచి కూడా వారి నాటక ప్రదర్శనలలో సాంకేతికతను అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సురభివారి ప్రదర్శనలు కాలానుగుణంగా సాంకేతికతను మార్చుకుంటూ వచ్చాయి. నాటకాలకు సంబంధించిన ఒక క్రొత్త అంశంగాని, ఆలోచనగాని, ప్రత్యేక విధానంగాని చూసిన వెంటనే సురభివారు తమ నాటకాలలోకి ఆ క్రొత్త అంశాన్ని, ప్రత్యేకతని ప్రయోగించేవారు. అలా పార్శివారి నాటకాలను చూసి రోలింగ్ కర్టెన్స్‌ను తమ నాటకాలకు ఉపయోగించడం ప్రారంభించారు. ఈ రోలింగ్ కర్టెన్ విధానాన్ని ప్రస్తుతకాలంలో వాడుతున్నది సురభివారు మాత్రమే. అలాగే తమిళనాడు కర్ణాటక ప్రాంతాలలోని నాటక సమాజాల వారు ప్రయోగించే "స్పెషల్ ఎఫెక్ట్‌ని" చూసి చూడగానే ఎలా చేసి ఉంటారో ఊహించి దానికి తమ ఆలోచనలను జోడించి ఆ స్పెషల్ ఎఫెక్ట్‌ని తమ నాటకాలలో సందర్భోచితంగా తక్కువ సమయంలోనే ప్రయోగించి విజయం సాధించిన సందర్భాలు ఉన్నాయి.

సురభి సమాజాలలో చిన్నా, పెద్దా, ఆడ, మగ అందరూ సాంకేతిక పనివారే. మరీ చిన్నపిల్లలు అంటే 2,3 ఏళ్ళలోపు వారు కాదుగానీ మాట అర్థం చేసుకునే వయసునుండే అన్ని విభాగాలలో పాల్గొనడం వారి వృత్తిగా మారింది. మేకప్ వేసుకోవడం, సీను పనిలో సహాయ పడడం, ట్రిక్కు సీను నిర్వహణలో సహాయం చేయడం, ప్రదర్శన రోజు పగటిపూట ప్రదర్శనకు కావల్సిన ఏర్పాట్లు సిద్ధం చేయడం, ఒకరికి ఒకరు సహాయం చేయడం సురభిలోని బాలబాలికలకు అలవాటు. సురభివారికి వారికి డెరానే (రంగస్థలం) వారి ప్రపంచం. బయటి ప్రపంచంతో తక్కువగా సంబంధాలను కలిగి ఉండడం వల్ల ఆట-పాటలు, ఊహలు, ఆలోచనలు, కలలు అన్నీ నాటకమే.

అందుచేత తమ ఇంటినే రంగశాలగా - రంగశాలే తమ నివాసంగా వారు మలచుకున్న తీరు నభూతో నభవిష్యతి. వారు ఆ రంగశాలలోనే ఉంటారు - తింటారు, జీవిస్తారు - మరణిస్తారు. వాళ్ళ ఆనందాలు - దుఃఖాలు, కష్టాలు - సుఖాలు, అన్నీ ఆ రంగశాలలోనే. ఈ రంగశాలలో రంగస్థలం ఉంటుంది. ప్రేక్షకాగారం ఉంటుంది. సింహద్వారం ఉంటుంది. టిక్కెట్ కౌంటర్ ఉంటుంది. గ్రీన్ రూం ఉంటుంది. ఇంజన్ షెడ్ ఉంటుంది. వీటితోపాటు సురభి సమాజంలోని కుటుంబాల నివాసగృహాలు (షెడ్‌లు) ఉంటాయి. నాటక ప్రదర్శనకు నేపథ్య సంగీతానికి తోడుగా మృదంగం, తాళం, తంబూర చంక తిత్తిని శృతిగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం హార్మోనియం, తబలా, కీబోర్డు వంటి ఆధునిక సంగీత పరికరాలు ఉపయోగిస్తున్నారు. ఇలా రంగస్థల ప్రదర్శనకు కావలసిన అన్ని ఉపకరణాలు సిద్ధం చేసుకుని సంచార ప్రదర్శనలు ప్రారంభించారు.

సురభి రంగస్థలం - సాంకేతిక నిర్మాణ విధానం:

సురభి వారి సాంకేతిక ప్రయోగాల కూర్పుకు వారి

నాటక రచనా క్రమంలోనే బీజం పడుతుంది. సురభి వారు నాటకాలను వారికి కావలసిన రీతిలో ప్రత్యేకంగా వ్రాయించుకుంటారు. ఎందుకంటే సురభివారి నాటక రచన అనేది ఇతర నాటకాలకన్నా భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా సురభి నాటకం అంటేనే సాంకేతిక అంశాల కూర్పు అనేది ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నాటక ప్రదర్శనలో సాంకేతిక అంశాలను ప్రదర్శించడానికి అనుకూలంగా ఉండే కథలనే నాటకాలుగా మలచడం జరుగుతుంది. ఒకవేళ నాటక కథ బాగుంటే దానిని తమ ప్రదర్శనలకు అనుకూంగా సాంకేతిక అంశాలను చూపించే విధంగా సురభివారు ఆ కథను మార్పులు చేసుకోవడం జరుగుతుంది. నాటకాన్ని తమ పూర్తిస్థాయి జీవనాధారంగా మార్చుకునే క్రమంలో నాటక ప్రదర్శనకి అవసరమైన రంగాలంకరణ (సెట్ మరియు ప్రాపర్టీస్) రంగోద్దీపనం, ముఖాంగరచన (మేకప్) దుస్తులు, వాద్య సహకారం (సంగీతం) అన్నింటికంటే ముఖ్యమైన రంగస్థల ఏర్పాటు సురభివారే స్వయంగా సమకూర్చుకుంటారు.

ఆధునిక పోకడలకు అనుగుణంగా సురభివారే సొంతంగా తమ తెరలు తయారు చేసుకోవడం ప్రారంభించారు. ఇప్పటికీ సురభివారి తెరలు (పెయింటింగ్ కర్టెన్స్) వారే స్వయంగా చిత్రించుకుంటారు. సైన్ గుడ్డ కొని, పలు రకాల పరదాలు కుట్టడం నుంచి డిజైనింగ్, స్కెచ్, పెయింటింగ్ వర్కు అంతా సురభివారే స్వయంగా చేస్తారు. వీరు తెరలను రోలింగ్ కర్టెన్ విధానంలో ఉపయోగిస్తారు. ఇది ఒక ప్రత్యేకమైన నిర్మాణం. ఈ రోలింగ్ కర్టెన్ నిర్వహణకోసమే సురభివారు రంగస్థలం పై భాగంలో ప్రత్యేకంగా 'అటక' కడతారు. పెయింట్ చేసిన పరదాలను 24 అడుగుల పొడవు 2, 1/2 ఇంచీల వ్యాసపు తేలికపాటి ఇనుప గొట్టంతో చుట్టుకుంటూ పైకి లేపే విధానం. ఈ విధానంలో అతి త్వరగా సీను మార్చడానికి ఉపయోగపడుతుంది. సురభి సమాజంలో ఆడవారు కూడా ఈ పరదాలు ఎత్తి దించుతారు. బిట్ సామాగ్రిని కూడా వారే స్వయంగా రూపొందించుకుంటారు. సింహాసనాలు, జంతువులు, పూలచెట్లు, రాతి బిట్లు మొదలైన ఆకారాలలో తయారు చేసిన చెక్కలకు, ఇనుప చట్రాలకు తెల్లగుడ్డ అతికించి, ఆ ఆకృతులను ఆ గుడ్డమీద పెయింట్ చేసిన సామాగ్రిని సురభివారు "బిట్" సామాన్లు అని అంటారు. ఈ బిట్ సామాగ్రిని సురభివారు సెట్టింగ్స్‌కు ఉపయోగిస్తారు. వారు సెట్ ప్రాపర్టీ కొరకు ఎక్కువగా జాజిచెక్క (జాజిచెట్టు) వాడతారు. జాజి చెక్క తేలికగా ఉండి, సెట్ మార్పిడి సులువుగా జరపడానికి చక్కగా ఉపకరిస్తుంది.

రంగస్థల ప్రదర్శన - కాంతి పరికరాలు :

సురభివారి మొదటి ప్రదర్శనకు రంగోద్దీపన పరికరాలు 14 సం॥ లాంతర్లు ఉపయోగించారు. అలాగే ఆముదం దీపాల వెలుగులో ముఖాంగ రచన చేసుకున్నారు. 14 సం॥ లాంతర్ల వెలుగులో ప్రారంభం అయిన సురభి నాటకం 1901 ప్రాంతంలో పెట్రోమాక్స్‌లైట్ వెలుగులో దేదీప్యమానం అయింది. ఈ పెట్రోమాక్స్ లైట్‌తో సురభివారు చేసినన్ని ప్రయోగాలు మరే ఇతర నాటక సమాజాలవారు చెయ్యలేదని చెప్పవచ్చు. పెట్రోమాక్స్ లైట్ కిరోసిన్‌తో వెలుగుతుంది. అలాగే పెట్రోమాక్స్ లైట్‌కి అరగంటకి లేదా గంటకి ఒకసారి గాలి కొట్టాలి. ఈ పనిని సమయానుకూలంగా చిన్నా పెద్దా అందరూ చేసేవారు. అంటే ఆ లైట్ కాంతి తగ్గే సమయంలో అక్కడ ఎవరు ఉంటే వారు గాలి కొట్టేవారు. అలాగే ఈ లైట్ వెలగడానికి అవసరం అయిన కిరోసిన్ సంపాదించడం అప్పట్లో చాలా కష్టంగా ఉండేది. ప్రపంచ యుద్ధాల కాలంలో అయితే కిరోసిన్ సంపాదించడం కోసం 'వార్‌ఫండ్ నాటకాలు' ప్రదర్శించేవారు. 1924వ సం॥ సురభివారు ఇంజన్ వాడడం మొదలు పెట్టారు. 1500 వాట్స్ మాత్రమే ఈ ఇంజన్ కెపాసిటీ, 5-6 బల్బులు వెలిగేవి. కాని ఆనాటి ప్రేక్షకులను ఆ బల్బులు ఎక్కువగా ఆకర్షించాయి.1970వ దశకంలో ప్రభుత్వ విద్యుత్ సరఫరా గ్రామాలకు విస్తరిస్తున్న కాలంలో సురభివారు తమ సహజ

ధోరణిలో నూతన మార్పులను ఆనందంగా స్వీకరించారు. తమ రంగోద్దీపనానికి (స్టేజీ లైటింగ్) కొత్త హంగులు సమకూర్చుకున్నారు.

సహజ రంగులతో సురభివారి ఆహార్యం :

రంగస్థలం పైకి నటుడు ప్రవేశించగానే ఆకర్షించేది వారి ఆహార్యం. సురభివారు ఎవరి ముఖాంగ రచన (మేకప్) వారే చేసుకోడంతో పాటుగా, వారి వారి పాత్రానుసారం దుస్తులను కూడా వారే స్వయంగా తయారు చేసుకుంటారు. ఊహ తెలియని వయస్సు నుంచే (3-4 ఏండ్ల వయస్సు) సురభిలోని బాల బాలికలకు ఎవరి మేకప్ వారే వేసుకోవడం నేర్పిస్తారు. అది ఎలా వేసుకున్నా సరే. అయితే సాధారణ బాల వేషాలకు వారి మేకప్ వారే వేసుకుంటారు. ప్రత్యేక బాలవేషాలు అంటే బాలకృష్ణుడు, ప్రహ్లాదుడు, లవకుశలు, బ్రహ్మంగారు మొదలగు ప్రముఖ్యత కలిగిన బాలవేషాలకు వారి తల్లి తండ్రులలో, కుటుంబ పెద్దలో మేకప్ చేస్తారు. అదీ ఒక వయస్సు వరకే. తరువాత ఎంత పెద్దవేషమైన, ప్రాధాన్యత కలిగిన వేషమైనా సరే ఎవరి మేకప్ వారే వేసుకుంటారు, వేసుకోవాలి. ఇది సురభివారి పద్ధతి. ప్రారంభంలో ఆహార్యంలో సుద్ద, పసుపు రంగు, సింధూరం, నల్లమసి మేకప్ కోసం ఉపయోగించేవారు. ప్రస్తుతం ఆధునిక మేకప్ సామాగ్రిని వాడడం జరుగుతుంది.

మేకప్‌కు అవసరం అయిన రంగులు, ఇతర పదార్థాలను వారే సమకూర్చుకుంటారు. దుస్తులు కూడా వారే కుట్టుకుంటారు. సురభిలో దాదాపు అందరు ఆడవారికి కుట్టు పనిలో ప్రవేశం ఉంటుంది. అలాగే ముడి సరుకులు తెచ్చుకుని ఆభరణాలు, విగ్గులను వారే తయారు చేసుకుంటారు. ఇక్కడి ముడి సరుకు అంటే ఆభరణాల తయారికి అవసరమైన పూసలు, రంగు రాళ్ళు, దారాలు, తాళ్ళు మొదలైనవి. విగ్గులను మొదట్లో కొబ్బరి పీచుకు నల్లరంగు వేసి తయారు చేసుకునేవారు. తరువాత నల్లని పెళుసు దారాలతో లేదా సేకరించిన జుట్టుతో కూడా వారు స్వయంగా విగ్గులు తయారు చేసుకునేవారు. మెటల్ ఆభరణాలను మద్రాసు, మచిలీపట్నం నుంచి కొనుగోలు చేస్తారు. మామూలుగా ఇతర సమాజాల వారు ఈ సాంకేతిక విభాగాలను కలిగి ఉండడం చాలా అరుదు. ఒకవేళ కలిగి ఉన్నా ఆ విభాగాల నిర్వాహకులు ప్రత్యేకంగా ఆ విభాగాలకు మాత్రమే పరిమితం. కానీ సురభి సమాజాలలో పైన పేర్కొన్న విభాగాలను నిర్వహించే వ్యక్తులు ఉన్నా వారు ఆ ఒక్క పనికే పరిమితం కారు. వారు అన్ని విభాగాలను తెలిసినవారై ఉంటారు. మరీ ముఖ్యంగా వారంతా కూడా నటీనటులే. ఇది సురభివారికి మాత్రమే సొంతం. వీరి అద్భుతమైన ప్రత్యేకమైన ప్రక్రియ తెలుగు నాటక రంగంలో సాంకేతికతకు ఎనలేని కీర్తిని గడించిందని చెప్పక తప్పదు.

ఆధార గ్రంథ పట్టికలు

1. The Surabhi Theatre & AndhraPradesh, Modali Nagabhushana Sarma
2. సురభి నాటక శతజయంతి ఉత్సవాలు (ప్రత్యేక సంచిక 1989 నవంబర్ 15) ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ, హైదరాబాద్.
3. సురభి నాటక కళాసంఘం సప్తతి స్వర్ణోత్సవాలు. (జూన్ 29,30, జులై 1, 1960) సురభి నాటక కళాసంఘం ప్రచురణ హైదరాబాద్.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 3, March - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాటల మధుశాల సీనియర్ సముద్రాల

- తిరునగరి శరత్ చంద్ర, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సంప్రదాయ భక్తిగీతాలతో, ఆధ్యాత్మిక భావరసానంద డోలికల్లో మనల్ని ఓలలాడించి, రసాలూరే వలపుపాట లతో మనల్ని మత్తెక్కించి తెలుగు సినిమా ప్రపంచాన్నే ఉర్రూతలూపిన సినిమాకవి 'సముద్రాల రాఘవాచార్య'. మనకందరికి సీనియర్ సముద్రాలగా సుపరిచితులు.

సీనియర్ సముద్రాల జూలై 19, 1902 సం.లో గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలో పెదపులివర్రు (భట్టిప్రోలు)లో శ్రీ సముద్రాల వేంకటశేషాచార్యులు, శ్రీమతి లక్ష్మీతాయారు దంపతులకు జన్మించాడు. సంప్రదాయ కుటుంబంలో పుట్టినవాడు కనుక చిన్నప్పటి నుంచే సంస్కృతాంధ్రభాషల్లో మంచి పాండిత్యం సంపాదించాడు. వ్యాకరణ, తర్కశాస్త్రాల్లో విశేషమైన కీర్తి గడించాడు. తొమ్మిదవ తరగతి చదివేటప్పుడే కవిత్వం చెప్పడం ప్రారంభించాడు. ప్రాచీన, ఆధునిక సాహిత్యా లను విస్తృతంగా చదివి, 1925లో 'భాషాప్రవీణ' పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. ఉప్పుసత్యాగ్రహోద్యమంలో పాల్గొని కారాగారశిక్షను కూడా అనుభవించాడు. మొదట్లో అవధానాలు చేసేవాడు. ఆ తరువాత 'సమదర్శిని', 'ప్రజా మిత్ర' పత్రికల్లో కొంతకాలం పనిచేశాడు.

ప్రముఖ దర్శకులు బి.ఎన్.రెడ్డి, బి.నాగిరెడ్డి సోదరు లతో ఏర్పడిన స్నేహమే సీనియర్ సముద్రాల సినీరంగ ప్రవేశానికి బాటలు వేసింది. మొదట్లో అతని మిత్రుడు గూడవల్లి రామబ్రహ్మంతో కలిసి తరచుగా స్టూడియోకి వెళ్ళేవాడు. 'సీతాకల్యాణం', 'శ్రీకృష్ణలీలలు' సినిమాలకు ప్రకటనలు రాసి ఇచ్చేవాడు. ఆ తరువాత 1937 లో వచ్చిన 'కనకతార' (చందాల కేశవదాసు గారి ప్రసిద్ధ నాటకం) సినిమాకు పాటలు రాయడంతో సముద్రాల రాఘవాచార్య సినీప్రస్థానం ప్రారంభమైంది. సుమారు 7 పాటలు రాశాడు ఆ సినిమాకి. ఆయన రాసిన 'ఈ వసంత శోభాకాంచిన', 'అజ్ఞానంబున ఆశలుబాసీ' మొ.పాటలు ఆ సినిమాకు వన్నె తెచ్చాయి. ఎన్టీఆర్ గారి మొదటి చిత్రం 'మనదేశం'(1949) సినిమాకు కూడా ఆయన పాటలు రాశాడు. సముద్రాల రాఘవాచార్య రాసిన ఒక్కోపాట ఒక్కో అమృతగుళిక. ముఖ్యంగా భక్తిపాటలకు సముద్రాల సీనియర్ పెట్టింది పేరు. ఆ తరువాత వచ్చిన ఆయన కుమారుడు సముద్రాల జూనియర్ కూడా భక్తిపాటలనే ఎక్కువగా రాశాడు. తెలుగు సినిమాప్రస్థానం ప్రారంభమైన తొలిరోజుల్లో సీనియర్ సముద్రాల తన సంభాషణలతో, పాటలతో ఒక చరిత్ర సృష్టించాడు. ఇప్పటికీ ఏ దేవాలయాల్లోనైనా, ఏ క్షేత్రాల్లోనైనా జరిగే హరికథల్లో ఆయన పాటలు, పద్యాలు వినిపిస్తూనే ఉంటాయి. అంటే అవి అంతగా సంప్రదాయాన్ని పుణికిపుచ్చుకున్నాయని, బహుళ జనాదరణ పొందాయని ప్రత్యేకంగా చెప్పవలిసిన అవసరం లేదు.

'సీతారామకల్యాణం' (1961) సినిమా కోసం ఆయన రాసిన ఈ పాట ఇప్పటికీ, ఎప్పటికీ ఎక్కడ రాములవారి కల్యాణం జరిగినా, మానవకల్యాణం జరిగినా వినిపిస్తూనే ఉంది.. వినిపిస్తూనే ఉంటుంది.

'సీతారాముల కల్యాణం చూతమురారండీ
శ్రీసీతారాముల కల్యాణం చూతమురారండీ'

అంటూ సాగుతూ కల్యాణకాంతులను ఇలా ప్రకాశింపజేస్తుంది.

'సిరికల్యాణపు బొట్టును పెట్టి మణిబాసికము
నుదుటను పెట్టి
పారాణిని పాదాలకు పెట్టి పెళ్ళికూతురై వెలసిన సీతా
కల్యాణము చూతమురారండీ'

అంటూ ఆదర్శదంపతులైన శ్రీసీతారాముల పెళ్ళి కళను, అంగరంగవైభవంగా మన కళ్ళముందు ఆవిష్కృ

రింపజేస్తాడు సముద్రాల రాఘవాచార్య. ఈ సినిమాలోని మాటలు అన్ని పాటలు సముద్రాల రాసినవే. 1940-60 మధ్యకాలంలో సముద్రాల సినీసాహితీప్రపంచంలో ఒక శకాన్నే సృష్టించాడు. అద్భుతమైన సాహిత్యాన్ని అందించాడు. భక్తపోతన, స్వర్గసీమ, పల్నాటియుద్ధం, త్యాగయ్య, షావుకారు, దేవదాసు, విప్రనారాయణ, తెనాలిరామకృష్ణ, చండీరాణి, అనార్కలి మొ.సినిమాల్లో ఆయన రాసిన మాటలు,పాటలు అజరామరాలు. మణిమకుటాలు. చాలా సినిమాలకు ఆయన కథారచన కూడా చేశాడు.

1958 లో విడుదలైన 'భూకైలాస్' సినిమాలో ఆయన రాసిన -

'దేవదేవధవళాచలమందిర గంగాధరాహర నమో నమో
దైవతలోక సుధాంబుధి దినకర లోకశుభంకర నమో నమో'

'నీలకంధరా దేవా దీనబాంధవా రావా నన్ను బ్రోవరా' పాటలు భక్తి పారవశ్యంలో మనల్ని ముంచేస్తాయి. ఆ సినిమాలోనే మరో పాట...

'అత్యాశ మానవుని శత్రువంట త్యాగజీవనమే వీడిపోని మిత్రమంట
ఈ మేను మూడు నాళ్ళ ముచ్చటేరా మిత్తి వెన్నంటి తిరుగుతుంటె ఎరుగవేరా'

అంటూ - ఈ శరీరం మూడునాళ్ళకే వాడిపోతుందని, మృత్యువు (మిత్తి - వికృతి) మనల్ని వెంటాడుతుందని, అత్యాశ శత్రువని, త్యాగజీవితమే మిత్రమని బోధించాడు. ఇంకా - 'విప్రనారాయణ' (1954) సినిమాలో సముద్రాల రాసిన అన్ని పాటలు అపూర్వమే. ముఖ్యంగా...

'ఎందుకోయి తోటమాలి అంతులేని యాతన
ఇందుకేనా నీవు చేసే పూజలన్ని తపోధనా' పాట ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరుచుకుంది.

'నర్తనశాల' (1963) సినిమాలో...

'నరవరా ఓ కురువరా!
వీరుల నీకు సరిలేరని సరసులలో జాణవని
విన్నారా కన్నారా కనులారా!' అనే పాట వినని, విని పదే పదే పాడుకోని తెలుగువాడు లేడు. ఇంద్రసభకు ఏతెంచిన అర్జునుని వైభవాన్ని తెలియజేస్తూ రాసిన పాట ఇది. సురపతి వరప్రసాదియైన వాడని, పశుపతియైన వరవేశ్వరున్ని మెప్పించినవాడని, పార్థ,కిరీటి మొ.బిరుదులు పొందినవాడని, ఉలూచి, సుభద్రల హృదయస్థుడైనవాడని అర్జునున్ని, అతని కీర్తి ప్రతిష్ఠలను, అందచందాలను ప్రకటిస్తూ రాసిన మహోన్నతమైన గీతమిది. ఈ సినిమాలోనే 'దరికి రాబోకు రాబోకు రాజా!', 'సఖియా వివరించవే వగలెరిగిన చెలునికి నా కథా' వంటి చిలిపి పాటలు కూడా సముద్రాల రాశాడంటే చాలామంది నమ్మలేరు. ఈ సినిమాలోని 'జననీ శివకామినీ జయవర దాయినీ విజయరూపిణీ' అనే భక్తిరసాత్మకగీతం కూడా ఆయన రాసినదే. నవరసాలొలికే ఈ సినిమాసంభాషణలూ ఆయన రాసినవే.

సీనియర్ సముద్రాల వారి పాటల జాబితాలో మొదటి వరుసలో ఉన్న సినిమా 'దేవదాసు' (1955). బెంగాలీ రచయిత శరత్ చంద్ర ఛటర్జీ నవలకు దృశ్యరూపమిది. ఇందులో విషాదాంతభరితమైన ప్రేమకథామాధుర్యాన్ని సముద్రాల వ్యక్తీకరించిన తీరు అద్భుతం.

'జగమే మాయ బ్రతుకే మాయ
వేదాలలో సారమింతేనయా ఈ వింతేనయా
ఆశామోహముల దరిరానీకోయీ
బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్'

పాట నేటికీ ఏనాటికీ చిరస్మరణీయమైనదే. ఆశే దుఃఖానికి కారణమని ఇందులో తెలియజేస్తాడు సముద్రాల. మిథ్యావాదాన్ని మేళవించిన గొప్ప సందేశాత్మకగీతమిది. సముద్రాల రాఘవాచార్యలో ఉన్న తాత్త్వికదృష్టి ఈ పాటలో కనబడుతుంది. ఇంకా ఈ సినిమాలోనే...

'కుడిఎడమైతే పొరపాటులేదోయ్
ఓడిపోలేదోయ్
సుడిలో దూకి ఎదురీదక మునకే సుఖమనుకోవోయ్' అనే పాట వినిపించని ఇల్లులేదు. మ్రోగని హృదయమూ

లేదు. దేవదాసు సినిమాలోని ప్రతి పాట ఒక రసాత్మక కావ్యమే. 'తెనాలి రామకృష్ణ' (1955) సినిమాలోని పాటలు కూడా సముద్రాల కలం నుండి జాలువారినవే.

'చేసేది ఏమిటో చేసేయి సూటిగా
వేసేయి పాగా ఈ తోటలో
ఎన్ని కష్టాలు రాని నష్టాలు రాని
నీ మాట దక్కించుకో బాబయా'

సినిమాలో తెనాలి రామకృష్ణుని నోట పలికిన ఆత్మ విశ్వాసగీతమిది.

'అనార్కలి'(1955) సినిమాలోని పాటలు కూడా 'దేవదాసు' లాగే ప్రతి ప్రేమజంట పాడుకునే అపూర్వ కళాత్మక గీతాలు. సీనియర్ సముద్రాలకున్న సంస్కృత భాషాపటిమ అంతా ఇంతా కాదు. భక్తిగీతాల్లోనే కాదు ప్రేమపాటల్లో కూడా సంస్కృతపదాలను, సమాసాలను గుప్పించగలడు. 'అనార్కలి' సినిమాలోని ఈ పాట అందుకు నిదర్శనం. సాకీ లోనే..

'మధుర మనోహర సుందరనారీ మధురదరస్మిత
నయన చకోరీ
మందగమన జిత రాజమరాళీ..అనార్కలీ..

రాజశేఖరా..నీపై మోజుతీరలేదురా..రాజసానయేలరా' అంటూ అద్భుతమైన పదబంధాలతో అందంగా పలికించాడు. ఈ పాటను ఆధారంగా చేసుకుని తర్వాతి సినిమాల్లో ఎన్నో పాటలు పుట్టుకొచ్చాయి.
అనార్కలిలోనే..

'వసంతమధుర సీమల ప్రశాంతసాంధ్యవేళల
అంతులేని వింతలా
అనంతప్రేమ లీలలా
వరించు భాగ్యశాలులా
తరించు ప్రేమజీవులా
జీవితమే సఫలము రాగసుధాభరితము

ప్రేమకథామధురము' అనే పాటను కూడా సుకుమారమైన భావాలతో రచించాడు. ఈ పాట విన్న హృదయం ప్రేమామృతంతో నిండి పులకించిపోవలసిందే. ప్రేమ చిగురించిన హృదయం పులకించినపుడు ఉదయించిన ఉల్లాసానికి అక్షరరూపం పై పంక్తులు.. ఇలాంటి అక్షర నిధులు సముద్రాల భావనాసంద్రంలో కోకొల్లలు.

'దొంగరాముడు'(1955) సినిమాలోని..

'చిగురాకులలో చిలకమ్మా చిన్నమాట వినరావమ్మా' పాట, ఎన్నో సినిమాలకు అనుసరణయోగ్యమైన 'రారోయి మా ఇంటికి మావ మాటున్నది' పాట కూడా సముద్రాల వారు రాసిందే.

'సువర్ణసుందరి'(1957) సినిమాలోని..

'హాయి హాయిగా ఆమని సాగే
సోయగాల గనవోయి సఖా హాయిసఖా' పాట అందరి మనసుల్లో ఆమని అందాలను పూయించింది. ఇంకా -

'లవకుశ'(1963) సినిమాలోని..

'శ్రీరాముని చరితమును తెలిపెదమమ్మా
ఘన శీలవతి సీత కథ వినుడోయమ్మా' పాట, 'పలుకరాదటే చిలుకా'(షావుకారు), 'రాముని అవతారం రఘుకులసోముని అవతారం'(భూకైలాస్), 'పిలువకురా అలుగకురా నలుగురిలో నను ఓ రాజా' (సువర్ణసుందరి), 'దినకరా శుభకరా దేవా'(వినాయకచవితి) పాటలన్నీ ఆణిముత్యాలే. ముఖ్యంగా..

'భక్తప్రహ్లాద'(1967) సినిమాలోని...

'భవజలధినిబడి తేలగలేని జీవులబ్రోచే పరమపురుష

జీవము నీవే కదా దేవా బ్రోచే భారము నీదే కదా
నా భారము నీదే కదా!'

పాట కూడా సినీభక్తిగీతాల్లోనే ఒక మణిమకుటం. ముఖ్యంగా సముద్రాల రాఘవాచార్య భక్తిపాటల్లో చేసిన పదప్రయోగవైచిత్రి అత్యద్భుతం.. ఆత్మనివేదనం, దాస్యం, సఖ్యం, పాదసేవనం మొ. నవవిధ భక్తిమార్గాల్లో భగవంతున్ని అర్చించి అర్పించిన పాటలపుష్పాలు నేటికీ నిరంతరం పరిమళాలు పంచుతూనే ఉన్నాయి.

